# మాడం బ్లవట్‌స్కీ



శ్రీశార్వరి

# మాడం బ్లవట్స్కీ

శ్రీ శార్వరి

ప్రచురణ

**మాస్టర్ యోగాశ్రమం**

**MADAM BLAVATSKY**

***"Sri Sarvari"***

Editor : Dr. VAASILI VASANTA KUMAR

First Edition : December, 2009

**Price : Rs. 100/-**

Published by :
**MASTER YOGAASHRAM**
Plot 89, Krishna Enclave,
Military Dairy Farm Road, Tirumalagiri,
SECUNDERABAD - 500 015.
Phone : (040) 27790094, 9393933946
E-mail : drvaasili@yahoo.co.in
www. masteryogashram.com

Printed by :
**YOGAALAYA**
Plot No. 90, Krishna Enclave,
Tirumalagiri, SECUNDERABAD - 500 015.
Phone : 9000885599

# విషయసూచిక

| | | |
|---|---|---|
| | మాడం బ్లవట్స్కీ | 11 |
| 1. | థియోసఫీ ఫిలాసఫీ | 13 |
| 2. | కాంతి కిరణం | 23 |
| 3. | బాలారిష్టాలు | 25 |
| 4. | పర్యటన పదేళ్లు | 31 |
| 5. | అన్వేషణ : అనుభవం | 37 |
| 6. | అక్క డైరీ లోంచి ... | 43 |
| 7. | ప్రపంచం పిలిచింది! | 49 |
| 8. | న్యూయార్క్‌లో కొత్త జీవితం | 52 |
| 9. | పొద్దు పొడిచింది | 58 |
| 10. | ఇసిస్ అన్‌వీల్డ్ | 65 |
| 11. | మహాన్ భారత్ | 77 |
| 12. | సిమ్‌లా! సిమ్లా! | 94 |
| 13. | కాకిగూడు | 99 |
| 14. | మాస్టర్ – మీడియమ్స్ | 104 |
| 15. | అడయారు | 111 |
| 16. | తుఫాను మొదలైంది | 120 |
| 17. | సందిగ్ధం | 130 |
| 18. | మహర్షి సుబ్బారావు : శ్వేతయోగిని | 136 |
| 19. | సీక్రెట్ డాక్ట్రిన్ | 140 |
| 20. | పరాజయం అంచున | 145 |
| 21. | ఆనీబీసెంట్ | 152 |
| 22. | చరమాంకం | 160 |
| 23. | ఆఖరి పోరాటం | 168 |
| 24. | స్మృతి పథంలో ... | 173 |
| 25. | కొనసాగింపు | 177 |



డా॥ వాసిలి వసంతకుమార్

# మాస్టర్ స్పిరిట్

*నిశ్శబ్దం మాట్లాడుతుందా?*

*రహస్యం విస్ఫోటనమవుతుందా?*

*ఆత్మ దర్శనమవుతుందా?*

*– ఒక విధంగా ఇవి ప్రశ్నలు ... మరోవిధంగా సమాధానాలు.*

అనుభవానికి అనుభూతిని జోడించగలిగితే 'ఆత్మ' ఆధ్యాత్మిక వారసత్వం నుండి విడివడుతుంది ... నిశ్శబ్దంగా పలకరించటం ప్రారంభిస్తుంది ... రహస్యంగా విస్ఫోటనమవుతుంది ... పారదర్శకంగా దర్శనమిస్తుంది.

అంటే అటు Silence ఇటు Secret ల ఆచ్ఛాదన తొలగినట్లే!

ఓ వందేళ్లు వెనక్కి వెళ్తే ఈ తెరని తొలగించింది బ్లవట్స్కీ అయితే ఈ రెండింటి సంయోగాన్ని భృక్తరహితం చేసింది మాస్టర్ సి.వి.వి. బ్లవట్స్కీ విషయంలో 'సీక్రెట్' డాక్ట్రిన్ అయితే మాస్టర్ సి.వి.వి. విషయంలో 'సత్య'యోగం అయింది. బ్లవట్స్కీ సత్య'సంపద' నందిస్తే మాస్టర్ సి.వి.వి. సత్య 'యోగావిష్కారం' చేశారు. బ్లవట్స్కీది సిద్ధాంతసారమైతే మాస్టర్ సి.వి.వి.ది ప్రయోగ ఫలితం.

★ ★ ★

బ్లవట్స్కీ అంటే చప్పున గుర్తొచ్చేది 'సీక్రెట్ డాక్ట్రిన్'. అది చాల 'గొప్ప పుస్తకం' అని ప్రశంసిస్తూనే పేజీలు తిప్పడం వరకే పరిమితమైపోయి 'కితాబు'

నిచ్చిన పారకోత్తములు ఎందరెందరో?! అర్థం కాకపోయినా ఆత్మకు ఉన్నంత శాశ్వతత్వాన్ని బ్లవట్స్కీ సీక్రెట్ డాక్ట్రిన్'కు అందించింది మన తాత్విక ప్రపంచం.

అసలు ఏ పుస్తకమైనా ఎందుకు అర్థం కాదు?

కళ్లతో చదివితే ఏదీ అర్థం కాదు ... అహంకారంతో, అహంభావంతో చదివితే అసలే అర్థం కాదు ... మనసుతో చదివితే కాస్త ఫర్లేదనిపిస్తుంది ... హృదయంలో చదివితే 'బెటర్' అనిపిస్తుంది, కాస్త కుస్తీ పట్టవచ్చనిపిస్తుంది ... శూన్యమయి చదవగలిగితే అర్థం కానిదంటూ ఏమీ మిగలదు. శూన్యదృక్కులు అక్షరాల వెంట పరుగులు తీస్తుంటే పుటలు కరిగిపోతుంటాయి. డిగ్రీల కిరీటాలతో చదవాలనుకుంటే పల్టీలు కొట్టాల్సిందే!

★ ★ ★

ఓ చేతిలో సిగరెట్ ... మరో చేతిలో పెన్.

అసలు 'ఆడది' సిగరెట్ తాగడమేమిటి? ... మగరాయుడిలా!

అందులోను ఓ వందేళ్ల క్రితం ఇటువంటి ఆకారాన్ని మన భారతీయ సంస్కారం అర్థం చేసుకునే అవకాశం ఏది? అందుకే ముక్కున వేలేసుకున్నారు. 'అసలది ఆడది కాదు ... దెయ్యం' అంటూ ఎద్దేవా చేసేవారు. నెగెటివ్‌గా మనవారు దెయ్యం అన్నా పాజిటివ్‌గా ఆలోచిస్తే బ్లవట్స్కీ ఓ 'స్పిరిట్'. స్పిరిట్ అంటే మహితాత్మ ... మహాత్మ.

ప్రపంచం తనను 'కేర్' చేయకపోయినా బ్లవట్స్కీ తాను మాత్రం మానవ జగతిని 'కేర్' చేస్తూనే తిరిగింది. తానే ఓ 'కేర్‌టేకర్'లా సంచరించింది. తనపై అనేకానేకులు, దేశవిదేశీయులు కన్నెర్ర చేసినా ఆత్మసంయమనంతో దేశదిమ్మ రయింది. కుగ్రామాల నుండి అగ్రదేశాల వరకు, అటవీ ప్రాంతాల నుండి ఆత్మప్రయోగశాలల వరకు, అరణ్యప్రాంతాల నుండి ఆశ్రమవాసాల వరకు, నదీనదాల నుండి కొండగుహల వరకు కాలికి బలపం కట్టుకుని తిరిగింది. అలాగని ఆమెను టూరిస్ట్ అనటానికి వీలులేదు. ఆమె ప్రయాణం ప్రపంచాన్ని చుట్టిరావటానికి కాదు ... ఆత్మ సంపదను ఆవిష్కరించటానికి. ఆత్మ సిద్ధాంతాలు చెప్పటానికి కాదు ఆమె సంచారం ... ఆత్మానుభవాలు క్రోడీకరించటానికి. ఏ దేశమేగినా, ఎందు కాలిడినా బ్లవట్స్కీ చూసింది ఆత్మనెలవుల్ని.

అందరికీ తెలిసిన బ్లవట్స్కీ థియోసఫిస్టు. నా దృష్టిలో థియోలజిస్ట్. ఆమె ***'Spirit**ualist'* ... ఆత్మల నేస్తం. ఆమె సాగించిన ప్రయాణం జనసామాన్యంగా *Soul Journey* కావచ్చు ... నా వరకు ***'Spirit**ual Journey'* అది. ఆమె తన ప్రయోగాలతో *Soul*ని వెదకి పట్టుకోలేదు ... *Spirit* మూలాలను అందుకోగలిగింది. అదీ బ్లవట్స్కీ ***Spirit**ualism* లోని ***'Master**ism'*. నా దృష్టిలో బ్లవట్స్కీ ఓ *Master Spirit.*

బ్లవట్స్కీ యోగం చేసిందా అంటే ఏమో! ఆత్మతో పరిక్రమించింది ... నిశ్శబ్దంతో తలపడింది ... ఆత్మలతో సహవాసం చేసింది. తన ప్రయోగాలతో, ప్రయోగాలలో ఏ ఆత్మను దుర్వినియోగం చేయలేదు ... పైగా 'సత్' వినియోగమే ఆమెది. తన గమ్యంలో, గమనంలో మతాన్ని సమ్మతించలేదు కానీ గురువుల్ని కాదనలేదు. ఆమె దృష్టిలో గురువులు అంటే మాస్టర్స్ .... అంటే మహాత్ములు. వారి మాస్టరిజానికి తలవొగ్గిందే తప్ప గురుసంప్రదాయానికి కాదు. వారిని తన మార్గదర్శులుగా చేసుకుందే తప్ప వారి అడుగులకు మడుగు లొత్తలేదు. వారి సహకారాన్ని అందుకుంటూనే స్వతంత్రించింది. ఏ ఆధ్యాత్మిక వారసత్వ నీడలు సోకకుండా థియోసాఫికల్ సొసైటీని స్థాపించింది. ఆత్మజ్ఞానానికి తప్ప అన్యానికి స్థానం లేదక్కడ. ఆమెది *Spirit of Freedom. "True Faith is the Embodiment of Divine Charity"* అన్నది బ్లవట్స్కీ జీవితం అందించే సందేశం.

బ్లవట్స్కీ రష్యాలో పుట్టినా ప్రపంచదేశాలు తిరుగుతూ భారతావనిలో తన 'ఆత్మీయ' 'మేధస్సు'కు ఒక రూపకల్పన చేసింది. ఆమె సహప్రయాణీకులలో అధికశాతం విదేశీయులే ... అన్నీ విదేశీపేర్లు ... దేశదేశాల సంచారం ... విచిత్ర వ్యక్తులతో సమావేశాలు ... ఆత్మీయ సమాలోచనలు. *World Map* అంత కాన్వాస్ బ్లవట్స్కీ జీవితం .... ఆ జీవితంపై ఎందరో మాస్టర్ల ప్రభావం. ఆ మాస్టర్ల మార్గదర్శకత్వం ఎలా ఉంటుందనటానికి అక్షరరూపం మాస్టర్ శార్వరి 'మాడం బ్లవట్స్కీ' పుస్తకం. ఓ విదేశీయురాల్ని చదువుతున్నామన్న ధ్యాస లేకుండా రసరమ్యంగా సాగిన రచన ఈ పుస్తకం. ఈ పుస్తకం చదువుతున్నంతసేపు బ్లవట్స్కీ ప్రపంచయాత్ర చేయదు. మనమే బ్లవట్స్కీతో పాటు ప్రతీచోటా ప్రత్యక్షమవుతాం .... బ్లవట్స్కీ విషయంలో శ్రీశార్వరి ఆత్మీయముద్ర అది.

"ఒక కొండగుహలో కూర్చుని తపస్సు చేసి మహర్షి కావచ్చు. మహారణ్యాలలో ఘోరతపస్సు చేయవచ్చు ప్రాణభయం లేకపోతే. కాని ఒక సద్గురువు కోసం దేశాలు పట్టి తిరగడం, కొండల్లో అన్వేషించడం మాటలు కాదు. ఎంతో తపన పడితే తప్ప స్వచ్ఛమైన గురువు దర్శనం కాదు. ఆ కిటుకు మాడం బ్లవట్స్కీకి తెలుసు." అనే శ్రీశార్వరికీ ఆ 'కిటుకు' తెలుసు ... ఆ తెర తొలగటం కోసం చేసిన ప్రయోగమే ఈ పుస్తకం. బ్లవట్స్కీని ఒక మీడియమ్ అనుకుంటే ఆమె స్థానంలో మనం ఉన్నా పరిణతి చెందటానికి, ఆత్మావిష్కారం చేసుకోవటానికి, మహాత్ముల అనుగ్రహం పొందటానికి చేసే ప్రయాణంలో మనమూ మమేకం అవుతాం.

"మాస్టర్లు కంటికి కనిపించరు. వచ్చినట్లు చప్పున అనిపిస్తుంది. అంతర్దృష్టికి దర్శనమిస్తారు. అంతలో అంతర్ధానమైపోతారు. జరగవలసిన పని జరిగిపోతుంది. చెప్పవలసిన విషయం మనస్సుకి స్ఫురిస్తుంది." అదీ మీడియమ్ అందుకోవలసిన మాస్టర్ 'కీ'.

బ్లవట్స్కీ మాటల్లో "మాస్టర్స్ ఒక మిత్ర మండలి. అందరూ సమానులే. అందరూ సోదరులే. యోగులు ఎక్కడ ఉన్నా యోగులే. వారంతా ఒక నిర్జన ప్రదేశంలో, రహస్యంగా తపస్సు చేస్తుంటారు. తమ ఆచూకీ ఎవరికీ తెలియనివ్వరు. అసలు వారంతా అశరీరులు. కాంతి దేహాలలో ఉంటారు. ఎవరికీ కనిపించరు. అవసరమైనపుడు ఆస్ట్రల్ రూపం ధరిస్తారు. సకృత్తుగా భౌతిక శరీరాలు ధరిస్తుంటారు. వారికి మృత్యువంటే చనిపోవటం, శరీరాన్ని వదలిపోవటం కాదు. శూన్యంలో శూన్యంగా కలిసిపోవటం."

మీకూ మాస్టర్స్‌ని చూడాలని ఉందా?! పేజీ తిప్పండి ... శ్రీశార్వరి అక్షరాల వెంట బ్లవట్స్కీతో ప్రయాణం ప్రారంభించండి ... ఆ మాస్టర్ల మిత్ర మండలితో మమేకం కండి ... ధ్యాసంతా అక్షరాలపైన ఉన్నా శూన్యమైపోతూ ధ్యానాత్మలైపోతారు ... బ్లవట్స్కీ స్థానంలో మీరే మిగులుతారు. అంటే యు ఆర్ ది మాస్టర్ మీడియమ్!

**– వాసిలి వసంతకుమార్**

ఎం.ఎస్.మూర్తి



# దివ్యజ్ఞాని

*జీవితం అంటే ఏమిటి?*

*జీవుల పుట్టుక ముందు స్థితి, చనిపోయిన తరువాత స్థితి ఎట్లా ఉంటుంది? అనే ప్రశ్నలతో ఇప్పటికి ఎంతమంది తత్వవేత్తలు, జ్ఞానులు, జిజ్ఞాసులు, అంతకుమించి శాస్త్రవేత్తలు పరిశోధించినా తృప్తికరమైన సమాధానాలు రాబట్టలేకపోయారు. ఇంక సాధారణ మానవుల పరిస్థితి చెప్పనక్కరలేదు. అది పూర్తిగా అవసరం లేని విషయం అనుకుంటారు.*

*సృష్టి రహస్యాలు, మానవుడి దివ్యశక్తులు తెలిసిన మహాత్ములు (మాస్టర్స్) వారి విజ్ఞానాన్ని రహస్యభాషలో ప్రపంచంలో కొన్ని ప్రదేశాల్లో నిక్షిప్తం చేసి అర్హులైన వారికి అందిస్తూనే ఉన్నారు. కాని పరిణామాన్ని వేగవంతం చేసి ఈ జ్ఞానాన్ని అందుకునే అర్హత పొందేలా మానవుణ్ని తయారు చేయాలంటే ఈ మహాత్ముల పర్యవేక్షణలో కొందరు అర్హతులు ప్రత్యేకంగా పనిచేయవలసి ఉంది. ఈ బృహత్తర ప్రణాళికకు నాంది 19వ శతాబ్దంలో ప్రపంచంలో వేరువేరు స్థలాల్లో మొదలైంది. అందుకు నియమించబడ్డ వారిలో రష్యన్ యోగిని మాడం బ్లవట్స్కీ ఒకరు.*

*ఈమె పుట్టినప్పటినుండి ఎన్నో అతీంద్రియశక్తులతో కుటుంబ సభ్యులను చుట్టుపక్కల వారిని ఆశ్చర్యపరుస్తూ ఉండేది. ఆమెను చూస్తేనే ఏదో ఆకర్షణ. ఆమె చూపులు లోతుగా ఉంటాయి. ఆ చూపుల్లోంచి ప్రేమ ప్రవహిస్తూ ఉంటుంది. ప్రాచీన హిందూ, టిబెట్, ఈజిప్టు, పర్షియా, చైనా, గ్రీసు, హంగరి మొదలైన సాంప్రదాయాల్లో ఉన్న సత్యాలను, జ్ఞానాన్ని, ఆధ్యాత్మిక రహస్యాలను పక్కదోవ పట్టించి, మతాల ఊబిలో మనుషుల్ని ముంచేసిన స్వార్థపర శక్తుల నుండి తప్పించి, ప్రపంచంలో మానవ సమాజానికి దివ్యజ్ఞానాన్ని మహాత్ములకు (మాస్టర్స్) పరిచయం చేసిన ఆధ్యాత్మిక సింహం బ్లవట్స్కీ . ప్రపంచంలో రహస్య ప్రదేశాల్లో మాస్టర్ల అధీనంలో ఉన్న గుప్త ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ఒక పద్ధతి ప్రకారం సమాజానికి అందించి పరిణామం వేగవంతం చేసి మనిషి తనను తాను తెలుసుకునేలా చేయడానికి కార్య రంగంలోకి దింపబడిన ఉపాసిక మాడం బ్లవట్స్కీ.*

*అందుకోసం విసుగూ విరామం లేకుండా 18 ఏళ్ల నుండి 60 సం॥ వరకు అంటే భౌతికశరీరం వదిలే వరకు, తన సౌకర్యాలు, అవసరాలు*

పట్టించుకోకుండా, ఒంటరిగా ప్రపంచం అంతా తిరుగుతూ ఈజిప్టులో పిరమిడ్ రహస్యాలపై పరిశోధనలు చేస్తూ ఈజిప్టు గురువుల సేవలు చేసి, టిబెట్‌లో, ఇండియాలో గుహ్యమైన ప్రదేశాల్లో సంచరించి, బౌద్ధ లామాల శుశ్రూషలు చేసి మాస్టర్స్ నిరంతర పర్యవేక్షణలో కనుమరుగైన జ్ఞాన భాండాగారాన్ని **'ఇసిస్ అన్వీల్డ్', 'సీక్రెట్ డాక్ట్రిన్'** ఎంతోమంది హైందవ మహర్షులతో ఆధ్యాత్మికంగా సమాన హోదా కలిగిన గురుమాత మాడం బ్లవట్‌స్కీ.

ఎందరో మహాత్ముల ఆధ్యాత్మిక జీవిత రహస్యాలను, సాధనా విధానాలను, తను అధిగమించిన ఉన్నత ఆధ్యాత్మిక సీమల అనుభవాలతో విశ్లేషించి, నిరంతర గ్రంథస్థం చేస్తూ సాధకులకు అందిస్తున్న గురువుగారు శ్రీశార్వరిగారికి మాడం బ్లవట్‌స్కీకి ఎన్నో సారూప్యతలు కనబడతాయి. ఇద్దరి పద్ధతి ఒక్కటే. పుస్తకాల రూపంలో అనుభవ పూర్వక ఆధ్యాత్మిక రహస్యాలను సాధకులకు అందించడం, వారి పరిణతికి మాస్టర్స్ తరఫున నిస్వార్థంగా పనిచేయడం. ఫలాలు అప్పటినుండి, ఇప్పటి వరకు సాధక సమాజానికి అందుతూనే ఉన్నాయి. ఇద్దరిలో కరుకుతనం, వేగం, అధికారం సమానంగా ఉన్నాయి. అగ్నిపర్వతం బద్ధలైతే ప్రవహించే లావా, అందులో నయాగరా జలపాతం దూకుడు కనిపిస్తుంది. సాధకుల ఆత్మల్ని ఒడిసి పట్టుకుని, దివ్య సీమలకు తీసుకువెళ్లే చాతుర్యమూ ఉంది. వీరి రచనలు చదవడంతో పాటు వాటినీ అధ్యయనం చేస్తుండాలి.

ఇద్దరిలో ఎవరికీ తెలియని లోతులున్నాయి, రహస్యాలున్నాయి, వెలుగులున్నాయి. ఇద్దరికీ ఆడంబరాలంటే ఇష్టం ఉండదు. సాదాగా జీవించడం ఇష్టం, నిరాడంబరత ఆధ్యాత్మిక సోపానం.

ఆ స్థితికి ఎదిగి మహాత్ముల సాంగత్యం పొందడానికి బ్లవట్‌స్కీ చిన్నప్పటి నుండి చేసిన సాధన, పరిశ్రమ, అకుంఠిత దీక్ష, మహాత్ములకు సంపూర్ణంగా శరణాగతి అయిన పద్ధతికి ఈ పుస్తకం నిలువుటద్దం. ఆ సమర్పణ సత్యాన్వేషణ చేసే ఎవరికైనా తప్పనిసరి. ఈ పుస్తకం చదివితే సామాన్య సాధకునిలోనైనా దీక్ష, పట్టుదల, తనను తాను తెలుసుకోవాలన్న తపన, సమాజంపై ప్రేమ, మాస్టర్ల పరిణామ ప్రణాళికతో పనిచేయడానికి అర్హత సంపాదించాలన్న ఆర్తి కలిగితీరుతాయి. సత్యాన్ని అన్వేషించేవారికి మహాత్ముల రక్షణ ఎప్పుడూ ఉంటుంది. సత్యాన్ని మించిన మతం లేదు.

*"There is no religion higher than Truth".*


**– ఎం.ఎస్.మూర్తి**




మాస్టర్ మైత్రేయ



మాస్టర్ మోరియా



మాస్టర్ కుత్‌హోమి



మాస్టర్ జ్వాల్‌కూల్



మాడం బ్లవట్స్కీ



అనీబీసెంట్



# మాడం బ్లవట్‌స్కీ

*మాడం బ్లవట్‌స్కీని చదివారా?*

*లేదు. విన్నాను. చదవలేదు. ఆమె గురించి మనమెందుకు చదవాలి?*

*భగవాన్ బుద్ధుని చదివారా?*

*కొంత చదివాను. కొంత విన్నాను. చాలా గొప్ప సంస్కర్త.*

★ ★ ★

**పు**స్తకాలు చదివినంత మాత్రాన ఆ మహాత్ముల్ని చదివినట్లు కాదు.

చదవడం అంటే అధ్యయనం చేయడం, వారి లోతులకు వెళ్లి వెతకడం.

వారి తపస్సును, ఔన్నత్యాన్ని గుర్తించి వారు అధిరోహించిన శిఖరాలకు ఎగబ్రాకడం.


★ ★ ★

"H.P.B." Helena Petrovna Blavatsky" ఆమె పేరు!

"ఇదేదో రష్యన్ పేరులా ఉంది. ఆమె ఇండియన్ కాదా?"

అవును పుట్టింది రష్యాలో. అయినా అన్ని దేశాలు తిరిగింది – ఆమె విశ్వమహిళ.

ఆమెని "పిచ్చిది" అన్నారు పిన్నవయసులో.




"ఆమెకి దయ్యం పట్టింది" అన్నారు కాస్త వయసు వచ్చాక.

ఆమె 'దైవ రక్షిత' అన్నారు యుక్త వయసు వచ్చాక.

అవునా? నిజమా? నిజంగా నిజమా?

భారతదేశంలో జన్మించి ఉంటే ఆమె 'కారణ జన్మురాలు' అయి ఉండేది. ఆజన్మ యోగిని అయ్యేది. జగన్మాతగా కీర్తించబడేది.

క్రైస్తవ ప్రపంచంలో పుట్టి ఉంటే 'సెయింట్' అయి ఉండేది. కాని ఆమె జన్మించింది రష్యాలో.

ఇంతకీ ఎవరామె? ఆమె విశిష్టత ఏమిటి?

ఆమె ఒక ఉపాసిక. ఆమె మహాయోగిని. ఆమె పేరు హెలెనా.

తాను జన్మకు వచ్చిన పని పూర్తి చేయకుండానే నిష్క్రమించింది.

గమ్యం చేరకముందే జీవితం చాలించింది.

జీవితాంతం వరకు యోగినిగా 'సత్య' ప్రతిష్ఠాపన కోసం తపించింది.

సనాతన ధర్మ పునరుద్ధరణ తన జీవిత ధ్యేయంగా భావించింది.

ఆమె అన్వేషిత. ఆమెకు సత్యాన్వేషణే యోగం. ప్రచారమే యోగ సాధన.

లోకానికి పరమ గురువుల ఉనికిని తెలియచెప్పి సాధకులకు కొత్త వాకిళ్లు తెరిచింది.

జీవిత లక్ష్యానికి కొత్త గమ్యాన్ని నిర్దేశించింది.

పరమ గురువుల చైతన్య గీతానికి బ్లవట్స్కీ అనుపల్లవి.

మాస్టర్ యోగానికి బలమైన పునాది థియోసఫీ.

థియోసఫీ పేరున సనాతన ఆర్యధర్మాన్ని నేటి విద్వత్ లోకానికి పరిచయం చేసింది బ్లవట్స్కీ.

ప్రాక్పశ్చిమ దేశాల మధ్య ఆధ్యాత్మిక అవగాహనతో సాంస్కృతిక వారధి నిర్మించిన మహోదాత్త మానవీయ మహిళ హెచ్.పి. బ్లవట్స్కీ.



# 1. థియోసఫీ : ఫిలాసఫీ

***"థియో యోనః ప్రచోదయాత్"***

థియోసఫీ అన్నది ఫిలాసఫీ కాదు.

అది తాత్విక చింతన మాత్రమే గాని ఒక తత్వశాస్త్రం కాదు.

అది చింతనా విశేషం. విశ్లేష పూర్ణచింతన. ఆత్మ నివేదన.

మానసిక పరితాపంలోంచి పుట్టిన ఆత్మీయభావన ఆత్మ నివేదన.

ఫిలాసఫీకి పునాది మతం. మత ప్రసక్తి ఏమాత్రం లేనిది థియోసఫీ. అంటే థియోసఫీకి జీవితం ఆధారం. జీవన ధర్మం ఉపాధేయం. అన్ని మతాలకు మూలమైనది సనాతన ధర్మం ఒక్కటే.

***పవిత్ర జీవనం థియోసఫి. థియో యోనః ప్రచోదయాత్.***

★ ★ ★

ప్రతి మనిషి జీవితం అవసరం లేకపోయినా ఏదో ఒక మతంతో ముడిపడి ఉంటుంది. మనిషి సమాజం కోసం మత నియమాలకు తలవంచి బ్రతుకు తుంటాడు. మతంతో జీవితాన్ని ముడిపెట్టకుండా జీవించడం థియోసఫి లక్ష్యం. నిజానికి వారే సనాతనులు. మానవత్వపు వెలుగుల్లో జీవించాలనుకునే వారు, జీవితంలో వెలుగులు నింపుకోవాలనుకునే వారు థియోసఫిస్టులు. మానవ వికాసానికి తనను తాను అంకితం చేసుకున్నవాడు థియోసఫిస్టు.

"Time Discovers Truth" ఎంతచక్కటి సూక్తి. హితోక్తి.

అది మహద్వాక్యం. అది సత్యావిష్కారం.

"కాలం సత్యాన్ని ఆవిష్కరిస్తుంది". సత్యావిష్కారాన్ని మించిన యోగం లేదు. యోగాన్ని మించిన సత్యం లేదు. యోగం సత్యానికి బాట. యోగి లక్ష్యం సత్యదర్శనం.

1875లో థియోసాఫికల్ సొసైటీ ఆవిర్భావం చరిత్రను సృష్టించింది. చరిత్ర గతినే మార్చేసింది. థియోసఫీ దీధితుల్లో మతాల రంగులు వెలవెల పోయాయి. రంగు మాసిన మతంపట్ల మనిషికి మోజు తగ్గింది. అన్ని దేశాలు మత మౌఢ్యానికి ఒక్క అడుగు దూరంగా జరిగాయి.

ఎంత గొప్ప ప్రవక్త అయినా మనుషులందర్నీ ఒక్కరోజులో మార్చలేడు. ఎంత గొప్ప సిద్ధాంతమైనా అందరినీ ఒక గీతపైన నడిపించనూ లేదు. మూకుమ్మడిగా లక్షల మందిని 'మతం' మార్పించవచ్చు. 'మతి' మార్పు అంత సులభం కాదు. మనసు పెట్టి గుండె తలుపులు తెరిచిన వారిలో మార్పు వస్తుంది. హృదయం నిర్మలం అయిన వారిలో పరిణామం కనిపిస్తుంది. అంటే థియోసఫీ హృదయానికి సంబంధించిన పరిణామం, హృదయ గతికం. థియోసఫీ అంటే జీవన వేదం, జీవిత సత్యం, సనాతన ధర్మం. మంచి మనసుతో, పవిత్ర హృదయంతో, మానవతా విలువలతో జీవించడమే థియోసఫీ అంతస్సూత్రం. అది దివ్యజ్ఞానం అయినా ఆత్మపరిజ్ఞానమే. ఆత్మదర్శన మార్గమూ అదే.

ప్రపంచంలోని మనుషులంతా మారాలని వాంఛించడం అత్యాశ కాదు. అది సహజమైన, సహేతుకమైన, అవసరమైన అభిలాష, జీవన లాలస. అందుకు భావ సంస్కారం, హృదయ స్పందన అవసరం. అది ఆత్మజాగృతికి, చైతన్యానికి సంబంధించిన అంశం. మనిషి మంచిగా, మానవత్వంతో జీవించాలన్నది భగవంతుని సంకల్పం. సృష్టి లక్ష్యమూ అదే. మనిషి గమ్యమూ అదే అయి ఉండాలి. మనిషిని ఉద్ధరించి మంచి మార్గంలో పెట్టాలన్నది మహర్షుల తపస్సుకు లక్ష్యం. ఆనాటి మహర్షుల నుండి ఈనాటి మహాయోగుల వరకు అందరూ సద్గురువులే, పరమ గురువులే. కారణ శరీరులుగా ఉంటూ విశ్వకళ్యాణం కాంక్షిస్తూ ప్రస్తుత గురువులకు సహకరించేవారు మాస్టర్లు. వారే పరమ గురువులు. వారంతా ఫిజికల్ ఇమ్మోర్టాలిటి సాధించి తిరిగి మానవ జన్మకు రాకుండా తమ ప్రజ్ఞని మాత్రం పరకాయ ప్రవేశం చేయిస్తూ లక్ష్యాన్ని సాధిస్తుంటారు. ప్రగతిని సమీక్షిస్తుంటారు.

**అలా పరమ గురువులైన వారు ఎన్నిక చేసిన వ్యక్తి బ్లవట్స్కీ.**

**ఇది హెలెనా పెట్రోవ్నా బ్లవట్స్కీ – జీవిత కథ.**

★ ★ ★

దృశ్య ప్రపంచం అవతల అదృశ్య లోకాలు, అధిభౌతిక శక్తులు ఉన్నాయి. దివ్య శక్తులు, అతీంద్రియ శక్తులు చెట్టా పట్టాలు వేసుకుని తిరుగుతుంటాయి. ***"అంటే ప్రకృతి వెనుక పరా ప్రకృతి చాలనం ఉంటుంది. అగోచర శక్తులే భౌతిక ప్రపంచాన్ని, జీవజాలాల్ని నడిపిస్తుంటాయి."*** అంటూ బ్లవట్స్కీ తన అతీంద్రియ జ్ఞానంతో విశ్లేషించి అమెరికా వంటి పాశ్చాత్య మేధావులకు కనువిప్పు కలిగించారు. దివ్యజ్ఞానాన్ని భౌతికవాదులకు రుచి చూపించారు. అంటే భౌతికత్వం చాటున అధిభౌతిక ప్రపంచం ఒకటి దోగాడుతుందని స్పష్టం చేయగలిగారు. మనిషికి శారీరక బలం, మేధాశక్తి కాక, ఆత్మశక్తి మరొకటి ఉన్నదని, అది పరాశక్తి నుండి ప్రభవించి దిగి వస్తుందని, ఆ మహాశక్తి పరమాత్మ అధీనంలో ఉంటుందని వక్కాణించారు. లాటిన్ అమెరికా ఆటవిక తెగల్లోని వారి శక్తులు తెలిసిన అమెరికన్లు రష్యానుండి వచ్చిన బ్లవట్స్కీ సిద్ధాంతం పట్ల ఆకర్షితులైనారు. ఎక్కడా జీసస్ మాట ఉచ్ఛరించకుండా, క్రైస్తవ ప్రస్తావన లేకుండా, కొత్త సిద్ధాంతాన్ని నమ్మించడం అంత సులభం కాదు. ఏ దేశానికి వెళ్లినా ప్రగతి శీలురకు, అభ్యుదయ భావుకులకు మతం, మత ఛాందసం అవరోధం కల్పిస్తూ ఉండడం సహజం.

ఆమె ఇసీస్ అన్‌వీల్డ్ (Isis Unveiled) పుస్తకంలో నిగూఢజ్ఞానం బయట పెట్టింది. ఆత్మజ్ఞానాన్ని సైతం కొద్దికొద్దిగా ఆవిష్కరించింది. ప్రకృతిలో ఉన్న శక్తులన్నీ మనిషిలోనూ ఉన్నాయని, స్వయం సాధనతో ఇంకా ఎక్కువ శక్తులు పొందవచ్చునని చెప్పింది. ఆత్మవిద్యను అవగాహన చేసుకోవడం వల్ల ఎవరైనా అతీంద్రియశక్తులు పొందవచ్చుననీ సూత్రీకరించింది. ఆమె మాటలు అమృత గుళికల్లా పనిచేశాయి. తాంత్రిక విద్యలంటే అనాగరిక, ఆటవికజాతుల క్షుద్రవిద్యలని నమ్మిన వారికి భయం పోయి, ఆధ్యాత్మికతపట్ల అభిరుచి ఏర్పడసాగింది. ఆ పుస్తకం ద్వారా బ్లవట్స్కీ పునర్జన్మలు, కర్మసిద్ధాంతం నమ్మేటట్లు చేసింది. మనిషిలో భిన్న మనస్తత్వాలు, పరిణామ వాదం చెవికెక్కించి కొత్త ప్రపంచానికి వాకిళ్లు తెరిచింది.

ఆ విధంగా అమెరికన్ హృదయ క్షేత్రాలలో కొత్త బీజాలు నాటి తర్వాత ఆర్యావర్తం వైపు, ప్రాచ్యదేశాల వైపు దృష్టి మళ్లించింది. ఆర్యావర్తం అంటే భారతదేశం. అది పుణ్యభూమి, కర్మభూమి, యోగాలయం. ఎంతో కాలంగా భారతదేశం గురించి కలలు కంటున్నది. ఎన్ని జన్మలు గానో తనకు భారతదేశంతో సంబంధం ఉందని ఆమె హృదయవాణి వినిపిస్తుంది. తన సత్యాన్వేషణకు భారతదేశం ఒక్కటే అనువైన ప్రదేశం అని గాఢంగా నమ్మింది. పాశ్చాత్య దేశాలకు

ఆత్మశాంతిని ప్రసాదించగల మహాశక్తి భారత్‌లోనే ఉన్నది. ఆ శక్తి ప్రాచ్యదేశాల పరమ గురువులకే ఉన్నదని ఆమె నమ్మకం.

"Can there be Bliss when all that lives must suffer?
Shalt thou be saved and hear the whole world cry".

- The Voice of the Silence

బుద్ధభగవానుని వాణి అది. అది బ్లవట్స్కీ హృద్గీత.

"అవును! లోకులంతా బాధల్లో కునారిల్లుతుంటే నా ఒక్కడికి ఎందుకు దైవానుగ్రహం? లోకులు అందరూ విలపిస్తుండగా నేనొక్కడినెలా ఆనందించను?"

*"యదా యదాహి ధర్మస్య గ్లాని ర్భవతి భారత*
*అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం"* **భగవద్గీత**

బ్లవట్స్కీ రాసిన "The Voice of Silence" లోని గీతాలన్నీ భారత పవిత్ర గ్రంథాలలోని సూక్తులే. ముఖ్యంగా తెలుగు నీతి శతకాల సుధల్ని అనువదించుకుంది. బ్లవట్స్కీ అంటే మహాయాన బౌద్ధాన్ని తనకు ఆదర్శంగా తీసుకుంది. భారతీయ సనాతన ధర్మ సూత్రాలను ఔదలదాల్చింది. వెరసి మత రహితమైన, కరుణభరితమైన ఆత్మజ్ఞాన ప్రదీపిక అయింది.

పరమాత్మ ప్రతినిధులు మహాత్ములు. సామాన్యులుగా జన్మించి 'ఆత్మ' స్పృహతో ఆత్మ సంస్కారం పొంది, యోగ శిఖరాలు అధిరోహించి జన్మ, కర్మ రాహిత్యం పొంది, మహాపర, పర నిర్వాణ భూమికల్లో మృత్యుంజయులుగా ఉండేవారు పరమ గురువులు. వారినే మహాత్ములు, మాస్టర్లు అంటారు. మాస్టరు అంటే మహాత్మ అనే విపులార్థం. ప్రపంచాన్ని రక్షించే బాధ్యత వారిది. వారి ప్రజ్ఞ లేదా అంశ యోగ్యులైన వారిలో ప్రవేశపెట్టి, వారి ద్వారా తమ లక్ష్యాన్ని సాధిస్తుంటారు. జగత్కల్యాణ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఆధ్యాత్మిక వికాసం కలిగిస్తుంటారు.

ప్రతిసారి భగవంతుడు అవతరించవలసిన అవసరం ఉండదు. ధర్మ సంస్థాపన ఒక్కటే బాధ్యత కాదు. అలా అయితే అంత లోపభూయిష్టమైన ప్రపంచాన్ని, అధర్మవర్తనుడైన మనిషిని సృష్టించడం సృష్టికర్త తప్పు అవుతుంది. అంటే తాను చేసిన తప్పులు తానే సరిచేసుకోవడం లోకోద్ధరణ, ధర్మరక్షణ ఎలా అవుతాయి? ఆపని పరమ గురువులది, మహాత్ములైన వారిది. అంచేత మహాత్ములు దేవుళ్ళకంటే గొప్పవారు. లోకాన్ని రక్షించే బాధ్యత త్రిమూర్తులది కాదు. ఆత్మ సంస్కారం కలిగిన మనిషి తప్పు చేయడు, పాపం చేయడు. పరమాత్మ కోసం అన్వేషణ సాగిస్తాడు.

అటువంటి పరమ గురుమండలి ఎన్నిక చేసిన వ్యక్తి మహాయోగిని బ్లవట్స్కీ. ఆమెకు చేదోడుగా ఆల్కాట్, జడ్జి అనే మరో ఇద్దరిని జతపరిచారు. ఆ ముగ్గురు థియోసాఫికల్ సొసైటీ స్థాపకులు. దివ్యజ్ఞాన ఉద్యమానికి మూలవరులు. బ్లవట్స్కీ రష్యన్ వనిత, జడ్జి బ్రిటిష్ వాడు, ఆల్కాట్ అమెరికన్.

***"ప్రతి మనిషిలో నిగూఢంగా ఉండే దివ్యత్వాన్ని, శక్తిని గుర్తించి వినియోగ పరచడం అన్నది బ్లవట్స్కీ ప్రతిపాదించిన ఆశయం. ప్రాక్పశ్చిమ దేశాలను మనో భూమికపైన సంధాన పరచడం రెండవ ఆశయం. ప్రాచ్యదేశాల ప్రాచీన విజ్ఞానాన్ని, సనాతన ధర్మాన్ని దేశదేశాలకు పంచి, మానవత్వ విలువల్ని పెంచడం మూడవ లక్ష్యం. వివిధ మతాలు కాకుండా మానవత్వం ఒక్కటే మానవ మతం అనడం నాల్గవ సిద్ధాంతం."***

మనిషి మనుగడకు సమాజం అవసరం. సామూహిక జీవనమే సమాజం. మతాలు, కులాలు అవసరం లేదు. అవి అర్థం లేనివి. సమాజంలో వ్యక్తుల మధ్య సఖ్యత అవసరం. **సఖ్యత, సభ్యత, సమానత – ప్రగతికి బాటలు వేస్తాయి. 'థియోసఫీ' అన్నది జీవన యోగం.**

పాశ్చాత్య దేశాలకు యోగం తెలియదు. 'ఆత్మ' పట్ల అవగాహన లేదు. సాధన, తపస్సు అనేవి అవసరం లేనివి. మనిషి సుఖపడడానికి అవి అవరోధాలు. జీవితాన్ని ప్రకృతి శక్తులతో అనుసంధానం చేయడం యోగం అని, ఆత్మకు పరమాత్మిక స్పృహ కలిగించడం సాధన అనీ వారికి తెలియదు. అంతవరకు మతానికి ప్రాధాన్యత ఉన్న పాశ్చాత్యదేశాలు సైన్సును తలకెత్తుకున్నాయి. మానసిక శక్తులకు కైమోడ్చాయి. వారికి ఆత్మశక్తిని, దివ్యజ్ఞానాన్ని పరిచయం చేయడం అవసరమని బ్లవట్స్కీ భావన. వివేకం కన్న జ్ఞానం, జ్ఞానం కన్న ఆత్మ దర్శనం గొప్పవని చెప్పడం, నమ్మించడం అంత సులభం కాదు. అందుకు ఉద్యమించింది బ్లవట్స్కీ. ఆ ఉద్యమం పేరే థియోసఫీ. దాని వేదిక థియోసాఫికల్ సొసైటీ.

నేల విడిచి సాము చేయడం కాకుండా, మతాలను, దేవుళ్లను, దైవశక్తుల్ని గుడ్డిగా నమ్మడం కాకుండా, శాస్త్రీయ అవగాహన కలిగించాలని ఆమె ప్రయత్నం. సృష్టిలో భూగోళం వంటి గోళాలు చాలా ఉన్నాయి. మనిషిలాంటి జీవులు ఆయా గోళాలపైన ఉన్నారు. మనిషి భౌతిక శరీరం ఒక్కటే ప్రధానం కాదు. భౌతిక శరీరం అవసరమే. భౌతిక శరీరాన్ని నడిపించే శక్తి ఏది? సైన్సు కాదు. మనస్సా? అది కొంత వరకే. కనిపించని 'ఆత్మ' ఒకటి ఉంటుంది. దానిని పట్టుకోవడం 'యోగం'. అది ఈసొటరిక్. అంటే యోగపరిజ్ఞానం. ఆమె తన వాదనతో భౌతిక


వాదుల్ని నమ్మించ గలిగింది. అనుభవంతో సాక్ష్యాధారాలతో చెప్పిన విషయాలు నమ్మక తప్పలేదు.

అంతదాకా భరతఖండంలో, అంటే ఇండియా, టిబెట్ లాంటి దేశాలకు మాత్రమే వేద విజ్ఞానం, యోగ విజ్ఞానం పరిమితమై ఉండేది. సూక్ష్మలోకాలు, సూక్ష్మశరీరాలు, పునర్జన్మలు ఉన్నాయనే విశ్వాసం వారికే ఉండేది. అతీంద్రియ శక్తుల్ని ప్రదర్శిస్తే తప్ప 'పర' లోకాలను పాశ్చాత్యులు నమ్మలేదు. వారికి ఎంత సేపు భౌతిక దృష్టే. ఆత్మజ్ఞానం లేదు. దాని అవసరమూ వారికి కన్పించదు. ఒక్క జీసస్‌ని మినహాయిస్తే, అధిభౌతిక శక్తులు, ఆత్మశక్తులు మహాత్ముల అధీనంలో ఉంటాయని ప్రాచీన విజ్ఞానం నిదర్శనలతో నిరూపించింది. ఆ విజ్ఞాన కోశాన్ని బయట పెడుతూ నెమ్మదిగా నమ్మకం కలిగించ గలిగింది బ్లవట్స్కీ.

ఆర్యావర్తం తపోభూమి. ఇక్కడ మహర్షుల ఉనికి కొత్త కాదు. ప్రాచీన విజ్ఞానం అంతా మహర్షి ప్రోక్తమే, సత్య సందర్శనమే. మన పురాణ గాథల నిండా మహర్షులు, యోగులు, మునులు ఉన్నారు. వారిని కేంద్రంగా చేసి అల్లిన కథలే అన్నీ. పాశ్చాత్య దేశాలకు మన ఋషి సంప్రదాయం తెలియదు. అక్కడా జ్ఞానులుండేవారు. కానీ వారి పరిధులు వేరు. మరీ అనాగరికంగా ఉండే మనిషికి విశ్వాసం కలిగించారు. భారతీయ ఋషులు తపస్సు చేసి, ఆత్మ దర్శనంతో పరిశోధనలు చేసి సత్యాలు కనుగొన్నారు. ప్రాచీన సమాజంలో మంత్రాలు, పూజలు ఉండేవి. అయితే శాస్త్రీయ అవగాహన ఉండేది కాదు. సంకేతంగా ఉండేవారు.

అంధ విశ్వాసాలు, మూఢ నమ్మకాలు ఏ మతానికైనా పెట్టని కోటలు. మతం మనిషిని స్వతంత్రంగా ఆలోచించనీయదు. తనకుగా సత్యాన్ని తెలుసుకో నివ్వదు. ఋషి తుల్యులు అన్ని దేశాల్లో, అన్ని కాలాల్లో ఉన్నారు. బ్లవట్స్కీ పరిశోధనలో చాలా దేశాలకు చెందిన మాస్టర్లు ఉన్నారు. హిందూ, బౌద్ధ, టిబెట్ దేశాల వారు వరిష్ఠులు. ఈజిప్టు, గ్రీసు దేశాల వారూ సుప్రసిద్ధులే. మహాత్ములైన వారందరిది ఒకే కుటుంబం. జగదైక కుటుంబం వారిది. థియోసఫిస్టులు పేర్కొన్న మాస్టర్లు అందరు శాశ్వతులే. అందరు 'ఆత్మ సంచారులే', సూక్ష్మ శరీరులే. పైగా వారు కాలాతీతులు. వారి ప్రజ్ఞ విశ్వవ్యాప్తం. వారి కర్మక్షేత్రం విశాలవిశ్వం. గోచర ప్రపంచమే కాదు అగోచర లోకాలు వారివే.

**"థియో యోనః ప్రచోదయాత్".** థియోసఫీ మూల సూత్రం సనాతన ధర్మం సరే. అందులో 'సూఫీ' కూడా ఉందా? సూఫిజం చాలా ప్రాచీనం గదా! నిజానికి థియోసఫీ అన్నది ఒక సిద్ధాంత ప్రవచనం కాదు. 'ప్రేమ – కరుణ –



మైత్రి' మూడింటి సమీకరణం థియోసఫీ. ఆ మూడు అవసరం లేని దెప్పుడు? ప్రతి మనిషికి అవసరమైన మూడుగుణాలు అవేగదా! మనుషుల మధ్య నెలకొనవలసింది ప్రేమ, మైత్రి. అవగాహన లేనిచోట్ల, అవి కొరవడిన చోట్ల పూరించ డానికి వ్యవధి అవసరం కావచ్చు గాని అసంభవం కాదు. అంటే థియోసఫీలో మొదటి మెట్టు అవగాహన. మనిషిలో కనిపించిన దైవాంశ పేరు థియోసఫీ. ఒకనాటికి భూమి స్వర్గం కావాలి. మనిషి దివ్యుడు కావాలి. మనది దివ్యజీవనం కావాలి అని సంకల్పించారు శ్రీ అరవిందయోగి. సాధ్యమా? అంటే ఎందుకు సాధ్యం కాదు. మనిషి తన లోపలకు చూడగలిగితే, లోలోతులకు చొచ్చుకు పోగలిగితే సాధ్యమే. తనలో పూర్ణ మానవత్వానికి దివ్యత్వపు పరిమళాలు అద్దగలిగితే సాధ్యమే. మన ముందున్న లక్ష్యం అది. మనిషి చిరాశయం, భగవత్ సంకల్పమూ అదే. మనిషిలోని తపనా అదే.

మనిషికి స్వేచ్ఛ ఉంది గాని స్వతంత్రం లేదు. ప్రతి మనిషి అస్వతంత్రుడే? స్వేచ్ఛాజీవి. మరొకరిపై ఆధారపడకుండా మనిషి జీవించడం అసంభవం. తన పైన తను ఆధారపడి జీవించగలగడం స్వతంత్రం. ప్రక్కవాడు తనలాంటివాడే నన్న భావన ఏర్పడకపోతే సౌభ్రాతృత్వం అసాధ్యం. సహజీవనం కాదు, సఖ్యజీవనం కావాలి. సమభావన నెలకొనాలి. అది శాస్త్రీయ అవగాహన. అది తాత్విక దృష్టి. తాత్వికం అంటే హృదయ స్పందన. హృదయం రసార్ణవం అయితే తప్ప ఆ స్పందన కలగదు. గుండె కరుణరస ప్లావితం కావాలి. హృదయ స్పందన భావ వీచికే కావచ్చు. అయినా అది అవసరం. మానసిక సంయమనం కలవారికి మతంతో పనిలేదు. మతం అన్నది మనస్సు కట్టిన అడ్డుగోడ. అది దాటి

హృదయాన్ని చేరడం మహనీయత. అది ప్రేమభావన వల్ల సాధ్యం. సుహృద్భావన వల్ల సాధ్యం.

థియోసాఫికల్ సొసైటీ ఆవిర్భావం నాటికి అమెరికా, యూరప్ దేశాలు ఆధిపత్యం పోరులో తలపడుతున్నాయి. చిత్ర విచిత్ర భావావేశాలకు లోనై ఉన్న తరుణం. అహంకారంతో హుంకరిస్తున్నాయి. మేధావి వర్గం తలలు పట్టుకున్న సమయం. ఒక రకంగా అది మేథో మథనం. ఆ మథనంలోంచి పుట్టుకొచ్చిన అమృత భాండం థియోసఫీ.

పాశ్చాత్య దేశాల దృష్టి ప్రాగ్దేశాల వైపు మళ్లింది. మనశ్శాంతి కావాలి. మనశ్శాంతికి ఉపాయం కావాలి. అలజడి తగ్గాలి. వారెవరికీ ఆత్మ సంగతి తెలియదు. తూర్పు దేశాలలో విజ్ఞాన గనులున్నాయి. అక్కడ మనశ్శాంతి నిల్వలు పేరుకుపోయాయని ఒక విశ్వాసం. ఈజిప్టు కంటే భారత్, చైనా, టిబెట్ దేశాలు అగ్రస్థానంలో ఉన్నాయని నమ్మకం. తమకు లేనిదేదో వారి వద్ద ఉంది. ఇంతకాలం వారికి హిందూమతంలో చాదస్తాలు, బౌద్ధంలో శాంతిసందేశాలు. చైనావారిలో అంటరానితనం, టిబెట్‌లో ఒంటెత్తుపోకడలు కన్పించేవి. ఇప్పుడు శాంతి కపోతాలు కనిపించసాగాయి.

అసలు భారతీయ ఆత్మను పశ్చిమ దేశాలకు ఎత్తి చూపినవాడు మాక్స్‌ముల్లర్. ఆయన మానసికంగా మహర్షి, బౌద్ధికంగా జ్ఞాని. ఆయన **నిర్వాణం** అనే పదానికి యిచ్చిన అర్థం పాశ్చాత్యుల గుండెల్లో గుచ్చుకుని సలపరం కలిగించింది. దీపం మలిగినపుడు అంతరించిపోయే వెలుగు స్థితిని **'నిర్వాణం'** అన్నాడు. అంటే ఏమిటో, ఎలాగో అర్థం కాలేదు.

చచ్చిపోయిన మనిషి మళ్లీ జన్మిస్తాడు – అంటేనే ఎలా? అంటారు పాశ్చాత్యులు. సైంటిఫిక్‌గా ఎట్లా నిరూపిస్తారు? అని అడుగుతారు. దయ్యం అంటే డెవిల్, స్పిరిట్ అని భయంతో వణికి పారిపోతారు. మరణం అంటే పూర్తిగా చచ్చిపోవడం గదా. మళ్లీ బ్రతకడం ఏమిటి? మనిషిని బ్రతికించేది ప్రాణం. అదనంగా ఆత్మ ఎక్కడి నుండి వచ్చింది? ఎక్కడ ఉంటుంది? మనిషికి ఆత్మతో అవసరం ఏముంది? పైగా ఆత్మ జన్మిస్తుందంటారు. కనిపించని ఆత్మ మళ్లీ జన్మించడం ఏమిటి? జన్మకు కర్మలు కారణం అంటారు. అదేమిటి? సమాధానం దొరకని ప్రశ్నలు. హిందూ మతంలో వారికి బొత్తిగా అర్థం కానిది ఆత్మ వాదం. బౌద్ధంలో వారికి మింగుడు పడనిది అనాత్మవాదం. ఆ రెండు మతాలు గొప్పవెలా అవుతాయి? బుద్ధితో ఆత్మను అంచనా వేయడం కుదరనిపని. పాశ్చాత్యులు మేధావంతులే కావచ్చు కాని ఆత్మజ్ఞానం లేని అమాయకులు.

ఆత్మజ్ఞానాన్ని 'విజ్ఞానం' అనే 'సైన్సు'లోకి అనువదిస్తే తప్ప వారికి పునర్జన్మలపై నమ్మకం ఏర్పడదు. అప్పుడది 'సైంటిఫిక్' అవుతుంది. పునర్జన్మకు ఒక జన్మలో చేసిన పనులు ఆధారం అని నమ్మకం కలగాలి. మన దేశంలో మత పెద్దలు, గురువులు 'స్వర్గం' పేరు చెప్పి మోసం చేస్తుంటారు. వారు చూపించిన దారిలో వెడితేనే స్వర్గం. దారి తప్పినా, అడ్డదారిన పోయినా నరకంలోకి నడక. ఏ దారి ఎటుపోయినా 'మోక్షం' అడ్రసు దొరకదు. పాపిష్టి పనులు చేసేవారే నిత్యం స్వర్గం గురించి కలవరిస్తుంటారు.

సైన్సు అభివృద్ధి చెందడంతో పాటు పదార్థ విజ్ఞానంపై మోజు పెరిగింది. మనిషి వ్యక్తిత్వం, వికాసం, ప్రగతి – అతని భౌతిక వనరులు బట్టి, సంపదలు బట్టి అంచనా వేయడం జరుగుతోంది. సుఖలాలసపై మోజు పెరిగి మతంపై మోజు తగ్గుముఖం పట్టింది. చాందసాలు, మూఢనమ్మకాలు కొంతవరకు తగ్గుముఖం పట్టాయి. మతం మబ్బులు విడిపోగానే ఆత్మకిరణ ప్రసారం ప్రారంభమవుతుంది. భగవంతుని సృష్టిరహస్యం తెలియనివారు డార్విన్ సిద్ధాంతం నమ్మారు. పరిణామ వాదం బలపడసాగింది. ఆ సందిగ్ధ సమయంలో సైన్సుకు ఆధ్యాత్మికత సహాయ సహకారాలు అవసరపడ్డాయి. సరిగా అప్పుడే మన దేశంలోనూ మతం గోడలు పగుళ్లిచ్చాయి. మతం మీద మేధ తిరుగుబాటు చేసింది.

మనసు పైన ప్రభుత పెత్తనం చేయదు. మనస్సు స్వేచ్ఛగా విహరిస్తుంది. ఆలోచనల్ని ఎవరూ కట్టడి చేయలేరు. ప్రతి మనిషి భావ పరంగా స్వతంత్రుడే. భావ ప్రకటనపైన స్వేచ్ఛ ఉంది. మతం నోరు నొక్కినా, మనసు తిరగబడక మానదు. అది మానవ నైజం. అది మనోజవం.

భౌతిక సుఖాలపై తెర తొలగగానే ఆ శూన్యంలోకి ఆధ్యాత్మికత్వం ప్రవేశిస్తుంది. ఒక్కసారి ప్రవేశించిన ఆధ్యాత్మికత తిరిగిపోదు. తరిగిపోదు. అందుకే మరణం తర్వాతి జీవితం విలువ పెరిగింది. అదే అసలైన జీవితం. విలువలు తరగని జీవితం. భద్రమైన జీవితం, దివ్యమైన జీవితం అనే స్పృహ ఏర్పడ్డది. సైన్సు కూడా రోదసిలోకి, ఖగోళంపైకి దృష్టి సారించింది. ఇంతకాలం సందిగ్ధంగా ఉన్న లోకాలు వాస్తవాలయ్యాయి. పరలోకాల, సూక్ష్మశరీరాల చిక్కుముడి వీడింది. సైకాలజీ వచ్చి ఫిలాసఫీ దుప్పట్లో దూరి కూర్చుంది. మనసు, ఆత్మ వేరు వేరన్న స్పృహ కలిగింది. ఆత్మని మరుగున పెట్టి మనసు 'ఆత్మ' మేకప్‌లో మనిషిని మోసం చేస్తున్నదని మేధావి గ్రహించాడు.

అటువంటి సందిగ్ధంలో విభిన్న భావజాలాల్ని ముడివేసే ప్రయత్నం థియోసాఫికల్ సొసైటీ చేసింది. అంతవరకు పాశ్చాత్య విద్వాంసుల బుర్రకు తట్టని మాట 'థియోసఫీ'. పాశ్చాత్యులు అదే కోరుతుండడం వల్ల బ్లవట్స్కీ థియోసఫీతో పరిష్కారం చూపించినట్లయింది.

లోకాన్ని దేవుడు సృష్టించాడు అని నమ్మే మనిషికి పరిణామంలో మనిషి ఏర్పడ్డాడు అని నమ్మించడం ఎంతకష్టం! అలాగే దేవుళ్లను నమ్మి బ్రతికే వారికి పరమ గురువుల పాలనలోనే జగత్తు ఉందని నమ్మించడం కష్టం! 'మాస్టర్లు' అయిన వారంతా ఒకప్పుడు మన లాంటివారే. భౌతికదృష్టికి అందని సూక్ష్మ లోకాలలో, కారణ శరీరాలలో ఉంటారని చెప్పినా నమ్మరు. ప్రతిదానికి నిదర్శనాలు కావాలి.

మనకు మంచి ఆలోచనలు కలిగించేవారు మాస్టర్లు. మనలో జ్ఞానబీజాలు నాటే వారూ పరమగురువులే. పరమ గురువులపై అపూర్వ పరిశోధనలు చేసి 'మాస్టర్ల' ఉనికిని నిరూపించ గలిగిన ధీమణి బ్లవట్స్కీ. పరమ గురువుల వద్ద సృష్టి విజ్ఞాన భాండారం ఉంది. అది తరగని సంపద. అది నిగూఢం, భృక్తం. మనం ఎంత తపస్సు చేసినా, యోగం చేసినా మాస్టర్ల అనుగ్రహం పొందలేక పోతే గమ్యం చేరడం జరగదు. యోగంతో జ్ఞానం సాధిస్తే ప్రతి ఒక్కరు మాస్టర్ స్థాయికి ఎదగవచ్చు.

సృష్టిలో మనిషి ఒక భాగం. ఉత్తినే ఎవరూ లోకంలో జన్మించరు. ప్రతి జీవికి కొంత బాధ్యత ఉంది. మనిషికి మరింత బాధ్యత ఉంది. మనిషికి అదనంగా మనసున్నది గదా. మనసుకు వివేకం ఉంది. వివేకానికి బుద్ధి తోడున్నది. కనుక పరిణామ కార్యంలో మనిషి నిర్వహించవలసిన పాత్ర చాల పెద్దది. ముఖ్యమైనది. ప్రతి మనిషి దివ్యమానవుడుగా మారే వరకు పరిణామం సాగుతుంది.

మనిషి పుట్టింది కేవలం సుఖపడి చావడానికి కాదు. జ్ఞానం ఆర్జించడానికి, పరిణామానికి దోహదం చేయడానికి. మనిషిగా జీవిస్తూ ఎక్కవలసిన తర్వాతి మెట్టు దివ్యత్వం. దివ్యత్వం సాధించడం మనిషి తనకోసం కాదు – పరిణామం కోసం, పూర్ణత్వం కోసం. అదీ మానవజన్మ రహస్యం. సరైన మార్గంలో, సదాశయంతో, సత్సంకల్పంతో సాధన చేసి సాధించవచ్చు.

**థియోసఫీ అందరిదీ. అది "ఆర్ట్ ఆఫ్ లివింగ్". ప్రతి మనిషీ థియోసఫిస్టే. అంటే థియోసఫిస్టు లక్ష్యం తనలోని ఆధ్యాత్మిక శక్తుల్ని గుర్తిస్తూ దివ్యత్వం వైపు సాగడం. దివ్యత్వంలోకి ఎదగడం.**



# 2. కాంతి కిరణం

*కారు చీకటిలో కాంతి కిరణం – ఆమె జననం.*
*నవయుగానికి వైతాళిక గీతం – ఆమె ఆగమనం.*

**అ**న్ని దేశాల మేధావుల్ని ఒక్కసారిగా ఉలిక్కి పడేట్లు చేసింది ఆమె గొంతు.

ఆమె పూరించిన విప్లవ శంఖం పేరు 'అక్షరం'. అదే థియోసఫీ. ఆకాశపు టంచుల వరకు అంతర్నేత్రం దర్శించిన త్రినయని ఆమె. ఆమె జన్మతః యోగిని. దివ్యజ్ఞానానికి సరిహద్దులు చెరిపిన ధీమణి. ప్రపంచ సుఖాలు, భోగాలు, సంపదలు ఏవీ అవసరం లేని విరాగిని. విశ్వశ్రేయస్సు కోసం, అహర్నిశలు తపిస్తూ, తమిస్తూ నిస్వార్థంగా జీవించిన సాంసారిక సన్యాసిని.

లోకం కోసం, లోకహితం కోసం తనను శూన్యం చేసుకోగలిగింది.

శూన్యంలో లయించగలిగింది. శూన్యంలో శూన్యమైంది.

శూన్య హృదయాలకు జ్ఞానామృతం దోసిళ్ల కొద్దీ పంచిన అమ్మ.

సమకాలీనులు తనను అర్థం చేసుకునేలోగా అవతారం చాలించింది. అయినా ఆమె ఔన్నత్యం కాలాతీతం, శాశ్వతం. ఆమె ప్రాతఃస్మరణీయ.

దివ్యజ్ఞాన సుధల్ని 'థియోసఫీ' అనే బంగారు పాత్రలో లోకానికి అందించింది. అవసరానికి ఆదుకునే ఆపన్న హస్తం ఆమెది.

అది సంధియుగం. అనేక శతాబ్దాలుగా యూరపు దేశాలు చీకటి నాగరికతలో ఉండిపోయి, కలహాలకు కాలుదువ్వుతున్నాయి. ఎప్పుడు ఏ రాజ్యం మరే రాజ్యం మీద దండెత్తుతుందో తెలియదు. రాజ్యకాంక్ష, రాజ్యవిస్తరణ కాంక్ష, అధికార వ్యామోహం అందరిది.

అప్పుడు భారతదేశం బానిసత్వంలో ఉంది.

ఆమె రాక ఒక శుభకామన.

అంధ విశ్వాసాలపైన మెత్తని కత్తి ఝళిపించింది. ఒంటరిపోరుకు సిద్ధమైంది.

నిరాడంబర జీవనం, నిస్వార్థ పరత – ఆమె విజయ రహస్యం.

నడి సముద్రంలో నిలిచిన గిరి శిఖరం ఆమె.

అయితే ...

ప్రపంచం ఆమె రాకను స్వాగతించడానికి సిద్ధం కాకముందే జన్మించింది. ఆమెను ఇరవైయవ శతాబ్దం అర్థం చేసుకున్నంతగా సమకాలికులు అర్థం చేసుకోలేకపోయారు.

మనిషి తనను మరచిపోయి చాలా కాలమైంది.

మానవత్వం మరచిన మనిషిని జాగృత పరచాలి.

తనను తనకు పరిచయం చేయాలి.

అందుకు మాస్టర్ల తరపున నియుక్తమైన దూతిక ఆమె.

ఆమె జన్మకు రాకముందే మహాజ్ఞాని, కాలజ్ఞాని.

మాడం బ్లవట్స్కీ ఆవిష్కరించిన థియోసఫీ పూర్తిగా కొత్తది కాదు. 14వ శతాబ్దంలో 'సాంగ్–ఖ–పా' అనే టిబెట్ యోగి ఈ ఆధ్యాత్మిక సంస్కరణలకు శ్రీకారం చుట్టాడు. ప్రపంచంలో అప్పుడప్పుడు సనాతన ధర్మంపైన మతం చీకటి మబ్బులు కమ్మడం సహజం. కొంతకాలం చీకట్లు ఆవరిస్తాయి. చీకటి వెలుగుల సయ్యాటలు తప్పదు. ప్రపంచంలో ద్వంద్వం తప్పదు. అన్ని విషయాలు అద్వైతంలో ఇమడవు. అటువంటి సమయాల్లోనే మహాత్ములు జన్మిస్తుంటారు. అవతార పురుషులు ఋషులవుతుంటారు. అయితే ఏ ఒక్క ప్రవక్త, అవతారుడు పూర్తి విజయం సాధించి, ఉద్ధరించిన దాఖలాలు కనిపించవు. ఎక్కడో లోపం ఉంటోంది. పని అసంపూర్తిగా మిగిలిపోతూనే ఉంది. మరొక మహాత్మ అవతరణకు అవకాశం ఉంటూనే ఉంది.

బ్లవట్స్కీ అవతార లక్ష్యం పూర్తిగా నెరవేరిందని చెప్పలేం. అయినా నిష్ఫలం కాలేదు. ప్రతి మహాత్మునికీ అనుయాయులుంటారు. వారసులు తయారవుతారు. అసంపూర్ణ కార్యభారాన్ని తమ భుజ స్కందాలకు ఎత్తుకుంటారు. ఉద్యమాగ్ని చల్లారదు. కొంతకాలం నివురుకప్పి ఉంటుంది. ఇది చెరగని ఆనవాలు. ఇది సత్యం.




# 3. బాలారిష్టాలు

**హె**లెనా పెట్రోవ్నా జననం 1831 ఆగష్టు 12 అర్ధరాత్రి. మెరిడియన్ టైం (జీరో అవర్)లో పుట్టినవారు మహాత్ములవుతారని ఒక ప్రతీతి. అది దేవతలు సంచరించే సమయం. మహాత్ములు ఆత్మయానం చేసే సమయమూ అదే. అప్పుడు అర్హులు, యోగ్యులైన వారిపై మహాత్ముల దృష్టి పడుతుంది.

దక్షిణ రష్యాలోని 'ఏకాటరనిస్లోవ్' పట్టణంలో ఆమె జన్మించింది. ఆ పట్టణం డ్నిపర్ నది ఒడ్డున ఉంది. ఆమె తండ్రి కల్నల్ పీటర్, తల్లి హెలెనా డి. ఫదెయేవ్. ఆమె ప్రముఖ నవలా రచయిత్రి. హెలెనా అమ్మమ్మ కూడ సాహితీ పరురాలే. రచయిత్రి కూడా. ఆమె పేరు డోల్‌గొరుఖోవ్. ఆమె సంపన్న కుటుంబానికి చెందిన మహిళ. పైగా రాజవంశం. రష్యా ప్రభువు గ్రాండ్ డ్యూక్ రోరిక్ వారసురాలు.

బాల్యంలో హెలెనా ప్రవర్తన విచిత్రంగా ఉండేది. అందరు పిల్లల్లా ఉండేది కాదు. బాల పిశాచిలా ప్రవర్తించేది. దయ్యంపట్టిన దానిలా తిరుగుతుండేది. అయితే ఆమె అద్భుత శక్తులు చూచిన బంధువులకు, స్నేహితులకు మతులు పోయేవి. తనపై ఎవరి పెత్తనం సహించేది కాదు. తన పంతం నెగ్గవలసిందే. తన మాట చెల్లుబాటు కావలసిందే. ఆమె ప్రజ్ఞ బహుముఖీనం, తెలివి తేటలు అపూర్వం. మంచి భాషాపటిమ. స్పష్టంగా, నిర్దుష్టంగా మాట్లాడేది. పియానో అంటే ఇష్టం. ఎక్కడా నేర్చుకోకపోయినా అద్భుతంగా వాయించేది. మంచి మంచి బొమ్మలు వేసేది. కుంటి గుర్రాలపైన స్వారి చేయడం ఇష్టం. ప్రకృతి సౌందర్యం

అంటే ఇష్టం. చిన్నతనంలోనే తన జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకుందా అనిపించేది. తను అందరిలాంటిది కాదు. అందరిలా బ్రతికే ఆడపిల్ల తను కాదు. తనకు దైవ రక్షణ ఉంది. తను కారణజన్మురాలు.


ఆమెది బాలతనాన్ని మించిన బేలతనం, మనసు వెన్నెలంత చల్లన, నిర్మల హృదయం. ఆమె దానధర్మాలకు, దాతృత్వానికి హద్దు, అదుపు ఉండేది కాదు. ఆయాని తెగ విసిగించేది. ఏడిపించేది. సంప్రదాయంపైన, ఆచారాలపైన తిరగబడడం ఉగ్గుపాలతోనే నేర్చింది. కుట్రలు, కుతంత్రాలు తెలియవు. లౌక్యం తెలియక కష్టాలు తెచ్చుకునేది. తర్వాత జీవితంలోనూ తన అలవాట్లు మార్చుకోలేక భంగపడిన సందర్భాలు అనేకం. ఎవరికి కాస్త అపకారం జరిగినా, అన్యాయం జరిగినా సహించేది కాదు. తండ్రి ఎవరికైనా సైబీరియా శిక్ష వేస్తే విలవిల్లాడి పోయేది. ఎడారిలో వారు పడే కష్టం ఊహించుకుని కుమిలిపోయేది. తను పెరిగి పెద్దయిన తర్వాత ఎవరికీ అలాంటి కష్టాలు రాకుండా చూస్తానని శపథం చేసింది. అప్పుడే ఆమెలో బుద్ధుని కరుణ ప్రవేశించింది.

మనిషి కష్టాలకు, బాధలకు కారణం ఏమిటి? వాటిని తొలగిస్తే బాధలు ఉండవు గదా! సరిగా సిద్ధార్థుని ఒకనాటి ఆవేదన అదే. అదే పరితప్త హృదయం. ఒంటరిగా అడవుల్లో, కొండల్లో, నిర్జన ప్రదేశాల్లో తిరుగుతూ ఆలోచించేది. సమాధానం ఏదీ? చెట్లతో, పక్షులతో కబుర్లు చెప్పేది. అది ప్రకృతిపై ప్రేమా? కృత్రిమ జీవితం పైన అయిష్టమా? అప్పుడే నిరాడంబరంగా, సహజంగా జీవించాలని నిర్ణయించుకుంది. చిన్న పిల్ల.

హెలెనా పుట్టినపుడు చాలా అర్భకంగా ఉండేది. కళ్లు తెరిచేది కాదు. ఏడ్చేది కాదు. ఆ పిల్ల బ్రతికి బట్ట కడుతుందని ఎవరూ అనుకోలేదు. శాపగ్రస్తు రాలు అనుకునేవారు. ఎంతోమంది పూజారులు, మంత్రవేత్తలు, భూతవైద్యులు వచ్చి ఎన్ని క్రతువులు జరిపించినా ప్రయోజనం కనిపించలేదు. పట్టింది చిన్న దయ్యం, మామూలు దయ్యం కాదు. పెద్ద పిశాచమో, భూతమో అనుకునేవారు. పెద్ద పెద్ద దివిటీలు వెలిగించి ఆర్భాటంగా హోమాలు చేయించారు. మత పూజారులైన ఆడ, మగ జంటలకు కొవ్వొత్తు లిచ్చి నాట్యాలు చేయించారు. అది గ్రీకు సంప్రదాయం. అందరు నిలబడి అలాంటి క్రతువు నిర్వహిస్తారు.

ఆ క్రతువు పెద్ద మందిరంలో ఏర్పాటు చేశారు. రాజ కుటుంబం కదా! ఉత్సవం చూడడానికి పెద్ద సంఖ్యలో జనం తరలి వచ్చారు. ప్రధాన పురోహితుడు అతని శిష్యగణం బంగారు రంగు గౌనులు ధరించి, మెడలో పూసల పేర్లు,

నగలు ధరించి, యాగీ చేశారు. ఒక గంట తతంగం. హెలెనా పసిపిల్ల. ఆమెకు తోడుగా పిన్నమ్మను కూర్చోపెట్టారు. ఆ పిల్ల హెలెనా కన్న కాస్త పెద్దది. అంతలో ప్రధాన పూజారి వేసుకున్న బట్టలకు నిప్పంటుకుంది. ఒక్కసారిగా మంటలు లేచాయి. చాలా మందికి ఒళ్లు కాలి శివా లెత్తారు. ఆ సంఘటన అశుభ సూచకంగా భావించారు. రష్యాలోనూ మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలు ఎక్కువే. ఆరోజు నుండి హెలెనాపై "పాపిష్టి పిల్ల" అని ముద్ర పడ్డది.




తల్లి హెలెనా డి. ఫధెయేవ్

చిన్నప్పటి నుండి హెలెనాది పెడసర స్వభావం. అయినా ఆమెలో ఏదో ఆకర్షణ ఉండేది. ఇష్టం ఏర్పడేది. టీచర్లు చెప్పినా, పెద్దలు చెప్పినా మాట వినేదికాదు నిర్లక్ష్యం. చెయ్యమన్న పని చేసేది కాదు. వద్దన్న పని ఖచ్చితంగా చేసేది. తన ఇష్టాలను ఎవరూ కాదనకూడదు. ఏ పని చేసినా స్వతంత్రంగా, ధైర్యంగా చేస్తుంది. ఏటికి ఎదురీదే స్వభావం.

తల్లి చనిపోతూ హెలెనా భవిష్యత్తు గురించి బెంగ పడ్డది. పెద్దపిల్ల ఫరవా లేదు. చిన్నది పిచ్చి మాలోకం. ఎట్లా బ్రతుకుతుందో? ఎన్ని కష్టాలు పడుతుందో!

తల్లి మరణం తర్వాత అక్కాచెల్లెలు 'సారటోవ్' లోని అమ్మమ్మ గారింటికి చేరారు. అక్కడ తాతగారిల్లు పెద్ద రాజప్రాసాదం. పొడవాటి వసారాలు, విశాలమైన గదులు, చీకటి మెట్లు, చీకటి కోనలు. అది పాతకాలపు కోట. ఆ ఇంటికి ఒక రాక్షసుడు కాపలా ఉండేవాడు. రాక్షసుడంటే నిజం రాక్షసుడు కాదు. మహాక్రూరంగా ప్రవర్తించేవాడు. అతని చేతిలో చచ్చిన దొంగలు అక్కడ దయ్యాలై తిరుగు తుంటారని చెప్పుకుంటారు. దానితో ఏ చీకటిగది దగ్గరకు వెళ్లినా, దయ్యం తిరుగుతున్నట్లే అనిపించేది. అక్క చెల్లెళ్లకు తోడుగా ఓ అరడజను మంది పనివాళ్లు ఆ ఇంట ఉండేవారు.

హెలెనా ఒక్కచోట నిలకడగా ఉండేది కాదు. కాలు కాలిన పిల్లిలాగ తిరుగుతుండేది. హద్దు, అదుపు లేదు. పాడుబడిన గదులన్నీ ఆమెకు పరిచయమే. చీకటి గదులంటే మరింత ఇష్టం. చదువు ఎగ్గొట్టి చీకటిగదుల్లో కూర్చుండి


అమ్మమ్మ డోల్‌గొరుభోఖో

పోయేది. ఎంత రహస్యంగా జారుకున్నా ఆమె స్వభావం తెలిసిన పనివాళ్లు వెదికి లాక్కొచ్చేవారు. ఎవరికీ కనిపించకుండా ఒక ఉపాయం పన్నింది. పాత టేబుళ్లు, కుర్చీలు, సామాన్లు ఒకదానిపైన ఒకటి పేర్చి వాటి చాటున కూర్చునేది. సాల్మన్ కథల పుస్తకం పట్టుకెళ్లి తెగ చదివేది. సాల్మన్ కథలంటే అన్నీ దయ్యాలు, భూతాల కథలు. మాయా ప్రపంచం.

ఆ పిచ్చి చాలనట్లు, రాత్రి వేళల్లో నిద్రలో లేచి నడిచిపోయే అలవాటు. ఏ చీకటి గదికో వెళ్లి అక్కడ నిద్రపోయేది. పన్నెండేళ్ల వయసులో అలాగే లేచి వెళ్లిపోయింది. అందరూ కంగారు పడ్డారు. అన్ని గదులు సోదా చేశారు. చివరకు వరండా చివరన, ఎవరితోనో మాట్లాడుతున్నట్లు తనలో తనే మాట్లాడుతోంది ఏకపాత్రాభినయంగా. అవతలి వ్యక్తి ఎవరో ఎవరికీ కనిపించలేదు. అంటే అప్పటికే అదృశ్యంగా ఉన్న వారితో పరిచయాలు ఏర్పరచుకుంది. జన్మాంతర సంస్కారం. అలాంటి పిల్లతో వేగడం ఎలా? ఆమెలో రెండు స్వభావాలుండేవి. ఆమెలో రెండు ఆత్మలు కలిసి ఉండేవి. అంటే ఆమెలో సదా ఇద్దరు మనుషులు ఉంటుండేవారన్న మాట. లైబ్రరీలో కూర్చుని గంటల తరబడి చదివేస్తుండేది.

**హెలెనా అక్క తమ చిన్నతనం గురించి ఇలా చెప్పింది :**

"ఊహ తెలిసినప్పటినుండి హెలెనా అంటే జగమొండి. పిల్ల అర్థమయ్యేది కాదు. దాని స్వభావం, ప్రవర్తన ఒక్కోసారి మంచిగా ఉండేది.

తన ఈడు పిల్లల్ని కూర్చోపెట్టుకుని గంటల కొద్దీ కథలు చెప్పేది. అన్ని కథలు దాని పొట్టలో ఎట్లా ఉండేవో మరి! దాని కడుపు కథల ఊటబావి. ఆ కథలు నమ్మ శక్యంగా ఉండేవి కావు. కళ్లతో దృశ్యాలు చూస్తూ కథలు అల్లేదేమో! అంత తన్మయం దానిది. ఒక్కొక్కసారి కథ చెప్పడం అపి, కళ్లు మూసుకుని పరవసించిపోయేది, ఎంత ఆనందమో! తన కళ్లు రవ్వల్లాగా మెరుస్తుండేవి. పిల్లలు దాని కళ్లలోకి సూటిగా చూడాలంటే భయపడే వాళ్లు. ఒక్కోసారి పిచ్చిగా కేకలు పెడుతూ ఇల్లంతా పరుగులు పెట్టేది. పిచ్చిగా తనలో తానే నవ్వుకునేది. కనిపించని మనుషులతో సదా కబుర్లు చెబుతుండేది. తనకి చీకటంటే ఇష్టం.

అస్సలు భయం అన్నది ఉండేది కాదు. పావురాళ్ల గూళ్లు అంటే ఇష్టం. ఒళ్లో పావురాయిని పట్టుకుని ముద్దులాడుతుండేది. బుజ్జగిస్తుండేది. తను శూన్యాన్ని శ్రద్ధగా వినేది. చెట్లతో చేమలతో మాట్లాడేది. పూలతో ఊసులాడేది. పక్షుల గొంతులను అనుకరిస్తూ పలకరించేది. మాకు శూన్యంగా ఉన్నచోట్లలో తనకు ఎవరో కనిపించేవారు. తనతో కబుర్లు చెప్పేవారు. మాకెవ్వరికీ వినిపించేది కాదు. అర్థమయ్యేది కాదు.

మా తాతగారంటే గవర్నరు. మా బంగ్లాకు అయిదారు మైళ్ల దూరంలో ఇసుక మైదానాలుండేవి. అక్కడ ఇదివరకు ఒక నది ప్రవహించేదట. ఇప్పుడు లేదు. ఆ నది ఇసుకలో పురాతన కాలం నాటి శిల్పాలు బయట పడుతుండేవి. మా పిచ్చి చెల్లి ఆ శిల్పాల్ని తదేకంగా చూచి, వాటి కథలు చెప్పేది. ఆ కాలంలోకి వెనక్కి వెళ్లిపోయి ఆనాటి రాజుల కథలు, రాణుల కథలు, వింత వింత కథలు చెప్పేది. మోచేతిపైన గడ్డం ఆన్చి, దీర్ఘంగా ఆలోచిస్తూ కథలు చెబుతుంటే అవన్నీ నిజం కథలే అనిపించేవి. కల్పనలు కావు. యుద్ధాలు సైతం వర్ణించి చెప్పేది. 'మేం నమ్మం' అంటే ఒకసారి శ్రోతలందర్నీ ఆ కాలంలోకి తీసుకువెళ్లి నిజంగా చూపించింది. తను గతకాలంలోకి వెళ్లడమే కాదు – మమ్మల్నీ తీసుకు వెళ్లేది. ఆలోకాలను చూస్తే భయం వేసేది. మా పిచ్చిపిల్ల సామాన్యురాలు కాదు."

★ ★ ★

పెళ్లయితే పిచ్చి కుదురుతుందన్న విశ్వాసం రష్యాలోనూ ఉంది. ఆ నమ్మకం అన్ని దేశాల్లో ఉంటుంది. పిచ్చి అన్నది కొంత మనో వైకల్యం. హెలెనా ఆలనా పాలనా చూసే గవర్నెస్ ఆ పిల్లను ఎవడో ఒకడికి కట్టబెడితే ఒక పనైపోతుందని భావించింది. నికిఫర్ వి. బ్లవట్స్కీ అనే ముసలాడ్ని చూచి ఒప్పించింది. అతను హెలెనా కన్న మూడు రెట్లు వయసున్నవాడు. పెళ్లినాడు ప్రమాణాలు చేయిస్తారు గదా! హెలెనా చేత "నేను భర్తకు విధేయంగా ఉంటాను. మంచి భార్యగా ఉంటాను." అని పురోహితుడు ప్రమాణం చేయమంటే **"నేను చచ్చినా మొగుడికి విధేయంగా ఉండను. వాడితో కాపురం చేయను"** అని ప్రమాణం చేసింది. పెంకి ఘటం. అందరూ అవాక్కయ్యారు. ఇదేం పిల్లరా బాబూ! అనుకున్నారు.

ఎవరు ఎలా అనుకున్నా, మొహం మీద అన్నా పట్టించుకునే రకం కాదు. పెళ్లి అయిన మర్నాడే ఇల్లు వదలి, ఊరు వదలి పారిపోయింది. బంధువులకు, మొగుడికి తెలియదు. ఆమె పలాయనం గురించి మొగుడు అసలు పట్టించు కోలేదు. ఆ పిల్ల ఎలాగూ తనకు సరిజోడు కాదు!

హెలెనా జాతకంలో శుభగ్రహాలు వక్రించాయని, దుష్టగ్రహాలు రాజ్యం చేస్తున్నాయని జ్యోతిష్కులు చెప్పారు. ఎవరి తలరాత ఎవరు మార్చగలరు? గ్రహాలూ విధిని మార్చలేవు. పది సంవత్సరాలు ఇంటి ముఖం చూడలేదు.

హెలెనా జన్మించిన ఊరుకు దగ్గరలో ఒక యోగి ఉండేవాడు. ఆయన పండు ముదుసలి, మహాజ్ఞాని. ఒకసారి హెలెనా, ఆమె అక్కయ్య ఆయన్ని దర్శించారు. ఆయన హెలెనాను చూచి ... "ఈ అమ్మాయి అందరిలాగా జీవించదు. భవిష్యత్తులో చాలా గొప్ప వ్యక్తి అవుతుంది. ఆమెలో దివ్య శక్తులు గూడు కట్టుకుని ఉన్నాయి. నా మాటలు నిజమయ్యే నాటికి నేను బ్రతికుండను" అని చెప్పాడు. ఆనాటి మత పెద్దలెవరూ ఆమె మహత్తుల్ని గుర్తించేవారు కాదు.

రష్యా మొత్తంలో ముగ్గురు ప్రధాన మతాచార్యు లుండేవారు. వారిలో ఒకాయన హన్ కుటుంబానికి హితుడు, సన్నిహితుడు. 1860లో ఆయన అంతర్వాణి ఉద్వేగంతో చెప్పాడు. "అమ్మాయ్! నీలో మహాశక్తులు నిగూఢంగా ఉన్నాయి. వాటిని కానిపనులకు వెచ్చించి కష్టాలు కొని తెచ్చుకోవద్దు. అతీంద్రియ శక్తుల్ని, దివ్యశక్తుల్ని ఎవరుగాని విశ్వ ప్రయోజనాలకు, మంచి పనులకు ఉపయోగించాలి. దైవశక్తుల్ని పొదుపుగా ఉపయోగించుకోవాలి. జాగ్రత్త తల్లీ" అని సలహా యిచ్చారు.

★ ★ ★

1844లోనే తండ్రి వెంట ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ, ఇంగ్లండు వెళ్లింది. ఆయా దేశాలలో కళలు, సంగీతం ఆమెను అలరించాయి. జర్మనీలో పియానో విద్వాంసుడు 'ఇగ్నజ్' వద్ద సంగీత శిక్షణ తీసుకుంది. చిన్న వయసులోనే ఆమె ప్రతిభను గుర్తించి లండన్‌లో ఒక సంగీత విభావరిలో పాల్గొనే అవకాశం యిచ్చారు. ప్రసిద్ధ పియోనిస్టులు క్లారాస్కూన్‌మన్, అరబెల్లా గొడార్డ్‌ల తర్వాత మూడవ స్థానం బ్లవట్‌స్కీకి దక్కింది. సంసారం చేయకపోయినా మొగుడి ఇంటిపేరు తన పేరుకు తగిలించుకుంది.

అజ్ఞాత పర్యటనలో ఆమె పేరు లారా. ఇటలీలో, రష్యాలో ప్రచ్ఛన్న నామంతోనే వ్యవహారం నడిపించింది. ఆమె సహజ సౌందర్యంతో పాటు కళా చాతుర్యం జనాలకు ఆకర్షణ అయింది.

న్యూయార్కులో హెలెనా పియానో ప్రావీణ్యం రుచి చూచి పరవశించి పోయిన కల్నల్ ఆల్కాట్ ఆమె అభిమానిగా మారాడు.




# 4. పర్యటన పదేళ్లు

**పె**ళ్లి పెటాకులైంది. సంసారసుఖం సాగరసంగమ మైంది. ఆనందం ఆకాశం మార్గం పట్టింది. ఇంక జీవితంలో మిగిలిందేమిటి? చివరికి మిగిలేది ఏమిటి? మొగుడు లేకపోయినా 'మగ' సిరితో బ్రతకగల నంగనాచి. పెళ్లి అయినందుకు గుర్తుగా మొగుడి ఇంటిపేరు తన పేరు చివరన తగిలించుకుంది. అదొక తృప్తా? కాదు అది అవసరం.

పెళ్లి అయిన మర్నాడే గుమ్మం దాటింది. ఊరు వదిలింది. దేశం వదిలింది. టర్కీ, ఈజిప్టు, గ్రీసు దేశాలు ఆబగా పర్యటించింది. ఎక్కడికి వెళ్లినా తండ్రికి ఉత్తరాలు రాస్తుంది. ఆయనగారు అవసరానికి మించి డబ్బు పంపుతుండేవాడు.

1851 బ్లవట్స్కీ ఇరవైయ్యవ పుట్టినరోజు నాటికి లండన్‌లో ఉంది. చిన్నతనం నుండి తనకు కనిపించకుండా అదృశ్యంగా గమనిస్తూ తనను నడిపిస్తున్న గురువును దర్శించే అవకాశం కలిగింది ఒకనాడు. ఆయన భారతదేశానికి చెందిన రాజపుత్రుడు – **మహాత్మా మోరియా**. తర్వాతి కాలంలో థియోసఫిస్టులు మాస్టర్ ఎం అనీ, మాస్టర్ మోరియా అని ఉపాసించింది ఆయననే. ఆనాడే బ్లవట్స్కీకి ఆయన దిశానిర్దేశం చేశాడు. నాటి నుండి ఆమె హృదయంలో గురుస్థానం మోరియాది. ఆమె అంతరంగంలో నిండింది ఆ గురుభావన.

గురు దర్శనంతో ఆమెకు వేయి ఏనుగుల బలం వచ్చింది. ఈ విశాల విశ్వం అంతా తన విహార వేదిక అనుకుంది. తాను ఒక దేశానికి చెందిన వ్యక్తి కాదు. తాను విశ్వమహిళ. నిర్భయంగా ప్రపంచ యాత్రకు బయలు దేరింది.

కెనడా, అమెరికా, మెక్సికో, దక్షిణ అమెరికా, వెస్టిండీస్, సింహళ దేశాల మీదుగా భారతదేశం చేరుకుంది. టిబెట్ వెళ్లాలని ఎంత ప్రయత్నించినా అనుమతి లభించలేదు. ప్రస్తుతానికి ఆ ప్రయత్నం విరమించి 1853 నాటికి ఇంగ్లాండు చేరింది. 1854లో అమెరికా వెళ్లి 1855 నాటికి మళ్లీ ఇండియా చేరుకుంది. ఈసారి కాశ్మీర్ ద్వారా టిబెట్‌లో ప్రవేశం పొందగలిగింది. లధక్‌లో పరమ గురువుల్ని దర్శించి ఆధ్యాత్మిక శిక్షణ పొందాలని సంకల్పం. అగోచర లోకాలకు వెళ్లి జ్ఞానం సంపాదించాలని కోరిక.

1858లో ఫ్రాన్సు, జర్మనీ దేశాలు తిరిగి రష్యా చేరింది. అప్పటికి ఆమె లక్ష్యం నెరవేరలేదు కానీ మార్గం తెలిసింది. కాకసస్ పర్వత శ్రేణులలో ఉండే తాంత్రికుల్ని, గురువుల్ని దర్శించి, కొంతకాలం వారి శుశ్రూష చేసి, కొన్ని శక్తులు చేజిక్కించుకోగలిగింది. అయినా అసలు గమ్యం అందనంత దూరంగానే ఉండిపోయింది.

ఏ బాట ఎటుపోతుందో చెప్పవచ్చు. ఎవరి జీవితం ఎటు పోతుందో, ఎన్ని మలుపులు తిరుగుతుందో ఎవరూ చెప్పలేరు. జ్ఞానయాత్రలో ఎన్ని మజిలీలో, మరెన్ని ప్రస్థానాలో? ఏ మలుపు ఏ గమ్యానికి చేర్చుతుందో తెలియదు. ఆత్మ స్వతంత్రం. ఆత్మయానం మరీ స్వేచ్ఛాయుతం. బ్లవట్‌స్కీ పర్యటనలో కలిసిన మహాత్ములు, గురువులు ఎందరో ఆమెకు జ్ఞానదాతలైనారు, మార్గదర్శకులైనారు. ఆమె జీవితం మహాపథం అయింది. ఆమె అనుభవాలన్నీ ఆత్మప్రబోధాలే, ఆమె ఆవేదనలన్నీ నివేదనలు. అవి అన్నీ అనుభూతి పర్వాలు. అవి భవిష్యత్తుకు ఉపాధులైనాయి, సోపానాలైనాయి. వాటన్నింటి సంకలనమే ఇసిస్ అన్వీల్డ్ ("Isis Unveiled") తొలి రచన.

ఆ రోజుల్లో ఆడవారు ఒంటరిగా ప్రయాణం చేయడం అరుదు. అందునా రాజకుటుంబ స్త్రీలు అసూర్యంపశ్యలు. కులీనకుటుంబ మహిళలు పరదాల చాటున ఉంటారు. ఘోషాలు ఎక్కువ. బ్లవట్‌స్కీ అయినా అపనిందలకు అతీతం కాదు. అయినవాళ్లు విమర్శించారు. పైగా ఇరవై యేళ్ల పడుచు. ఎంత పొగరున్నా సొగసున్నది. అందం ఉన్నది. పైగా భర్తను వదిలిన ఇల్లాలు. పారిస్, బెర్లిన్, వియన్నా నగరాల్లో జల్సా చేస్తోందని ప్రచారం సాగింది. ఆమె ఆరాటం సత్యాన్వేషణ అని ఎవరికీ తెలియదు. చెప్పినా అర్థం కాదు.

లండన్ మహానగరంలో తన గురువును దర్శించడం యాదృచ్ఛికం. ఒకనాడు వీధిలో నడుస్తుండగా ఒక హిందూ రాజకుటుంబంతో నడుస్తున్న అతన్ని



చూచింది. అతన్ని తను చిన్నతనం నుండి చూస్తూనేవుంది కలల్లో, భావాల్లో. అభౌతికంగా కలల్లో కనిపించిన వ్యక్తిని అలా చూడగానే స్థాణువైంది. గుడ్లప్పగించి చూడసాగింది. అతనున్న వైపుగా నడిచింది. 'వద్దు' అని ఆయన సైగ చేశాడు. ఆగిపోయింది. బృందం ఆమెను దాటి వెళ్లిపోయింది.

మరునాడు హైడ్ పార్క్‌లో ఒంటరిగా నడుస్తూ ఆలోచిస్తోంది. అప్పుడు తన కలల గురువు తన దగ్గరగా వచ్చి "నేనిప్పుడు రాజావారి బృందంతో వచ్చాను. నీ పని మొదలు పెట్టు" అని థియోసాఫికల్ సొసైటీ కార్యక్రమం పురమాయించి వెళ్లిపోయాడు. "చాలా కష్టాలు వస్తాయి, జాగ్రత్త" అని చిన్న హెచ్చరిక చేశాడు.

పెద్ద భారం పైన వేసుకున్నప్పుడు, చిన్న చిన్న కష్టాలు తప్పవు.

టిబెట్‌లో మూడు సంవత్సరాలుండి తగిన ఆధ్యాత్మిక శిక్షణ తీసుకోవలసి ఉంటుందని గురువు ఆదేశించి వెళ్లాడు. అప్పుడు ఆమెకు టిబెట్ వెళ్లాలన్న ఆలోచన కలిగింది. అంతదాకా ఆమెకు పరమ గురువుల గురించి, మాస్టర్ల గురించి బొత్తిగా తెలియదు. ఆమాట కొస్తే టిబెట్ ఎక్కడ ఉందో కూడా తెలియదు! ఎలా వెళ్లాలి!

## మాస్టర్లు ఎవరు?

కలడు కలండనెడివాడు కలడో? లేడో?

భగవంతుని ఉనికినే మనిషి శంకిస్తాడు!

తనను తాను తెలుసుకోలేని వాడికి భగవంతుడు ఎలా కనిపిస్తాడు?

అదీ నిజమే కదా!

మాస్టర్లు ఉన్నారా, లేరా? అన్నది నాటికి నేటికీ సంశయమే! మహర్షులు, సప్తర్షులు అంటాం! వారిలో ఒక్కరినీ ఎవరూ చూచింది లేదు. కథల్లో, పురాణాల్లో

చదవటం, సినీమాల్లో చూడడం తప్పు. కనీసం ఆస్ట్రల్ రూపంలో దర్శనం యిచ్చినా, ఎప్పుడో ఉన్నవారే నని నమ్మవచ్చు. అయితే మనకున్న పర జ్ఞానం ఎంత? పరేంగిత ప్రజ్ఞ ఏపాటి? పరం గురించి, పరలోకాల గురించి ఎంత నేర్చుకున్నాం? భౌతిక నేత్రాలకు కనిపించని వాటిని మనం నమ్మలేం. పరలోకాలూ, సూక్ష్మశరీరాలు ఉన్నాయని నమ్మనివారి జోలికి మాస్టర్లు రారు.

మన దేశం అనాదిగా ఆత్మను నమ్ముతోంది. పునర్జన్మలు విశ్వసిస్తుంది. ఆత్మజ్ఞానానికి, ఆధ్యాత్మికతకు పెద్దపీట వేస్తుంది. ఇతర దేశాల వారికి ఆ సంస్కారం లేదు. తూర్పు, పశ్చిమ దేశాల సంస్కృతులు వేరు. నాగరికతలు వేరు. నమ్మకాలను బట్టే నాగరికత, సంస్కృతి ఏర్పడుతుంది. జీవన విధానాలలో మార్పులుంటాయి. పాశ్చాత్య నాగరికతలో భౌతికత్వం ఆధ్యాత్మికతపై పెత్తనం చేస్తుంది. ప్రాచ్య దేశాలలో భౌతికత్వంపై మోజు తక్కువ. ఆధ్యాత్మికంపై ఆసక్తి ఎక్కువ. ఇక్కడ భౌతిక సుఖాలకు స్థానం పరిమితం. ఆ రెండు సంస్కృతులను ఎప్పటికైనా కలప గలిగింది యోగం ఒక్కటే. అంటే థియోలజీ, థియోసఫీ అంటే మతం ముద్ర పడని సనాతన ధర్మం.

యోగం భౌతిక ప్రపంచాన్ని కాదనదు. మనిషి అవసరాలు, సుఖాలు కాదనదు. ఆధ్యాత్మికత్వానికి ప్రాధాన్యం యిస్తూనే భౌతిక, ప్రాపంచిక అవసరాలను మన్నిస్తుంది. ప్రతి మార్పును ఆమోదిస్తూ, పరిణామానికి ఉపయోగిస్తుంది. ఆ పని చేస్తున్నది, చేయిస్తున్నది భగవంతుడు కాదు. దివ్యశక్తి. దివ్యశక్తి భూపరిధిలోకి దిగిరాగానే ఆత్మశక్తిగా మారుతుంది. పరమాత్మ ప్రతినిధిగా, పరమాత్మతో 'లింక్' పెట్టుకుని పనిచేస్తుంది. ఆ పని మహాత్ములైన వారి ఆధ్వర్యంలో పర్యవేక్షణలో జరుగుతుంది. మాస్టర్లు అయిన వారంతా ఒకప్పుడు మనుషులుగా మనుగడ సాగించినవారే. వారు తపస్సుతో, యోగసాధనతో, జ్ఞానార్జనతో మృత్యువును దాటి శాశ్వతులైనవారు. అగోచరంగా ఉంటూ విశ్వాన్ని రక్షిస్తుంటారు. అవసరమైతే కొందరు మాస్టర్లు కొందరికి కనిపిస్తుంటారు. తమ ప్రతినిధులకు తమ ప్రజ్ఞను అందిస్తూ పరిణామ ప్రగతికి సహాయపడుతుంటారు. అలాంటి వారు మాస్టర్లు.

ప్రాపంచికతను అనుభవిస్తూ కూడ ఆధ్యాత్మిక లబ్ధి చేకూరుస్తుంది యోగం. మాస్టర్స్ ఆశించేది అదే. ఆ పని నిర్వహించడానికి పరమ గురుమండలి ఎన్నిక చేసిన వ్యక్తి బ్లవట్స్కీ. ఆమె రష్యాలో పుట్టి, యూరపు, ఇంగ్లాండు, ఇండియాలను దర్శించి, ప్రాచ్యదేశాల విజ్ఞానం శోధించి, పరిశోధించి, పాశ్చాత్య దేశాలకు అందించ దలచింది.

అందుకు మొదట చేయవలసిన పని భృక్తంగా ఉన్న విజ్ఞాన భాండాలను బయటకు తీయడం. అందుకే పరమ గురువులు ఆ అమాయికను భూమిపైన అవతరింపచేశారు. పుట్టినప్పటి నుండి ఆమె వెంట ఉండి కనిపెడుతూ వచ్చారు. అంటే బ్లవట్స్కీ కొత్తగా పరమ గురువుల్ని సృష్టించినట్లు కాదు. ఆమె వారి తరఫున రాయబారి. ఆమెను ముందుగా సిద్ధం చేసి, ఆత్మజ్ఞానాన్ని, దివ్యజ్ఞానాన్ని (ఈసాటరిక్) ఆమెకు అందించారనుకోవచ్చు. గురువుల అనుగ్రహం లేనిది ఎవరికీ యోగం అబ్బదు. ఆధ్యాత్మిక వికాసం కలగదు. ఆ భావాన్ని ఆమెలో కలిగించింది మాస్టర్లే. వారే ఆమెకు స్వప్నాలలో, జాగృతిలో, ఆస్ట్రల్ రూపంలో దర్శనం యిస్తూ వచ్చారు. ఆమె ప్రతి చర్యలో, వేసిన ప్రతి అడుగులో మాస్టర్ ప్రేరణ ఉంది. ముందుగా దేశదేశాలు చుట్టి రావడం అందులో భాగమే. వివిధ దేశాల విస్తరించిన జ్ఞానాన్ని సమీకరించి, క్రోడీకరించడం తొలుత బ్లవట్స్కీ చేసిన పని.

ముందుగా కైరోలో ఒక తాంత్రికస్వామిని ఆశ్రయించి ఉపచరించింది. తంత్ర రహస్యాలు నేర్చుకుంది. తర్వాత మౌంట్ లెబనాన్‌లో కూటముల్లో ప్రవేశించి మంత్ర విద్యలు నేర్చింది. అక్కడ మర్మయోగుల సాహచర్యం నెరపింది. కెనడాలో రెడ్ ఇండియన్స్‌తో కలిసి జీవిస్తూ వారి తాంత్రిక పద్ధతులు అభ్యసించింది. ఆఫ్రికాలో ఆటవిక జాతులతో చేయిచేయి కలిపింది. అక్కడ 'డాంజువన్' ప్రయోగాలలో ప్రావీణ్యం పొందింది. 'వూ-డూ' తంత్రంలో 'ప్రాణహాని' కలిగినప్పుడు మాస్టర్లు ఆమెను అక్కడ నుండి తప్పించారు. పారిపోయి, ప్రాణాలు దక్కించుకుంది. తర్వాత టెక్సాస్‌లో ఒక ఫ్రెంచి కెనడియన్ 'డీరేజావ్సన్' ఆప్యాయంగా ఆదరించి, ఆమెకు తన విద్యలన్నీ నేర్పాడు. మొత్తం పది సంవత్సరాలలో ఆమె దేశదేశాలు తిరిగి, కాలగర్భంలో దాగిన అతీంద్రియ శక్తుల్ని వెలికి తీసింది.

రష్యన్ వనిత. తిరిగేది నానా దేశాలు. ఆమెకు తెలిసిన ఇంగ్లీషు స్వల్పం. చిన్నతనంలో తండ్రితో కలిసి జర్మనీ, ఫ్రాన్సు వెళ్లినపుడు ఆయా దేశభాషలతో స్వల్ప పరిచయం ఏర్పడింది. ఏ దేశం భాష ఆ దేశానిది. ఒక్క దేశంలోనే అనేక భాషలుంటాయి. మెక్సికోలో ఉండగా మహాత్మ మోరియా శిష్యుడొకడు తటస్థపడ్డాడు. అతని అండ దొరక్క పోయినట్లయితే మెక్సికోలో ఆమె జీవితం అసహ్యంగా మారేది. అతనే ఆమెను వెంటబెట్టుకుని వెస్ట్ ఇండీస్ తీసుకువెళ్లి మార్మిక కేంద్రాలను పరిచయం చేశాడు. అక్కడ నుండి సరాసరి ఇండియా చేరుకుంది.

ఇండియాలో ఉన్నప్పుడే కల్నల్ ఆల్కాట్ పరిచయం ఏర్పడ్డది. మేజర్ జనరల్ 'ముర్రే' ఇంట్లో ఒక నెల ఉంది. టిబెట్ వెళ్లే ప్రయత్నం బెడిసి కొట్టడంతో సింగపూర్, జావాల మీదుగా ఇంగ్లాండు చేరింది. అప్పటికే క్రిమియన్ యుద్ధ మేఘాలు యూరప్‌పై ఆవరించాయి. ఇంగ్లండు, ఫ్రాన్సులు రష్యాపై యుద్ధానికి సిద్ధం అయ్యాయి. ఆమెను రష్యా గూఢచారి అనే అనుమానంతో అమెరికా పంపి వేశారు. న్యూయార్కు నుండి చికాగో మీదుగా శాన్‌ఫ్రాన్సిస్కో చేరుకుంది.


ప్రపంచంలో ఎన్ని దేశాలు తిరిగినా ఆమె దృష్టి టిబెట్ యోగులపైనే. అది నెరవేరని స్వప్నం. టిబెట్ అంటే ఆమె భావనలో బౌద్ధ మహాగురువుల ఆవాసం. 1855లో తిరిగి ఇండియా చేరింది. ఈసారి తన తండ్రిగారి స్నేహితుడు (జర్మన్) కులోవీన్ కలిశాడు. అతను బ్లవట్‌స్కీని టిబెట్ పంపే ఏర్పాటు చేశాడు. టిబెట్‌లో ఊహించనన్ని కష్టాలు ఎదురైనాయి. టిబెట్ లామాలు, షామాన్‌లు ముప్పుతిప్పలు పెట్టారు. చివరికి భారత సరిహద్దులలో దిగవిడిచి వెళ్లారు.

"ఇసిస్ అన్వీల్డ్" పుస్తకంలో ఆమె తన టిబెట్ అనుభవాలు ఇలా రాసుకున్నారు –

"లాసాలో 'కుచ్చి' అనే అతను నన్ను ఒక 'షామన్' స్థావరం చేర్చాడు. ఇరవై అయిదు మంది గుర్రాల మీద వచ్చి మమ్మల్ని చుట్టుముట్టారు. నిర్బంధించారు. అది వారి నాయకుని ఆదేశం. నాయకుడంటే 'లామా'. షబరాన్‌లో 'లామా' యోగి. ఆయన తన మఠం వదలి బయటకు రాడు. ఎవరూ అతను ఉన్న ప్రదేశం చేరలేరు. రక్షణ బలగాలున్నాయి. చుట్టు అడుగడుగునా శిష్యులు ఆయుధాలతో కాపలా కాస్తుంటారు. అతను నాకు పరిచయమైన 'కుచ్చి'కి తెలుసు. అందువల్ల నేనతన్ని కలుసుకో గలిగాను."

టిబెట్‌లో లామాలకు తంత్ర యోగశక్తులు ఎక్కువ. కొందరికి ఆధ్యాత్మిక శక్తులూ ఉంటాయి. ఉన్న చోటు నుండి కదలకుండానే దివ్యదృష్టితో గ్రహిస్తుంటారు. జ్ఞాన నేత్రంతో చూస్తుంటారు. మనో సంకల్పంతో ఎవరినైనా తమ వద్దకు రప్పించుకో గలరు. వారికి పరప్రజ్ఞ చాలా ఎక్కువ. వారు ప్రపంచం దృష్టిలో పడరు. కామరూప విద్య తెలుసు. చూస్తుండగానే అంతర్ధానం కాగలరు. మాయ విద్యలో ఘటికులు. అరూపంగా, అదృశ్యంగా ప్రపంచమంతా తిరుగుతుంటారు. అవసరమైనచోట్ల భౌతికరూపం ధరిస్తుంటారు. అందుకే పరమ గురువులైన మాస్టర్లు టిబెట్‌ను ఎన్నుకుంటారు.

**పరమ గురువుల స్థావరం పేరు 'శంబలా'.**




# 5. అన్వేషణ : అనుభవం

**పూ**ర్వం మన దేశంలో చదువులు గురుకులాల్లో సాగుతుండేవి. అప్పట్లో బడులు, గుడులు ఉండేవి కావు. గురువులే విద్యాబోధకులు. గురువులే ఆచార్యులు. పెద్ద పెద్ద విద్యాపీఠాలు ఉండేవి. బౌద్ధం ప్రభావంతో నలందా, తక్షశిల లాంటి విద్యా పీఠాలు వెలసినట్లు తెలుస్తుంది. అవి విద్యాలయాలే కాదు, బౌద్ధ ధర్మశాలలు. పన్నెండు సంవత్సరాలు విద్యాభ్యాసం తర్వాత విద్యార్థులు, ఆసేతు హిమాలయ పర్యంతం గురుకులాలు, ఋష్యాశ్రమాలు దర్శించి, రెండు సంవత్సరాల పాటు, తమ జ్ఞానాన్ని పటిష్టం చేసుకునేవారు.

ఇతర దేశాలు తిరగడం మరొక పద్ధతి. హ్యుయన్‌సాంగ్, పాహియాన్ లాంటి యాత్రీకుల అనుభవాలు, రాహుల్ సాంకృత్యాయన్, రోరిక్ లాంటి వారి పర్యటనానుభవాలు చరిత్ర ప్రసిద్ధాలు. రష్యాకు చెందిన ప్రసిద్ధ కళాకారుడు 'రోరిక్' అనేకమార్లు టిబెట్ దర్శించాడని, శంబలా వెళ్లి మాస్టర్లను దర్శించాడని చరిత్ర. విజ్ఞానయాత్రలు ప్రపంచంలో ప్రాచీన కాలం నుండి సాగుతున్నవే. ఈ యాత్రీకులే అలనాటి సంస్కృతికి రాయబారులు.

ఒక కొండగుహలో కూర్చుని తపస్సు చేసి మహర్షి కావచ్చు. మహారణ్యాలలో ఘోర తపస్సు చేయవచ్చు ప్రాణ భయం లేకపోతే. కాని ఒక సద్గురువు కోసం దేశాలు పట్టి తిరగడం, కొండల్లో అన్వేషించడం మాటలు కాదు. ఎంతో తపన పడితే తప్ప స్వచ్ఛమైన గురువు దర్శనం కాదు. ఆ కిటుకు మాడం బ్లవట్‌స్కీకి తెలుసు. తెలియకపోయినా ఎవరో పరమ గురువులు సంకల్పం ప్రేరణ యిచ్చి

ఉంటారు. అంచేతనే అవిశ్రాంతంగా దేశాలు పట్టి తిరిగింది. భావ రూపాలలో దర్శనమిచ్చే గురువులు భౌతిక రూపాలలో ఎందుకు కనిపించరు?

19వ శతాబ్దం నాటి పరిస్థితులు వేరు. అప్పట్లో ప్రయాణ సౌకర్యాలు లేవు. ఇప్పుడులా విమానాలు లేవు. సముద్రంపైన నౌకా ప్రయాణాలే. రవాణా సౌకర్యాలు తక్కువ. ఒక దేశానికి మరో దేశానికి మధ్య సఖ్యత ఉండేది కాదు. కీచులాటలు, కొట్లాటలు, ఒకరినొకరు శత్రువుగా చూచే మనస్తత్వం. సఖ్యత, సౌభ్రాతృత్వం బహు తక్కువ. అన్యదేశాలంటే శత్రు దేశాలనే. యూరపులో రష్యా ఒక భాగమే అయినా దాని భౌగోళిక పరిస్థితులు, సంస్కృతీ స్వభావాలు మిగిలిన దేశాల కంటే భిన్నం.

అమెరికాలో ఉన్న రోజుల్లో ఒక బంధువు మరణంతో బ్లవట్స్కీకి కొంత వారసత్వ సంపద వచ్చి పడ్డది. యాభై వేల రూబుల్స్ అంటే తమాషా కాదు ఆ రోజుల్లో. 1873లో తండ్రి మరణానంతరం తన వాటాగా వచ్చిన సొమ్ముతో న్యూయార్కు లాంగ్ ఐలాండ్‌లో వ్యవసాయ భూములు కొని వ్యవసాయం చేసింది. అనుభవం లేక నష్టాలు మిగిలాయి. తనకు అలవాటైనపని రచనా వ్యవసాయం. రష్యన్ పత్రికలకు ఎడాపెడా వ్యాసాలు రాస్తుండేది. అదే సంపాదన. రచనల వల్ల డబ్బుకు డబ్బు, మంచి పేరు వచ్చింది. ఆమె ప్రచ్ఛన్న నామం "రడ్డాబాయ్". అది కలం పేరు.

1857లో బ్లవట్స్కీ భారత్‌లో ఉండగానే సిపాయి తిరుగుబాటు జరిగింది. గురువు గారి ఆదేశం మేరకు ఇండియా వదలి జావా చేరింది. అక్కడ కొందరు యోగులతో, జ్ఞానులతో పరిచయం కలిగింది. అక్కడ నుండి అమెరికా వెళ్లి 1860 నాటికి యూరపు చేరింది. ఫ్రాన్సు, జర్మనీలతో చిన్ననాటి పరిచయం. అక్కడ కొంత కాలం గడిపి, రష్యా వెళ్లి చాలా సంవత్సరాలు స్వదేశంలోనే ఉండి పోయింది.


మహాత్ములకైనా, మహాఋషులకైనా కన్నతల్లి పైన, జన్మభూమి పైన మమకారం పోదు. ఎన్ని దేశాలు తిరిగినా, ఎంత తపస్సు చేసినా స్వదేశాన్ని మరచి పోవడం జరగదు. స్వదేశంలో, స్వంత ఇంటిలో ఉన్న సుఖం స్వర్గంలో ఉండదు. బ్లవట్స్కీ చాలా అతీంద్రియ శక్తులు సంపాదించింది. దివ్యజ్ఞానం సంపాదించింది. ఏకాంతంగా ఉన్న వేళల్లో తనలోకి చొచ్చుకుపోయి, అంతర్ముఖం కాగలుగుతోంది. శూన్యం కాగలుగుతోంది. ఆత్మ స్పందనల్ని అనుభూతించ గలుగుతోంది. ఇంతకాలం ఆర్జించిన జ్ఞానం తనకొక మార్గం చూపిస్తుందన్న

నమ్మకం ఏర్పడ్డది. ఇప్పుడు ఆస్ట్రల్ శరీరంతో టిబెట్ బౌద్ధారామాలకు వెళ్లి రాగలుగుతోంది. సంకల్పించగానే మాస్టర్లు మనసులోకి వస్తున్నారు. అడిగిన వాటికి సమాధానా లిస్తున్నారు. అర్థించకపోయినా వారంతటవారు కొన్ని సలహాలు యిస్తున్నారు. మొత్తం మీద ఒక ప్రణాళిక రూపొంద సాగింది. మాస్టర్లు వస్తారు. తనకు మాత్రమే కనిపిస్తారు. మాట్లాడతారు. అంతలోనే అంతర్ధానమైపోతారు.

ఈ ఆస్ట్రల్ అనుభవాలు, మాస్టర్ల దర్శనాలు ప్రోత్సాహం ఇస్తున్నా ఆరోగ్యం సహకరించడం లేదు. దేశదేశాలు పది సంవత్సరాల పాటు పిచ్చిపట్టినట్లు తిరగడం వల్ల ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. రకరకాల రోగాలు బయట పడసాగాయి. ఉపవాసాలవల్ల, అడ్డమైన తిళ్లవల్ల, తిరుగుళ్లవల్ల ఆరోగ్యం చెడి పోయిందని గ్రహించగలిగింది. అయితే మనోనిగ్రహం, సంకల్పబలం, మాస్టరు కరుణ వల్ల నాలుగు రోజుల్లో రోగం తగ్గిపోయేది. ధ్యానం వల్ల, 'కుండలినీ' జాగృతివల్ల ఆరోగ్యం చెడుతోందని తెలుసుకోలేదు. అప్పటికి యోగంతో పెద్దగా పరిచయం లేదు. శక్తులకోసం ఆరాటమే తప్ప ధ్యానం చక్కగా కుదిరినప్పుడు రోగం తగ్గిపోయేది. ఆ రెండింటికి ఉన్న సంబంధం ఏమిటో తెలిసేది కాదు. కుండలిని జాగృతం అయినపుడు కలిగే శక్తి పాతం మనిషిని కల్లోల పరుస్తుంది, ఉక్కిరిబిక్కిరి చేస్తుంది, రోగాలు బయట పడుతుంటాయి. కొంతకాలం ద్వంద్వ జీవితం అనుభవించ వలసి వస్తుంది. పైకి అనారోగ్యం. లోపల ఆత్మానందం. అదేమిటో వింత?

మాస్టర్లు కంటికి కనిపించరు. వచ్చినట్లు చప్పున అనిపిస్తుంది. అంతర్దృష్టికి దర్శన మిస్తారు. అంతలో అంతర్థానమై పోతారు. జరగవలసిన పని జరిగిపోతుంది. చెప్పవలసిన విషయం మనస్సుకు స్ఫురింప చేస్తారు. మాస్టర్లు వచ్చిన వేళల్లో బ్లవట్స్కీకి భౌతిక స్పృహ ఉండేది కాదు. మనస్సు పనిచేసేది కాదు. ప్రక్కనున్న వారిని, ప్రపంచాన్ని విస్మరించి మరో లోకంలో, ఏదో శూన్యంలో మిగిలిపోయేది. తన ఉనికిని మరచిపోతే తప్ప మాస్టర్ రాక తెలియదు. ఆ సమయంలో తనంటూ ఒక వ్యక్తి ఉన్నట్లు అనిపించదు. తను భావపరంగా శూన్యం అవుతుంది. కళ్లు మూతలుపడి నిద్రలోకి జారినట్లు, మగత ఆవరిస్తుంది. స్పృహ ఉండదు. భౌతిక స్మృతి ఉండదు. పైలోకాలకు సూక్ష్మశరీరం పరుగులు తీస్తుంది.

గతంలో ఏడు సంవత్సరాలపాటు బ్లవట్స్కీ టిబెట్, ఈజిప్టు, సిరియా వంటి దేశాలలో మిస్టిక్ మాస్టర్ల వద్ద శుశ్రూష చేసింది. చాలా శక్తులు వారు అనుగ్రహించినవే, నేర్పినవే. గురువుల అనుగ్రహం వృథా పోదు. రకరకాలుగా



మాస్టర్ కుత్‌హోమి

వినిమయం అవుతుంది. ఏడు సంవత్సరాలు గురుశుశ్రూషల ఫలం ఇప్పుడిప్పుడు అనుభవంలోకి వస్తోంది. ఇది రివిజన్, పునశ్చరణ. అర్హులైన వారికి మాస్టర్లు యిచ్చే శిక్షణ అలాగే ఉంటుంది. తాము కనిపించక పోయినా గైడ్ చేస్తుంటారు. శక్తిపాతం జరుపుతుంటారు. అజ్ఞాతంగా ఉంటూనే తాము ఎన్నుకున్న వారిని జ్ఞానుల్ని చేస్తారు.

ఆనాటి అనుభవాలు మాడం బ్లవట్‌స్కీ ఇలా జ్ఞాపకం చేసుకుంది :

***"ఆ రోజుల్లో నేను మౌంట్ లెబనాన్‌లో 'డ్రూజెన్' రహస్య స్థావరాలలో ఉన్నాను. అక్కడ మాస్టర్లు, పర్షియన్ ముల్లాలు రకరకాల మార్మిక వేత్తలతో నాకు సంబంధం ఏర్పడ్డది."***

తర్వాత ఆమె జబ్బులు నెమ్మదిగా తగ్గిపోసాగాయి. అతీంద్రియ శక్తుల విజృంభణ తగ్గింది. ఆత్మపై పట్టుదొరికింది. మనస్సుపై నియంత్రణ ఏర్పడ్డది. అది శాంతి పర్వం. యోగి ప్రగతికి అది నిదర్శనం. ఏర్పడవలసిన 'స్వస్థితి' అది. సంయమనం, స్థైర్యం ఏర్పడ్డాయి. సంకల్ప మాత్రంచేత అతీంద్రియ శక్తుల సహాయం తీసుకో గలుగుతోంది. క్షణంలో మాస్టర్లు వస్తున్నారు. భౌతిక ప్రపంచంలో తనకు అతీంద్రియ శక్తుల్ని ఉపయోగించగల శక్తి వచ్చింది.

పరిస్థితులు అనుకూలించాయి. యుద్ధం గొడవ తీరింది. ఇంటి పట్టున ఉండడానికి కాలు నిలవడం లేదు. ప్రపంచం రమ్మని పిలుస్తోంది. లోపల మాస్టర్లు తొందర పెడుతున్నారు. మరల బయలుదేరింది. యూరపు, రష్యా, ఆసియా దేశాలు తిరగ సాగింది. పర్యటనలోని కష్టాలు అలవాటైనాయి. నాలుగు సంవత్సరాలు నిర్విరామంగా తిరిగిన తర్వాత మాస్టర్‌వాణి వినిపించింది. అనుభవాలు హృదయంలో పదిల పరచుకుంది.

1868 వరకు బ్లవట్‌స్కీకి కుత్‌హోమీ తెలియదు. పేరు విన్నదీ లేదు. చూచింది లేదు. షిగాసేలో తన అక్క జెలిహావ్‌స్కీ ఆమె కూతురుతో కలిసి కొంతకాలం ఉంది. ఇటలీ స్వాతంత్ర్య పోరాటంలో 'గరిబాల్డీ' సైన్యంలో పని

చేసింది. యుద్ధంలో గాయపడ్డది. మాస్టర్ అనుగ్రహంతో వెంటనే కోలుకుంది. ఆ తర్వాత కాన్‌స్టాంటినోపుల్ నుండి సరాసరి టిబెట్ వెళ్లాలని సంకల్పించింది. ఆమె చిరకాలవాంఛ టిబెట్ పర్యటన, పరమ గురువుల దర్శనం. వారి సేవనం. టిబెట్ చేరిన తర్వాత ఆమె ఆచూకీ ఎవరికీ తెలియలేదు. మూడు సంవత్సరాల పాటు బ్రతికి ఉందో లేదో తెలియని అయోమయం. 1870 నవంబరు 7న తిరిగి ఇంటికి వస్తున్నట్లు ఇంటికి ఓ ఉత్తరం వచ్చింది. వాస్తవానికి ఆ ఉత్తరం ఆమె లేఖిని కాదు. మాస్టర్లు సృష్టించింది. దానిని సృష్టించి అందచేసింది మాస్టర్ కుత్‌హోమి.


మేనత్త మాడం ఫదెయేవ్

ఆ లేఖ బ్లవట్‌స్కీ మేనత్త మాడం ఫదెయేవ్ గదిలో టేబుల్ పైన ప్రత్యక్షమైంది. ఎవరు తెచ్చి ఇచ్చారో ఎవరికీ తెలియదు. దాని మీద పోస్టు ముద్రలు లేవు. ఏవో అదృశ్య శక్తులు, దయ్యాలు ఇలాంటి పనులు చేస్తుంటాయని చెప్పగా మేనత్త భయపడి పోయింది. ఏవో ఆత్మలు 'మాయా' రూపంలో వస్తుంటాయని, ఇలా వస్తువుల్ని సృష్టించడం, మాయం చేయటం వాటి పనేనని తెలిసి మరీ కంగారు పడ్డది. బ్లవట్‌స్కీ అంటేనే భయం. ఆమె అధీనంలో ఏవో స్పిరిట్స్ ఉన్నాయని వారి నమ్మకం.

చిన్నప్పటి నుండి బ్లవట్‌స్కీకి దయ్యాలతో స్నేహం ఉందని అందరికీ తెలుసు. గాలిలోంచి వస్తువులు సృష్టించేది. అప్పటికి యూరపు, అమెరికాల్లో ఈ గాలి చేష్టలు తెలియవు. బ్లవట్‌స్కీ ప్రశస్తికి ఈ గాలిలోంచి వస్తువుల్ని సృష్టించడం అన్నది ప్రధాన కారణం. టిబెట్ లామాలకు, ఇండియాలో యోగులకీ ఇలాంటి అద్భుత శక్తులుంటాయని అమెరికా వారు నమ్ముతారు. పాశ్చాత్యులలో ఎవరికీ ఈ విద్యలు రావు.

టిబెట్‌లోని 'షిగాట్సే'లో మార్మిక విద్యలు నేర్చిన తర్వాత బ్లవట్‌స్కీ యూరపు చేరింది. సైప్రస్, గ్రీసులో ఉండగా గ్రీకుమాస్టర్ ఇల్లారిన్‌ని కలిసింది. ఈజిప్టుకు నౌకలో ప్రయాణిస్తుండగా మందుగుండు పేలిన ప్రమాదంలో చాలామంది

చనిపోయారు. బ్లవట్స్కీ కట్టుబట్టలతో ఒడ్డున పడ్డది. అందరూ చనిపోయినా తనను ఎవరు రక్షించారో, ఎవరు ఒడ్డుకు చేర్చారో ఆమెకు తెలియదు. రష్యాలో బంధువుల నుండి ఆర్థిక సహాయం అందేవరకు ఈజిప్టులో చాలా కష్టాలు అనుభవించింది.

కైరోలో ఉన్న నాలుగు మాసాల కాలంలో తన అతీంద్రియ శక్తుల్ని బయట పెట్టవలసి వచ్చింది. ఆత్మలతో, పునర్జన్మ సిద్ధాంతంపైన చాలా ప్రయోగాలు జరిపి, పరిశోధన చేసింది. ఆత్మల్ని పిలిచి, వాటి పూర్వజన్మ వృత్తాంతాలు చెప్పించేది. ఆత్మలు అందరి మీదికి రావు. చాలా పవిత్రంగా జీవిస్తున్నవారు మీడియం కావాలి. ఆ దేశంలో అలాంటి మంచి వారు దొరకలేదు. పోనీ తనపైకి తెప్పించుకోవచ్చు. ప్రయోజనం? ప్రశ్నించే వారికి 'ఆత్మ'జ్ఞానం ఉండేది కాదు. అక్కడ ఎవరికీ ఆత్మజ్ఞానం లేదు. మీడియం అయినవాడు అమాయకుడై ఉండాలి. శూన్యం కాగలగాలి. పృచ్ఛకులు ధైర్యం కలవారై ఉండాలి. దయ్యం (స్పిరిట్) రాగానే పారిపోయే వారితో ప్రయోజనం ఉండదు. పిరికివాళ్లు పిలిచినా, అరిచి గీపెట్టినా ఆత్మలు రావు. పలకవు. దయ్యాలు వారు చెప్పినమాట వినవు. సమాధానం చెప్పవు.

అరిచి భయపెట్టడానికి అవి మనుషులు కాదు. ఆత్మలు. అవి ఎక్కడో పైలోకాలలో ప్రశాంతంగా ఉంటాయి. మనం పిలవగానే భయపడి పరిగెత్తుకు రావు. ప్రేమగా పిలిస్తే వస్తాయి. వాటిని ప్రసన్నం చేసుకునే మంచితనం, ఆత్మశక్తి మనలోనూ ఉండాలి.

కైరోలో ఆమెకు తటస్థపడ్డవారంతా తాగుబోతులు. రెండుసార్లు 'సియాన్సీ' ప్రయోగాలు చేసి, అక్కడి వారి నైజం తెలుసుకుంది. దయ్యాలను నీచకార్యాలకు ఉపయోగించేవారు అన్నిచోట్లా ఉంటారు. ఆత్మ శరీరులు ఎక్కడో పుణ్యలోకాలలో ఉంటారు. వారితో స్నేహం చేయగల పుణ్యమూర్తులు భూమిపైన బహు స్వల్పంగా ఉంటారు.

కైరోలో బ్లవట్స్కీ చేసిన ప్రయోగాలు బెడిసి కొట్టాయి సరైన మీడియం దొరక్క. ఈజిప్ట్‌లో ఒక రాత్రి ప్రధాన పిరమిడ్‌లో ఒంటరిగా జాగరణ చేసింది. ఆ నిశిలో ఆమెకు చాలా గొప్ప విషయాలు తెలిశాయి. మనసు విప్పిన వారికి పిరమిడ్స్‌లో గొప్ప ఆధ్యాత్మిక రహస్యాలు, సృష్టి వైచిత్రి తెలుస్తాయంటారు.



అక్క ఝెలిహోవ్‌స్కీ

# 6. అక్క డైరీ లోంచి ...

*("ఝెలిహోవ్‌స్కీ మాడం బ్లవట్‌స్కీ అక్క - 1858లో ఆమె తిరిగి రష్యా చేరిన ఉదంతం అక్క డైరీలో ఇలా రాసింది.")*

*"హెలెనా వస్తున్నట్లు ఉత్తరం వచ్చింది గానీ, తను వస్తుందో రాదో, ఎప్పుడు వస్తుందో, వచ్చినా ఎక్కడికి వస్తుందో ఏమీ తెలియదు. ఆ ఉత్తరంలో సంతకం లేదు. ఎక్కడ పోస్టు చేసిందీ ఆనవాళ్లు లేవు. ఆ లేఖతో తను బ్రతికి ఉన్నట్లు రూఢి అయింది. అదొక తృప్తి. అంతవరకే.*

"**ఆ**రోజు మా ఇల్లంతా కోలాహలంగా ఉంది. అది మా మామగారి ఇల్లు. ఆ రోజు సాయంత్రం మా ఆడబిడ్డ పెళ్లి. ఇంటినిండా చుట్టాలూ, స్నేహితులు. విందు జరుగబోతోంది. అంతలో బయట కాల్‌బెల్ వినిపించింది. పెళ్లి ఇల్లు. బెల్లు అవసరం లేదు. ఎవరైనా నేరుగా వచ్చేస్తారు. తలుపులు తెరిచే ఉన్నాయి. నాకో చిన్న అనుమానం. ఆ వచ్చింది హెలెనా కాదు గదా! నేనే విందులోంచి లేచి బయటకు వెళ్లాను, ఆశ్చర్యం, ఆనందం! ఆ వచ్చింది బ్లవట్‌స్కీ. నాచెల్లి, హెలెనా!

గట్టిగా అరిచి కావిలించుకున్నాను. నాకళ్ల వెంట జలజల కన్నీరు! ఎంత కాలమైంది చూచి! ఎంత మారిపోయింది. ఆరిందా అయింది. హెలెనా నీలి కళ్లంటే నా కిష్టం. దాని కళ్లలో ఆనందం, విషాదం ఏదీ తెలియదు. నిబ్బరం ఎక్కువ. ఎందుకు ఆనందం? ఎందుకు విషాదం? అంటుంది. దానిది వెర్రి వేదాంతం! మనిషి ఎంత మారినా హెలెనా కళ్లుచూచి గుర్తించ వచ్చు బ్లవట్‌స్కీ

అని. తనకళ్లు విచిత్రంగా మెరుస్తుంటాయి. ఆ చూపులో వాడి, వేడి ఉంటుంది. వెలుగు కనిపిస్తుంది.

సరాసరి నా గదికి తీసుకువెళ్లాను. విందు సంగతి, పెళ్లి సంగతి మరచిపోయి చాలాసేపు కబుర్లు చెప్పుకున్నాం. ఎన్నెన్ని విషయాలో చెప్పింది. నాకు ఏవీ తెలియవు. ఆ సాయంత్రానికి బ్లవట్స్కీ వచ్చిన సంగతి, తన అతీంద్రియ శక్తుల గురించి అందరికీ తెలిసిపోయింది. తను మేలుకొని ఉన్నా, నిద్రపోతున్నా తనని ఏవో స్పిరిట్స్ కాపలా కాస్తుంటాయట. తన చుట్టూరా కనిపించని దయ్యాలు తిరుగుతున్నట్లే ఊహించుకోసాగాను. నిజంగా ఏవో శబ్దాలు వినిపించేవి. ఎవరో తిరుగుతున్నట్లు అనిపించేది. కనిపించకుండా అన్ని వైపులనుండి శబ్దాలు వినిపించేవి. బీరువాల దగ్గర, కిటికీల్లో, గుమ్మాలపైన వాటి కదలికలు తెలిసేవి. ఆ శబ్దాల సంకేతం ఆమెకే తెలుసు. మాకు అర్థం అయ్యేది కాదు.

అవి నిజమా, కాదా? అని నా మనసు సంకోచించింది. నా ఆలోచన ఇట్టే హెలెనా గ్రహించింది. "అడుగు! నీకే సమాధానం వస్తుంది, నీ అనుమానం తీరిపోతుందిగా" అన్నది. నాకు మాత్రమే తెలిసిన ఒక విషయం అనుకున్నాను. వెంటనే సమాధానం వచ్చింది. క్లియర్! అది మనోభాష. మూడవ వ్యక్తికి వినిపించని భాష. హెలెనా శక్తుల్ని గురించి ఊరు ఊరంతా తెలిసింది. తనను చూడడానికి జనం రాసాగారు. రాత్రి అనీ, పగలనీ లేదు. కేవలం జరిగిపోయిన సంఘటనలే కాదు జరగబోయేవీ చెప్పసాగింది. కాలజ్ఞాని. తను ఉన్నచోటు నుండి కదలకుండా దూరంగా ఉన్న వస్తువుపై దృష్టి నిలిపి, దానిని గాలిలోకి లేపేది. ఇక్కడి వస్తువు అక్కడకు జరిపేది. అది మాత్రం తక్కువా? 'షాకోవ్' పట్టణంలో ఎక్కడ చూచినా బ్లవట్స్కీ వార్తా కథనాలే. చిత్రం ఏమంటే బయటి వాళ్లు నమ్మినట్లు ఇంట్లో వాళ్లు నమ్మే వారు కాదు. మా నాన్నగారికి, తమ్ముడికి అనుమానం.

ఒకరోజు ఒక చిత్రమైన సంఘటన జరిగింది. హాలు నిండా జనం ఉన్నారు. పేకాట ఆడేవాళ్లు, పియానో వినేవాళ్లు, ఉత్తిగా కబుర్లు చెప్పేవాళ్లు. మా తమ్ముడు లియోనిర్ ఎవరినీ పట్టించుకోకుండా అటు ఇటు పచార్లు చేస్తున్నాడు. చల్లగా బ్లవట్స్కీ కుర్చీ వెనక చేరి ఆమె మాటలు వినసాగాడు. హెలెనా చెబుతోంది. వినేవారు ఆసక్తిగా వింటున్నారు : "ఇండియాలో ఈ విద్యల్ని యోగవిద్య లంటారు. అక్కడ యోగులు చాలా మంది ఉన్నారు. మామూలు జనాలకు చిన్నచిన్న విద్యలు వచ్చు. మనం తేలికగా ఎత్తగలిగిన వస్తువుకు బరువు కల్పిస్తారు. ఆ తర్వాత దాన్ని కదల్చలేం. బండరాళ్లకు బరువు లేకుండా చేస్తారు. నీళ్ల మీద, గాలిలోను

నడుస్తారు. నిప్పు చేతితో పట్టుకుంటారు. చేతులు కాలవు. వాటిని యోగసిద్ధులు అంటారు."

"కొయ్ కోతలు. వినేవాళ్లు ఉంటేసరి" మా తమ్ముడు వెనకనుండి విమర్శించాడు.

"నిజంరా, తమ్ముడూ!"

"నీకు ఆశక్తి ఉందా చెప్పు! అంతేగాని పుస్తకాల్లో చదివిన వన్నీ చెప్పకు. అవి కల్పనలూ, అసాధ్యాలు. నీవు చేసి చూపగలవా! నమ్ముతాను." హాలులో అందరు అతనికి వంతపాడారు "చెయ్యాలి, చూపించాలి" అని.

"ప్రయత్నం చేస్తాను. కచ్చితంగా చేయగలనో లేదో నాకు తెలియదు. యోగులకు అలాంటి సిద్ధులు ఉన్నాయని తెలుసు. నాకున్నాయో లేదో తెలియదు. – ఇది ప్రయత్నం మాత్రమే! చేయలేకపోతే మాత్రం నన్ను తిట్టవద్దు. మీలో ఎవరైనా వచ్చి ఆ బల్ల కదిలించండి" అన్నది.

ఒకతను వచ్చి చెస్ బల్లను ఎత్తి గిరిగిరా తిప్పి క్రిందపెట్టాడు.

"నేను బల్ల పైన చూపు నిలుపుతాను. పది నిమిషాల తర్వాత దాన్ని కదిలించండి. మధ్యలో నన్ను డిస్టర్బ్ చేయకూడదు."

"సరే, నువ్వు బల్లకు దూరంగా ఉండాలి. బల్లను తాక కూడదు."

"అలాగే" అన్నది నవ్వుతూ.

బ్లవటస్కీవి అసలే నీలికళ్లు. చూడడానికి మాజిక్ నేత్రాలనిపిస్తాయి. దూరంగా కూర్చుని, చెస్ బల్ల మీద దృష్టి నిలిపింది. పది నిమిషాల తర్వాత చేతితో సౌంజ్ఞ చేసింది వెళ్లి కదిలించమని. మొదట ఆ బల్ల ఎత్తి అవతల పెట్టిన వ్యక్తి మళ్లీ వెళ్లి ప్రయత్నించాడు. అతని వల్ల కాలేదు. బల్ల కదలలేదు. మేకులు గానీ నేలలో కొట్టలేదుగదా! అతను బలమంతా ఉపయోగించి ప్రయత్నించి వెల్ల కిలాపడ్డాడు. తర్వాత అయిదారుగురు ప్రయత్నించి హతాశులైనారు. చెస్‌బల్ల కాదుగదా! బల్ల మీదున్న చెస్‌బోర్డు కూడా కదిలించలేకపోయారు.

తర్వాత బ్లవట్‌స్కీ తన దృష్టిని మరల్చి 'ఇప్పుడు ప్రయత్నించండి' అంది. ఇప్పుడు చిన్న పిల్లలు కదిలించ గలిగినంత తేలికైంది.

★ ★ ★

విధికి తలవొగ్గి సామాన్యులు జీవిస్తుంటారు. ధీమంతులు విధిని ఎదిరిస్తూ ముందుకు సాగుతారు. అలాంటి వారిని జాతకాలు, గ్రహాలు ఏమీ చేయవు.

1859లో బ్లవట్స్కీ అక్క, తండ్రితో కలిసి 'రుగదేవ్' చేరింది. పల్లె వాతావరణంలో ఆరోగ్యం బాగుంటుందని ఆశించింది. కాని, ఆమె కంటే ముందుగానే 'శని' అక్కడ చేరి ఆమెను స్వాగతించింది. వెళ్లీ వెళ్లగానే జబ్బు పడ్డది. ఆసియా పర్యటనలో కొండలు కోనలు తిరగడం వల్ల పాదాలు పగిలి, పుండ్లయ్యాయి. తర్వాత అప్పుడప్పుడు ఆ పుండ్లు చీముపట్టి సలపరించసాగాయి. ఇప్పుడు ఆ పుండ్ల బాధ మరీ ఎక్కువైంది. అప్పుడప్పుడు ఫిట్స్ వచ్చి స్పృహ పోతోంది. మగత నిద్ర, మాటా పలుకు లేకుండా పడి ఉండడం, మృత్యువును తలపించేది. కళ్లు తెరిచి స్పృహలోకి వచ్చేవరకు శవంలాగా పడుకుని ఉండేది. నాడి అందేది కాదు. శరీరం చల్లబడి పోతుండేది. ఒకసారి ఫిట్స్ వస్తే మూడు నాలుగు రోజులు కోలుకునేది కాదు. తిండీ తిప్పలు ఉండేవి కావు. చచ్చిపోయిందేమో నని ఇంట్లో వారికి అనుమానం. స్పృహలోకి వచ్చేసరికి ఈ పుండ్లు మానిపోయేవి చిత్రంగా. ఏ ఆపన్నహస్తమో వచ్చి ఆమెకు చికిత్స చేస్తుండేది.

ఇంట్లోవారు డాక్టర్ని పిలిపించినా అతని మందులు పనిచేసేవి కావు. డాక్టరు నాడి పరీక్ష చేస్తుంటే అతని కళ్ల ముందు ఒక నల్లని చేయి కదులుతున్నట్లు కనిపించేది. ఆ చేయి బ్లవట్స్కీ గొంతు నుండి నాభివరకు అనేక మార్లు క్రిందికి పైకి కదిలేది. అదేమిటో అర్థం కాక భయపడుతుండగా, ఆగదిలో చిత్రమైన శబ్దాలు వినిపించేవి. పైకప్పు లోంచి, కిటికీల్లోంచి, గోడల్లోంచి ఎవరో వచ్చినట్లు తెలిసేది. వారెవరూ ఎవరికీ కనిపించరు – అనిపించడం తప్ప. తర్వాత డాక్టరు తన వల్ల కాదని రావడం మాని వేశాడు.

1860లో అక్కాచెల్లెలు కాకసస్ పర్వతాలలోని 'రుగోదోవ్' తాతగారి ఊరు వెళ్లారు. ఎప్పుడో చిన్న తనంలో వెళ్లారు. మళ్లీ ఇప్పుడే ఆ ఊరు వెళ్లడం. టిప్లిస్ నుండి మూడు వారాలు గుర్రం బగ్గీలో ప్రయాణం. బ్లవట్స్కీ, టిప్లిస్‌లో రెండేళ్లు, కాకసస్‌లో మూడు సంవత్సరాలు ఉంది. చివరి సంవత్సరంలో నల్ల సముద్ర తీరంలోని ఇమరేషియా, జార్జియా, మింగ్రేలియాలు తిరిగింది.

ఆమె అతీంద్రియ శక్తులు, ఆధ్యాత్మికత రోజు రోజుకు పెరుగుతున్నాయి. సంకల్ప మాత్రంచేత ఎంత జటిలమైన పని అయినా ఇట్టే జరుగుతోంది. దేశమంతటా ఆమె పేరు మోగిపోతోంది. ఎక్కడికి వెళ్లినా, ఎవరిని కదిలించినా బ్లవట్స్కీ స్మరణే. మూఢ నమ్మకాలు కలవారు ఆమెను మాంత్రికురాలని ముద్ర వేశారు. కొందరు 'బ్లాక్ మాజిక్' అన్నారు. దూరదూరాల నుండి జనం వచ్చి తమ సమస్యలు నివేదించి పరిష్కారం అర్థించసాగారు. ఇప్పుడు తతంగం లేదు.




అడిగిన వాటికి క్షణంలో నేరుగా, సూటిగా పరిష్కారం సూచిస్తుంది. లేదా కాగితంపైన రాసి యిస్తుంది.

ఒక్కొక్కసారి జవాబు ఇవ్వడానికి కళ్లు మూసుకుని ట్రాన్సులోకి వెళుతుంది. కళ్లు మూసుకునే చెప్పేవారి మాటలు వింటుంది. అలాగే సమాధానాలు యిస్తుంది. ఆమె మగతలో పడడానికి కొన్ని రోజులు ముందర ఒక సంఘటన జరిగింది. చాలా జబ్బు చేసింది. ఆమె జబ్బు ఇదని డాక్టర్లు తేల్చి చెప్పలేకపోయారు.

***తన ఆనాటి పరిస్థితి బ్లవట్స్కీ మాటల్లో :***

***"ఎవరో పేరు పెట్టి పిలిచేవారు, కళ్లు మూసుకుపోయేవి. ఆ తర్వాత మగత. నేను నేననిపించేది కాదు. నేను శూన్యమైపోయేదాన్ని. నేను మరెవరో. నాలో మరెవరో ప్రవేశించినట్లయ్యేది. వెంటనే కొంచెం జ్వరం వచ్చేది. ఆకలి పూర్తిగా చచ్చిపోయేది. ఏ ధ్యాస ఉండేది కాదు. దాహం అయ్యేది కాదు. రోజుల తరబడి అదే స్థితి. ఒకసారి అలా నాలుగు నెలలు ఉండిపోయాను. బాగా చిక్కిపోయి శవంలాగా మారాను. ఆ సమయంలో నేను పలికే మాటలు నావి కావు. నానోటి వెంట వెలువడేవాటి గురించి నాకు తెలియదు. ఎక్కడో సుదూర దేశంలో నేనొక పరదేశిని. నా ప్రస్తుత జీవితానికి ఆ రెండవ జీవితానికి సంబంధం లేదు."***

అప్పట్లో బ్లవట్స్కీ మింగ్రాలియాలో ఒక సైనిక స్థావరంలో ఉండేది. చిన్న పట్టణం. అక్కడొక ఇల్లు కొన్నది. అది అడవి ప్రాంతం. రోడ్లు, వాహన సౌకర్యం ఉండేది కాదు. ఆమె జబ్బు పడితే డాక్టరు భయపడి టిప్లిన్ పంపాడు. గుర్రం బగ్గీలో వెళ్లడం కష్టమని నలుగురు సేవకులను తోడిచ్చి పడవమీద పంపారు. నాలుగు రోజులు ప్రయాణం.

నదికి రెండు వైపులా భయంకరమైన అడవి, సన్నపాటి నది. ఒంటరిగా ప్రయాణం. నాలుగు రోజుల ప్రయాణంలో నరకం చూచినట్లయింది.

నదిలో పడవ పోతూ ఉంటుంది. పడవలో బ్లవట్‌స్కీ నిద్రపోతుండేది. పడవ నడిపేవారికి అరణ్యంలో నుండి ఆమె వస్తూ కనిపించేది. వారు భయపడేవారు. పడవలో ఆమె పడుకునే ఉండేది. అడవిలోకి ఎట్లా వెళ్లినట్లు? దయ్యం కాదుగదా! బ్రతికున్న మనిషి దయ్యం అవుతుందా! ఒకసారి బ్లవట్‌స్కీ పడుకున్నచోట మరో ఇద్దరు ఎవరో పడుకుని ఉన్నట్లు కనిపించేది. వారు మొత్తం మీద టిఫ్లిస్ చేరే సరికి ఆమె ప్రాణావశిష్టంగా తయారైంది. ఈ నిమిషంలోనో మరో నిమిషంలోనో ప్రాణం పోయే మనిషిని తెచ్చి ఇంట్లో పడుకోబెట్టారు. ఆ స్థితిలో ఆమె నాలుగు రోజులు ఎట్లా ప్రయాణం చేయగలిగిందో!

కొన్ని రోజుల్లో రోగం తగ్గింది కాని, నీరసం తగ్గలేదు. బలహీనంగా ఉంది. నెమ్మదిగా వచ్చి పినతల్లి ఫెదయేవ్ ప్రక్కన కూర్చుని 'నాకు నిద్రొస్తోంది' అంటూ సోఫాలో పడుకుండిపోయింది. ఆమె సోఫాలోకి మారగానే ఒళ్లు తెలియనంత నిద్ర పట్టింది. పినతల్లి రాసుకుంటూ కూర్చుండి పోయింది. అంతలో గదిలోకి ఎవరో వస్తున్న చప్పుడైంది. చూస్తే ఎవరూ లేరు. కాని రావడం జరిగింది. ఎవరు? గదిలో బ్లవట్‌స్కీ తనూ ఇద్దరే ఉంది. గది నిశ్శబ్దంగా ఉంది. అయినా బరువుగా అడుగులు వేస్తున్న శబ్దాలు ఆమెకు వినిపించాయి.

ఆ వచ్చిన మనిషి నిద్రపోతోన్న బ్లవట్‌స్కీ చెవిలో ఏదో చెప్పాడు. ఎదురుగా ఉన్న షెల్ఫ్‌లోంచి ఒక పుస్తకం తీసి పేజీలు తిప్పాడు. మనిషి కనిపించలేదు. పేజీలు తిరుగుతున్నాయి. ఫెదయేవ్ కళ్లు విప్పి ఆశ్చర్యంగా చూచింది. బీరువాలో ఆపుస్తకం యదాస్థానంలో ఉంచి వెళ్లిపోయాడు ఆ వ్యక్తి. అదృశ్య మానవుడు.

ఆమెకు భయంకన్నా ఎక్కువ ఆశ్చర్యం కలిగింది. కుర్చీలోంచి లేచివచ్చి బ్లవట్‌స్కీని లేపబోయింది. అంతలో దూరంగా ఉన్న కుర్చీ ఒకటి కదిలి బ్లవట్‌స్కీ దగ్గరగా వచ్చింది. ఆ కుర్చీలో ఎవరున్నారు? ఏవో గుసగుసలు బ్లవట్‌స్కీతో. ఆ తర్వాత బ్లవట్‌స్కీ కళ్లు తెరిచింది.

ఆ సంఘటన తర్వాత ఈ పిల్ల ఎంత తొందరగా వెళ్లిపోతే అంత బాగుండును అనుకుంది ఆంటీ. బ్లవట్‌స్కీ ఆరోగ్యం త్వరగానే చక్కబడ్డది. వెంటనే ఇటలీ బయలుదేరి వెళ్లిపోయింది. ఆమె ఆధ్యాత్మిక స్థితి స్థిమితపడ్డది. ఆ తర్వాత ఎలాంటి అపస్వరాలు లేవు.



# 7. ప్రపంచం పిలిచింది!

ప్రపంచాన్ని ఉద్ధరించాలనుకునే వారి కళ్లు ఎప్పుడూ నెత్తిమీద ఉంటాయి. క్రిందికి చూడరు. వారికి నేలమీది మనుషులు కనిపించరు. ప్రతిక్షణం ప్రపంచం తమని పిలుస్తున్నట్లే కలలు కంటారు. ఒకచోట కాలు నిలవదు. బ్లవట్స్కీ విషయంలో ఒక వ్యక్తికి మేలు చేయడం కాదు. ఒక దేశాన్ని ఉద్ధరించడం కాదు. ప్రపంచాన్ని సమూలంగా మార్చాలి. నవ చైతన్యంతో మనుషుల్ని ఉక్కిరి బిక్కిరి చేయాలి. కనిపించని మాస్టర్లతో మంతనాలు. ఇంకా సరైన శిక్షణ లభించలేదు. గైడెన్సు అందడం లేదు. ఆశ చావడం లేదు. ఎక్కడికి పోవాలి? ఏం చేయాలి? ఎక్కడ పని ప్రారంభించాలి? అంతరాత్మ సతాయిస్తోంది ఒక ప్రక్క పరమాత్మ సిగ్నల్ ఉండడం లేదు. తెగించి 1865లో మళ్లీ బయలుదేరింది. బాల్కన్స్, గ్రీసు, ఈజిప్టు, సిరియా, ఇటలీ దేశాలు చుట్టి 1868 నాటికి ఇండియా చేరి టిబెట్‌లో ప్రవేశించ గలిగింది. ఆమె గమ్యం టిబెట్!

**1870లో బ్లవట్స్కీ మేనత్త ఫెదయేవ్ ఇలా రాసుకుంది :**

"నా మేనకోడలు హెలెనా ప్రపంచ పర్యటనలో ఉన్నప్పుడు తన సమాచారం ఏమీ తెలిసేది కాదు. తను వస్తున్నట్లు రాసిన ఉత్తరం మాస్టర్ కుత్‌హోమి సృష్టి. ఆ ఉత్తరం ఎవరో తెచ్చి యిచ్చి అంతలో మాయమైపోయారు. కుత్‌హోమి గారి శిష్యుడై ఉంటాడు. హెలెనా తను చాలా మంది మాస్టర్లను కలిసినట్లు రాసింది. ఆ లేఖల్ని బట్టి మాస్టర్లు ఉన్నట్లే."

1871లో బ్లవట్స్కీ రాసిన ఉత్తరం ప్రకారం అప్పుడే ఇండియా నుండి

గ్రీసు చేరింది. స్పిరిట్ సొసైటీ ఒకటి ప్రారంభించిందట. ఎన్ని కష్టాలు ఎదురైనా, ఎవరెంత నిష్టూరాలాడినా అనుకున్న పనిచేస్తుంది. ఇక్కడ ఎవరికీ ఏమీ తెలియదు. నాకేం నష్టం లేదు. ఉత్తినే కూర్చోను. రంగంలోకి దిగాలి. కష్టపడాలి. శ్రమించక పోతే ఫలితం ఉండదు.

ఇంగ్లాండు, ఫ్రాన్సు లోనూ ఆదరణ లభించలేదు. ఒక్క 'మీడియం' కూడా దొరకలేదు. స్పిరిట్ సొసైటీలో చేరవచ్చిన వారంతా శృంగార పురుషులు, తాగుబోతులు. ఈజిప్టులో ఒకే ఒక పెద్ద మనిషి బ్లవట్స్కీ ప్రతిభను గుర్తించి అభినందించాడు.

"నేను మాడంకు రెండు చిన్న బాక్సులు చూపించాను. ఒక బాక్సులో ఒక చిత్రపటం. రెండవ దానిలో ఒక వెంట్రుక పెట్టి మూసివేశాను. ఆ రెండు బాక్సుల్లో ఏముందో చెప్పగలరా? అని అడిగాను. ఆమె ఆ బాక్సులు చేతితో నైనా ముట్టుకోకుండా చెప్పింది "ఒక బాక్సులో మీ అమ్మ గారి చిత్రం, రెండవ దానిలో మీ చెల్లి తలవెంట్రుక ఉన్నాయి".

★ ★ ★

అలెగ్జాండ్రియాలో అలాంటి సంఘటన మరొకటి : యాకోవ్‌లీ, బ్లవట్స్కీ ఒక హోటల్ గదిలో ఉన్నారు. సోఫాలో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. సోఫా ఎదురుగా టీపాయ్ మీద వైను సీసా, గ్లాసులు ఉన్నాయి. అతను నోటి దగ్గర వైను గ్లాసు పెట్టుకొనేలోగా అది పగిలి వైను నేల పాలైంది. అతను చిరాకు పడ్డాడు. మాడం నవ్వి అన్నది.

"నేను మద్యం తాగను. తాగే వాళ్లన్నా నాకు అసహ్యం."

"అవును తమరు తాగడానికి మళ్లీ ప్రయత్నించినా ఆ గ్లాసు ముక్క లవుతుంది తప్పదు. మిమ్మల్ని తాగనివ్వను."

అతను వైను తాగడానికి మళ్లీ ప్రయత్నించగా చేతిలో గ్లాసు ముక్కలైంది.

స్పిరిట్ సొసైటీలు తాగుబోతుల అడ్డాలుగా మారడంతో ఆమె ప్రాణం విసిగిపోయి స్వదేశానికి బయలుదేరింది. 1972లో అనుకోకుండా లభించిన ఇద్దరు మిత్రులతో కలిసి 'ఒడెస్సా' చేరింది.

★ ★ ★

**కౌంటెస్ పాస్కోవ్ 1872 నాటి అనుభవం ఇలా రాసుకుంది.**

"ఒకసారి నేను బరాంటిస్ నది ప్రక్కన ప్రయాణం చేస్తున్నాను. అంతా ఎడారి. ఒకచోట ఒంటెల తండా (కారవాన్) కనిపించింది. ఆ కారవాన్‌లో

మాడం బ్లవట్స్కీ ఉంది. మేము కలిసి ప్రయాణం చేశాం. "దయర్ మార్ మరూన్" అనే గ్రామంలో ఒక పెద్ద శిథిలభవనం ఉంది. అక్కడ ఒక శిలాఫలకం మీద ఏదో రాసి ఉంది. ఆ రాత అక్కడ ఎవరికీ తెలియదు. బ్లవట్స్కీ స్పిరిట్స్ సాయంతో అద్భుతాలు చేస్తుందని నాకు తెలుసు. ఆ శిలాశాసనం గురించి, ఆ శిథిల భవనం గురించి, చెప్పమని అర్థించాను.

చీకటిపడ్డ తర్వాత మేము ఆ భవనం దగ్గరకు వెళ్లాం. బ్లవట్స్కీ వలయాకారంగా ఒక గీత గీసింది. ఆ వలయం లోపల నిప్పు మంట వేసింది. నెగడు తాలూకు పొగ చుట్టూరా దట్టంగా వ్యాపించింది. తను ఏవేవో మంత్రాలు ఉచ్చరించింది. మంట మరి కాస్త పెద్దది చేసింది. తన చేతిలోని కర్రతో శిలా ఫలకాన్ని తట్టింది. ఒక్కసారిగా ఆ రాతి పలకపై వెలుగుపడి మెరిసింది. ప్రక్కనే ఉన్న చెట్లు, కొమ్మలకు మంటలు వేలాడసాగాయి. ఎక్కడ నుండి వచ్చాయో నక్కలు వచ్చి అరవసాగాయి. అప్పుడు బ్లవట్స్కీ ఆ శాసనాన్ని ఆవహించిన భూతాన్ని ఆవాహన చేసింది. అంతలో చుట్టూ ఆవరించిన పొగ ఒక మేఘంలాగా రూపొంది వెన్నెల మసకేసింది. మంట మరింత పెద్దది చేశాం ఆమె చెప్పినట్లు.

ఆ మేఘం కుంచించుకుపోయి ఒక వృద్ధుని రూపం ధరించింది. తెల్లని గడ్డం. అతని గొంతు ఎక్కడో దూరం నుండి వినిపించినట్లు అనిపించింది. "ఈ శిథిల భవనం అతి ప్రాచీన కాలంలో ఒక దేవాలయం. అది ఒక దేవుని పేర కట్టించిన ఆలయం. ఆ దేవుడు పైలోకాలకు వెళ్లిపోగానే దేవాలయం శిథిలమైంది. ఈ ప్రాంతం ఎడారి అయింది."

బ్లవట్స్కీ ఆవృద్ధుని ప్రశ్నించింది. "నీవెవరు?"

అతను : "నా పేరు హెయిరో. ఆనాటి దేవాలయ పూజారిని".

బ్లవట్స్కీ అతన్ని అడిగింది : "అప్పుడు దేవాలయం ఎట్లా ఉండేదో చూపించగలవా?"

పూజారి ఓ క్షణం సేపు తలవంచి నిలబడ్డాడు. మా కళ్లముందు అలనాటి దేవాలయం, అప్పటి మనుషులు ప్రత్యక్షమైనారు. చూపు ఆనినంత మేర అది బహు సుందర నగరం.

తర్వాత అంతా అదృశ్యమైంది.



ఆల్కాట్‌తో బ్లవట్‌స్కీ

# 8. న్యూయార్క్‌లో కొత్త జీవితం

**బ్ల**వట్‌స్కీ న్యూయార్కు నగరంలో అడుగు పెట్టేనాటికి ఆమె వయసు నలభై రెండు సంవత్సరాలు. అప్పటికే ఆమెకు మహాయోగిని లక్షణాలు అలవడ్డాయి. అతీంద్రియ శక్తులు, ఆధ్యాత్మిక శక్తులు ఇబ్బడి ముబ్బడిగా వశమై ఉన్నాయి. పూర్ణ యోగినిగా, ఒక దేవతగా కనిపిస్తోంది. ఆత్మలకు మగ, ఆడ తేడా ఉండదు. మహాత్మలకు లింగ భేదం ఉండదు. మహాత్మలు ఎన్నిక చేసిన వ్యక్తి బ్లవట్‌స్కీ. ఆమె భౌతికంగా స్త్రీ – మానసికంగా పురుష ప్రవృత్తి ఆమెది. ఆమె ఒక 'మహాత్మ' అయి ఉండవచ్చు. మానవిగా జన్మించిన తర్వాత తన మహత్వ తత్వాన్ని, పూర్వజన్మ జ్ఞాపకాలను తనలో మిగుల్చుకోలేదు. వాటి అవసరం ఉండదు. ఈ జన్మలో చేయవలసిన పనులకు పూర్వజన్మ జ్ఞాపకాలు బొత్తిగా అవసరం ఉండదు. పైగా అవి అవరోధాలవుతాయి. కానీ పూర్వజన్మల సంస్కారం ఆత్మను అంటి పెట్టుకుని ఉంటుంది.

బ్లవట్‌స్కీ చిన్నతనం నుండి ఆత్మజ్ఞానంతో, పూర్ణప్రజ్ఞతో జీవిస్తూ వచ్చింది. అదే విశేషం. అందుకే ప్రపంచం ఆమెను అపార్థం చేసుకున్నది అనడం కన్న అర్థం చేసుకోలేకపోయింది అనడం భావ్యం. తగిన సమయం రాగానే పరమ గురువులు ఆత్మ ప్రవేశం చేశారు. ఆమెను తమ ప్రతినిధిగా (మీడియం) తీర్చిదిద్దడానికి నలభై సంవత్సరాలు పట్టింది. మహా గురువుల లక్ష్యం కాలంలో కరిగిపోతున్న సనాతన ధర్మాన్ని వ్యవస్థాపించడం, పునరుద్ధరించడం. అందుకు తగిన ఒక వ్యక్తి, ఒక సంస్థ అవసరం. సనాతన ధర్మాన్ని గ్రీకు భాషలో ఐరోపాలో

'థియోసఫియో' అంటారు. భాష వేరు భావం ఒక్కటే. అది భారతీయ మహర్షుల ఉపనిషత్సుధ. విజ్ఞానం. అది సత్యపథం. పరమ పథం. ఆ మహావృక్షానికి కొమ్మలూ రెమ్మలే వివిధ మతాలు, వివిధ విశ్వాసాలు, సిద్ధాంతాలు, జీవన విధానాలు.

ఇప్పుడు బ్లవట్స్కీ ముందున్నవి రెండు లక్ష్యాలు. రెండు బాటలు. రెండూ సమాంతరాలు. బూజుపట్టిన అంధమత విశ్వాసాలను, ఆచారాలను తొలగించడం. అప్పటికది క్రైస్తవ మతానికి పరిమితం. రెండవది, ప్రతి పనికి భౌతిక ప్రయోజనం ఆశించకుండా, శాస్త్రీయత అంటూ సైన్సుతో ముడి పెట్టకుండా, ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం కల్పించడం. రెండూ జటిలమైనవే. రెండూ మనసులోని పొరలు, అరలు. రెండూ అసాధ్యాలే అనిపిస్తాయి. రెండింటికి కావలసింది మానసికమైన పరిణామం. మెంటల్ కల్చర్. మతైక దృష్టిపోయి, ఆధ్యాత్మిక అవగాహన ఏర్పడాలి. ఆ అవగాహన ఒక అవసరంగా మారాలి. అమెరికా వంటి సంపన్న దేశంలో, సుఖ భోగాలకు ప్రాధాన్యమిచ్చే ప్రపంచంలో అది ఎంతవరకు సాధ్యం? కరడుగట్టిన క్రైస్తవ చాదస్తంలో చీలిక సాధ్యమా? బ్లవట్స్కీ మాటల్లో చెప్పాలంటే:

**"ఆ లక్ష్యాన్ని సాధించడమే నా జీవిత లక్ష్యం. దయ్యాలు, భూతాలపై నమ్మకం కలిగించడం కాదు. అసలైన ఆత్మ తత్వాన్ని అన్ని దేశాలు అర్థం చేసుకోవాలి. సనాతన ఆధ్యాత్మికత అందరి జీవితాల్లోకి రావాలి."**

మాడం బ్లవట్స్కీ లక్ష్య సాధనతో సంపూర్ణంగా సహకరించడానికి ఐచ్ఛికంగా ముందుకు వచ్చిన వ్యక్తి కల్నల్ హెన్రీ స్టీల్ ఆల్కాట్. నీతి, నిజాయితీ గల వ్యక్తి. సివిల్ వార్‌లో పని చేసినా మానవత్వం ఉన్నవాడు. ఆధ్యాత్మికత తెలిసినవాడు. ప్రస్తుతం న్యూయార్క్‌లో న్యాయవాది వృత్తిలో ఉన్నాడు. బ్లవట్స్కీ, ఆల్కాట్‌ల పరిచయం స్నేహబంధంగా మారింది. ఆల్కాట్‌కు ఇండియాతో పరిచయం ఉంది. భారతదేశ తాత్వికత తెలిసినవాడు.

**ఆల్కాట్ తన డైరీలో ఇలా రాసుకున్నాడు :**

*"నాకు మాడం బ్లవట్స్కీతో పరిచయం 1873 జులై మాసంలో న్యూయార్క్‌లో. అప్పటికి ఆమె న్యూయార్క్ వచ్చి వారం రోజులైంది. నేను "న్యూయార్క్‌సన్" పత్రిక స్టాఫ్ రిపోర్టర్‌ని. రష్యా మీద ఒక రచన చేయవలసి వచ్చింది. పూర్తి అవగాహన లేకుండా రచన చేయడం ఎలా? ఒక మిత్రుడు మాడం బ్లవట్స్కీ న్యూయార్క్‌లో ఉన్న విషయం చెప్పాడు. వెళ్లి ఆమెను కలిశాను. ఆ చిన్న పరిచయం మా ఇద్దరి మధ్య పెద్ద అనుబంధంగా మారింది. గొప్ప*

స్నేహంగానూ పరిణ మించింది. మొదటిరోజునే ఆమె మనసు విప్పి మాట్లాడింది. ఏమీ దాచుకోవడం చేతకాని మనిషి. పారిస్ నుండి బయలుదేరే రోజువరకు అనుకోలేదుట తను న్యూయార్క్ వస్తానని. ఎందుకు బుద్ధి మారిందో తెలియదు. టిబెట్ వెళ్లాలని అసలు ఆలోచన. తన పర్యటనల గురించి, ఈజిప్టు, ఇండియా అనుభవాలు వివరంగా, ఇష్టంగా చెప్పింది. ఆమెకు ఇండియా అంటే ఎంతో ఇష్టం."

**న్యూయార్కులో తొలినాళ్లలో బ్లవట్స్కీ అనుభవాల గురించి ఎలిజిబిత్ హోల్ట్ 1873 ఆగష్టులో ఇలా రాశారు :**

పెద్ద కుటుంబాల మహిళలు. తక్కువ సంపాదనతో న్యూయార్క్‌లో జీవించడం కష్టం. ఉండడానికి మంచి వసతి దొరకదు. ఓ నలభై మంది స్త్రీలు సహకార జీవనం చేస్తుండే వారు. ఒకరి కొకరు తోడు (ఇప్పటి వర్కింగ్ ఉమన్స్ హాస్టల్స్). మాడిసన్ వీధిలో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నారు. నేను, మా అమ్మ సారటోగాలో ఉంటాం. ఇక్కడి వసతిగృహం మా ఇంటి యజమానిది. సెలవుల్లో నేను ఇక్కడికి వచ్చేదాన్ని.

అక్కడే బ్లవట్స్కీ పరిచయం. తను రెండవ అంతస్తులో ఉండేది. ఆ ప్రక్క గది నా ఫ్రెండ్‌ది. బ్లవట్స్కీ పోర్షనులో ఒకగది ఆఫీసు రూం, ఒకటి సిట్టింగ్ రూం ఉండేది. ఆమె ఎక్కువ కాలం ఆఫీసు రూంలోనే గడిపేది. ఎప్పుడు ఒంటరిగా ఉండేది కాదు. ఎవరో ఒకరు ఉండేవారు. ఆమెలో గొప్ప ఆకర్షణ. ఆడ, మగ అని లేదు. ఎవరినైనా వచ్చి పలకరిస్తారు. ఎప్పుడు చూచినా ఆ గదిలో అలాగే ఉండేది. సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తుండేది. మెడచుట్టూ స్కాఫ్ చుట్టుకుని చూడడానికి గమ్మత్తుగా ఉండేది. రష్యన్ మహిళ కదా! అమెరికన్ మహిళలకు భిన్నంగా ఉండే ఆచారాలు, అలవాట్లు. చూడగానే పొడవు అనిపించేది కాదు. కాని పొడగరి. కొంచెం లావు. పొట్టి శరీరం. ముఖం వెడల్పు. భుజాలు విశాలం. జుత్తు లైట్ బ్రౌన్ రంగు. మొత్తం మీద బ్లవట్స్కీ మాడం చూడడానికి మహా ఆకర్షణగా ఉండేది.

పారిస్ మహిళల విలాస జీవితం గురించి, తన పియానో ప్రావీణ్యం గురించి నాతో చెప్పింది. నాకోసం చాలసార్లు పియానో వాయించింది. ఎవరైనా అడిగితే గతం గురించి చూచినట్లు వివరంగా చెబుతుండేది. ఆమెకు తాంత్రిక విద్యలు తెలుసని మా అనుమానం. నా స్నేహితురాలు పార్కర్ వాళ్లమ్మ చనిపోయింది. తనకు అమ్మ ఆత్మతో మాట్లాడాలని కోరిక. బ్లవట్స్కీని అడిగితే

**"కుదరదు. మీ అమ్మగారి ఆత్మ ఈ దగ్గరలో లేదు. చాలా పైలోకాలకు వెళ్లిపోయింది. వేరే పెద్ద పనిలో ఉంది. రప్పించడం కుదరదు. రమ్మన్నా వచ్చే తీరిక లేదు తనకి" అన్నది.**

తను అనుకున్నది కాకపోతే మాడం చాలా చికాకు పడుతుండేది.

**మరొక సంఘటన :** మా వీధిలో రౌడీలు తిరుగుతుండేవారు. రాత్రి పొద్దు పోయి వచ్చే ఆడపిల్లల్ని ఇబ్బంది పెట్టేవారు. ఒకరోజు రాత్రి పొద్దు పోయి ఒకమ్మాయి వస్తుంటే ఒక రౌడీ వెంట పడ్డాడు. ఆ అమ్మాయి భయపడి పరిగెత్తుకు వచ్చి మాడం గదిలో దూరింది. బ్లవట్స్కీ మాడం వెంటనే సివంగిలా లేచి తన బొడ్లో ఉన్న చాకుతీసి అతని వెంటపడ్డది. ఎవరైనా తనపై అఘాయిత్యం చేస్తారని ఆత్మరక్షణ కోసం ఒక చాకు దగ్గర ఉంచుకుంటుందిట.

అప్పట్లో బ్లవట్స్కీ డబ్బుకు ఇబ్బంది పడుతుండేది. రష్యా నుండి వాళ్ల డాడీ డబ్బు పంపేవారు. ఏ కారణంగానో డబ్బు రావడం ఆగిపోయింది. మా ఫ్రెండ్ పార్కర్‌తో కౌన్సిల్ ఆఫీసుకు వెళ్లినప్పుడు తెలిసింది. వాళ్లది జమీందారీ కుటుంబమని. కౌన్సిల్ అధికారికి ఆమె తండ్రిగారు తెలుసునట. చాలా గౌరవంగా మాట్లాడాడు. ఆమె తండ్రి చనిపోవడం వల్ల డబ్బు రావడం ఆలస్యమైనదని త్వరలో ఆమెకు వారసత్వం డబ్బు వస్తుందని హామీ యిచ్చాడు.

భోజనం లేకపోయినా తను గదిలో కూర్చుని ఎప్పుడూ రాసుకుంటుండేది. తర్వాత ఒక పెద్ద ఫ్రెంచి మహిళతో పరిచయం కలిగింది. డబ్బు వచ్చేవరకు తనతో వచ్చి ఉండమని ఆమె అడిగింది. బ్లవట్స్కీ ఆ ఫ్రెండ్ ఇంటికి మారింది.

★ ★ ★

***కల్నల్ ఆల్కాట్ మాడం బ్లవట్స్కీల మైత్రికి ఒక సంఘటన.***
***ఆల్కాట్ మాటల్లో :***

1874 జులైలో ఒకరోజున నా ఆఫీసులో ఏదో పని చేస్తూ ఆలోచిస్తున్నాను. న్యూయార్క్ సిటీ కార్పొరేషన్ కేసు ఒకటి విచారణలో ఉంది. వాదించడానికి మంచి పాయింట్ దొరకడం లేదు. మెదడు పనిచేయడం లేదు. ఈ మధ్య ఆధ్యాత్మికానికి దూరం అయినాను. అలా వీధి చివర దాకా వెళ్లి "Banner of Light" పత్రిక కొన్నాను. అందులో ఒక చిత్రమైన కథనం నన్నాకర్షించింది. అది "దయ్యాలు మనుషులుగా మారటం."

***మనిషి చనిపోయిన తర్వాత గదా దయ్యంగా మారేది? దయ్యాలు చచ్చిపోయి మళ్లీ మనుషులుగా మారతాయా? నా సందేహం.***

వెర్మంట్ రాష్ట్రంలోని 'చిట్టెన్‌డన్' అనే ఊళ్లో అలాంటివి జరుగుతున్నాయట. న్యూయార్క్‌కు వందల మైళ్ల దూరం. అయినా ఆసక్తికొద్దీ వెళ్లాను. నాలుగు రోజులు అక్కడ మకాం వేశాను. పత్రిక రిపోర్టరుని కదా! అక్కడి విషయాలు "న్యూయార్క్ సన్" పత్రికకు రిపోర్టింగ్ పంపాను. నా రచన అమెరికా మొత్తంలో సంచలనం కలిగించింది.

రెండవసారి "న్యూయార్క్ డెయిలీ గ్రాఫిక్" పత్రిక ఫోటో గ్రాఫర్‌ను ఒక ఆర్టిస్టుని తీసుకువెళ్లాను. ఈసారి పన్నెండు వారాలు మకాం వేశాను. బొమ్మలతో సహా నా 'దయ్యాల కథలు' పత్రికలో వచ్చేవి. నా వ్యాసాలు మాడం బ్లవట్‌స్కీ చదవటం తటస్థించింది. వెంటనే 'చిట్టెన్‌డన్'కు వచ్చింది.

ఆనాటి మా పరిచయం నిన్న మొన్న జరిగినట్లు అనిపిస్తుంది.

మధ్యాహ్నం లంచ్ టైముకు మాడం వచ్చింది. భోజనానికి ఇంకా చాలా మంది ఉన్నారు. అందరూ దయ్యాలను చూడాలని వచ్చిన వారే! బ్లవట్‌స్కీ తనతో వచ్చిన మరొక ఆమె ఫ్రెంచిలో మాట్లాడుకోసాగారు బయట కూర్చుని. బ్లవట్‌స్కీ సిగరెట్ వెలిగించబోగా, నేను అగ్గిపుల్ల వెలిగించాను.

"మీరు ఎన్ని రోజులుగా ఇక్కడ ఉన్నారు" మాడం అడిగింది. చెప్పాను.

"నేనిక్కడకు రావడానికి ముఖ్య కారణం దయ్యాలు కానే కాదు. కల్నల్‌ని కలవవచ్చునని వచ్చాను."

"అతనంటే మీకు భయమా".

"భయం కాదు. నా గురించి తన పత్రికలో రాస్తాడని ఆశ. రిపోర్టర్ కదా!

అప్పుడు నన్ను ఆమెకు పరిచయం చేసుకున్నాను. "సారీ మాడం! మీ పర్మిషన్ లేకుండా పత్రికల్లో మీ పేరు వాడుకున్నందుకు. క్షమించండి, నేనే ఆల్కాట్‌ని."

ఆ క్షణంలో మా ఇద్దరి చూపులు కలిశాయి! చూపులు కలసిన శుభవేళ అది. గమ్మత్తుగా ఇద్దరి అభిరుచులు కలిశాయి. ఇద్దరి ఆకాంక్షలు ఒక్కటయ్యాయి. రెండు ఆత్మలు ఏకమై పలకరించుకున్నాయి.

ఆరోజు తెలిసింది బ్లవట్‌స్కీ సామాన్యురాలు కాదు. చాలా దేశాలు తిరిగింది. స్పిరిట్స్ గురించి చాలా పరిశోధన జరిపింది. ఆమెలో ఆధ్యాత్మికత చాలా ఎక్కువ. చాలా సిద్ధులు, అతీంద్రియ శక్తులు ఉన్నాయని గ్రహించాను. అప్పటికి నాలో

అభిలాష తప్ప ఆత్మజ్ఞానం బొత్తిగా లేదు. దయ్యాల గురించి తప్ప ఆత్మల గురించి అసలు తెలియదు. ఆనాడే తెలిసింది దయ్యాలు వేరు – స్పిరిట్స్ వేరు. స్పిరిట్యువల్ ప్రపంచం వేరు అని.

అక్కడ మీడియంగా వ్యవహరిస్తున్న వ్యక్తి పేరు ఎడ్డీ. రోజూ సాయంత్రం పూట దుకాణం తెరిచేవాడు. మేడపైన పెద్ద హాలు ఉంది. ఒక చివరన తను కూర్చుంటాడు. గుమ్మానికి కర్టెన్ వేసి ఉంటుంది. దయ్యాన్ని రమ్మని పిలుస్తాడు. లోపల చీకటి. దయ్యం లోపలకు వచ్చినపుడు కర్టెన్ పక్కకు తొలిగేది. తెర మీద నీడలా దయ్యం కనిపించేది. అతిథుల కోరిక మేరకు వచ్చే దయ్యాలు రెడ్ ఇండియన్స్, అమెరికన్, యూరపు దయ్యాలు మాత్రం వచ్చేవి. బ్లవట్స్కీ వచ్చి కూర్చున్న రోజు జార్జియా నుండి ఒక కుర్ర దయ్యం, టిఫ్లిస్ నుండి ఒక ముస్లిం దయ్యం, ఒక రష్యన్ దయ్యం వచ్చాయి. వారి భాష మీడియం ఎడ్డీకి అర్థం కాలేదు. అసలు జరిగింది ఏమంటే బ్లవట్స్కీ తన సంకల్పంతో పరలోకాల నుండి వారి ఆత్మల్ని రప్పించింది.

అక్కడ ఉన్నన్ని రోజులు మాడం నాతో స్పిరిట్స్ గురించి అనేక విషయాలు చెప్పింది. చనిపోయిన వారి 'ఆస్ట్రల్' వెంటనే లయించిపోకుండా అదే రూపంలో ఆస్ట్రల్ రూపంలో గాలిలో తిరుగు తుంటుందట. ఇండియాలో జరిగిన చాలా కథలు చెప్పింది. ఏవీ నాకు అర్థం కాలేదు. అయినా ఇద్దరి అభిరుచులు కలిశాయి. కనుక ఫ్రెండ్స్ అయ్యాం. ఆమెను నేను 'జాకీ' అని పిలవసాగాను.

1874 నవంబరులో చిట్టెన్‌డన్‌లో దయ్యాలపై పరిశోధన ముగించి న్యూయార్క్ చేరగానే బ్లవట్స్కీని కలిశాను. ఎప్పుడెప్పుడు మాడంను కలవాలా అని ఆరాటం. ఆమెను మరచిపోలేక పోతున్నాను. ఈసారి టేబుల్ కదల్చడం, పైలోకాల నుండి ఆత్మ శరీరుల రాక, వారి సందేశాలు వివరించింది. అదొక మాయా ప్రపంచం. కింగ్‌జాన్ ఆత్మను పిలిచింది. అతని రూపాన్ని సృష్టించింది. తన చేతిని అంగుళం ఎత్తుగా ఉంచి, టేబుల్‌ని కదిలించింది.

వేరొకసారి నా జేబులో ఉన్న నోట్‌బుక్‌లో 'మిస్టిక్ రైటింగ్' సృష్టించింది. తన మనసులోని మాటల్ని కాగితంపైకి బదిలీ చేసింది. మొత్తం మీద బ్లవట్స్కీ చెప్పే ప్రాచ్యదేశాల కథనాలపై నాకు మక్కువ కలిగింది. వారి అతీంద్రియ శక్తులపై విశ్వాసం పెరిగింది.




# 9. పొద్దు పొడిచింది

**మా**డం బ్లవట్స్కీ చిట్టెన్‌డన్‌లో 'ఎడ్డీఫారం' నుండి న్యూయార్కు చేరగానే కల్నల్ వచ్చి కలిశాడు. ఆమె రాక ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాడు. తన మిత్రుడు విలియం క్వాన్ జడ్జిని ఆమెకు పరిచయం చేశాడు. జడ్జి ఐరిష్ జాతీయుడు. అప్పుడే అటార్నీగా ప్రాక్టీసు ప్రారంభించిన యువకుడు. మేధావి. ఆల్కాట్ తనని మొదటిసారి కలిసినప్పటి నుండి అతనిలో ఆధ్యాత్మిక చింతన కలిగించ డానికి బ్లవట్స్కీ ప్రయత్నిస్తూనే ఉంది. వచ్చిన ఏ అవకాశాన్ని ఆమె జారవిడుచుకోదు. వీలైనంత ఎక్కువమందిని తన వేపు తిప్పుకోవడం ఆమెకు అవసరం. తన థియోసఫీ సిద్ధాంతాలు, లక్షణాలు అతనికి నూరిపోసింది. కానీ ఆల్కాట్‌లో స్పందన ఆశించినంతగా ఉండేది కాదు. చివరకు తన మనసులోని మాట కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది.

"మిస్టర్ ఆల్కాట్! నేను అమెరికా వచ్చింది మోజుపడి కాదు. ఎడ్డీ బ్రదర్స్‌ను కలవడం ఏదో నేర్చుకోవాలని కాదు. అవన్నీ నాకు వచ్చిన విద్యలే. నీకు కొంత ఆత్మ సంస్కారం ఉందని నాకనిపించింది. నీకు స్పిరిట్స్‌తోనూ పరిచయం ఉందని నాకు తెలుసు. ఆధ్యాత్మిక అవగాహన లేకుండా, ఆకల్టిజంపై ప్రేమ లేకుండా స్పిరిట్స్‌తో చెలిమి ప్రమాదకరం. గంటలు మోగించడం, మనసులోని ఆలోచనలు చదవడం, మిస్టిక్ రైటింగ్, ఆత్మల్ని పిలిచి మాట్లాడడం వంటివి గొప్ప విషయాలు కావు. ఎవరైనా చేయవచ్చు కాస్త మనసు పెడితే. భౌతిక ప్రపంచంలో సహజంగా జీవిస్తూ కూడా ఆస్ట్రల్ శక్తుల్ని సంపాదించ వీలుంది. అది విరోధం కాదు. నాకు నాలుగు సంవత్సరాల వయసు నుండి ఈ విద్యలలో ప్రవేశం ఉంది. ఆ పనులన్నీ

అలవోకగా చేసి చూపించాను. వస్తువుల్ని గాలిలో ఎగిరేలా చేశాను. గాలిలో పరుగెత్తించాను. నేను మాస్టర్లను కలుసుకోక పూర్వమే ఈ విద్యలన్నీ నాకు వచ్చు."




థియోసఫీ ఉద్యమంలో జడ్జి నిర్వహించవలసిన పాత్ర ఆమె ఊహించి, రూపకల్పన చేసుకుంది. ఆల్కాట్ డ్యూటీ వేరు. జడ్జి డ్యూటీ వేరు. జడ్జికి 'ఆకల్టిజం' పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ స్పిరిట్స్‌తో వ్యవహారాలు అతనికి నచ్చదు.

జడ్జి బ్లవట్‌స్కీని గురించి రాసుకున్న మాటలు :

"ఈ జన్మలో తొలిసారిగా మాడం బ్లవట్‌స్కీని న్యూయార్కులో 1874లో కలిశాను. (పూర్వజన్మలలోనూ కలిసి ప్రయాణం చేసి ఉంటాము). ఆమె కళ్లు నన్ను ఆకర్షించాయి. అనేక జన్మలుగా ఆ కళ్లతో నాకు పరిచయం ఉందనిపించింది. అవే కళ్లు – మా జన్మజన్మల మైత్రికి ఆనవాళ్లు. మొదటి పరిచయంలోనే మాడం నన్ను గుర్తించిందని నాకు అనిపించింది. తర్వాత ఏనాడు ఆమె ఆదరణ తగ్గలేదు. అదే ప్రేమ, అదే అభిమానం. ఆమెతో తాత్విక విషయాలు చర్చించాలని నేను తనని కలవలేదు. అనేక జన్మలలో మేము ఇద్దరం సహచరులం. భావాలు కలిసి పంచుకున్నాం. ఒకే లక్ష్యం కోసం ముందుకు సాగినవాళ్లం. నా పిలుపు ఆమెకు వినిపించిందా? లేక ఆమె పిలుపు నాకు వినిపించిందా? ఏమో? మా అన్వేషణ, ఆశ ఒక్కటేనని అర్థమైంది. చెప్పకుండానే పని ప్రారంభించాం. మాది గురుశిష్య సంబంధం. సోదర మైత్రి. మాది ఒకే సాధన, ఒక్కటే గమ్యం. ఆమెలో మహర్షుల ప్రజ్ఞ ఉంది. సింహం పట్టుదల ఆమెది. అది రాజసం. ఆమె రాజయోగిని.

అపనిందలు, కువిమర్శలు తప్పవని మాకు తెలుసు. మమ్మల్ని విమర్శించడం వల్ల ప్రపంచం ఎంత నష్టపోతుందో కూడా మాకు తెలుసు. 1875లో మాడం నాతో అన్నది : "అన్ని అపనిందలు, అవమానాలు భరిస్తూ మనం కార్యక్రమం నిర్వహించాలి. మన కృషికి ఎటువంటి ఫలితం ఆశించకూడదు. ప్రయోజనం వెంటనే ఆశించకూడదు. సింహం ముందుకు పోతూ ఉంటే మిగిలిన జంతువులు అవే దారి యిస్తాయి."

"నాకు తెలుసు ఆమెకు మిస్టిక్ పవర్స్ ఉన్నాయని. అతీంద్రియ శక్తుల పైన ఆమెకు ఆధిపత్యం ఉంది. వాటిని తనే సాధించుకుంది. అవి సైన్సుకు, మేధకు అందని శక్తులు. తన శక్తులకు ఆమె ఎప్పుడూ గర్వపడలేదు. వాటిని ప్రదర్శించి, లబ్ధి పొందాలనీ భావించలేదు. తన లక్ష్యం అతీంద్రియ శక్తులు సంపాదించడం, నేర్వడం కాదు. మానవతను కమ్మిన మత్తు వదిలించాలి. మనిషిని చైతన్య పరచాలి. దివ్యజ్ఞానం కలిగించాలి. మానవత్వాన్ని ఉద్ధరించాలి. ఒక మెట్టుపైకి చేర్చినా చాలు. కొద్ది మందికైనా ఈసాటరిక్ పరిజ్ఞానం కలిగించగలగాలి. అందుకు తగిన శిక్షణ యివ్వాలి. ఆ లక్ష్యం సాధించాలంటే ఒక సొసైటీ అవసరం. ఎంత చిన్నదైనా ఫరవాలేదు. ఎంత కొద్దిమంది చేరినా ఫరవాలేదు. దివ్యజ్ఞాన మందిరం పునాదులు గట్టిగా ఉండాలి."

**ఒక అమెరికన్ దృష్టిలో మాడం బ్లవట్స్కీ :**

"మాడం బ్లవట్స్కీ చూడడానికి అతి సాదాగా, నిరాడంబరంగా ఉన్నా ఆమెలో గొప్ప ఆకర్షణ ఉండేది. మనిషి పొడవుగా, దృఢంగా ఉంటుంది. నడకలో హుందాతనం, నిండుదనం. శరీరానికి మించిన తల, నుదురు విశాలం, కనుబొమలు దట్టంగా ఉంటాయి. చిత్రమైన ఆకర్షణ ఉంది. ఆమె చూపుకు ఎంతటి వాడైనా తల వంచక తప్పదు. అంత పవర్‌ఫుల్ లుక్. వయస్సు నలభై లోపు. వయసుకు మించిన గాంభీర్యం ఆమెలో. ఆమెను చూడగానే స్త్రీ అంటే ఇలా ఉండాలి అనిపిస్తుంది. ఎ ఫుల్ అండ్ పర్‌ఫెక్ట్ ఉమన్.

"మాడం ఉండేది మూడు గదుల పోర్షను. **దానిపేరు "లామాసారి". అంటే బౌద్ధకుటీరం అని అర్థం**. నిత్యం ఆమె కోసం గొప్ప మేధావులు వస్తుండేవారు. ఆమెతో సంభాషించడమే ఒక ఎడ్యుకేషన్ అనేవారు.

"అనేక విషయాలపై అనర్గళంగా మాట్లాడేది. ఎన్నో దేశాలు తిరిగింది. అనుభవాలు ఎక్కువ. నాలెడ్జి ఎక్కువే. యోగం గురించి, ఆధ్యాత్మిక శక్తుల గురించి రోజులు తరబడి విసుగు లేకుండా చెప్పగల ప్రజ్ఞ ఉంది. అనేక దేశాల ప్రాచీన, ఆధునిక సాహిత్యాలలోనూ పరిచయం ఉంది. ఎప్పుడు చదివిందో అన్ని పుస్తకాలు! అనేక భాషలు తెలుసు. జర్మనీ, ఫ్రెంచి ఫిలాసఫీలు ఆమెకు కొట్టిన పిండి. తత్వ విషయాలకు ఘాటుగా స్పందిస్తుంది. నిర్మొహమాటంగా విమర్శిస్తుంది. ఆమెకు భయంలేదు. ఆమె చెప్పే విషయాలు ఖండించే సాహసం ఎవరికీ ఉండేది కాదు. అప్పుడప్పుడు అతిథుల్ని తన పియానో వాద్యంతో మంత్ర ముగ్ధుల్ని చేస్తుంది.

"ఆమెకు తాంత్రిక విద్యలు తెలుసునని అందరి అనుమానం. అయితే ఏ అతీంద్రియశక్తులు ఆమె ప్రదర్శించడానికి ఇష్టపడేది కాదు. క్షుద్ర విద్యల్ని గర్హించేది. మానసిక శక్తిని, విల్ పవర్‌ను అప్పుడప్పుడు ప్రయోగించవలసి వచ్చేది. ఆమె ద్వారా పరమ గురువుల ప్రవచనాలు వెలువడే సమయంలో ఆమెకు భౌతిక స్పృహ ఉండేది. తాను చెప్పకపోయినా తన నోటి ద్వారా వెలువడే అంశాలు తనకు జ్ఞాపకం ఉండేవి. తను వేరు, తనలోని మాస్టరు వేరని కాక, మాస్టరుకు తాను మీడియం అయ్యేది. తాను దూరంగా నిలబడి, మానసికంగా గమనిస్తుండేది. శక్తుల్ని తన అధీనంలో ఉంచుకునేది.

"మొదట్లో మరీ సన్నిహిత మిత్రుల మధ్య మాత్రమే అతీంద్రియ శక్తుల ప్రస్థావన చేసేది. వాటికి ప్రచారం ఇవ్వవద్దని గట్టిగా హెచ్చరించేది. ఆకల్టిజం ప్రయోగాలు సైన్సుకు ఉపయోగపడాలన్నది ఆమె తపన. తన ఆప్త మిత్రులు ఆల్కాట్, జడ్జ్‌లకు మాత్రమే తన అతీంద్రియ ప్రయోగాలు తెలియనిచ్చేది. ఆ మిత్ర ద్వయం బ్లవట్‌స్కీని అర్థం చేసుకునేవారు. ఇద్దరూ ఆమెకు శిష్య సమానులే."

ఆత్మశక్తి ఎవరిలో ప్రవర్తిల్లినా, దానిని దాచినా దాగదు. బ్లవట్‌స్కీ కీర్తి అన్ని దేశాలకు వ్యాపించ సాగింది. మతం మత్తులో జోగుతున్న వారిని తట్టి లేపి నట్లయింది. కొన్ని ప్రయోగాలు చేయక తప్పలేదు. మేధావి వర్గానికి నమ్మకం కలగడం అవసరం గదా! ప్రచారం కోసం కాకపోయినా సత్యప్రకటన కోసమైనా కొంత ప్రయత్నం అవసరం. నిదర్శనలుంటే తప్ప శాస్త్రజ్ఞులు అంగీకరించరు. ఎవరో ఒకరిద్దరు మాత్రం చేయగల పనులకు శాస్త్రీయత ఉండదు. ఎవరు ప్రయోగం చేసినా అదే ఫలితం వస్తే అది శాస్త్రీయం అవుతుంది. సాధన ద్వారా, తపస్సు ద్వారా, యోగం ద్వారా ఆత్మ జాగృతం అయితే తప్ప ఆధ్యాత్మిక ప్రయోగాలు, అతీంద్రియత నిరూపణ సాధ్యపడదు. ఆ పని జరగనంతకాలం ఎంతమంది యోగులు కృషిచేసినా అది వారి వరకే పరిమితం – అది ఈసాటరిక్ గానే (గుప్తంగా) మిగిలి పోతుంది.

★ ★ ★

అప్పట్లో 'యోగం' అంటే అమెరికా వారికి తెలియదు. 'ఆత్మ' అంటే అదేమిటి? అంటారు. ఇప్పుడు అమెరికాలో 'యోగం' ఒక ఫాషనైంది. పుట్ట గొడుగుల్లాంటి యోగా టెంపుల్స్ అన్నిచోట్ల వెలిశాయి. యోగా రిసార్ట్సు తయారైనాయి. బ్లవట్‌స్కీ మనిషి తనలోని ఆత్మశక్తిని, ఆధ్యాత్మిక అవసరాల్ని గుర్తించేటట్లు చేయగలిగింది. ఆధ్యాత్మికత అంటే దయ్యాల కథలు కాదు.

దయ్యాలపై ప్రయోగాలు కాదు. ఆత్మ శక్తిని తెలుసుకుని, దానిని పెంపొందించు కోవడం, పరిణామానికి ఆశక్తిని వినిమయం చేయటం.

అమెరికా సంపన్న దేశమే కాని, మతం విషయంలో మూర్ఖత్వం ఎక్కువ. అక్కడ మతఛాందసులకు, తాంత్రికులకు మధ్య సయోధ్య లేదు. ప్రాచ్య దేశాల ఆత్మజ్ఞానం గురించి వారికి అసలు తెలియదు. బ్లవట్‌స్కీ ఆపనికి 1875లో అంకురార్పణ చేసింది. 'మాస్టర్లు' అనే పదం దైవికంగా వినిపించసాగింది. మాస్టర్లు అంటే కనిపించని ఏంజల్స్. కనిపించని సెయింట్స్. **బ్లవట్‌స్కీ తన గురువు 'మహాత్మ మోరియా' అని స్పష్టంగా చెప్పుకోసాగింది. అదే థియోసఫీకి బలం.**

## సొసైటీ ఆవిర్భావం

కలలు కళ్లలోనే ఉంటే ప్రయోజనం లేదు. కనురెప్పలు దాటి బయటకు రావాలి. వాస్తవం కావాలి. మహాత్ముల ఆశయాలు నెరవేరాలంటే మానవ సహాయం, సహకారం అవసరం. ఒక్క వ్యక్తి అన్ని పనులు తనే చేయలేడు. దేవుడు ఎక్కడో ఉండి ఏం లాభం? గుడిలో రాయిగా మారితేనే పూజలు, పునస్కారాలు. సమాజ హితం కోరి చేసే పనుల్లో వ్యక్తి స్వార్థం ఉండకూడదు. అది ఒక వ్యక్తికి పరిమితమై ఉండకూడదు.

బ్లవట్‌స్కీ కళ్లే కాదు, ఆమె కన్న కలలు జనాల్ని ఆకర్షించాయి, ఎంతగానో అలరించాయి. అలాంటి కలలు మరికొందరికి వచ్చాయి. అవి మేధావుల్ని ఆకర్షించాయి. మేధ, కొత్తదనం మనిషిని ఆకర్షిస్తాయి. నటులకు, రాజకీయ నాయకులకు లేని ఆకర్షణ బ్లవట్‌స్కీకి ఏర్పడ్డది. భౌతిక వాదంపైన ఆమె ఎక్కుపెట్టిన బాణాలు సూటిగా తగిలి గుండెల్లో గుచ్చుకున్నాయి. భౌతిక సుఖాల వల్ల కలిగే అనర్థాలు ఇవీ అని చెబితే తప్ప అమెరికన్ బుర్రలకు ఎక్కలేదు. ఆమె స్వరం నాగస్వరం అయింది. ఆమె రాతలోని భావాలు జనామోదాలయ్యాయి.

పదే పదే మహాత్ముల ప్రస్థావన చేయడంలో **'మాస్టరిజం'**పై ఆసక్తి పెరిగింది. **మాస్టరిజానికి మరోపేరు థియోసఫి.**

"ఓ మహాత్మా! నీ ఇష్టం. నీవు ఏది చేయదలిస్తే అది చెయ్యి ..." అని మౌనంగా ప్రార్థించేది.

బ్లవట్‌స్కీ అభిమతాన్ని ఆదేశంగా భావించిన వ్యక్తి ఆల్కాట్. ఆయన టోటల్‌గా సరెండర్ అయినాడు. తానుగా ఆసక్తి గల వారిని సమీకరించి మానసిక శక్తులపై ప్రసంగించసాగాడు. దానికి "Miracle Club" అని నామకరణం చేశారు.

అది అంతే మిరకిల్‌గా నాలుగు రోజుల్లో నామరూపాల్లేకుండా పోయింది. అంతలో మాస్టర్ ఆదేశం అందింది బ్లవట్‌స్కీకి. "ఫిలసాఫియా రెలిజియస్ సొసైటీ" ఏర్పాటు గురించి. ఆ బాధ్యత ఆల్కాట్ తనపైన వేసుకున్నాడు. పాపం! ఆల్కాట్ గారు చూచి రమ్మంటే కాల్చి వచ్చే రకం.

మత రహిత సమాజం ఏర్పడాలన్నది మహాత్మల సంకల్పం. కాని జరిగింది వేరు. రెలిజియన్‌ను ఫిలాసఫితో ముడి పెట్టడం జరిగింది. మతం లోతులు తరచి చూచి ఫిలాసఫీని బయటకు లాగడానికి ప్రయత్నం జరిగింది. బహుశా అది 'మహాత్మ' తత్వానికి విరుద్ధమేమో! ఎవరూ గమనించలేరు. అత్యుత్సాహంతో ముందుకు సాగారు. మతానికి సైతం శాస్త్రీయ అవగాహన అవసరం. మతంలో 'హేతువాదం' పొసగుతుందా! తర్కంలో 'మతం' నిలుస్తుందా? చివరికది మనో విశ్లేషణతో ముగుస్తుందా? పరిశోధనకే పరిమితం అవుతుందా?

మహాత్ముల ఏకైక ప్రతినిధి బ్లవట్‌స్కీ. మిగిలిన వారందరూ సహాయకులు. మహాత్మ మోరియా నుండి, మహాత్మ కుత్‌హోమీ నుండి సందేశాలు ఆమెకు అందుతుండేవి. ఒక లేఖ అందిందంటే మాస్టర్ మోరియా ఇండియా నుండి పంపినట్లు. న్యూయార్క్‌లో ఉన్నంత కాలం ఆమెను రక్షించింది ఈజిప్టు గురు మండలి. దాని పేరు గ్రేట్ లాడ్జ్. దాని అధిపతి 'Serapis Bey'.

*ఒక ఆసక్తికరమైన సంఘటన :*

గెర్రీ బ్రౌన్ అనే అతను ఆర్థిక ఇబ్బందుల కారణంగా పత్రిక నడపలేక పోయాడు. అతను ఆల్కాట్ మిత్రుడు. ఆల్కాట్ అతనికి ఏదో కొంత సహాయం చేయాలనుకున్నాడు. బ్లవట్‌స్కీ సలహాతో ఒక ప్రకటన తయారు చేశాడు. ఆ ప్రకటన పైన ఏడుగురు "లుక్సర్ బ్రదర్ హుడ్" సంతకాలు చేయాలి. ఆ ప్రకటనలోని విషయాలు బ్లవట్‌స్కీకి చెప్పలేదు. ఆరు పేరాల మాటర్ రాశారు. అన్ని పేరాల మొదటి అక్షరాలు చేర్చితే "TUITIT" వచ్చింది. "ట్యుటిట్" ఒక పరమ గురువు. బ్లవట్‌స్కీ ద్వారా ఆల్కాట్‌కు Tuitit నుండి సందేశాలు అందుతుండేవి. తర్వాత అదే గురువు ట్యుటిట్ ఇండియాలో టి. సుబ్బారావును, కైరోలోని ఒక గురువును సంప్రదిస్తూ వారి సలహాలు పాటించమని ఆల్కాట్‌కు సలహా యిచ్చాడు. ఈజిప్టులోని మరి కొందరు గురువుల సహకారం తీసుకోవలసిందిగా మాస్టర్ కుత్‌హోమీ సూచన. ఎవరీ టి. సుబ్బారావు? ఒక మహాత్మా? మహర్షియా?

1875 సెప్టెంబరు 7న బ్లవట్స్కీ ఉంటున్న ఇంట్లోనే థియోసాఫికల్ సొసైటీ ఏర్పాటు జరిగింది. ఆహూతుల ముందు బ్లవట్స్కీ తన ఆశయాలు వివరించింది.

అదృశ్య శక్తుల గురించి, మనిషి ప్రగతి సాధనకు పూర్ణత్వానికి ఆ శక్తుల అవసరం గురించి ప్రసంగించింది.

**"ఆ శక్తుల్ని తక్కువ అంచనా వేసి, వాటిని రెచ్చగొట్టకూడదు. చిన్నచిన్న ప్రయోజనాలకు వాటిని ఉపయోగించకూడదు. అవి మనకన్న ఉన్నతమైన స్థానంలో ఉన్నాయి."**

అంతకు ముందు ఏర్పాటు చేసిన Philosophic Religious Societyకి దీనికి తేడా ఉంది. దానిని మాస్టర్స్ ఆదేశంతోనే ఆల్కాట్ ప్రారంభించాడు. అది మానసిక శక్తులకు, పరిశోధనలకు పరిమితం. అక్కడ 'ఆత్మ' ప్రస్తావన లేదు. Theosophical Society కేవలం ఆత్మజ్ఞానానికి సంబంధించింది. పరిమితమైంది కాదు. దీని వైశాల్యం ఎక్కువ. ఇందులో ఆత్మ శక్తులు, దివ్య శక్తులు, అతీంద్రియ శక్తులు ఉన్నాయి. ప్రయోగాలు, పరిశోధనలు ఉంటాయి. సూక్ష్మ లోకాలు – ఆస్ట్రల్ జీవులు ఉంటాయి. సొసైటీకి ఆల్కాట్ అధ్యక్షుడు, జార్జి అడ్వయిజర్. బ్లవట్స్కీ కరస్పాండెంట్ – సెక్రటరీ.

1875 నవంబరు 17న అధ్యక్ష తొలి ప్రసంగం జరిగింది. పత్రికలలో మంచి ప్రచారం వచ్చింది.

"థియోసఫీ ఒక చైతన్య పూర్ణ ఉద్యమం. ఆల్కాట్ నాయకత్వంలో, నిర్వహణలో సమర్థుడు. అమెరికన్ మేధావి వర్గంతో సత్సంబంధాలు ఉన్నవాడు. ఆత్మలతో 'భేటీ'కి ధైర్యం కలవారు ముందుకు రావాలి. అందరు ఏకం కావాలి."

విశ్వ విజ్ఞానం పై పరిశోధనలకు థియోసఫీ కొత్త అవకాశాలు కల్పించింది. వాకిళ్లు తెరిచింది. కొత్త ఆశయాలను కల్పించింది.

1879–80లో నిబంధనల్లో, ఆశయాల్లో "సౌభ్రాతృత్వం" అనే పదం అదనంగా చేర్చారు. మొదటి నుండి థియోసఫీలో మతానికి ప్రాధాన్యం లేదు. రాజకీయ జోక్యం లేదు. ఎరవైనా సభ్యులుగా చేరవచ్చు.

మానవ సమస్యలకు పరిష్కారం అన్వేషించడం థియోసఫీ లక్ష్యం.

**బ్లవట్స్కీ అభిభాషణ :**

**స్వర్గ సంపదలు ఆశించేవారు భౌతిక సంపదలు, సుఖాలు వదలాలి.**

**మాస్టర్ అనుగ్రహం ఒక్కటి చాలు.**



# 10. ఇసిస్ అన్‌వీల్డ్

**అ**ప్పట్లో అందరి దృష్టిని అతీంద్రియ శక్తులు ఆకర్షించాయి. విద్యావంతులలో మరీ ఆసక్తి పెరిగింది. అలాంటి వారంతా బ్లవట్స్కీ చుట్టూ చేరసాగారు. అలా వచ్చిన వారిలో కార్నెల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ హిరం కోర్సన్ ఒకరు. అతని ఇంట్లోనే 1875లో బ్లవట్స్కీ కొన్ని వారాల పాటు అతిథిగా ఉండి 'ఇసిస్' రచన ప్రారంభించింది.

కోర్సన్ కూతురు పదహారు సంవత్సరాల వయస్సులో చనిపోయింది. అతనికి ఆ అమ్మాయి అంటే ప్రాణం. చనిపోయిన వారి ఆత్మల్ని పిలిచి పలకరించడం మాడంకి ఇష్టం ఉండదు. ప్రశాంతంగా పై లోకాలలో ఉన్న ఆత్మల్ని పిలిచి ఇబ్బంది పెట్టకూడదని ఆమె భావన. ప్రొఫెసర్ ఎలాగైనా బ్లవట్స్కీని ప్రసన్నం చేసుకుని కూతురి ఆత్మతో సంభాషించాలనుకున్నాడు. అందుకే ఇసిస్ రచన విషయంలో ఆసక్తి చూపి సహకరించసాగాడు.

ఆమె రాసే కొటేషన్లు లైబ్రరీలో కూర్చుని ఓపిగ్గా ఆయా పుస్తకాలు వెదికి సరిచూచి పెట్టేవాడు.

"మాడం! మీకు ఆ విషయాలు ఎలా తెలుస్తాయి? ఏ పుస్తకం చదవరు గదా! అన్ని పుస్తకాల కొటేషన్సు ఎలా యిస్తారు? ఎట్లా సేకరిస్తున్నారు?" అడిగాడు.

మాడం సమాధానం. "అవి అన్నీ పైలోకాలలో ఎక్కడో ఉండే ఉంటాయి. నా కళ్లకు కనిపిస్తాయి, రాస్తాను."

★ ★ ★

బ్లవట్స్కీకి ఇష్టమైన వ్యక్తుల్లో ఆల్కాట్ తర్వాత జడ్జి ...

**విలియం జడ్జి మాడంతో తన మొదటి పరిచయం గురించి అంటాడు :**

"మా పరిచయం 1875లో. అప్పుడు మాడం న్యూయార్క్ సిటీలో ఇర్వింగ్‌ప్లేస్‌లో ఉండేది. తను ఉన్న పోర్షనులో చాలా గదులుండేవి. నేను మొదటిసారి వెళ్లిన సమయంలో ఆమె చుట్టూ చాలా మంది అభిమానులున్నారు. రకరకాల భాషల వారు. ఎవరు ఏ భాషలో ప్రశ్నిస్తే ఆభాషలోనే సమాధానం చెబుతోంది. ఆమెకు రష్యన్ భాష అనర్గళంగా వచ్చును. రష్యన్‌లో ప్రసంగిస్తూ మధ్యమధ్య అడిగే వారికి సమాధానాలు చెబుతూ మరలా వెళ్లి రష్యన్ ప్రసంగం ఆపిన చోట  మొదలు పెట్టేది. గొప్ప జ్ఞాపక శక్తి ఆమెది. ఏ మాత్రం తడబడేది కాదు.

మొదటి రోజునే నా మనసులోని అనేక సందేహాలకు సమాధానాలు లభించాయి. నా వ్యక్తిగత సమస్యలకు పరిష్కారం లభించింది. ప్రశ్నించకుండానే ఆ ప్రస్థావన తీసుకు రావడం, పరిష్కారం చూపించడం గొప్ప విశేషం. నా చరిత్ర, నా కుటుంబ చరిత్ర చదివినట్లు చెప్పింది. తర్వాత తరచుగా మాడంని కలిసేవాణ్ని. మనుషులంత స్వేచ్ఛగా ముందు గదుల్లో ఆత్మలు, స్పిరిట్స్ తిరుగుతుండేవి. 'వద్దు వెళ్లిపోండి' అని చెప్పినా అవి కదిలిపోయేవి కావు. ఆమెకు అవి రక్షణగా ఉండేవి.

★ ★ ★

ఒకనాటి సాయంత్రం మాడంను కలవడానికి వెళ్లాను. ఆమె బిజీగా రాసుకుంటున్నారు. ఆరడుగుల దూరంలో మిత్రుడు ఆల్కాట్ యిచ్చిన పుస్తకం చదువుకుంటున్నాను – మాడంను డిస్టర్బ్ చేయడం యిష్టం లేదు. పుస్తకం పేరు చూచాను కానీ మరచిపోయాను. మొదటి పేజీ చదువుతుండగా గాలిలో గంటల శబ్దం వినిపించింది. ఏదో ఆత్మ వచ్చిందన్న భయంతో తల ఎత్తాను. మాడం నన్నే గమనిస్తూ ఉంది.

'ఏమిటా పుస్తకం?' అడిగింది మాడం.

పేరు మరచిపోయాను కదా! అట్ట తిప్పి చూచాను. కొత్త పుస్తకం అది. దానిపైన ఇంతకు ముందు లేని ఏడు వాక్యాలు రాసి ఉన్నాయి. అంటే ఆమె తన మనస్సులో అనుకున్న మాటలు నా పుస్తకంలోకి ఎక్కించింది. అలా భావాల్ని ట్రాన్స్‌మిట్ చేయడం ఆమెకు మాత్రమే అబ్బిన విద్య. ఒక్కసారిగా గదిలో సుగంధం వ్యాపించింది. ఆమె ఉన్నచోట ఎప్పుడు అగరువత్తులు కాలుతున్న వాసన వస్తుంది.

ఆ గదిలో ఎవరూ వెలిగించరు. ఒకసారి నా హాండ్ కర్చీఫ్ తీసుకుని ఒక నిమిషం తర్వాత యిచ్చి వేసింది. హాండ్ కర్చీఫ్‌కు నాకిష్టమైన సువాసన వచ్చింది. మరొకసారి అలా చేయి చాచగానే టిఫిన్, ఫలహారాల ప్లేటు చేతిలోకి వచ్చింది. ఇలాంటి అద్భుతాలు మాడం ఎన్నో చేస్తుండేది రోజూ.

★ ★ ★

ప్రొఫెసర్ హిరం కోర్సన్ అతిథిగా ఉంటూ 'ఇసిస్' రచన మొదలెట్టింది. రోజూ కనీసంగా ఫుల్ స్కేప్ సైజు ఇరవై పేజీలు రాస్తుండేది. ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయే వరకు కూర్చున్న చోటునుండి కదిలేది కాదు. రాస్తున్నంత సేపు చేతిలో సిగరెట్ కాలుతుండేది. రోజుకు 200 సిగరెట్లు తగలెట్టేది. ఒకసారి రాస్తూ మధ్యలో "ఓల్డ్ టెస్ట్‌మెంటులో ఒక పదాన్ని గ్రీసులో ఏమంటారని" అడిగింది ప్రొఫెసర్‌ని. అతనికి గుర్తు రాలేదు.

"ప్రొఫెసర్ నువ్వు స్కూల్ బాయ్‌వి" అని నవ్వి రాసుకు పోయింది. ఆమె రాసిన 'పదం' కరెక్టేనని, తర్వాత ప్రొఫెసర్ లైబ్రెరీకి వెళ్లివచ్చి నిర్ధారించాడు. అమెరికన్ లైబ్రరీలో దొరకని పుస్తకాల్లోంచి కొటేషన్స్ యిచ్చేది. నిజానికి అవి ఆమె చదివిన పుస్తకాలు కావు. ఎవరో డిక్టేట్ చేస్తున్నట్లు రాసుకుపోయేది.

అప్పటికే ఆల్కాట్ పుస్తకం "People from Another World" వెలువడింది. ఆ పుస్తకానికి మంచి పేరు వచ్చింది. డిమాండ్ పెరిగింది. ఆ పుస్తకం వల్లనే ఆమెరికా రాష్ట్రాలలో అతీంద్రియ శక్తులపై ఆసక్తి విపరీతంగా పెరిగింది. ఆ పుస్తకం యిచ్చిన ప్రోత్సాహం 'ఇసిస్' రచనకు పురికొల్పింది. ఆఫ్రికాలో మంత్రగత్తెల వలె మాడం మెడలో ఒక పూసల దండ వేసుకునేది. దాని శక్తి ఏమిటో ఎవరికి తెలుసు? ఆమె ఆఫ్రికా ఆటవికులతో కలిసి, అనేక 'గుహ్య' విద్యలు నేర్చింది. వాటన్నింటి సమాహారమే 'ఇసిస్ అన్‌వీల్డ్.'

బ్లవట్‌స్కీ తన ఆశలను, ఆశయాలను, కలల్ని కలబోసి అచ్చొత్తించిన తొలి పుస్తకం **'ఇసిస్ అన్వీల్డ్'**. పత్రికా రచయితగా ఆమె ప్రసిద్ధురాలు. కాని గ్రంథ రచనకు అది మొదటి అనుభవం. 'ఇసిస్ అన్వీల్డ్' విపుల వ్యాఖ్యానంగా, ముగింపుగా 'సీక్రెట్ డాక్ట్రిన్' రాసింది. ఇది ఆమె చివరి పుస్తకం. ఆ రెండు గ్రంధాల మధ్య వారధి థియోసాఫికల్ సొసైటీ. ప్రాచీన విజ్ఞానం యావత్తు మృగ్యమై పోతోందన్న ఆవేదన, దానిని పునరుద్ధరించాలన్న తపన. సనాతన ధర్మం ఏమైంది? ఉంది. నిక్షేపంగా ఉంది. అయితే నిక్షిప్తంగా ఉంది. పరమ గురువుల అధీనంలో సురక్షితంగా ఉంది. ఈథర్ శరీరాలతో హిమాలయాల్లో ఉండే మహాత్ముల్ని ప్రసన్నం చేసుకోగలిగితే మనమూ మాస్టర్ల లెవెల్‌కి ఎదగవచ్చు.

ప్రపంచంలోని అన్ని దేశాల సద్గురువులు భౌతిక శరీరాలు వదలిన తర్వాత అమృతులై దివ్య, తేజో రూపాలలో ఉంటారు. మన మనస్సులపై ఉన్న 'మాయ' తెర తొలిగితే తప్ప వారి దర్శనం కాదు. వారితో 'ఆత్మ' సంబంధం ఏర్పడదు. మనల్ని తమంతటి వారిని చేయాలన్న వారి ఆకాంక్షను మనమే అర్థం చేసుకోము. అందుకు సిద్ధం కాము.

మనిషి ప్రాపంచిక సుఖాలు, భౌతిక అవసరాలకు ఇచ్చినంత ప్రాముఖ్యం ఆధ్యాత్మ విషయాలకు ఇవ్వడు. మనకు తెలియని ఆధ్యాత్మిక శక్తులు ఉన్నాయని తెలుసుకోవాలి కదా! లోకం తనను విశ్వసించదని, విమర్శిస్తుందని ఆమెకు తెలుసు. తెలిసే రంగంలోకి దిగింది. మనిషి అంత సులభంగా మారడు. మారదలచినా 'మతం' మారనీయదు. మతాన్ని ప్రక్కలకు తోసి ముందుకు పోతే తప్ప మనిషికి గతి, సుగతి ఉండవు. తనేమిటో తెలుసుకోడానికైనా ఆధ్యాత్మిక శక్తులు అవసరం. ఆ శక్తులు సంపాదించడానికి మార్గం చూపగలవారు గురువులు. వారే మార్గదర్శకులు. ఆ పని చేయడానికైనా గురువులకు మాస్టర్ల అనుమతి, అనుగ్రహం ఉండాలి. ఆ కోణంలో పరిశీలిస్తే 'ఇసీస్ అన్వీల్డ్' ఒక విప్లవ శంఖం పూరించినట్లు, 'సీక్రెట్ డాక్ట్రిన్' విజయ కేతనం ఎగుర వేసినట్లు.

"Isis Unveiled" అంటే – భృక్తంగా ఉన్న దివ్య జ్ఞానాల్ని ఆవిష్కరించడం, అంటే 'భృక్తరహితం' చేయడమే. 'ఇసిస్'లో రాయదలచిన అంశాలు రెండు సంవత్సరాల ముందునుండే పత్రికల్లో వ్యాసాలుగా రాసింది. అప్పుడే పెద్ద దుమారం రేగింది. జనంలో సంచలనం కలిగించింది. ఆమె సిద్ధాంతం కొత్తది. థియోసఫీ అంటేనే వైజ్ఞానిక పరిశోధన, శాస్త్రీయ దృక్పథం, ఒక నూతన అవగాహన అని ముందుగానే 'ఫీలర్స్' యిచ్చి సిద్ధం చేసింది.

'మతం' చట్రంలో థియోసఫీ ఇమడదు. ఆకల్టిజం ఆత్మీయం. మతం పరిమితం. థియోసఫి అంటే దివ్యజ్ఞానం అపరిమితం, సనాతనం 'Finite - Infinite' ఆకల్టిజంలో అవకాశం ఎక్కువ. అది యోగభూమిక. అది అనంత శూన్య సాగరం. పునర్జన్మ సిద్ధాంతానికి బ్లవట్స్కీ కొత్త భాష్యం చెప్పింది.

## దివ్యజ్ఞానం

పురాతనకాలం నుండి మనకు జ్ఞాన నిధు లున్నాయి. అవి మహాత్ముల అధీనంలో ఉన్నాయి. ఆ నిధి నిక్షేపాల మాలిగలు తెరిచే సూత్రాలు (Keys) మాస్టర్ల వద్ద ఉన్నాయి. ఆ తలుపులు తెరిస్తే తప్ప నిధులు దొరకవు. కంట పడవు – చేతికి చిక్కవు. అవి కంటికి కనిపించని కమనీయ నిధులు. మనసెరిగి

మసలుకోవాలి. ఆత్మతో గాలం వేసి పెట్టుకోవాలి. అన్నింటినీ మించి అర్హత లుండాలి.

థియోసాఫికల్ సొసైటీ నెలకొల్పడంతో బాటు **'ఇసిస్'** రచనకు ఉపక్రమించింది బ్లవట్స్కీ. రెండు సంవత్సరాల తర్వాత 1877లో ఇసిస్ అచ్చయింది. తర్వాత చాలాకాలం వరకు 'థియోసఫీ'కి ఏకైక ప్రామాణిక గ్రంథం అదే. ఇసిస్ అన్వీల్డ్ అప్పటికి సమగ్రం కాకపోవచ్చు. సిద్ధాంత పరంగా ముఖ్యమైన గ్రంథమే "A Master key to the Mysteries of Ancient and Modern Science on Theology" గా పేరు సంపాదించుకుంది. ఆకల్ట్ పరిశోధనలకు ఆలంబన అయింది. ఇసిస్‌లో పూర్తిగా చెప్పలేకపోయిన విషయాలు పదకొండు సంవత్సరాల తర్వాత 'సీక్రెట్ డాక్ట్రిన్'లో విపులంగా వివరించడమైంది. అది మాడం బ్లవట్స్కీ "Magnum Opus" – అద్వితీయ రచన.

**మాస్టర్ K.H. ఇచ్చిన కితాబు.**

*"ఇసిస్ అన్‌వీల్డ్‌లో అసలు విషయాలన్నీ గుప్తంగా, భృక్తంగానే ఉన్నాయి. బ్లవట్స్కీ వాటిని బహిరంగ పరచలేదు. కాదంటే పరిశోధనలకు వాకిళ్లు తెరిచింది. జిజ్ఞాసుల్ని తట్టి లేపింది. ఎవరికి వారుగా పరిశోధించాలి. తాను యిచ్చిన 'కొటేషన్స్'లో రహస్యాలు వెతకాలి."*

*"ఆకల్ట్ విజ్ఞానం అంతా ఒక్కచోట రాశి పోసి ఉండదు. అసలు అన్ని విషయాలు వివరించడం సాధ్యం కాదు. చాలా విషయాలు నోటితో చెప్పకూడదు. అవి ఎప్పటికీ రహస్యాలే. అవాచ్యాలే. కేవలం ఎవరికి వారుగా అనుభూతించి గ్రహించవలసి ఉంటుంది. చెప్పడానికి వీలైన పక్షంలో మాస్టర్లు ఆపని ఎప్పుడో చేసి ఉండేవారు. స్కూలులో పాఠాలు చెప్పినట్లు గుప్తజ్ఞానం పాఠాలు చెప్పరు. ఆ రహస్యాలు మాస్టర్లు మూట కట్టుకుని దాచుకున్నారనుకుంటారు. అది భ్రమ. అదే అజ్ఞానం. మేమేం చేసుకుంటాం. అది మీ కోసమే గదా! యోగ్యులైన వారికి, అర్హత కలవారికి తప్పకుండా అందచేస్తుంటాం."*

ప్రజ్ఞతో అందుకోవలసిన విషయాలు పాఠాలుగా చెప్పరు, చెప్పకూడదు. ఆ తేజస్సు హృదయంలో ఉద్బుద్ధం కావాలి. హృదయం వెలుగుతో నిండాలి. ఆ కాంతిచ్ఛటలు కళ్లలో మెరవాలి. ప్రజ్ఞ లేనివారికి అందించి ఏం ప్రయోజనం! అప్పట్లో బ్లవట్స్కీ ప్రసంగాలు విన్నవారికి శరీరం, మనస్సు తప్ప ఆత్మ గురించి తెలియదు. అవగాహన అసలు లేదు. ఆత్మ ఏమిటి? అదెక్కడ ఉంటుంది? అని

సంశయం కలిగేది. ఆత్మ శాశ్వతత్వం వారి వివేకం పరిధిలో లేనిది. పునర్జన్మల గురించి ఎంత చెప్పినా వారి బుర్రలకు అందేది కాదు. అప్పట్లో బ్లవట్స్కీ పూర్తిగా విశ్లేషించ లేకపోయింది. అహం, ఆత్మల భేదం తెలియాలి. ఆత్మ, పరమాత్మ, ప్రత్యగాత్మల వివరణ యివ్వడం ఆమెకు కష్టమైంది.

బుద్ధుని 'నిర్వాణం' గురించి, 'నిర్వాణ పథం' గురించి చెప్పడం ఆమె వల్ల కాలేదు. 'నిర్వాణం' అనే మాటకు తాత్వికులు రకరకాల నిర్వచనాలు చెప్పారు. 'Soul, Spirit, Ego' అనే మాటల మీద నిలబడితే గానీ వివరణ ఇవ్వడం సాధ్య పడదు. Physical Immortality అంటేనే తెలియనప్పుడు Spiritual Immortality ని ఎలా వివరించాలి? రెండూ ఒకటి కాదు. 'Ego' అహం కాదు, అహానికి ఒక కొమ్మ. మనిషితో నశించేది **ఈగో** మాత్రమే. మూల కాండమైన 'ఆత్మ' అలాగే ఉంటుంది. అంచేత 'ఆత్మ' నశించదు. చెట్టు నరికినా వేళ్లు భూమిలో ఉంటాయి. వేరులోంచి మళ్లీ చెట్టు తయారవుతుంది.

బుద్ధుడు చెప్పిన 'నిర్వాణం' ఫిలాసఫర్స్ 'Annihilation' అన్నారు. ప్రమిదలోని దీపం కొడిగట్టి ఆరిపోవడంతో పోల్చారు. దీపం వెలుతురు ఏమైనట్లు? ప్రమిద, చమురు, వత్తి మూడూ అక్కడే ఉన్నాయి. లేనిది వెలుగు. ఆత్మకు మూడు స్థాయీ భేదాలున్నాయి. మనిషిలో ఉన్నంతకాలం 'అహం'గా పెచ్చరిల్లిపోతుంది. ఆస్ట్రల్‌లో స్పిరిట్‌గా ఉంటుంది. ఊర్ధ్వలోకాలలో ఆత్మగా (సోల్) మారుతుంది. మొదటి రెండు స్థాయిలు ఉపాధులు. అహం పూర్తిగా నశిస్తుంది. స్పిరిట్‌గా ఉన్నప్పుడు సగం నశిస్తుంది. సగం నశించదు. 'ఆత్మ'గా మారినపుడు అసలు నశించదు. అది Immortality. ఇమ్మోర్టల్ స్థాయిని చేరిన ఆత్మ తిరిగి జన్మకు రాదు. స్పిరిట్‌గా రోదసిలో తిరుగుతున్నంత కాలం తిరిగి జన్మకు వచ్చే అవకాశం ఉంటుంది. అవసరమూ ఉంటుంది. మరో జన్మలో రూపం మారుతుంది, గుణం మారుతుంది. అది Trans-migration జరిగే వరకు అరూపంగా ఉంటుంది. భావ శరీరంగా కదలాడుతుంది. మూడవ భూమిక చేరినఆత్మ పునర్జన్మకు రానవసరం లేని కారణంగా, నశింపు లేని కారణంగా, శాశ్వతంగా ఉండి పోతుంది. అది అసలైన Physical Immortality. జనన మరణ రహిత స్థితి. పాప పుణ్యాలు అంటని స్థితి అది. యోగంతో, తపస్సుతో సిద్ధి పొందినవారంతా ఆ స్థితికి చేరి పరమ గురువులుగా (మాస్టర్సు) ఉంటారు. పరమాత్మలో లీనం కారు.

వీటిని గుహ్యం అంటారు. అంటే పరమ రహస్యాలు. వాటిని మాస్టర్లు

వివరించరు. బయట పెట్టరు. మనమే జ్ఞానంతో తెలుసుకోవాలి. పూర్తిగా జ్ఞానులైతే తప్ప వాటి లోతులు అందవు. 'ఇసీస్'లో తెలియక చేసిన తప్పుల వల్ల, అంటే బయట పెట్టకూడని రహస్యాలు బయట పెట్టడంవల్ల, బ్లవట్స్కీ చాలా సంవత్సరాలు బాధలుపడవలసి వచ్చింది. ఒక విధంగా చెప్పాలంటే మాస్టర్ల అనుగ్రహానికి కొంత దూరం కావలసి వచ్చింది. పునర్జన్మల విషయంలో చాలా ప్రతికూల విమర్శలు ఎదుర్కోవలసి వచ్చింది.

పూర్వజన్మ అన్నది ఖచ్చితంగా మానవ జన్మ అని చెప్పడానికి లేదు. పునర్జన్మ ఖచ్చితంగా మానవజన్మ అవుతుందని చెప్పలేం. మరో జన్మ సిద్ధాంతం నమ్మినా అది జంతువుగా పుట్టడాన్ని ఎవరూ సహించరు. పూర్వజన్మలో ఒక కుక్క, నక్క అంటే ఎవరూ సంబరపడిపోరు. దానికి బ్లవట్స్కీ సరైన వివరణ ఇవ్వలేక పోయింది. పరిణామంలో ఎంతో ముందుకు వచ్చి మనిషిజన్మ ఎత్తిన 'ఆత్మ' వెనక్కిపోవడం, మళ్లీ జంతు, పక్షి జన్మ లెత్తడం జరగదు. అది పరిణామ సిద్ధాంతాలకి వ్యతిరేకం. యోగం వల్ల, సత్ప్రవర్తన వల్ల మళ్లీ మానవజన్మ ఇంకా మంచిది లభిస్తుంది. జంతు జన్మ రాదు. బౌద్ధాన్ని హైందవాన్ని కలిపి ముడి వేయడం సాధ్యపడలేదు. థియోసఫీ ఆ విషయంలో లోతుగా పరిశోధించ లేదు.

అప్పటికి ఇతర గోళాలపై జీవం ఉన్నదీ లేనిదీ స్పష్టంగా తెలియదు. మనలాంటి మనుషులే ఉంటారనడం ఒక ఊహ, ఇప్పటికీ అది ఊహే. నిరూపణ జరగదు. భూగోళ వాతావరణం మనుషుల జీవానికి పరిమితం. అమెరికాలో బ్లవట్స్కీకి సహాయపడిన మేధావులు ఎవరూ పూర్ణజ్ఞానులు కారు. వారు చేసిన తప్పులు బ్లవట్స్కీ కాతాలో వచ్చి చేరాయి. ఇసిస్‌లో తప్పులు సరిచేసే పనిలో ఆల్కాట్ మరికొన్ని తప్పులు జోడించాడు.

★ ★ ★

బ్లవట్స్కీకి మనోభూమికనుండి (టెలిపథిక్‌గా) మాస్టర్ మోరియ, మహాత్మ కుత్‌హోమి సమాచారం అందిస్తుంటారని, కొందరు భారతీయ యోగులు డిక్టేషన్ ఇస్తుంటారని ఆల్కాట్, జడ్జిల అనుమానం. ఏమైనా 1875లో ప్రారంభమైన థియోసాఫికల్ సొసైటీ నెమ్మదిగా ప్రాచుర్యం పొంది కార్యకలాపాలు విస్తరించ సాగాయి. మీటింగులు, ఉపన్యాసాలు జోరందుకున్నాయి. మూడు సంవత్సరాల వ్యవధిలో రెండు వేల మంది సభ్యత్వం నమోదు జరిగింది. అయితే బ్లవట్స్కీ మీటింగుల్లో అతీంద్రియ శక్తుల ప్రదర్శనలకు 'డుమ్మా' కొట్టింది. థియోసఫీ ప్రచారానికి అవి ఆకర్షణలైనా సిద్ధాంత ప్రాభవానికి అవసరం అనిపించలేదు.

పైలోకాల నుండి అందే సమాచారం ఏదీ నిరూపణకు నిలవదు. మరణం తర్వాత జరిగే విషయాలు ఎవరెంత కమ్మగా చెప్పినా నమ్మకం కుదరదు. నిరూపణ చేయలేం. ఇక్కడ సిద్ధాంతం పట్ల విశ్వాసం ఏర్పడాలి. అందుకు ఉత్త వివేకం చాలదు. జ్ఞానం అలవడాలి. అది అతీంద్రియ జ్ఞానం కావాలి. అతీంద్రియ జ్ఞానం పొందడానికి యోగం ఒక్కటే వాకిలి, తపన మాత్రం చాలదు.

★ ★ ★

**1875లో బ్లవట్స్కీ తన సోదరికి రాసిన లేఖలో తన మనస్సులోని మాటను స్పష్టం చేసింది :**

*"సియాన్సీల్లో ప్రేతాత్మల్ని పిలవడం, వాటితో సంభాషించడం వల్ల మనిషికి చాలా ప్రమాదం అనిపిస్తోంది. మన లోకానికి, పై లోకాలకి మధ్యన ఉన్న తెర చాలా పలచన. అసలు తెరే లేదంటారు కొందరు. గుడ్డివాళ్లకు 'నల్లని తెర' ఉన్నట్లు అనిపిస్తుంది, ఇదీ అంతే. జ్ఞానదృష్టితో చూచినపుడు తెర ఉండదు. మన ఇంద్రియ జ్ఞానంతో అతీంద్రియ లోకాలను అంచనా వేయడం, విశ్లేషించడం అవివేకం. మనం ఇక్కడ కన్నది, విన్నది, అనుభూతించింది అక్కడ వాస్తవం కాదు. మన అంచనాలు సత్యాన్ని దూరం చేస్తుంటాయి. సత్యాన్ని ఊహలతో కొలవకూడదు. మనిషికి ప్రకృతి ప్రసాదించిన పంచేంద్రియాలే పరా ప్రకృతిని అర్థం చేసుకోవడంలో అడ్డు పడతాయి. ఇంద్రియాల పరిధుల్ని దాటిపోతే తప్ప* ***ఇంద్రియాతీతం*** *అంటే ఏమిటో తెలియదు. అది* ***అతీంద్రియ ప్రజ్ఞ****. మన వ్యక్తిత్వానికి అక్కడ విలువ ఉండదు చనిపోయిన వారి ఆత్మలు బ్రతికున్న వారి చుట్టు ప్రదక్షిణలు చేస్తూ బ్రతుకును దుర్భరం చేస్తాయి. బ్రతికి ఉన్నా, జీవితాలు మనవి మృత ప్రాయాలే.*

★ ★ ★

***మహాత్మా కుత్‌హోమీ వివరణ :***

*"ఆధ్యాత్మికత్వం అంటే అచ్చమైన ఆత్మజ్ఞానం, దివ్యజ్ఞానం. దయ్యాలతో సయ్యాటలు, ఆత్మలతో పలకరింపులు, వస్తువుల్ని సృష్టించడం లాంటివి కావు. ఆత్మల్ని, ప్రేతాత్మల్ని మనుషులపైకి రప్పించడం, పలకరించడం థియోసఫీ అనిపించుకోదు. అవి భౌతిక వాదుల్ని నమ్మించడానికి తాయిలాలు."*

★ ★ ★

"ఇసీస్ అన్వీల్డ్"తో రహస్యం బట్టబయలైందా? మత మౌఢ్యాన్ని, సైన్సు పరిమితిని ఛాలెంజి చేసింది థియోసఫీ. బ్లవట్స్కీ గట్టి నిరసనల్ని ఎదుర్కోవలసి వచ్చింది. తన ఆత్మజ్ఞానం మొక్కవోనిది. తనకు మాస్టర్ల సపోర్టు ఉంది. ఎంతటి ప్రతిఘటన నైనా ఎదుర్కొని నిలబడగలనని నమ్మింది. ఆ పని తనవల్ల కాకపోతే? హిందూ దేశంలో, టిబెట్‌లో మహా యోగులు, మహర్షులు ఉన్నారు. వారి సహాయం అర్థిస్తే సరి.

ఆత్మ జ్ఞానుల కోసం ఆమె తూర్పు దిశగా చూచి చేతులెత్తి నమస్కరించింది. అతీంద్రియ శక్తి ప్రదర్శన కారణంగా అమెరికాలో బ్లవట్స్కీ సంఘ విద్రోహి అయింది.

ఆకల్టిజం అనే మాటను బ్లవట్స్కీ కొత్తగా సృష్టించిందని నిందించారు. ఆస్ట్రల్ శరీరాల గురించి, ఆస్ట్రల్ లోకాల గురించి అమెరికన్లకు కనీస జ్ఞానం లేదు. ఇండియాలో మహర్షులకు, యోగులకు దృష్టిజ్ఞానం ఉంది. వారికి పరలోకాలు తెలుసు. ప్రాచీన కాలంలో ఆత్మజ్ఞానం ఉండేదని చెప్పినా నేటికాలం వారు నమ్మరు. మరణం తర్వాత ఆత్మ ప్రస్థానం గురించి ఎంత చెప్పినా వారి బుర్రకు ఎక్కలేదు.

★ ★ ★

మనిషి చనిపోయిన తర్వాత అతని స్మృతి మిగిలి ఉంటుంది. స్మృతి విస్మృతి అయ్యేవరకు అతని రూపం, వ్యక్తిత్వం ఛాయగా ఉంటుంది. అవి చేయగల పనులుండవు. సియాన్సీలో ఒకరి ఆత్మని ఆహ్వానించాలి. అనుకుంటాం. అది తాను మహాత్మాగాంధీ ననవచ్చు. మరొక ప్రసిద్ధ పురుషుడు, మహిళ పేరు చెప్పవచ్చు. ఆ 'ఆత్మ' వారిదేనని చెప్పలేం. అదొక ఆట. మనం నిజమే ననుకుంటాం. అడిగే వ్యక్తి మనస్సు ఆ వచ్చిన ఆత్మ పట్టేస్తుంది. వారి ఆలోచనలు ముందుగా పసికట్టి ఏవో పిచ్చి పిచ్చి సమాధానాలు చెప్పి నమ్మించి చక్కాపోతుంది.

"ఇసిస్" తొలి ముద్రణపై ఆమెకు రాయల్టీగా అయిదు వేల డాలర్లు వచ్చాయి. డిమాండ్‌ని బట్టి మరొక పుస్తకం రాసి పెట్టమని పబ్లిషర్ కోరగా "నాకు మాస్టర్ పర్మిషన్ లేదు" పొమ్మని తిరస్కరించింది. బ్లవట్స్కీ చాలా కష్టాలు పడ్డది. ఇక్కడి వారి వ్యతిరేకతవల్ల కొన్ని కష్టాలు, ఇష్టంగా చేస్తున్న పరలోక యాత్రలలో ఆస్ట్రల్ జీవులు కలిగించిన అవరోధాలు కొన్ని. అవి సామాన్యులకు అర్థం కాదు. కనిపించని కష్టాలు కదా! ఉదా : ఒక రోగం వచ్చింది. రోగం ఏమిటో డాక్టర్లకు తెలియదు. మందులు పనిచేయవు. చివరికి చావో, రేవో

తెలియని అయోమయం. ప్రాణాలకు సైతం తెగించిన వారు తప్ప బ్రతికుండగా పరలోక యాత్రలు చేయకూడదు.

## మళ్లీ పెళ్లి – మళ్లీ విడాకులు

హెలెనా బ్రహ్మచారిణి అనుకుంటారు. బ్రహ్మచారిణే కాని పెళ్లయింది. పెళ్లయిన బ్రహ్మచారిణి. పెళ్లి అయిన తర్వాతనే ఆమె పేరు చివరన బ్లవట్స్కీ వచ్చి కూర్చుంది. ఆమె ఫిలడెల్ఫియాలో ఉన్న కొద్దిరోజుల్లోనే మళ్లీ పెళ్లి మీదికి మనసు మళ్లింది. వరుడు M.C. బెటానల్లీ. మంచి ఈడూ జోడూ. అప్పటికి ఆమె వయస్సు నలభై మూడు. బాలా కుమారి కాకపోయినా కన్యగానే ఉంది. బెటానల్లీ ఆమెను ఘోరంగా ప్రేమించాడు. పిచ్చి ఆరాధనలో పడ్డాడు. 'పోనీలే పాపం'. అని పెళ్లికి ఒప్పుకుంది. అది నామమాత్రపు పెళ్లి. మొగుడంటే మగడు, పెళ్లాం అంటే ఇల్లాలు. సంసారబంధం లేనే లేదు. పెళ్లయిన తర్వాత ఇంటి పేరు మార్చుకోలేదు. అది మూన్నాళ్ల ముచ్చట. అతగాడి 'అమలిన' ప్రేమ 'మలిన' పడే ఛాన్సే దొరకలేదు. 1878లో కోర్టు ద్వారా విడిపోయి ఇద్దరూ మంచిపని చేశారు. ఆదర్శ ప్రేమికులుగా ఉండిపోయారు. 'అదేదో గతజన్మ కర్మశేషం' అని ఆల్కాట్ జోక్ చేసేవాడు.

★ ★ ★

బ్లవట్స్కీ ఒక ఉదయం పూట వాకింగ్‌కు పోతూ పోతూ రాతిపైన కాలు జారి పడి కాలు విరగ్గొట్టుకుంది. కాలువాచి ఫ్రాక్చరైంది. సెప్టిక్ అయి కోతి పుండు బ్రహ్మరాక్షసిగా మారింది. కాలు ఆంప్యూట్ చేయాలని సర్జన్ చిన్న సలహా యిచ్చాడు. ఆయన ప్రఖ్యాత సర్జన్ డా. సెట్ పాన్‌కోస్టు. కాలు తీయకపోతే చచ్చి పోతావని భయపెట్టాడు. అంతే ఆమె ఇంటికి వచ్చి, మళ్లీ ఆస్పత్రి వైపు చూడలేదు. మాస్టర్ గారి ప్రేయర్‌తో రాత్రికి రాత్రే కాలు ఫ్రాక్చర్ నయమైంది.

అక్కడ ఆచారం ప్రకారం చనిపోయిన వారిని భూస్థాపితం చేస్తారుగాని, దహనం చేయరు. బిర్యా డి.పామ్ అనే అతను ఆల్కాట్ మిత్రుడు. అతను చనిపోగా ఆల్కాట్ అతని శవాన్ని దహనం చేయించాడు. ఆరోగ్యపరంగా దహన సంస్కారం మంచిదని ఆల్కాట్ విశ్వాసం. అలా దహనం చేస్తే మృతుడి ఆత్మ–శరీర అవశేషాలు కనిపించక సరాసరి పై లోకాలకు చేరుతుందని వాదిస్తాడు. అది అమెరికాలో అప్పటికి మొదటి దహనకాండ. ఆ ఒక్క సంఘటన థియోసఫీపై నమ్మకం కలగడానికి ఎంతో దోహదం చేసింది. బిర్యా పోతూపోతూ తన సంపదనంతా ఆల్కాట్ పేర రాశాడు. ఆల్కాట్ దానిని థియోసాఫికల్ సొసైటీకి దానం చేశాడు.

★ ★ ★

ఇసీస్ అన్వీల్డ్ తెచ్చిపెట్టిన కీర్తి యిచ్చిన ఊతంతో థియోసాఫికల్ సొసైటీలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. లండన్‌లోని థియోసఫీ విద్యార్థులు లివర్ పూల్‌లో థియోసఫీ లాడ్జి ఏర్పాటు చేశారు. 1878లో లండన్‌లో థియోసాఫికల్ సొసైటీ ఏర్పడ్డది. వారి ఆశయాల లిస్టులో **'అధ్యయనం, ఆత్మ పరిశీలన'** వచ్చి కలిశాయి.

అప్పుడే థియోసాఫికల్ సొసైటీకి స్వామి దయానంద సరస్వతి నెలకొల్పిన ఆర్యసమాజ్‌కి మధ్య భావసారూప్యతలున్న కారణంగా రెంటిమధ్య ఒక అవగాహన కుదిరింది. దయానంద సరస్వతి గొప్ప సంస్కర్త, యోగి. కొంతకాలం థియోసాఫికల్ సొసైటీ పేరు "The Theosophical Society of the Arya Samaj" గా మార్చుకోవడమూ జరిగింది. అయితే స్వామి దయానంద ఆశయాల 'డొల్లతనం' గుర్తించారు థియోసఫిస్టులు. దయానంద సరస్వతికి బుద్ధుని భావజాలం నచ్చదు. ఆయనది కేవలం హిందుతత్వం. థియోసఫీలో బౌద్ధం, జొరాస్ట్రియన్ సిద్ధాంతాల పట్ల మక్కువ ఎక్కువ. అవి బూటక మతాలని దయానంద సరస్వతి విమర్శించడం వారికి నచ్చలేదు. ఇండియాలో థియోసాఫికల్ సొసైటీ ప్రారంభించగానే ఆర్యసమాజంతో తెగతెంపులు చేసుకున్నారు.

థియోసఫీ వేళ్లు ఇంగ్లండులో, అమెరికాలో బాగా లోతుగా నాటుకున్నాయి. 1875లో పరమ గురువుల ఆదేశాలు అందాయి – ప్రాచ్య దేశాలకు ప్రయాణం చేయమని. బ్లవట్‌స్కీ దృష్టిలో ప్రాచ్య దేశాలలో తలమానికం ఇండియా. ఇండియాలో సెటిల్ కావాలని ఆమె కోరిక. ఇండియాలో అయితే ఇటు దివ్యజ్ఞానం ప్రచారం చేస్తూ అటు తన యోగపరిశోధనలు సాగించవచ్చు. ఈసాటరిక్ పరిశోధనలకు ఇండియాను మించిన దేశం మరొకటి కనిపించలేదు. ఆల్కాట్ అమెరికాలో వ్యవహారాలు చక్కబెట్టుకుని మాడం వెంట బయలుదేరాడు. కష్టమో, సుఖమో థియోసఫీకి తన జీవితాన్ని సంపూర్ణంగా అంకితం చేసిన మహనీయుడు ఆల్కాట్. భవిష్యత్తు చీకటిమయం అని తెలుసు. ఆయన చీకట్లో ప్రయాణానికి సాహసించాడు. అది పరమ గురువుల ఆదేశం!

కొంతకాలం క్రితమే మాస్టర్ మోరియా రంగం సిద్ధంచేసి ఉంచాడు. ఒకనాటి అర్ధరాత్రి న్యూయార్క్‌లో ఆల్కాట్, బ్లవట్‌స్కీ గదిలోపల గడియవేసి మాట్లాడుకుంటుండగా మాస్టర్ మోరియా వారి ఎదుట ప్రత్యక్షమైనాడు. వారితో దీర్ఘంగా చర్చించాడు.

"మానవ జాతికి మహోపకారం జరగాలి, అందుకు సిద్ధం కండి" అని సందేశం. బ్లవట్‌స్కీ, ఆల్కాట్ కలిసి పనిచేయాలని ఆదేశం. ఎన్ని కష్టాలు వచ్చినా




నష్టాలు, అవమానాలు ఎదురైనా వెనుతిరగ వద్దని హెచ్చరిక.

మాస్టర్ మోరియా ఎట్లా ప్రత్యక్షమైనాడో, అలాగే అంతర్ధానమైనాడు. తను వచ్చి వెళ్లినందుకు గుర్తుగా తన "తలపాగా" అక్కడ టేబుల్ మీద వదలి పెట్టాడు. అది కల కాదు. భ్రమ అంతకన్న కాదు. మహాత్మ మోరియా రావడం నిజం. నిరూపణకు ఆయన వదలి వెళ్లిన తలపాగా నిదర్శనం.

ఆ సంఘటన తర్వాత ఆల్కాట్‌కి అమెరికాలో ఒక్క నిమిషం ఉండబుద్ధి కాలేదు. మాడం బ్లవట్‌స్కీ ప్రయాణం ఎప్పుడా అని ఎదురు చూస్తోంది.

★ ★ ★

బ్లవట్‌స్కీ అమెరికా వదలి వెళ్లిపోతున్నదనే వార్త గుప్పు మంది. ఎంత గుంభనగా దాచినా, పత్రికల వాళ్లు రానే వచ్చారు. ఆల్కాట్ ఫైల్సు రెడీ చేస్తూ, సిగార్ కాల్చుకుంటున్నాడు. రిపోర్టర్లు 'లామాసారి'కి వెళ్లి బ్లవట్‌స్కీని సూటిగా ప్రశ్నించారు. "మీరు అమెరికా వదలి వెళ్లిపోతున్నారట నిజమా?"

"అవును. నా 'లామాసరి'ని మీకే వదిలిపోతున్నాను. ఈ గదితో నా అనుబంధం చాలా గొప్పది. అయినా వదిలి పోతున్నందుకు నాకే మాత్రం విచారం లేదు. ఆనందంగా ఉంది. మీ దేశంలో స్వేచ్ఛ ఉంది. మంచిదే. కాని, అది అతిగా ఉంది. 'అతి' ప్రమాదకరం.

"అమెరికా అంటే అంత అయిష్టం అయితే రష్యా వదలి ఇక్కడి కెందుకు వచ్చారు? అమెరికన్ సిటిజన్ అయినారు గదా!"

ఆమె నవ్వింది, "మీకు లిబర్టీ ఉంది. నాకు లేదు. మా రష్యన్ కౌన్సిల్ నన్ను ఆదుకోలేదు. అమెరికా కౌన్సిల్ నాకు రక్షణ ఇస్తుందనుకున్నాను."

"మీరు ఎప్పుడు బయలుదేరతారు?"

"ఎప్పుడు వెళతానో, ఏ దేశం వెళతానో నాకే తెలియదు. బయలుదేరి ముందుగా లండన్ వెడతాను. అక్కడి నుండి బొంబాయి చేరతాను. ఇండియా నా మాతృభూమి. నా జన్మభూమి కాకపోయినా ఇండియా పుణ్యభూమి.

**"పుణ్యభూమి నాదేశం నమో నమామి"** కుర్చీలోంచి లేచింది.

రిపోర్టర్లకు ఆమెలో 'భారతీయాత్మ' ప్రభాసమానంగా కనిపించింది.



# 11. మహాన్ భారత్

**"మేరా భారత్ మహాన్!"**

**ఆ**ల్కాట్, బ్లవట్స్కీ 1879 ఫిబ్రవరి 16న బొంబాయి చేరారు. బొంబాయిలో వారికి స్వాగతం చెప్పిన మొదటి వ్యక్తి ఆల్‌ఫ్రెడ్ పెర్సీ సిన్నెట్ (ఎ.పి. సిన్నెట్) అలహాబాద్‌లోని 'పయనీర్' పత్రిక ఎడిటర్. అది బ్రిటిష్ ప్రభుత్వం వారి పత్రిక. తర్వాత థియోసాఫికల్ ఉద్యమంలో సిన్నెట్ పాత్ర గణనీయమైంది. చాలా మంది అభిమానులు బ్లవట్స్కీని చూడడానికి వచ్చారు.

బొంబాయి చేరకముందు కొన్ని నెలలు ఇంగ్లండులో ఉన్నారు. అక్కడ జరిగిన ఒక సంఘటన. డాక్టర్ బిల్లింగ్ ఆతిథ్యం.

**అప్పటి అనుభవం చార్లెస్ సి.మాసీ మాటల్లో :**

*"జనవరిలో ఒక సాయంత్రం నేను బిల్లింగ్ ఇంటికి చేరాను. లోపలకు వెళ్లే సరికి బ్లవట్స్కీ లేరక్కడ. తర్వాత లోపలనుండి వచ్చింది. నా ఓవర్ కోటు బయట హాలులో తగిలించి లోపలకు వచ్చాను. మాడం నా వేపు చూచి "ఏదైనా నీకు కావలసిన వస్తువు అడుగు, తెప్పిస్తాను" అంది. నిజానికి నాకు మంచి కార్డు బాక్సు కావాలని ఉంది. మొహ మాటంతో ఏదో చిన్న వస్తువు అడిగాను. అది వెంటనే సృష్టించి యిచ్చింది.*

*నాకు మరొకటి కావాలని అడిగాను. 'టూ లేట్' అన్నదామె. నేను బయటకు వెళ్లి నా ఓవర్ కోటు వేసుకుంటుండగా పాకెట్ బరువుగా అనిపించింది. అది నేను కోరుకున్న కార్డుబాక్స్. అది ఏనుగు దంతంతో*

*చేసిన బాక్సు. చాలా అందంగా ఉంది. అది ఇప్పటికీ నా దగ్గర ఉంది.”*

**లండన్‌లో ఉన్న రోజుల్లో కలిగిన అనుభవాలు ఆల్కాట్ మాటల్లో :**

*“కానన్ స్ట్రీట్‌లో నడిచి పోతున్నాం. ఆరోజు పొగమంచు బాగా పట్టింది. ఎదురుగా వస్తున్న మనిషిని గుర్తించడానికి లేదు. నాతో పాటు మరో ఇద్దరున్నారు. ఆ ఇద్దరు మొదటగా అతన్ని చూచారు. చూచి దయ్యాల్ని చూచినట్లు కంగారు పడ్డారు. గావుకేక పెట్టారు. ఏమిటా అని నేను అటు వేపు తిరిగాను. మా ముందు నడుస్తున్న వ్యక్తి వెనక్కి తిరిగి చూచాడు. నేను గుర్తించాను. ఆ మొహం నాకు పరిచితమే. అది మాస్టర్. ఒకసారి చూస్తే చాలు జన్మలో మరచిపోలేం. ముందు నడుస్తున్నా వెనుతిరిగి వచ్చి నన్ను చూస్తూ వెళ్లాడు.”*

సాయంత్రం తిరిగి బిల్లింగ్ ఇంటికి చేరాక **‘బ్రదర్’** వచ్చి వెళ్లినట్లు చెప్పారు. మాకు బజారులో కనిపించిన మాస్టర్ ఇక్కడకు వచ్చి బ్లవట్‌స్కీని కలవాలని బిల్లింగ్ దంపతుల్ని అడిగాడు. ఆమె గదిలోకి వెళ్లి చాలా సేపు మాట్లాడి వెళ్లి పోయాడు. ఏం మాట్లాడాడు? వారి మాటలు బిల్లింగ్ దంపతులకు వినిపించలేదు.

★ ★ ★

“ఒకసారి నేను మాడం ప్రక్కనే కూర్చుని ఉన్నాను. మాడం ఒక్కసారి ఉలిక్కిపడి కెవ్వున కేకవేసింది! “ఏమిటి మాడం?” అని అడిగాను.

“వాళ్లు నన్ను స్థిరంగా ఉండనీయడం లేదు. కవ్విస్తున్నారు ఆల్కాట్.”

“ఎవరు వాళ్లు?”

“ఇంకెవరు? మాస్టర్సు, నా వెంటపడి తరుముతున్నారు.”

“మాడం వాళ్లలో జీసస్ క్రైస్ట్ కూడా ఉన్నాడా?”

“ఉన్నట్లు లేదు.”

“పోనీ జీసస్ గురించి మీ అభిప్రాయం ఏమిటి చెప్పండి.”

“ఏమో, ఆయనెవరో నాకు తెలియదు. నాకు మహాత్ములతోనే పరిచయం.”

బ్లవట్‌స్కీకి జీసస్ క్రైస్ట్ గురించి తెలియదనుకోవాలా? గొప్ప సదభిప్రాయం లేదనుకోవాలా?

★ ★ ★

ఆల్కాట్, బ్లవట్స్కీలు వచ్చిన నౌక బొంబాయి రేవులో ఆగగానే ముగ్గురు అపరిచితులు వచ్చి స్వాగతం చెప్పారు. ఎవరు వారు? ఎవరికీ తెలిసినవారు కాదు. వాళ్లు తమని పరిచయం చేసుకోగానే ఆల్కాట్ వాళ్లకి షేక్‌హాండ్ యిచ్చాడు. వాళ్లు వచ్చిన బోటులోనే వీరిద్దరినీ రేవుకు చేర్చారు. నేలపైన కాలు మోపగానే ఆల్కాట్ నేలపైన కూర్చుని నేలకు నమస్కరించాడు. అది అతని ఆత్మపూజ.

**ఆనాటి ఆల్కాట్ కథనం :**

"మేము న్యూయార్క్ నుండి బయలు దేరకముందే హరిచంద్ అనే అభిమానికి ఉత్తరం రాశాను– మాకో ఇల్లు చూడమని, అదీ హిందువులు ఉండే ప్రాంతంలో కావాలని. అతను మమ్మల్ని గిర్‌గామ్ వెనక వీధిలో ఒక ఇంటికి తీసుకువెళ్లాడు. ఆ ఇల్లు, పరిసరాలు చాలా నచ్చాయి. చుట్టు ప్రక్కల ఇళ్లలోని ఆడవారు హిందువులు, పార్శీలు బ్లవట్స్కీని చూడడానికి వచ్చారు. ఆ మర్నాటి నుండి వచ్చేవారి సంఖ్య మరీ పెరిగింది. మాడం కీర్తికి అదొక నిదర్శనం."

"రాస్ స్కాట్ అనే ఐరిష్ వ్యక్తితో అక్కడ తొలిపరిచయం. ఆయన చాలా గొప్ప వ్యక్తి. పెద్ద మనిషి. భారతీయ తత్వశాస్త్రం బాగా చదివినవాడు. తర్వాత మా థియోసాఫికల్ సొసైటీలో చేరాడు. ఒకసారి స్కాట్ మాడం ప్రక్కన చేరి, "మాడం! ఏదైనా ఒక అద్భుతం చూపించరూ" అని అడిగాడు.

"ఏం కావాలో అడుగు?"

అతను బ్లవట్స్కీ చేతిలో కర్చీఫ్ తీసుకుని చూచాడు. దాని మీద ఒక మూలన 'హెలియానా' అని అక్షరాలు ఎంబ్రాయిడరీ చేసి ఉంది.

"అడుగు మిస్టర్ స్కాట్, ఏం మిరకల్ కావాలి?"

నేనూ, హరిచంద్ దూరంగా కూర్చుని ఉన్నాం.

"కర్చీఫ్ మీద ఈ పేరు మాయంచేసి, వేరే ఏదైన పేరు వచ్చేలా చేయండి."


"ఏ పేరు కావాలి? అదీ చెప్పు."

స్కాట్ మా వైపు చూచి "హరిచంద్ పేరు తెప్పించండి" అన్నాడు.

మాడం స్కాట్‌తో అన్నది, కర్చీఫ్ మీ చేతిలో అలాగే పట్టుకోండి.

ఒక్క నిమిషం ఆగి "ఊ ... చూడు" అన్నది.

కర్చీఫ్ పైకి హరిచంద్ పేరు వచ్చింది.




మాడం అన్నది, "మిస్టర్ స్కాట్. మీ సైన్సు దీనికి ఏం సమాధానం చెబుతుంది. ప్రపంచంలో సైంటిస్టులు అందరూ ఏకమైనా మిస్టరీ ముడి విప్పలేరు."

★ ★ ★

ఫిబ్రవరి 17న గొప్ప రిసెప్షన్ ఏర్పాటు చేశారు. 300 మంది అభిమానులు హాజరైనారు. మేం క్వార్టర్సు మారాం. కావలసిన ఫర్నిచర్, వస్తువులు కొన్నాం. మార్చి 7న కొత్త ఇంట్లో గృహప్రవేశం. రెండు సంవత్సరాలు అది మా ఇల్లు. రోజూ చర్చలు, వేదాంత గోష్ఠులు, సైన్సుపై ప్రసంగాలు, అప్పుడప్పుడు మహాత్ముల రాక, పరామర్శ.

జులై 15న నేను మహాత్మ మోరియాను భౌతికంగా చూచాను. పట్ట పగలు గుర్రం మీద వస్తూ కనిపించారు. నన్ను మాడం ముందు గదిలోకి రమ్మని సర్వెంట్ చేత కబురు పంపాడు. అప్పుడు బ్లవట్స్కీ వేరే ఇంట్లో ఉంది. నన్ను కోప్పడ్డాడు. అక్కడ ఉండి బ్లవట్స్కీని తనే పిలిచాడు. పిలవడం అంటే ఆమె ఉన్న బంగ్లా వైపు తిరిగి సంకల్పం చేయడం. ఆమె పరుగున వచ్చి వాలింది. మాస్టర్‌ని చూడగానే మోకాళ్ల మీద కూర్చుని భక్తితో నమస్కారం చేసింది. ఏ రూపంలో ఉన్నా మాడం మాస్టర్లను ఇట్టే గుర్తిస్తుంది. ఆమె ఇన్‌ట్యూషన్ అద్భుతం. మా మాటలు అందరికీ వినిపించాయో లేదో! మాస్టర్‌ని చూచింది మాత్రం నేను, బ్లవట్స్కీ, సర్వెంట్. మిగిలిన వారు ఉన్నా మాస్టర్లు వారికి కనిపించలేదు.

★ ★ ★

బ్లవట్స్కీ ఇండియా వచ్చిన సమాచారం 'పయనీర్' పత్రిక ద్వారా విశేష ప్రచారం చేసినవాడు ఎ.పి. సిన్నెట్. ఆయన దానికి సంపాదకుడు.

**ఎ.పి. సిన్నెట్ అంచనా ప్రకారం బ్లవట్స్కీ.**

"ఆమె మాట తీరు, ప్రవర్తన చాలా చిరాకు కలిగిస్తుంది. బొత్తిగా మర్యాద లేని మనిషి. ఓర్పు, సహనం అస్సలు లేవు. మాటి మాటికీ **ఆకల్ట్ బిజినెస్** అనడం చికాకు కలిగిస్తుంది. సమాజంలో కొన్ని మర్యాదలు పాటించాలి. ఆమెకు ఆపాటి జ్ఞానం లేదు. తన మెక్సికో అనుభవాలు, ఈజిప్ట కథలు చెప్పి విసుగు

పుట్టిస్తుంది. రష్యాలో తన చిన్నప్పటి గొప్పలు అతిగా చెప్పేది. రచయిత్రి గదా! గంటల తరబడి కబుర్లు చక్కగా చెప్పేది. చివరికి బౌద్ధారామాల సుత్తితో ముగిస్తుంది. యోగవిజ్ఞానం (ఈసాటరిక్) అంటే ఆమెకు ప్రాణం. తన ఆలోచనల్ని, విధానాల్ని ఎవరైనా విమర్శిస్తే సహించదు. భారతీయ ప్రమాణాల ప్రకారం 'బ్లవట్స్కీ స్నేహశీలి కాదు.' అందుకే ఆమెకు శత్రువులు, అయిష్టులు ఎక్కువ. ఎదుటివారిని అసలు గౌరవించడం తెలియదు. అహంకారంతో, పెద్ద పొగరుగా ప్రవర్తిస్తుంది. తానొక్కరే మహా మేధావి అయినట్లు పోజు."

★ ★ ★

ఇండియాలో మాడం బ్లవట్స్కీ కథ మొత్తం థియోసాఫికల్ సొసైటీ చరిత్రతో ముడిపడి ఉంది. తాను లేకపోతే T.S. లేదు. సొసైటీ లేకపోతే బ్లవట్స్కీ లేదు. అంతటి అనుబంధం. ఆమె తన సర్వశక్తులు ప్రత్యక్షంగాను పరోక్షంగానూ సొసైటీకి వెచ్చించింది. తన ఖర్చుల కోసం రష్యన్ పత్రికలకు రచనలు పంపేది. గొప్ప నిజాయితీ. థియోసాఫికల్ సొమ్ము తన కోసం ఒక్క 'కాణీ' తీసుకునేది కాదు. తన సేవలకు 'ఖరీదు' కట్టేది కాదు. అయినా అప్పట్లో థియోసాఫికల్ సొసైటీ ఆదాయం నామ మాత్రమే.

థియోసఫిస్టుల లక్ష్యం యోగవిజ్ఞానం, సనాతన ధర్మోద్ధరణ. కాలంలో దాగిన సత్యాన్ని శోధించి వెలికి తీయటం. 'థియోసఫీ' పత్రిక తర్వాత కాస్త లాభాలు తెచ్చి పెట్టింది. సొసైటీ పనులు, పత్రిక పనులు అన్నీ సభ్యులు ఉదారంగా చేసేవారు. ఇనీసియేషన్ ఫీజులతో బోలెడు డబ్బు సంపాదిస్తోందని గిట్టనివారు విమర్శించేవారు. కానీ ఆమె వాటి డబ్బు ఎర్రని ఏగాణీ ముట్టుకునేది కాదు.

★ ★ ★

ఈనాడు మన సమాజంలో పరమత సహనం, కొంతవరకైనా కులవివక్ష తగ్గడానికి కారణం ఆనాటి థియోసఫీ, బ్లవట్స్కీ కృషి అన్నది నిర్వివాదాంశం. ఆల్కాట్ సహకారమూ తక్కువైంది కాదు. అస్పృశ్యతా నివారణకు, హరిజనోద్ధరణకు మహాత్మ గాంధీ నడుంబిగించడానికి చాలా సంవత్సరాల ముందే ఆ పని విజయవంతంగా ప్రారంభించిన వారు బ్లవట్స్కీ, ఆల్కాట్ ద్వయం. ఆనాటి వారి సంకల్పం వల్లనే బడుగు వర్గాల వారు తల ఎత్తి తిరగ గలిగారు. "మనమంతా ఒక తండ్రి బిడ్డలం. మనందరిదీ ఒకే జాతి మానవజాతి. మనం సోదరులం" అన్నది బ్లవట్స్కీ ప్రసార మకుటం.

"థియోసఫిస్టు" పత్రిక ఆరంభం నుండే దళిత ఉద్ధరణ దిశగా, అస్పృశ్యతా నివారణ లక్ష్యంగా రచనలు సాగాయి. బాల్య వివాహాలు నిరోధించడం, నివారించడం ఆమె కృషి ఫలితమే. బాల వితంతువులకు సహాయం అందించారు. స్త్రీ స్వాతంత్ర్యానికి కలంపట్టి, ప్రాచీన ఆర్యావర్తంలో స్త్రీలకు సమాన హక్కులు ఉండేవని సోదాహరణంగా నిరూపించారు. స్త్రీలకు చదువులు, ఉద్యోగాలు అవసరమని ఎలుగెత్తి చాటింది. 1882లో కలకత్తాలో మహిళా థియోసాఫికల్ సొసైటీని ప్రారంభించి, మహిళల హక్కులకు కొత్త పోరాట స్ఫూర్తిని అందించింది.

*బ్లవట్స్కీ, ఆల్కాట్ బయట చేసే ప్రసంగాల్లో మతాచారాలపై విరుచుకు పడేవారు.* ***"ఏ రెండు మతాల మధ్య శత్రుత్వం అవసరం లేదు. పనిలో, ప్రతిభలో పోటీ ఉండాలి"*** *అని ఉద్బోధించేవారు. ఆ మాటలు జనం మీద మంచి ప్రభావం చూపాయి. థియోసాఫికల్ సొసైటీ లక్ష్యం ఒక్కటే.* ***"సత్యం అన్ని మతాలను మించిన మతం. సత్యాన్ని మించిన మతం లేదు."*** *క్రమంగా హిందువులు, పార్శీలు, బౌద్ధులు, ముస్లిములు, ఐరోపావారు స్నేహంగా కలిసి మెలిసి ఉండసాగారు. అంతటి మత సహనం, సౌభ్రాతృత్వం అంతకుముందు భారతదేశ చరిత్రలో కనిపించదు.* ***'అన్ని మతాల మౌలిక ధర్మం ఒక్కటే'*** *అనడం గొప్ప ఊరట. దాని ప్రభావమే 'చికాగో'లోని 'సర్వమత సమ్మేళనం'.*

ఆల్కాట్ మంచి వక్త, మాటకారి, సంస్కార వంతుడు, మనసున్నవాడు. భారతీయులంటే ఇష్టం, ప్రేమ. అందరితో కలిసి మెలిసి తిరిగే స్వభావం. ఎవరినీ చిన్నచూపు చూచేవాడు కాదు. అతని ప్రేమతత్వం, ఆదరణ అందరినీ ఆకర్షించాయి. **"మనిషి కనీసావసరాలు తీరాలి. ప్రతి వ్యక్తికీ ఆధ్యాత్మిక దృష్టి ఏర్పడాలి"** అని బోధించేవాడు. మత పిచ్చిని నిరసిస్తూ సమతా దృష్టిని కలిగించే వాడు.

బ్లవట్స్కీ పద్ధతి, పోకడ వేరు. ఆమె బాణాలు విద్యావంతుల పైన ఎక్కు పెట్టేది. వేదాలు, పురాణాలు, ఉపనిషత్తుల్ని తన అంబుల పొదిలోంచి తీసి ఎక్కు పెట్టేది. విమర్శించేవారి కళ్లను వారి వేళ్లతోనే పొడిచేది.

"ఏ మహర్షీ పూర్వకాలంలో గృహస్థాశ్రమాన్ని నిరసించలేదు. సన్యసించ లేదు. అందరూ సంసారులే." అంటూ ప్రారంభించి తన ప్రసంగాలతో ఉక్కిరి బిక్కిరి చేసేది. ఆమె ప్రస్థావించే సూక్తులు, శ్లోకాలు వింటుంటే మహా మహా పండితులకే దిమ్మ తిరిగిపోయేది. ఆమె ప్రసంగాల్లో ఏ ఒక్క మతానికి కొమ్ము

కాసేది కాదు. తాను మహర్షుల మానసపుత్రికనని, వారి వారసురాలనని, పరమ గురువుల అంతేవాసినని బల్లగుద్ది చెప్పేది.

★ ★ ★

***ఎ.పి. సిన్నెట్ అంటారు :***

*“నేను ఒక పత్రిక ఎడిటర్‌ని. జర్నలిస్టును, రచయితను. ఆ వృత్తిలోని కష్ట నిష్ఠురాలు నాకు బాగా తెలుసు. మాడం బ్లవట్స్కీతో పరిచయం తర్వాతనే నాకు అతీంద్రియ విజ్ఞానంపై ఆసక్తి కలిగింది. నా అనుభవాలు పెరిగాయి. నమ్మకం దృఢ పడ్డది. ఆమె గాలిలోంచి వస్తువుల్ని కల్పించడం వాస్తవమా? అది ఎట్లా సాధ్యం? అది అసంబద్ధం కదా? అని రచయితగా ప్రశ్నించుకున్నాను. ఎడిటర్‌గా పరిశీలించసాగాను. ఆమె మొదటిసారి మా ఇంటికి వచ్చినపుడు నా సందేహం తీర్చింది. ఒక టేబుల్ చుట్టూ జనం కూర్చుని ఉన్నారు. వారిలో ఎవరైనా ‘మీడియం’ ఉంటేనే ‘ఆత్మ’లు తమ ఉనికిని తెలియచేస్తాయి. సైన్సు వాదనలో సిద్ధాంతాలు ఆత్మల విషయంలో నిలబడవు. మాడం టేబుల్ వద్ద ఉన్నప్పుడు ఆత్మలు వచ్చేవి. ఏవో శబ్దాల ద్వారా వాటి రాక తెలుస్తుంది. మీడియం ఒంటి మీద నగలూ, ఉంగరాలు ఉండకూడదు. మొత్తం మీద బ్లవట్స్కీలో అతీంద్రియ శక్తు లున్నాయని నేను నమ్మాను.”*

## సిలోన్ ప్రయాణం

1880 మే - జులై మధ్య థియోసఫి నేత లిద్దరూ సిలోన్ వెళ్లవలసి వచ్చింది. సిలోన్‌లో బౌద్ధాన్ని పునరుద్ధరించాలన్నది ఆల్కాట్ అభిలాష. బ్లవట్స్కీకి బౌద్ధం పట్ల ప్రేమ ఉంది. ఇద్దరూ సిలోన్‌లో **‘పంచశీల’** ప్రమాణ స్వీకారం చేశారు. పంచశీల అంటే బౌద్ధంలో అయిదు ధర్మాలు : అహింస, దొంగతనం చేయక పోవడం, సెక్సుపరంగా నీతి, అబద్ధాలు చెప్పకపోవడం, మద్యం సేవించక పోవడం. ఈ అయిదు నియమాలు పాటించడమే పంచశీల.

‘బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి” ఈ త్రిశరణాలు థియోసఫిలోని మూల సూత్రాలే.

బొంబాయి నుండి కొలంబోకు నౌకలో ప్రయాణం. నౌక బయలుదేరి నప్పటినుండి బ్లవట్స్కీకి నౌక ఆఫీసరుతో దెబ్బలాట. వారిద్దరికీ ఒకరంటే ఒకరికి అయిష్టం ఏర్పడ్డది. అతను స్కాట్లండ్ వాడు. పెద్ద కళ్లు, పెద్ద తలకట్టు, ఎర్రటి

జుత్తు. అతను ముదురు క్రిస్టియన్. చర్చి అంటే క్రిస్టియానిటి అంటే చచ్చేంత ప్రేమ. క్రైస్తవం తప్ప మరొక మతాన్ని అతను అంగీకరించడు. అతను బ్లవట్స్కీని చూచి "You are a big devil" అన్నాడు. "You are queen of lies" అని తిట్టాడు.

ఆమెకు మండింది. పైపెచ్చు "ఆ దయ్యం నౌకలో ఉంటే నౌక సురక్షితంగా కొలంబో చేరదు" అని పెద్దగా వ్యాఖ్యానించాడు. ఆమె ఎదురైన ప్రతిసారి "O! Jesus Save Me" అని క్రాస్ కళ్లకద్దుకునేవాడు.

ఒకరోజు బ్లవట్స్కీ అతనికి గట్టిగా డోస్ ఇవ్వాలనుకుంది.

"సూపర్ పవర్స్ రుచి చూస్తావా మిస్టర్ కెప్టెన్" అని అడిగింది.

"నీకు చాతనైతే నాకేం కష్టం చూద్దం?" అతని సమాధానం.

"నీ పాకెట్‌లో కర్చీఫ్ ఉందా?" అడిగింది.

తీసి యిచ్చాడు. అది నీలి రంగు అంచు ఉన్న కాటన్ కర్చీఫ్. ఆమె కప్పులు, గ్లాసులు తీసి అవతల పెట్టి, కర్చీఫ్ టేబుల్‌పైన పరచింది. తదేకంగా దాని వైపు చూస్తూ కూర్చుంది. తర్వాత మోచేతులు టేబుల్‌కు ఆన్చి కర్చీఫ్ ఉండగా చుట్టి తన చేతిలో ఉంచుకుని బిగదీసుకు పోయింది. శవంలా మారిపోయింది. రెండు నిమిషాల తర్వాత కళ్లు తెరిచి అతని కిచ్చింది. అతను జేబులో పెట్టుకుని తన కేబిన్‌కు వెళ్లిపోయాడు. చూడగా కర్చీఫ్ పైన చక్కని మోనోగ్రాం వచ్చి ఉంది.

అంతే నౌక కొలంబో చేరేవరకు మాడం ముందుకు రా సాహసించలేదు.

★ ★ ★

రెండు నెలల తర్వాత ఇద్దరూ మరొకమారు సిలోన్ వెళ్లవలసి వచ్చింది. అక్కడి బౌద్ధాచార్యులు వీరిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈసారి మాడంకు తోడుగా విమ్‌బ్రిడ్జ్, దామోదర్, కె. మావ్లంకర్, మరికొందరు బయల్దేరారు. కొలంబో హార్బర్‌లో నౌక లంగరైంది. ఒక పెద్ద బోటులో మొహత్తివత్తె గుణానంద (బౌద్ధ సన్యాసి) జాన్ రాబర్టు డిసిల్వా వచ్చారు స్వాగతం చెప్పడానికి.

సిలోన్‌లో బౌద్ధులకు, క్రిస్టియన్ మిషనరీలకు దెబ్బలాట.

బ్లవట్స్కీ, ఆల్కాట్ ఇద్దరు "రమణ్య నికాయ" ఆలయంలో బౌద్ధమత స్వీకారం చేశారు. అంతకుముందే ఇద్దరూ అమెరికాలో బౌద్ధం పుచ్చుకున్నారు. ఇక్కడ ఇదొక లాంఛనం. 'పాళీ' భాష పదాలు నోరు తిరగక అవస్థ పడ్డారు. కాండీలో బుద్ధుని దంతం పైన నిర్మించిన దేవాలయం దర్శించారు.

అక్కడివారు బ్లవట్స్కీని ప్రశ్నించారు.

"మాడం! ఇది నిజంగా బుద్ధుని దంతమేనా?"

"బుద్ధునిదే కాని, బుద్ధుడు పులిగా జన్మించినప్పటిది" అన్నది.

## "అనగరిక ధర్మపాల" చెప్పిన కథ

నా చిన్నతనంలో, పది సంవత్సరాల వయస్సులో ఒక దేవాలయంలో జరిగిన చర్చకు హాజరైనాను. ఒక ప్రక్క క్రైస్తవ పెద్దలు, రెండవ వైపున బౌద్ధులు. గుణానంద న్యాయనిర్ణేత ఎవరి మతం గొప్పతనం గురించి వారు మాట్లాడారు. వేల సంఖ్యలో జనం వచ్చారు వినడానికి. మూడు రోజులపాటు వాగ్యుద్ధం జరిగింది.

ఆ చర్చ జరిగినప్పుడు పీబుల్స్ అనే అమెరికన్ కొలంబోలో ఉన్నాడు. ఆయన స్పిరిట్యుయలిస్టు. ఆ వాదోపవాదాల నోట్సు రాసుకుని వెళ్లి న్యూయార్క్‌లో బ్లవట్స్కీకి, ఆల్కాట్‌కు అందజేశాడు. వారు గుణానంద, సుమంగళకు లేఖలు రాశారు. తాము విశ్వసౌభ్రాతృత్వం కోసం థియోసాఫికల్ సొసైటీ ప్రారంభించామని సిలోన్ వచ్చి వారికి సహాయం చేస్తామని రాశారు. ఆ లేఖల్ని వారు సింహళంలోకి అనువదించి బాగా ప్రచారం చేసుకున్నారు. ఇప్పుడు వారికి ఘనస్వాగతం లభించడానికి అది కారణం."

వారు సిలోన్ వచ్చేనాటికి నా వయస్సు పదహారు. వారి ఆశయాలు నాకు నచ్చాయి. నేను వారితో కలిసి నడవాలని నిశ్చయించుకున్నాను.

## దామోదర్ కె. మావ్లంకర్ కథనం

"సింహళంలోని ఒక గ్రామంలో మాడం, ఆల్కాట్, నేనూ ఒకరాత్రి మకాం వేశాం. మిగిలిన సభ్యులు ముందుకు వెళ్లిపోయారు. అక్కడ థియోసాఫికల్ సొసైటీ బ్రాంచి ఒకటి పెట్టాలని మా ఆలోచన. రాత్రి ఒంటిగంట అవుతోంది. మాడం, ఆల్కాట్‌లు నిద్రపోయారు. అది చిన్న ఊరు. ట్రావెలర్స్ బంగళా చిన్నది. లోపల గదిలో ఇద్దరికే వసతి ఉంది. నేను ఆమ్‌చైర్‌లో సర్దుకోవాలి. లోపల గడియపెట్టి పడుకోబోతుండగా ఎవరో తలుపు తట్టిన చప్పుడైంది. గుమ్మం వరకు వెళ్లి తలుపు తెరిచేలోగా రెండుసార్లు తలుపు తట్టారు. చిరాకుగా తలుపు తెరిచాను. ఆశ్చర్యం! నా ఎదురుగా మాస్టర్ మోరియా.

నన్ను డ్రెస్ చేసుకుని తనవెంట రమ్మని అడిగాడు. అలాగేనని సిద్ధమై మాస్టర్ వెంట బయల్దేరాను. బంగ్లాకు వెనకనే సముద్రం. ముప్పావుగంట నడిచి

ఉంటాం. సముద్ర తీరం చేరుకున్నాం. ఇంకా ముందుకు సముద్రం మీదికి నడిచామా? ఏమో! మా చుట్టూ జలరాశి. మేము అడుగులు వేస్తున్న మేర నేల. ముందు మహాత్మా మోరియా, ఆయన వెనక నేను. మరికొంత దూరం వెళ్లాక ఒక దీవి వచ్చింది. దూరంగా ఒక భవనం, అక్కడ వెలుగు కనిపించాయి. దూరాన ఒక మనిషి, చుట్టూరా పొదలు. దీవిపైకి చేరాం. భవనం దగ్గరకు వెళ్లాం. భవనం ముందర ఒక మాస్టర్ కూర్చుని ఉన్నారు. నేను ఆయన్ని ఎక్కడో చూచిన గుర్తు. అది ఆ మాస్టర్ నివాసం అయిఉండాలి. మహాత్మా మోరియా ఆయన ప్రక్కన కూర్చుని అరగంటపైగా మాట్లాడారు. వారి ఎదురుగా నేను నిలబడే ఉన్నాను. తర్వాత నన్ను మరొక చోటుకు తీసుకువెళ్లాడు. ఆ భవనం లోపలిభాగం అద్భుతంగా ఉంది. అక్కడొక చిన్నగది. ఆత్మపైకి పోయినపుడు భౌతిక శరీరం అలాగే ఉంటుందనిపించింది. అంటే ఆత్మ లేని శరీరం. ఆత్మ వదలి వెళ్లిపోయిన శరీరం అది. చుట్టూరా సుగంధ పరిమళం. మరో అరగంట గడిచింది. మేము బయలుదేరాలి. అక్కడున్న మాస్టరు నా శిరస్సుపైన స్పృశించి ఆశీర్వదించాడు. మాస్టర్ మోరియా, నేనూ తిరిగి బయలుదేరాం. మేం గెస్టు హౌస్ గుమ్మం వరకు రాగానే మాస్టర్ క్షణంలో అంతర్ధానమైనాడు.

★ ★ ★

తర్వాత స్టీమరులో బొంబాయి బయలుదేరాం. డిన్నర్ తర్వాత నా కేబిన్‌కి వెళ్లాను పడుకుందామని. అప్రయత్నంగానే కోటు జేబులో చేయి పెట్టాను. ఏదో కాగితం తగిలింది. తీసి చూడగా అది మాడం బ్లవట్‌స్కీ పేరున రాసిన నోట్. అది నా పాకెట్‌లోకి ఎలా వచ్చింది? ఎవరు రాసి ఉంటారు? ఎర్ర సిరాతో రాసి ఉంది.

"దామోదర్, నీకే చదువు" అని వినిపించింది. చదివాను. తర్వాత పడుకున్నా నిద్ర పట్టలేదు. ఒకటే ఆలోచనలు. కేబిన్ లోపల గడియవేశాను. అయినా అడుగుల సవ్వడి. వెనుతిరిగి చూడగా మహాత్మ మోరియా ప్రత్యక్షం. ఆయన ప్రక్కన మరో ఇద్దరు శిష్యులు! ఎంత సుకృతం మాస్టర్ దివ్యదర్శనం. నాతో అరగంట సేపు చాలా విషయాలు మాట్లాడారు. అవి అన్నీ తత్త్వ రహస్యాలే.

## ఆల్కాట్ కథనం

సిలోన్ ట్రిప్ ఎంత సుఖంగా హాయిగా ఉందో, నౌకలో ప్రయాణం అంత చిరాగ్గా ఉంది. నౌక నెమ్మదిగా సాగుతోంది. మాలో చాలా మందికి జబ్బు చేసింది.

‘సీ సిక్‌నెస్’ అంటారే అది. మరొక రోజులో బొంబాయి చేరతా మనగా భయంకరమైన వర్షం. అరేబియా సముద్రం మీద రోజూ వర్షమే. డెక్ తడిసిపోయి చిరాగ్గా ఉంది. బ్లవట్‌స్కీ ఏదో రాసుకోవాలని ప్రయత్నం చేసినా కుదుపుకు, ఊపుకు కుదరలేదు. ఆగష్టు 4న మాస్టర్ మోరియా బ్లవట్‌స్కీ దగ్గరకు వచ్చారు. చాలా సేపు మాట్లాడారు. వెళ్లబోయే ముందు కబురు పెడితే నేనూ వెళ్లాను. థియోసాఫికల్ సొసైటీ నిర్వహణ గురించి ఏవేవో జాగ్రత్తలు చెప్పాడు. తర్వాత నన్ను వెళ్ల మంటే నేను వచ్చేశాను. మాడం, మాస్టరు ఇద్దరే మాట్లాడుకున్నారు ఆ తర్వాత. నేను నా కాబిన్‌కి రాగానే ఒళ్లు తెలియని నిద్ర పట్టింది.

★ ★ ★

బొంబాయి చేరగానే సిమ్లా నుండి ఎ.పి. సిన్నెట్ ఆహ్వానం సిమ్లా రమ్మని. ఆగస్టు 27న మాడం, నేను, సర్వెంట్ బబ్లూ బయలుదేరాం.

## దామోదర్ మావ్లంకర్

సిమ్లా ప్రయాణంలో, ఆపైన ఉత్తరదేశ యాత్రలో నేనూ ఉన్నాను. మాడం ప్రక్కన బాడీ గార్డుగా ఉండేవాణ్ని. ఒకరోజు ఉదయం రెండు గంటల ప్రాంతంలో నా పని ముగించుకుని వెళ్లి పడుకున్నాను. పడుకున్న రెండు మూడు నిమిషాల్లోనే మాడం గొంతు వినిపించింది. ఆమె నన్నే పేరుతో పిలుస్తోంది. లేచి గమ్మున వెళ్లాను.

“మిస్టర్ దామోదర్, ఎవరో నాకోసం వస్తున్నారు. వెళ్లిపోయి పడుకో. మళ్లీ రావద్దు.”

నేను వెనుతిరిగి గుమ్మం దాటే లోగానే ఆమె రూపం అంతర్థానమైంది. గమ్మత్తుగా ఎండలో మంచు బొమ్మలా కాస్త కాస్త కరిగిపోయింది. నాకు తల తిరిగింది. ఒక మనిషి కళ్ల ముందు మాయం కావడం ఆశ్చర్యం. మరు క్షణంలో అదేచోట మహాత్మా మోరియా రూపం సంతరించుకుంది. వెనక్కి తిరిగి చూచాను. ఏమిటీ మాయ! మాస్టర్ ప్రక్కన మరో ఇద్దరున్నారు. వాళ్లు టిబెట్ దుస్తుల్లో ఉన్నారు. వారిద్దరిలో మాస్టర్ ప్రక్కన ఒకరున్నారు. నేను నాగదికి వచ్చేసరికి ఆ రెండవ వ్యక్తి నా బెడ్ మీద కూర్చుని ఉన్నాడు. నన్ను చూడగానే “ఆగు” ఆర్డరు చేశాడు.

ఆయన నా వైపు నిశితంగా చూస్తుంటే నాలో దడ పుట్టింది. కాళ్లు వణికాయి. నోట మాట రాలేదు. కాని, నాలోంచి ‘మరొక నేను’ బయటకు వెళ్లినట్లయింది. అలా ఎంతసేపు జరిగిందో నాకు తెలియదు.

అవి హిమాలయ సానువులు. కాశ్మీరం చివర ప్రదేశం. ఆయన నన్ను ఆస్ట్రల్ శరీరంతో అక్కడకు తీసుకువెళ్లాడు. అక్కడ రెండు గుర్రాలు ఎదురెదురుగా నిలబడి సిద్ధంగా ఉన్నాయి. చుట్టూ పచ్చగడ్డి గాని, ఒక చెట్టు గాని లేవు. మనుషులున్న జాడ అసలే లేదు. ఒక వ్యక్తి మాస్టర్ కుత్‌హోమి అనుకుంటా. వచ్చి, తనవెంట రమ్మని ఆజ్ఞాపించాడు. ఒక అరమైలు వెళ్లాక (నడిచానా? గాలిలో తేలిపోయానా? ఏమో!) ఒక సొరంగమార్గం కనిపించింది. ఆ ఇరుకు బాటలో చాలా దూరం వెళ్లాక బహిరంగ ప్రదేశం కనిపించింది. అది చాలా విశాలంగా, ప్రశాంతంగా ఉంది. అక్కడ కొన్ని వేల సంవత్సరాల క్రితం నిర్మించిన పురాతన భవనం ఒకటే ఉంది. దాని ప్రవేశ ద్వారం త్రికోణాకారంలో ఉంది. దాని లోపలకు వెళ్లిచూస్తే లోపల చాలా గదులున్నాయి.

నేను మాస్టర్‌గారితో కలిసి పెద్దమందిరం లోకి వెళ్లాను. లోపల పరమాద్భుతంగా, సుందరంగా ఉంది. అలా నిలబడి చూస్తున్నాను. ఏం జరిగిందో నాకు తెలియదు. మరు నిమిషంలో నా గదిలో బెడ్‌మీద ఉన్నాను. అది నిజమా! నా భ్రమా? అలా పిచ్చిగా ఆలోచిస్తుండగా, నా ముందర ఒక కాగితం మడతపెట్టి వచ్చిపడ్డది. తీసి చూచాను. అందులో ఇలా రాసి ఉంది. “ఇది కల కాదు. నీకు ఆస్ట్రల్ శరీరంతో మాస్టర్ ఇనీసియేషన్ జరిగింది. అదీ గురు మందిరంలో.”

★ ★ ★

1880 సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో మాడం బ్లవట్‌స్కీ, కల్నల్ ఆల్కాట్ ఎ.పి.సిన్నెట్ దంపతుల ఆతిథ్యంలో ఉన్నారు. సిన్నెట్ తనకు థియోసఫిపై అభిరుచి కలగడంతో మాస్టర్ మోరియా, కుత్‌హోమిలతో సంబంధం పెట్టుకున్నాడు. ఆయన అడిగిన ప్రశ్నలకు మాస్టర్స్ యిచ్చిన సమాధానాలు "Mahatmas letters to A.P. Sinnet" ప్రచురించబడ్డాయి. Originals British Library లో నేటికీ ఉన్నాయి.

★ ★ ★

ఆది నుండి బ్లవట్‌స్కీకి మహాత్ములతో అనుబంధం ఉంది. వారి ఆదేశాల మేరకు జీవిస్తూ వస్తోంది. థియోసాఫికల్ సొసైటీ ప్రారంభించక పూర్వమే మహాత్ముల గురించి, పరమగురు సంప్రదాయం గురించి, భృక్త విద్య గురించి అనేక ప్రసంగాలు చేసింది. అదృశ్య యోగుల్ని గురించి, అతీంద్రియ శక్తుల్ని గురించి ఆమెకు ఆసక్తి. వారిని ‘రొసిక్రూషియన్ల’ని, దేవదూతలని, మహాత్ములని, మాస్టర్సు అని రకరకాల పేర్లతో ప్రస్తావిస్తుండేది.

**ఒక లేఖలో ఆమె అంటారు.**

*"ఆల్కాట్‌తో చాలాసార్లు చెప్పాను. నాకు చాలా మంది మహాత్ములు తెలుసునని. అది ఒక మిత్రమండలి. అందరూ సమానులే. అందరూ సోదరులే. యోగులు ఎక్కడ ఉన్నా యోగులే. వారంతా ఒక నిర్జన ప్రదేశంలో, రహస్యంగా తపస్సు చేస్తుంటారు. తమ ఆచూకీ ఎవరికీ తెలియనివ్వరు. అసలు వారంతా అశరీరులు. కాంతి దేహాలలో ఉంటారు. ఎవరికీ కనిపించరు. అవసరమైనపుడు ఆస్ట్రల్ రూపం ధరిస్తారు. సకృత్తుగా భౌతిక శరీరాలు ధరిస్తుంటారు. వారికి మృత్యువంటే చనిపోవడం, శరీరాన్ని వదలి పోవడం కాదు – శూన్యంలో శూన్యంగా కలిసిపోవడం. అదే ఆత్మ పరమాత్మలో కలియడం. పది సంవత్సరాలు మనం యోగం చేస్తే తప్ప మహాత్ముల అనుగ్రహం మనకు లభించదు. సత్యాన్ని ప్రవచించడానికి మాత్రమే పరమ గురువులు నాకు అనుమతి ఇచ్చారు.*

*వారు మనకు అందనంత దూరంగా హిమాలయాల్లో నిర్జన ప్రదేశాల్లో ఉంటారు. 'తెచులామా'కు వారు తెలుసు. అందరిదీ ఒకే లక్ష్యం. అందరిదీ ఒక ధ్యేయం. వారిలో కొందరు లామా గురువులతో ఉంటారు. కాని మనకు కనిపించరు. అదృశ్యంగా చరిస్తుంటారు. వారిది మనసు భాష. వారి భావాలు మన భావాలకు అందుతుంటాయి. మామూలు లామాలకు పరమ గురువులు దర్శనం యివ్వరు – ప్రసన్నం కారు. నా గురువు మహాత్మ మోరియా. మరొక గురువు మాస్టర్ కుత్‌హోమి. ఇంకా కొందరు నాకు తెలుసు. నేను వారిని చూచాను. చాలామంది గురువులు వస్తూపోతుంటారు కాని నాకు వారి పేర్లు తెలియవు. ఈజిప్టు, సిరియా, యూరోపియన్ పరమ గురువులతోనూ నాకు పరిచయాలున్నాయి."*

★ ★ ★

బ్లవట్‌స్కీ బాల్యమిత్రుడు ప్రిన్స్ఎమిలీ పెద్దయిన తర్వాత పెద్ద ఆఫీసరైనాడు. టర్కీతో రష్యా యుద్ధం వచ్చినపుడు 'ఆ యుద్ధంలో పాల్గొనవద్దని' ఏవో స్పిరిట్స్ హెచ్చరించాయి. అతను బ్లవట్‌స్కీ సలహా కోరాడు.

ఆమె జవాబు : "మాస్టర్లు నిన్ను రక్షిస్తారు. ఫరవాలేదు" అని రాసింది.

యుద్ధంలో పాల్గొన్నా అతని సమీపంలో ఒక్క తుపాకీ పేలలేదు. అతను తుపాకీ పట్టేలోగా యుద్ధం అయ్యే పోయింది. చాలాసార్లు ఫైరింగ్ లైనుకు దగ్గరగా వెళ్లాడు. తీరా తుపాకీ ఎక్కుపెట్టే సరికి 'విరమణ' ఆర్డరు వినిపించేది.

బ్లవట్స్కీ చెప్పే మాస్టర్లు ఉన్నారని, వారే తనని రక్షించారని అతని విశ్వాసం.

అందర్నీ మాస్టర్లు రక్షిస్తే అసలు యుద్ధం అవసరమే ఉండదు గదా!

ఆరోజు రావాలి! ఆరోజు కోసం ఎదురుచూద్దాం! కాలానికి ఎదురు తిరగడం ప్రకృతి ధర్మం కాదు. మహాత్ములైనవారు ప్రకృతి ధర్మాన్ని వ్యతిరేకించరు. మంచివారికి రక్షణ కల్పిస్తుంటారు.

మహాత్ములు తమ నెలవులకు ఎవరినీ రానివ్వరు. కారణం, తమ ఏకాంతం, ప్రశాంతి భంగపడుతుందని కాదు. వచ్చినవారు ఐహికమైన కోరికలు కోరు తుంటారు. మహాత్ములకు అవి ఇష్టం ఉండని వరాలు. అందుకే వారు మనకు సమీపంగా ఉన్నా కనిపించరు. వారి స్థావరాలు అన్వేషించినా కనిపించవు.

★ ★ ★

బ్లవట్స్కీ థియోసాఫికల్ సొసైటీ ఆశయాలను స్పష్టంగా చెబుతూ వచ్చారు.

**మాస్టర్ కుత్‌హోమి హెచ్చరిక.**

"మా లక్ష్యం అవతారాలను పూజించే మరొక వర్గాన్ని తయారు చేయడం కాదు".

"ఇదొక ఆకర్షణ కాదు. ఇండియాలోని మహాయోగుల్ని మేము అక్కడ ఉండనీయం. టిబెట్ వచ్చెయ్యమని వత్తిడి చేస్తుంటాం. ఇండియాలో మహా గురువులైనవారు ఎక్కువమంది నిలవ ఉండకూడదు. వారి సంఖ్య పరిమితంగానే ఉండాలి."

మహాయోగులు, మహర్షులు చనిపోతుంటారని పాశ్చాత్యులు విమర్శిస్తారు. అది చనిపోవడం కాదు. ఐచ్ఛికంగా భౌతిక శరీరాన్ని వదలి, దివ్యశరీరాలు ఎన్నుకోవడం. మహాత్ముల ఆత్మలు అందుబాటులోనే ఉంటాయి. వారిని ఉపయో గించుకుంటున్న వారెందరు? అసలు గుర్తించేవారేరీ! మహాత్ములు తమ దివ్యజ్ఞానాన్ని అర్హులకు అందిస్తూనే ఉంటారు. చాలామంది యోగులు, మహర్షులు కాంతి శరీరాలతో హిమాలయాలకు వస్తుంటారు. దక్షిణభారతంలో ఇప్పటికీ కొందరు మహాయోగు లున్నారు. వారు సాధకులను తయారు చేస్తున్నారు. అందరూ హిమాలయాలకు రావడం లేదు.

దక్షిణ భారతదేశానికి చెందిన మహాయోగులలో నారాయణ గురు ఒకరు. న్యూయార్కులో బ్లవట్స్కీ 'ఇసిస్ అన్వీల్డ్' రాస్తున్న రోజులు. ఆయన టెలిపతీ

ద్వారా చాలా విషయాలు ఆమెకు అందించారు. ఆయనే కొన్ని మార్మిక రచనలు అందించారు. టి.ఎస్. నిర్మాతలలో **'ఒక యోగి'** అని సంతకం చేసేవారు. ఆయన ఎవరో ఎవరికీ తెలియదు. తెల్లవారే సరికి టేబుల్‌పైన రాత ప్రతులు ఉండేవి. స్వామి దయానంద గారి ఆర్యసమాజ్ నుండి టి.ఎస్. విడిపోయినపుడు స్వామి దయానందపై రచనలు చేసి యిచ్చింది ఈ గురువే నంటారు.

మాస్టర్ నారాయణ తమిళప్రాంతంలో 'తిరువళ్లం'లో ఉండేవారు. ఒకసారి థియోసఫిస్టు టి. సుబ్బారావు ఆయన్ని కలిశారు. దక్షిణ భారతదేశంలో ఇద్దరు మహాత్ములున్నారని బ్లవట్‌స్కీకి మాస్టర్ మోరియా చెప్పింది ఈ ఇద్దరిని గురించే. దక్షిణ భారతం అనేక మంది సద్గురువుల్ని నాటికీ, నేటికీ అందిస్తూనే ఉంది. కాశీలో మహాయోగిగా ప్రసిద్ధి చెందిన త్రైలింగ స్వామి తెలుగువారే. థియోసఫి వ్యాప్తికి వీరంతా పరోక్షంగా సహకరించారు.

## సభ్యత్వం

"థియోసాఫికల్ సొసైటీలో సభ్యులు కావడానికి జిజ్ఞాస, అభినివేశం చాలు. వివేకంతో వ్యాసుడంతటివాడైనా, ప్రతిభలో ప్లేటో వారసుడైనా కుదరదు. మాకు డిగ్రీలు, డబ్బు ప్రధానం కావు. అసలైన ఆధ్యాత్మిక దృష్టి ఉండాలి. ఆత్మబలానికి విచక్షణ తోడుగా నిలవాలి. మనిషి పవిత్రంగా ఉంటే చాలదు. మనసు నిర్మలం కావాలి. ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందగల లక్షణాలు గొప్పవారిలో కనిపించవు."

"నేను నీ దగ్గరకు వస్తాను. పవిత్ర హృదయంతో నన్ను నీలోకి ఆకర్షించ వలసింది నీవు. శుద్ధసంకల్పం ఉండవలసింది నాకు."

"మాగ్నట్ సూదిని ఆకర్షించినట్లు నీవు ఆధ్యాత్మికానికి అతుక్కుపోవాలి. నా మాటలు నీకు వినిపించకపోయినా నష్టం లేదు. నేను కనిపించకపోయినా నీకు పోయేది లేదు. నీలో సద్భావన ముఖ్యం. సద్భావనతో ధ్యానిస్తే నేను కనిపిస్తాను. నీవే నన్ను చూడగలవు. క్రింది లోయలో వెలిగే దీపం కొండపైనున్న వారికి మార్గం చూపిస్తుంది. నీ ప్రతి మంచి ఆలోచనా, సద్భావన ఎంతదూరాన ఉన్నా మాకు చేరుతుంది. తనలో కాంతిని దర్శించగలవాడే తథాగతుడు. అలాంటి వారు ప్రతి ఒక్కరిని స్పృశిస్తారు."

★ ★ ★

థియోసాఫికల్ నియమాలు భరించలేనివారు సొంత కుంపట్లు వెలిగించుకో సాగారు. నకిలీ మాస్టర్లు తయారైనారు. మాస్టర్లమని చెప్పి డబ్బు సంపాదించేవారు ఎక్కువైనారు. కుటిల మనస్కులు ఎప్పుడూ ఉంటారు. బుద్ధునికి, జీసస్‌కే

అటువంటి నకిలీల బాధ తప్పలేదు. అయినా టి. సుబ్బారావు, మాస్టర్ నారాయణ్ లాంటి పూర్ణ పురుషులు ఎప్పుడు ఒకరిద్దరు ఉంటారు. నకిలీ గురువుల్ని నకిలీ మాస్టర్లని ఏరివేయడం థియోసఫిస్టులకు తలకు మించినపని అయింది.

దివ్యజ్ఞానం అంటే ప్యూర్ థియోసఫి. దానికి టిబెట్ తాంత్రిక యోగం అడ్డు నిలిచింది. టిబెట్‌లోను ధ్యాన బుద్ధులు వేరు, తాంత్రిక బౌద్ధులు వేరు. రెండింటికి సమ ప్రాధాన్యత ఉంది. లామాలలో ఒక వర్గం వారు తంత్రాన్ని ఆశ్రయించి సత్వర ఫలితాలు సాధించారు. మహాయానబౌద్ధచ్ఛాయలు బ్లవట్‌స్కీ The Voice of the Silenceలో కనిపిస్తాయి.

★ ★ ★

భారతీయ తత్వశాస్త్రాన్ని పాశ్చాత్యులకు పరిచయం చేసిన మాక్స్‌ముల్లర్ కృషి తక్కువైంది కాదు. 15 సంవత్సరాల తర్వాత రంగ ప్రవేశం చేసిన బ్లవట్‌స్కీ గొప్ప సత్యాన్ని బయటపెట్టింది.

"ఈనాటి విద్యావిధానం భారతీయుల్ని ఆధ్యాత్మికతకు దూరం చేస్తోంది. భౌతికత్వంవేపు పరుగులు తీయిస్తోంది. ప్రాచీన సాహిత్యం నిజమైన ఆత్మజ్ఞానాన్ని, దివ్యజ్ఞానాన్ని అందిస్తుంది. ఇంగ్లీషు చదువుల్లో అది మృగ్యం."

ప్రొఫెసర్ మాక్స్‌ముల్లర్, బ్లవట్‌స్కీ ప్రయత్నాన్ని మెచ్చుకుంటూనే ఒక ఘాటు విమర్శ చేశాడు.

"మీరు టి.ఎస్. ద్వారా సంస్కృతం, ప్రాచీన విజ్ఞానం బోధిస్తున్నారు. మంచిదే. కాని హిందువుల మూర్ఖత్వాన్ని, అంధ విశ్వాసాలను మరింతగా పెంచుతున్నారు – అది తప్పు కదా? ప్రాచీన గ్రంథాలలో ఆధ్యాత్మికత కుప్ప తెప్పలుగా ఉందని నమ్మిస్తున్నారు. నాకు సంస్కృతం బాగా వచ్చు. మీరు చెప్పే నిగూఢతత్వం, జ్ఞానగుళికలు ఏవీ ఆ పురాణకథల్లో, పూర్వసాహిత్యంలో లేవు."

★ ★ ★

అయినా మహాత్ముల్ని బ్లవట్‌స్కీ గట్టిగా నమ్మింది. ఎన్ని విమర్శలు వచ్చినా ఆమె విశ్వాసం మొక్కపోలేదు, చెక్కు చెదరలేదు. మాస్టర్స్‌తో బ్లవట్‌స్కీకి గల చిరకాల అనుబంధం అందరికీ తెలుసు. సాధన ద్వారా యోగసిద్ధులు కలుగుతాయని ఆమె నమ్మకం. మహాత్ములు (Masters) రాజయోగంలో తారక శిఖరాల్ని చేరిన వారని, ఇండియాలో, టిబెట్‌లో తప్ప ప్రపంచంలో మరెక్కడా మాస్టర్లు ఉండే అవకాశం లేదని నమ్మింది. అదే ప్రచారం చేసింది.

అభిమానం ఉండడం వేరు, పాండిత్యం సంపాదించడం వేరు. బ్లవట్స్కీకి సంస్కృతం బొత్తిగా రాదని విమర్శిస్తారు. అలాగే భారతీయ వేద విజ్ఞానంతోను పరిచయం లేదంటారు. కానీ The Secret Doctrine చదివితే అలా అనిపించదు. అయినా ఇసీస్ అన్వీల్డ్ రాతపనిలో గాని, సీక్రెట్ డాక్ట్రిన్ రాయడంలో గాని బ్లవట్స్కీ చేతిని మాస్టర్లు ఉపయోగించుకొన్నారు. అందులో ఆమె పాండిత్యం లేనే లేదు. ఇసిస్ అన్వీల్డ్ రచనా సమయంలో న్యూయార్కులో ఇతరుల సహాయం తీసుకున్నది. Secret Doctrine రచన విషయంలో మహర్షి సుబ్బారావు సహకారం తీసుకున్నది. ఆ పుస్తకాలు తన స్వంత ప్రతిభతో రాశానని ఆమె ఎప్పుడూ చెప్పలేదు. అవి మాస్టర్స్ చెప్పి రాయించినవి. అంటే బ్లవట్స్కీ లేఖకురాలు మాత్రమే, రచన పరమ గురువులది.

## బ్లవట్స్కీ ప్రతిభకు ఒక మచ్చుతునక

డాక్టర్ జి. తిబాట్ జర్మనీ దేశస్తుడు. సంస్క ృత పండితుడు. బనారస్ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్.

ఆయన ఒకసారి బ్లవట్స్కీతో సాంఖ్య సిద్ధాంతంపై దీర్ఘచర్చ జరిపాడు. చాలా క్లిష్టమైన ప్రశ్నలు ఆమెపై సంధించాడు. ఆయన ప్రశంస.

“ఆమె మాక్స్‌ముల్లర్ కంటే, భారతీయ పండితమ్మన్యుల కంటే విలువైన సమాధానాలు చెప్పారు. ఆమె కళ్లు మూసుకోగానే, అప్రయత్నంగా సమాధానాలు వచ్చేవి.”

ప్రఖ్యాత టిబెట్ బౌద్ధ పండితుడు, లామా అయిన కాజీ దవా శాండుప్ అంటాడు : బ్లవట్స్కీ ఏం చదివిందో తెలియదు. కానీ ఉత్తమోత్తమమైన ‘లామా’ బోధనలన్నీ ఆమెకు తెలుసు. ఆమెకు బౌద్ధ సాహిత్యంతో, యోగంతో, విజ్ఞానంతో సంపూర్ణ పరిచయం ఉంది. "The Voice of the Silence" టిబెటన్ గురువుల బోధల మణిహారం.

ప్రొఫెసర్ డి.కె. సుజుకి అనే జపాన్ స్కాలర్, మహాయాన బౌద్ధంపైన అథారిటే అని చెప్పదగినవాడు అంటాడు :

The Voice of the Silence నేను మొదటిసారి ఆక్స్‌ఫర్డ్‌లో చూచాను. వెంటనే ఒక కాపీ డా. మిసెస్ సుజుకీకి పంపాను. "Here is the real Mahayana Buddhism" అని కితాబిచ్చాడు. బ్లవట్స్కీ కోరకుండానే పరమ గురువులు విశ్వవిజ్ఞానాన్ని ఆమె దోసిలికి అందించారు. ఆమె పరిపూర్ణ దివ్యజ్ఞాని.”



# 12. సిమ్‌లా! సిమ్లా!

**థి**యోసాఫికల్ సొసైటీ కార్యకలాపాలు బొంబాయి నుండి మరొక తావుకు మార్చాలని మాడం సంకల్పించారు. బొంబాయి వంటి వ్యాపార కేంద్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అనువు కాదు. ముందుగా ఉత్తరభారతంలో స్థలాన్వేషణ మొదలైంది. సిన్నెట్ సిమ్లా ఆహ్వానం అందులో తొలి అడుగు. సిమ్లా చలి ప్రదేశం కనుక విదేశీయులకు అనువుగా ఉంటుందని సిన్నెట్ భావించి వారిని ఆహ్వానించాడు. అప్పట్లో బ్రిటిష్ అధికారులు వేసవిలో సిమ్లాలో మకాం వేసేవారు. ఉత్తరాదిలో సిమ్లా, దక్షిణాదిన ఊటీ వేసవిలో శీతల కేంద్రాలు ... ఆ ఆశతోనే సిమ్లా ఆహ్వానం అందుకున్నారు.

## ఎ.పి. సిన్నెట్ రికార్డు (3 అక్టోబరు 1880)

> *"సిమ్లా పర్వతాలపైకి ఎక్స్‌కర్షన్ కోసం అనుకున్న విధంగానే సిద్ధమైనాం. మొత్తం ఆరుమందికి ఏర్పాట్లు జరిగాయి. తీరా బయలుదేరే వేళకు మరొకరు వచ్చి కలిశారు. కొండ దిగువన ఒక జలపాతం దగ్గర కొన్ని గంటలు ఆగాం. అది అడవి. బ్రేక్‌ఫాస్టుకోసం తెచ్చుకున్న బుట్టలు విప్పాం. సర్వెంట్స్ కాస్తంత దూరంగా స్టవ్ వెలిగించారు కాఫీ, టీల కోసం. మేం తెచ్చుకున్నవి ఆరు కప్పులు, ఆరు సాసర్లు. ఏడవ వ్యక్తికి ఎలాగా?*

ఒకరెవరో సరదాగా బ్లవట్‌స్కీతో అన్నారు : 'మాడం, మీరు గాలిలోంచి వస్తువుల్ని సృష్టిస్తారని అంటారు. ఏదైనా మాజిక్‌చేసి ఓ కప్పు, సాసరూ మెటీరియలైజ్ చేయండి."

"చాలా కష్టం మిస్టర్" అన్నారు ఆమె.

"మనం కోరితే మామ్ కాదనరు" మరొకరు రెచ్చగొట్టారు. బ్లవట్స్కీని ఇరుకున పెట్టారు. కాదనలేని పరిస్థితి. కాదంటే తన శక్తిపైన వారికి నమ్మకం పోతుంది. తన ప్రయోజనం దెబ్బ తింటుంది. ఒక ప్రయోజనం కోసం, లక్ష్యం కోసం కృషిచేసే వారికి ఇలాటి పరీక్షలు తప్పవేమో! మొండికేస్తే అసలుకే మోసం వస్తుంది!

వెంటనే కళ్లు మూసుకుని గురుస్మరణ చేసింది. సడెన్‌గా లేచి, పదిగజాల దూరంగా వెళ్లి నిలబడ్డది. నేను గమనిస్తూనే ఉన్నాను. ఏం చేయబోతోంది? ఏం జరగబోతోంది?

నేలపైన ఒకచోట గుర్తు పెట్టింది. తవ్వడానికి ఒక గునపం కావాలని అడిగింది. మేజర్ ఫిలిప్ హెండర్సన్ వద్ద ఒక చాకు ఉంది. అతడు ఆమె చెప్పిన చోట నేల చదును చేసి తవ్వడం మొదలుపెట్టాడు. కొంత లోతు తవ్వే సరికి ఒక కప్పు కనిపించింది. మరికొంత లోతుకు తవ్వమని ఆదేశించింది మాడం. ఈసారి ఒక సాసర్ బయటపడ్డది. అప్పటికప్పుడే హెండర్సన్ మాడం ప్రతిభకు దాసోహం అన్నాడు. వెంటనే సొసైటీలో సభ్యుడుగా చేర్చుకొమ్మని అర్థించాడు.

అప్పటికప్పుడంటే ఎలా? వచ్చింది ఎక్స్‌కర్షన్. అప్లికేషన్ ఫారాలు అవీ ఉండాలా, వద్దా? గాలానికి చిక్కిన చేపను జారిపోకుండా మాడం మరో మిరకిల్ చేయవలసి వచ్చింది.

కళ్లు మూసుకుని గురువును స్మరించింది. కళ్లు తెరిచి "డిప్లొమా వస్తోంది" అన్నది. డిప్లొమా అంటే అప్లికేషన్ ఫారం. అంతలో చుట్టచుట్టిన కాగితం ఒకటి ఎదురుగా ఉన్న చెట్టు కొమ్మకు వేలాడుతూ కనిపించింది. అది అప్లికేషన్ ఫారం.

బ్లవట్స్కీ మరీ తప్పని పరిస్థితుల్లో తప్ప అలాంటి అద్భుతాలు చేయరు. సాధారణంగా తప్పించుకుంటుంది. అలాంటి 'మిస్టిక్' పనుల వల్ల చాలా శక్తి క్షీణిస్తుంది.

ఆల్కాట్ హెండర్సన్ చేత అప్లికేషన్ పూర్తి చేయించి అడవి మధ్యలోనే ఇనీసియేషన్ తతంగం పూర్తి చేశాడు. తర్వాత అందరం కొండ దిగువకు చేరాం. అక్కడ అడవి మధ్యలో ఒక టిబెట్ ఆలయం కనిపించింది. దాని ప్రక్కన ఒక విశ్రాంతి గది ఉంది. అడవి మధ్య దేవాలయమా? అదీ టిబెట్ పద్ధతిలో? మా అందరికీ ఆశ్చర్యం. అది బ్లవట్స్కీ సంకల్పమా? పరమ గురువుల సృష్టా? లోపలకు వెళ్లాం. అక్కడ శక్తిపాతం తట్టుకోలేనంతగా జరిగింది.

"శక్తిపాతంలో తడిసిముద్దయి పొండి" అంది మాడం, తను బయటకు వెళ్లి పచ్చికపైన కూర్చుంది.

అంతలో ఎవరికో కాఫీ తాగాలని కోరిక పుట్టింది. పనివాళ్లని పిలిచి కాఫీ పెట్టమని అడిగారు.

కాఫీ చేయడానికి నీళ్లు లేవు. తెచ్చిన నీళ్ల బాటిల్స్ ఖాళీ అయ్యాయి. ఒక మైలు దూరంలో ఒక అంగడి ఉందని అక్కడ మంచి నీరు దొరకవచ్చు అన్నారు సర్వెంట్స్. అనడమే తడవుగా డబ్బాతో బయలుదేరారు. అరగంటలో తిరిగి వచ్చారు చేతులు ఊపుకుంటూ, ఖాళీ డబ్బాతో. అందరూ నీరసంగా కూర్చుండిపోయారు.

మాడం సడన్‌గా లేచి క్యారీబ్యాగులో ఉన్న కాళీ నీళ్ల బాటిల్ తీసింది. తన దుస్తుల్లో ఎవరికీ కనిపించకుండా దాచి తెచ్చింది. నవ్వుతూ నీళ్ల బాటిల్ చూపించింది.

అవసరానికి సరదాగా ఇలాంటి అతీంద్రియ శక్తుల్ని ప్రదర్శించి జనాన్ని అబ్బురపరుస్తుంటారు మాడం. బ్లవట్స్కీ సంకల్పం చేయగానే మాస్టర్ లేదా ఆయన శిష్యులు ఎవరో వచ్చి, అన్నీ అమర్చిపోతారు. ఆ వచ్చినవారు ఎవరికంటా పడరు!

సిమ్లాలో హ్యూమ్ ఇంటికి చేరుకున్నాం. "నీకేమైనా కావాలా మాడం" అని బ్లవట్స్కీ హ్యూం భార్యను అడిగింది. ఆమె తను పోగొట్టుకున్న ఏదో నగ కావాలని అడిగింది.

"ఆ నగను ఊహిస్తూ కళ్లు మూసుకోండి" అన్నది.

క్షణంలో ఒక పాకెట్ ఆమె చేతికి అందింది. అందులో మాడం హ్యూం పోగొట్టుకున్న నగ ఉంది.

**ఎ.పి. సిన్నెట్ – సిమ్లా** (అక్టోబరు 15, 1880)

ఒక రోజున నేను బ్లవట్స్కీని అడిగాను. "మాడం! మాస్టర్ గారికి ఉత్తరం రాస్తే అది వారికి చేరుతుందా? పోస్టు చేయవచ్చా? లేక మీకిస్తే మీరు అందిస్తారా?"

అది అసాధ్యమని నాకూ తెలుసు. కనిపించని వారికి మనం ఉత్తరాలు రాయడం ఎట్లా? అవి వారికి అందడం ఎలా?

"ట్రయ్ చేద్దాం లే" అన్నది మాడం.

నేను ఉత్తరం రాశాను. కనిపించని మహాత్మ పేరున రాసి బ్లవట్స్కీ చేతికి అందించాను. అదో సరదా అనిపించింది నా వరకు. జవాబు వస్తే అదొక థ్రిల్!

పైలోకంలోని మాస్టర్లతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపిన మొదటి వ్యక్తిని నేనే అవుతాను. అదీ విశేషమే.

అట్లా అడగడంలో ఒక ప్రయోజనం ఉంది. ఒక ప్రయోగం ఉంది.

"లండన్‌లో అచ్చైన ఈ రోజు వార్తా పత్రిక తెప్పించమని కోరవచ్చు" అదీ జరిగింది. దాంతో సిమ్లాలో జనాలకు థియోసాఫికల్ ఉద్యమంపై విశ్వాసం ఏర్పడ్డది.

ఆస్ట్రల్ ప్రయోగాలు ఏవీ సైన్సుకు అందవు. నిరూపించడం కుదరదు.

రెండు రోజులు గడిచాయి. నా ఉత్తరం ఏమైనట్లు? మాస్టర్ నుండి జవాబు వస్తుందన్న ఆశ నాకైతే లేదు. అంతలో బ్లవట్‌స్కీ నుండి కబురు వచ్చింది. మాస్టర్స్‌లో ఒకరు నా ఉత్తరం అందుకుని, జవాబు ఇవ్వడానికి అంగీకరించారని. మొదట అర్థిస్తే ఒకరు కాదన్నారు. మనుషులతో వ్యవహారం మంచిది కాదన్నారట కొందరు. సామాన్యుల బుద్ధులు మాస్టర్లకు నచ్చవు. అంచేతనే అరిచి గీపెట్టినా రారు. ఎవరో ఒక మాస్టర్ ఇష్టపడ్డాడట. "ఒకటి రెండు రోజుల్లో నీకు జవాబు రావచ్చు" అన్నది మాడం.

రెండవ రోజు సాయంత్రానికి నా టేబుల్‌పైన ఒక కవరు ప్రత్యక్షమైంది. అది నా ఉత్తరానికి జవాబు. ఎవరో ఒక పంజాబీ వ్యక్తి నుండి వచ్చింది. అతనికి చిన్నతనం నుండి అతీంద్రియ విద్యలు తెలుసునట. మాస్టర్ అతనిని 'మీడియం' చేసుకుని అతని ద్వారా రాయించాడు. అంటే మాస్టర్లకు 'మీడియం'లు అవసరం. డైరెక్టుగా ఎవరితోనూ కాంటాక్టు పెట్టుకోరా? ఎందుకు పెట్టుకోరు! బ్లవట్‌స్కీకి వచ్చి కనిపిస్తారు, మాట్లాడుతుంటారు. ఆమె కూడా మీడియమే గదా! అంటే మాస్టర్ తను చెప్పదలచిన విషయం ఒక మీడియంలో ప్రవేశించి రాయిస్తారు. ఆ పంజాబీ వ్యక్తి చిన్నతనంలోనే ఇతర దేశాలు తిరిగి చివరకు ఇండియాలో స్థిరపడ్డాడు. అతని పేరు కుత్‌హోమి లాల్‌సింగ్. అది టిబెట్ గురువులు ఇచ్చిన పేరు. ఆధ్యాత్మిక రంగంలో ఉపదేశం తర్వాత అసలు పేరు వదలి, కొత్తపేరు పెట్టుకోవడం ఒక ఆచారం, సంప్రదాయం. అది పునర్జన్మ లాంటిది గదా!

ఆ ఉత్తరంలో నాకు సన్నసన్నని చీవాట్లు తగిలించాడు.

*"నీవు అనుకున్నట్లు లండన్ నుండి డెయిలీ పేపర్ తెస్తే ఏమవుతుంది? కొందరికి నమ్మకం కలుగుతుంది. కొందరు మ్యాజిక్ అంటారు! ఒరిగేది లేదు. ఒకరి నమ్మకంతో ప్రపంచం మారదు. ఇంకా ప్రపంచం మొదటి మెట్టు పైనే ఉంది. మహావిజ్ఞానం అందుకోడానికి లోకం సిద్ధంగా లేదు".*

*నిజమే! మనకు ప్రకృతి సంపదలు చాలు. విశ్వవిజ్ఞానం అవసరం లేదు. ఆ విజ్ఞానం ఏం చేసుకుంటాం? మాస్టర్లో, పరమ గురువులో ఉన్నారనుకుందాం. మనకేం ప్రయోజనం! ఏం లాభం? అతీంద్రియ జ్ఞానం ఎందుకు? ఈ పరమాద్భుతాలకు సైన్సు సమాధానం చెప్పదు గదా! అవి సైన్సు ద్వారా, మేధస్సు ద్వారా నిరూపితం కావు గదా. ఓహో! అంటారు తప్ప 'సత్యం' వెంట జనం నడవరు. మనిషికి లాభాలు కావాలి. సుఖాలు కావాలి! పరం గురించి పచ్చి పచ్చిగా ఆలోచిస్తే పిచ్చిపడుతుంది. ఆలోచించు! ఈ ప్రయోగాలు నీకెందుకు పని కొస్తాయి? హెచ్.పి.బి.కి మాత్రం ఏం ప్రయోజనం? కష్టపడి నందుకు గుర్తింపు వస్తుంది. కీర్తి గడిస్తారు. చరిత్రలో నిలుస్తారు. తర్వాత ఎవరూ ఉపయోగించుకోరు. క్రమంగా అంతా మరచిపోతారు. ఈ ఫలితాలు మరుగున పడతాయి. మీ లక్ష్యం నీరు కారిపోతుంది. చీప్ ప్రయోగాల వల్ల అసలు ప్రయోజనం వెనక్కు పోతుంది."*

1880 అక్టోబరు 19న సిన్నెట్ మాస్టర్ కుత్‌హోమిని ఆస్ట్రల్‌లో చూచాడు. ఆయన్ని చూడగానే స్పృహ కోల్పోయాడు. మనస్సు పనిచేయలేదు. చైతన్యం, ఆలోచనలు లేకుండా పోయాయి.

## ఎ.పి.సిన్నెట్ మరొక అనుభవం

బ్లవట్‌స్కీ, ఆల్కాట్, అలిన్ గోర్డన్, నేనూ ఒకరోజు సమీపంలోని ఒక కొండపైకి డిన్నర్‌కి వెళ్లాం. ఆరోజు కుత్‌హోమి ఉత్తరం వచ్చింది. 'కొండపైకి'రా. ఒక అనుభవం కలుగుతుంది."

బ్లవట్‌స్కీ అడిగింది సడెన్‌గా.


"మిస్టర్ సిన్నెట్! మాస్టర్ కుత్‌హోమి తను పంపే వస్తువు ఎక్కడ పెట్టాలని అడుగుతున్నాడు."

నా సంకల్పం సంగతి, నా ఉత్తరం సంగతి ఆమెకు తెలియదు నిజానికి.

"ఆ కుషన్‌లో పెడితే చాలు మాడం."

తన పద్ధతిలో ఆ విషయం మాస్టర్‌కి చెప్పినట్లుంది. వెళ్లి కుషన్ కవర్ చించి చూస్తే అందులో ఇలా రాసి ఉంది : "బ్రదర్. ఇది ఎంత సులభమో అంత కష్టమని గ్రహించు. రాత్రి నీకు కలిగిన సందేహాలు తీర్చడానికే ఈ ప్రయోగం. ఇకపైన నీ తలగడలోనే నా ఉత్తరాలు కనిపిస్తాయి. చూస్తూ ఉండు."

**– కుత్‌హోమి లాల్‌సింగ్**




# 13. కాకిగూడు

**బొం**బాయిలో బ్లవట్‌స్కీ, ఆల్కాట్ ఉంటున్న ఇంటికి ముద్దుగా పెట్టుకున్న పేరు **'కాకిగూడు'** 'Crows Nest'. అక్కడి నుండే థియోసఫీ ప్రచారం సాగింది. అక్కడనే బ్లవట్‌స్కీ ఆసక్తిగల వారిని ఆస్ట్రల్‌లో మహాత్ముల దగ్గరకు పంపిస్తుండేది. అలా ఆస్ట్రల్ యాత్రకు సిద్ధం చేసిన వారిలో మార్తాండరావ్ బాబాజీ నాగనాథ్ ఒకరు.

## మార్తాండరావ్ అనుభవాలు

"నేను ఎక్కువగా బ్రీచ్‌కాండిలోని హెడ్‌క్వార్టర్స్‌కు వెళుతుండే వాడిని. సొసైటీ ముఖ్యులతో నాకు మంచి పరిచయం ఏర్పడ్డది. థియోసఫీని లోతుగా అధ్యయనం చేసే అవకాశం కలిగింది. నా అనుభవాలు క్రొత్తవారికి ప్రోత్సాహకరంగా ఉండేవి. ఇన్విజిబుల్ మహాత్ముల్ని నేను చూచాను. అది నా పూర్వజన్మ సుకృతం. ఈ జన్మ అదృష్టం.

1881 ఏప్రిల్‌లో ఒకరోజు రాత్రి పదిగంటల ప్రాంతంలో మేడమీది వరండాలో మాడం బ్లవట్‌స్కీ వద్ద నాతో పాటు మరికొందరు థియోసఫిస్టులు ఉన్నారు. ఆరడుగుల మనిషి, తెల్లటి తలపాగా ధరించి, మాముందు సడన్‌గా ఆకృతీకరించాడు. వెంటనే మాడం మా అందరినీ లోపలకు వెళ్లమన్నది. మేం వెళ్లాక వారిద్దరూ మాకు అర్థంకాని భాషలో ఏదో మాట్లాడుకున్నారు. మేము తిరిగి వచ్చేలోగానే అతను అదృశ్యమైనాడు.

మరొకసారి మేము వరండాలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాం. ఒక మహాత్మ (దయ్యం అనుకోకండి) తెల్లని బట్టలు వేసుకుని ఉన్నాడు. చెట్టుకొమ్మ

మీద కూర్చుని కనిపించాడు. చూస్తుండగానే చెట్టు పై నుండి గాలిలో అలా దిగి వచ్చాడు. వచ్చి బాల్కనీలో పిట్టగోడపైన నిలబడ్డాడు. మాడం కుర్చీలోంచి లేచి అతని ఎదుటకు వెళ్లింది. నాలుగుమాటలు మాట్లాడగానే అతని రూపం గాలిలో ఎగిరిపోయింది. చూస్తూ ఉండగానే చెట్ల మధ్య కనిపించి, గాలిలోకి ఎగిరి మాయమైంది.

## ఎ.పి. సిన్నెట్

1881 జులైలో నేను ఇంగ్లండు వెళ్లి తిరిగి ఇండియా చేరుకున్నాను. బొంబాయిలో థియోసాఫికల్ హెడ్ క్వార్టర్సులో మకాం వేశాను. అప్పుడు బ్రీచ్ కాండిలో 'క్రోస్ నెస్ట్' అనే బంగ్లాలో సొసైటీ పనిచేస్తుండేది. ఆ బంగ్లా చాలా సంవత్సరాలుగా వేకెంట్‌గా ఉంది. అందులో దయ్యాలు, పాములు తిరుగు తుంటాయని జనానికి భయం. థియోసఫిస్టులకు దయ్యాలంటే భయం ఉండదు. వారి ప్రయోగాలే స్పిరిట్స్‌తో గదా!

బంగ్లాను రెండు భాగాలు చేశారు. ఒక భాగంలో సొసైటీ ఆఫీసు. ఆల్కాట్ నివాసం. మేడపైన మాడం బ్లవట్స్కీ నివాసం. పైకి వెళ్లే మెట్లు చాలా ఇరుకు. థియోసఫిస్టు పత్రిక పనులు బ్లవట్స్కీ భాగంలోనే. అక్కడ ఒక గది వేకెంట్‌గా ఉండేది – నావంటి గెస్టుల కోసం.

ఉదయం లేవగానే మాడం మొదటి కార్యక్రమం రష్యన్ పత్రికలకు వ్యాసాలు రాయడం, తర్వాత కార్యక్రమం కరస్పాన్డెన్స్. అసంఖ్యాకంగా వచ్చే ఉత్తరాలకు స్వయంగా జవాబులు రాసేది. తర్వాత థియోసఫిస్టు పత్రిక రచన. తర్వాత పగలంతా వరండా గదిలో కూర్చుని వచ్చేవారితో చర్చలు, సంభాషణలు. మధ్యమధ్య పనిపిల్లవాడు బబులా మీద కేకలేస్తుండేది. హిందూ పండితులతో చర్చలు వాడిగా, వేడిగా ఉండేవి. వారుచెప్పే వేదాంతార్థాలకు తీవ్రంగా స్పందించేది. వారి వాదనలూ, అభిప్రాయాలు తప్పు అని నిష్కర్షగా చెప్పేది. మధ్యమధ్యలో మాస్టర్ల గొంతులు ఆమెకు వినిపిస్తుండేవి. కళ్లు మూసుకుని వారి సలహాలు మనస్సుతో వింటూ వీరితో వాదిస్తుండేది. ఆమెకు మాస్టర్లు ప్రాంప్టింగ్ యిస్తుండే వారు. మాస్టర్ల శబ్దం వినగానే లోపలి గదిలోకి పరుగెత్తి తర్వాత తాపీగా వచ్చి వాదన సాగించేది. ప్రొద్దుపోయే వరకు చర్చలు సాగేవి. ఆమె అలసట చెందడం ఉండేది కాదు. మాట్లాడుతున్నంత సేపు సిగరెట్లు కాలుస్తుండేది. ప్రాచ్యపాశ్చాత్య తత్వ విషయాలపై ఆమెది అధికార స్వరం. తనను మించిన అథారిటి లేనట్లు గట్టిగా వాదించేది. చాలా మంది 'ఇసిస్ అన్‌వీల్డ్' ఆధారంగా చర్చ సాగించేవారు.

ఉద్ధండ పండితులైన మహామహోపాధ్యాయులే మట్టికరిచేవారు. తలవంచేవారు. ఆ మధ్యకాలంలో సేకరించుకున్న విషయాలన్నీ ఆమెకు సీక్రెట్ డాక్ట్రిన్ రచనలో ఉపయోగించాయి. ఇసిస్ అన్‌వీల్డ్ రచనకు సీక్రెట్ డాక్ట్రిన్ రచనకు మధ్య ఒక దశాబ్ద కాలం ఎడం! ఇసీస్‌లో తలెత్తిన ప్రశ్నలకు, సందేహాలకు సమాధానాలు **'సీక్రెట్ డాక్ట్రిన్'**లో సమాధానం యిచ్చింది.

1882 జూన్‌లో ప్రత్యేక ఆహ్వానంపై బ్లవట్‌స్కీ, ఆల్కాట్ బరోడా సంస్థానానికి వెళ్లారు. అక్కడ గయక్వాడ్ న్యాయమూర్తి మాడంని ప్రశ్నించాడు.

"మాడం, పేపర్ పైన రాతలూ, గుడ్డపైన ఎంబ్రాయిడరీలు ఎలా వస్తాయి?"

**బ్లవట్‌స్కీ సమాధానం.**

"ఆస్ట్రల్ లైట్ ఒకటి ఉంటుంది. ఆ కాంతిలో అన్ని సంఘటనలు, అన్ని వస్తువులు ప్రతిఫలిస్తుంటాయి. అవతల రాస్తున్న వ్యక్తి చూడకపోయినా, అతని చేతి రాత తెలియకపోయినా మనం సంకల్పిస్తే చాలు. అవి అలాగే మెటీరియలైజ్ అవుతాయి. వస్తువుల్ని సృష్టించడానికి అదే ప్రక్రియ."

**ఆర్. కేశవ పిళ్లై,** బొంబాయి

సెప్టెంబరు 13 రాత్రి నేను ఆల్కాట్ గదిలో లోపల గడియ వేసుకుని పడుకున్నాను. లైటు వెలుగుతూనే ఉంది. గోడలోంచి గురుదేవ్ కుత్‌హోమి బయట కొచ్చాడు. వెళ్లి సాష్టాంగ నమస్కారం చేశాను. నన్ను ఆశీర్వదించి చక్కని తెలుగులో మాట్లాడారు: **"హిమాలయాలకు వచ్చి నన్ను కలుసుకో"**అని చెప్పి మాయమైనాడు.

తర్వాత నేను రైల్లో ప్రయాణం చేస్తుండగా అలహాబాద్, మొగల్ సరాయ్‌ల మధ్య నడుస్తున్న రైలులో నా పెట్టెలోకి ఒక ఉత్తరం వచ్చి పడ్డది. బోగీలో ఉన్నది నేను ఒక్కడినే. రైలు చాలా వేగంగా పోతోంది. గాలికి వచ్చిపడే అవకాశం లేదు. కిటికీలు అన్నీ మూసి ఉన్నాయి. నేను ఆలోచిస్తున్న విషయం మీద మాస్టర్ ఏదైనా సందేశం యిస్తే బాగుండునని లోపల అనుకున్నాను. వెంటనే ఉత్తరం వచ్చి వాలింది. అది మహాత్మ కుత్‌హోమి చేతిరాత. నాకు తెలుసు.

తర్వాత డార్జిలింగ్ వెళ్లినపుడు సిక్కింలో మహాత్మ కుత్‌హోమి మాస్టర్ మోరియా భౌతిక రూపాలలో దర్శనమిచ్చారు.

**ఎస్. రామస్వామయ్యర్**, డార్జిలింగ్ (సెప్టెంబరు 1882)

ఆఫీసు పని ఎక్కువై నా ఆరోగ్యం దెబ్బతిన్నది. సెలవు పెట్టాను. ఒకనాడు తిరునల్వేలిలో జరిగిన సంఘటన. నా గదిలో చదువుకుంటూ కూర్చున్నాను.

నా గురువుగారు మోరియా గొంతు వినిపించింది : "వెంటనే బయల్దేరి బొంబాయి వెళ్లు, బ్లవటస్కీకి నీ అవసరం ఉంది" అని.

"ఆమె వెన్నంటి తిరగాలి. ఆమె ఎక్కడకు పోతే అక్కడకు పోవాలి" అది మాస్టర్ ఆర్డరు.

ఆరోగ్యం బాగులేకపోయినా వెంటనే రైలెక్కాను. బొంబాయి చేరేసరికి మాడం అక్కడలేదు. కలకత్తా వెళ్లినట్లు వార్త. వెంటనే కలకత్తా బయలుదేరాను. అలహాబాదు వెళ్లేసరికి మళ్లీ గురువుగారి ఆస్ట్రల్ సందేశం ... కలకత్తా కాదు, బరంపురం వెళ్లమని.

నవీన్‌బాబు నన్ను కలిసి కలకత్తా నుండి చందర నాగూర్ చేర్చాడు. అక్కడ మాడం కనిపించింది. ఆమె రైలులో కూర్చుని ఉంది. ఎక్కడికి పోతోందో తెలియదు. నేను చివరి బోగీ పట్టుకుని రైలులోకి ఎక్కేశాను.

డార్జిలింగ్ వచ్చిన కొత్తలో మాడం ఒక బెంగాలీ బాబు ఇంట్లో ఉండేది. అతను థియోసఫిస్టు. అప్పట్లో ఆమె ఎవరినీ కలవడానికి, మాట్లాడడానికి ఇష్టపడేది కాదు. నేను చాలాసార్లు అపాయింట్‌మెంట్ కోరాను. నిరాకరించింది. "నీతో నాకు పనిలేదు" అని నిష్కర్షగా సమాధానం చెప్పింది. ఆమెను వెంట ఉండి కనిపెట్టమని మాస్టరు ఆర్డరు. ఈమెగారేమో దగ్గరకే రానీయడం లేదు. ఎలా? మహాత్ములకు ఆమె అవసరం ఉంది. ఆమెను రక్షిస్తారు. ఇదేమి బాధ!

నాకు చిరాకు వేసింది. ఏం జరిగితే అది జరగనీ అనుకున్నా. అక్కడికి టిబెట్ సరిహద్దు పన్నెండు మైళ్లు. సరిహద్దు దాటిపోతే మాస్టర్లని కలవవచ్చు. ఆ ప్రయత్నంలో చచ్చిపోయినా ఫరవాలేదు. నా మనసులోని ఆలోచన ఎవరికీ చెప్పకుండా అక్టోబరు అయిదున బయలుదేరాను. మధ్యాహ్నానికి 'రుంగిత్' నది తీరానికి చేరాను. ఆ నది ఇండియాకి సిక్కింకి బార్డరు.

మధ్యాహ్నం అంతా నడుస్తూనే ఉన్నాను. వెనక చూపులేదు. వెనకడుగు లేదు. సిక్కింలో చొరబడ్డాను. సన్నటి కాలిబాట. చీకటి పడేలోగా ఇరవై మైళ్లు నడిచి ఉంటాను. అక్కడి దాకా భయంకరమైన అరణ్యం. అక్కడక్కడ గుడిసెలు, కొండ ప్రాంతాల వాళ్లు. రాత్రికి బస కావాలి. కనీసం ఏదైనా తినడానికి కావాలి, నిద్రపోవడానికి చోటు కావాలి.

ఎట్లాగో రాత్రి గడిచింది. తెల్లవారింది. మళ్లీ కొండల్లో కోనల్లో నడక. తొమ్మిది గంటలైంది. సిక్కిం పట్నం వెళ్లే రహదారి మీదికి వచ్చాను. అక్కడక్కడ జన సంచారం కనిపిస్తోంది. అక్కడి నుండి టిబెట్ చేరాలి. నేను యాత్రికుడిని.

అంతలో ఎవరో ఒకతను గుర్రంమీద నావైపుగా వచ్చాడు. చాలా ఎత్తుగా, బలిష్టంగా ఉన్నాడు. చక్కగా స్వారీ చేశాడు. అతను సిక్కిం రాజుగారి సైనికు డనుకున్నాను. నా దగ్గరగా వచ్చి గుర్రాన్ని ఆపాడు. తలెత్తి చూచాను. ఆశ్చర్యం! ఆయన్ని గుర్తించాను. నా గురువర్యులు ఆయనే. వెంటనే సాష్టాంగ నమస్కారం చేశాను. ఆయన కళ్లలోకి చూచాను. వెంటనే నన్ను నేను మరచిపోయాను. నోట మాట రాలేదు. మనస్సులో ఆలోచనలు లేవు. గొంతు మూగబోయింది. "ఓ మహాత్మా! మహర్షీ! ఇది కలగాదు గదా! అది రాత్రి కాదు, పట్టపగలు. రాజ వీథి."

ఆయన నన్ను ప్రేమగా చూచాడు. అంతటి రాజఠీవి నేను జన్మలో ఎరుగను. కొంచెం సేపటికి స్పృహలోకి వచ్చాను. ఆయన గడ్డం నల్లగా ఉంది. గిరజాల జుత్తు. తలపైన టిబెటన్ టోపీ, ఉన్నికోటు ధరించాడు.

చాలా సేపు సంభాషణ సాగింది మా మధ్య. ఆపైన ముందుకు వెళ్లవద్దని సలహా చెప్పాడు. నాకు ఏడుపొచ్చింది.

"నిన్ను నా శిష్యునిగా స్వీకరించడానికి ఇంకా టైం పడుతుంది. నిరీక్షించు" అన్నారు. ఆయన చక్కని ఇంగ్లీషులో మాట్లాడారు. తమిళంలోనూ మాట్లాడారు.

"మీ దర్శనం అయినట్లు ఎవరికైనా చెప్పుకోవచ్చునా మాస్టర్?"

'సరే' అన్నట్లు తల పంకించాడు.

'సెలవ్' అని నమస్కారం చేశాను. అంతలో మరో ఇద్దరు గుర్రాల మీద వచ్చారు. మాస్టర్ గారి శిష్యులేమో! వారు మాస్టర్ గుర్రం వెనకనే వెళ్లిపోయారు. అటు చూస్తూ నిలబడిపోయాను. తిండీ తిప్పలు లేవు. గంటల కొద్దీ నడిచాను, ఒళ్లు నొప్పులు, కాళ్లు పీకుతున్నాయి. అలాగే కాళ్లు ఈడ్చుకుంటూ రుంగిత నదిని దాటాను. స్నానం చేసి, బజారు వెళ్లి పళ్లుకొని తిన్నాను. ఒక గుర్రం మాట్లాడుకుని సాయంత్రానికి డార్జిలింగ్ చేరాను.

ఎక్కడా విశ్రాంతి లేదు. ఒళ్లంతా పిండి కొట్టినట్లు నలిగిపోయింది. నేను కనిపించకపోయేసరికి మాడం భయపడ్డదట. ఆమెకు భయం ఏమిటి? ఆమెను చూచి నేను భయపడాలి! నా తొందర పాటు పనికి చివాట్లు పెట్టింది. బ్లవట్స్కీ ఆవులిస్తే పేగులు లెక్కించగలదు.

మహాత్మ నా గురించి మాడంకు కబురు అందించి ఉంటారా, ఏమో!

ఏది ఎట్లా జరిగితే అట్లా జరగనీ అనుకున్నాను. అంతా దైవాధీనం గదా!

మనిషి తెలిసిచేసే తప్పులకు దైవం బాధ్యత వహిస్తుందా? ఏమో!



మహర్షి సుబ్బారావు

# 14. మాస్టర్ - మీడియమ్స్

**బ్ల**వట్‌స్కీ అదృష్టం ఇండియాలో ఆమె ఆశించిన సహకారం లభించడమే గాక సమర్థులైన మీడియమ్స్ దొరకడం. వారికి అప్పటికే కొందరు మాస్టర్లతో సంబంధాలున్నాయి. అలాంటి వారిలో దామోదర్ మావ్లంకర్ ఒకరు.

## దామోదర్ మావ్లంకర్

మావ్లంకర్ సంస్కారవంతుడు. అతనికి చిన్నతనంలోనే బ్లవట్‌స్కీ చెప్పే మాస్టర్లు ఒకరితో సంబంధం ఏర్పడ్డది. అప్పటికే మాస్టర్లు ఇండియాలో కొందరు మీడియమ్స్‌ని ఎంపిక చేసి పెట్టుకున్నారు. మావ్లంకర్ మాడం బ్లవట్‌స్కీ కన్న రెండాకులు ఎక్కువ చదివినవాడు. అతను దివ్యదృష్టితో చూచి బ్లవట్‌స్కీని ఒక దివ్యజ్ఞానిగా గుర్తించాడు. ఆమె విదేశీయురాలని, స్త్రీ అని తక్కువగా చూడలేదు. ఆమెను ఒక శక్తి స్వరూపిణిగా ఆరాధించాడు. ఆమెను తన గురువుగా భావించాడు. ఒక విదేశీ మహిళను గురువుగా గుర్తించే సంస్కారం ఉండడం విశేషం. విదేశీయులంటే మ్లేచ్ఛులని, అప్రాచ్యులని ఈసడించే రోజులు అవి.

మావ్లంకర్ ఆరోగ్యం సరిగా ఉండేది కాదు. అయినా కష్టపడి పనిచేసేవాడు. తన బ్రాహ్మణ్యం వదలి, ఆస్తి పాస్తులు, కుటుంబం వదలి థియోసాఫికల్ సొసైటీ సేవకు సంపూర్ణంగా అంకితమైనాడు. ధ్యానం, యోగం చేస్తూ ఆహార నియమాలు పాటించేవాడు. తను లోగడ సాధన చేసిన హఠయోగక్రియల్ని పూర్తిగా వదలి దివ్యజ్ఞాని అయినాడు. అతని ఆరోగ్యం కోసం ఆల్కాట్ మాస్టర్లను ప్రార్థించేవాడు.

క్రమంగా ఏ పరిశ్రమ లేకుండానే యోగసాధనతో నియత జీవనంలో దామోదర్ ఆత్మశక్తి పెరిగింది. మాస్టర్లతో సంభాషిస్తుండేవాడు. తన ఆత్మశక్తితో

ఎవరి జబ్బులనైనా తగ్గించేవాడు. 1883 నాటికి మాస్టర్ అతన్ని మీడియంగా చేసుకుని అతని ద్వారా సందేశాలు పంపించేవారు. అతను 'ఆస్ట్రల్ మెయిల్' సంవాహకుడు. అహంకారం వదలి, కోరికలు జయించిన వారికి అతీంద్రియ శక్తులు, మాస్టర్ల అనుగ్రహం లభిస్తాయని ఆల్కాట్ తరచు చెబుతుండేవాడు. దామోదర్‌ని ఆదర్శంగా తీసుకుని వందల మంది థియోసఫీ తీర్థం పుచ్చుకున్నారు. అతను ఆదర్శ సాధకుడు, జ్ఞాని.

1883 నవంబరులో లాహోర్‌లో దామోదర్ మాస్టర్ కె. హెచ్.ని కలిశాడు. తర్వాత కొద్ది కాలానికే కాశ్మీరు వెళ్లినపుడు మరి కొందరు మహాత్ముల్ని కలిశాడు. వారితో కొంతకాలం కలిసి జీవించాడు. ఆల్కాట్ సలహా మేరకు సిక్కింలో అవతార్ లామాను కలిసి అతని వెంట తిరిగాడు. సిలోన్ వెళ్లినపుడు ఒక దీవిలో మరొక మహాత్మను కలుసుకున్నాడు. తర్వాత దామోదర్ టిబెట్ వెళ్లి తిరిగి రానేలేదు. అప్పుడు మహర్షి సుబ్బారావు దివ్యదృష్టితో చూచి దామోదర్ చేరవలసిన చోటుకు చేరాడని, సజీవంగానే ఉన్నాడని బ్లవట్‌స్కీకి చెప్పాడు.

దామోదర్ అంటే ఆల్కాట్‌కు ఎంతో ప్రేమ, గౌరవం. ఆల్కాట్ అంటాడు:

"అతను గొప్పవాడు. ఆరోగ్యం సరిగా లేకపోయినా పట్టుదలతో హిమాలయా లకు వెళ్లాడు. చిన్నతనంలో కలల్లో కనిపించిన గురువును ఇలలో దర్శించాలని టిబెట్ వెళ్లాడు. బ్లవట్‌స్కీతో పరిచయం తర్వాత తన స్వప్నగురువుల పరమ గురువు శ్రేణిలోని వాడని గుర్తించి, మానసికంగా ఆరాధిస్తూ, మాడం సేవలో చరితార్థు డైనాడు. ఏడు సంవత్సరాల యోగసాధన పూర్తి చేయకపోయినా మాస్టర్లు అతనిని టిబెట్ రావడానికి అనుమతించారు."

మాడం బ్లవట్‌స్కీ దామోదర్ గురించి అన్నమాట :

"ఇండియాలో నేను నమ్మిన వారంతా నన్ను మోసం చేశారు. నన్ను పూర్తిగా నమ్మినవాడు దామోదర్. అతను నాకు మంచి మిత్రుడు. అప్పటికే మాస్టర్లను ఎరిగినవాడు. నా హృదయం తెలిసినవాడు. తను అన్నింటికీ మించి సత్యయోగి. వేషాలు, ఆడంబరాలు చూచి నేను మోసపోయేదాన్ని. ఎవరికీ నా రహస్యాలు తెలియనిచ్చేదాన్ని కాదు. చివరికి ఆల్కాట్‌కు కూడా నా మనసు అసలు తెలియదనే చెప్పాలి. ఒక్క దామోదర్ మాత్రమే నన్ను పూర్తిగా అర్థం చేసుకున్న వ్యక్తి."

## మహర్షి సుబ్బారావు

మహాత్మా మోరియాకు అత్యంత ప్రియ శిష్యుడుగా సుబ్బారావును మొదటనే బ్లవట్‌స్కీ గుర్తించింది. ఆయనను ఒక మహర్షిగా సంభావించింది. థియోసఫిస్టు

పత్రికకు రచనలు చేస్తుండేవారు సుబ్బారావు. మేడం పైన వచ్చే విమర్శలకు ఘాటుగా ప్రతివిమర్శలు రాసి పంపేవారు. బ్లవట్స్కీ, ఆల్కాట్‌లు మద్రాసు రావడానికి ముందుగానే బ్లవట్స్కీ అభిమానం పొందినవాడు సుబ్బారావు. మాడంకు అత్యంత ఆత్మీయులు దామోదర్, టి.సుబ్బారావు. ఇద్దరూ మహా పండితులు. ఇద్దరూ బ్రాహ్మణులే. కాని ఇద్దరూ కులానికి దూరమైనవారు. ఇద్దరూ జ్ఞానులు, ప్రగతిశీలురు. బంధువులకు, మిత్రులకు దూరమైనారు. బ్లవట్స్కీకి ఆల్కాట్‌కు దగ్గరైనారు. థియోసఫి తీర్థం పుచ్చుకున్న వారిలో ప్రథమశ్రేణిలోని వారు.

సుబ్బారావు వేద విద్వాంసుడు. లాయర్ కావడం వల్ల ఇంగ్లీషులో గొప్పగా రచనలు చేసేవాడు. థియోసఫిస్టు పత్రికకు, సంస్థకు, థియోసఫీకి ఆయన కొండంత అండగా నిలిచాడు. గురువు కావడానికి ఆశ్రమాలు అవసరం లేదు. సంస్థలతో పనిలేదు. భారతదేశంలో గురు వ్యవస్థ అనాదిగా ఉంటున్నది. అది పాశ్చాత్యులకు కొత్త కావచ్చు. సుబ్బారావుకు థియోసాఫికల్ సొసైటీలో చేరడం వల్ల వొరిగింది లేదు. మహర్షి సుబ్బారావు ప్రతిభ సొసైటీకి ఎంతో ఉపయోగపడ్డది. సొసైటీలో చేరినంత మాత్రాన ఎవరూ దివ్యజ్ఞానులైనట్లు కాదు. గురువు అనిపించుకున్నంత మాత్రాన బ్రహ్మజ్ఞానులు అయినట్లూ కాదు. కష్టపడి, సాధన చేసిన వారికే గురుత్వ ఆకర్షణ ఉంటుంది.

1879లో సిమ్లా ట్రిప్‌లో సొసైటీలో చేరిన సిన్నెట్, హ్యూమ్ ఇద్దరూ ఇంగ్లీషు వారే. తొలినాళ్లలో ఇద్దరూ చురుకుగా పనిచేశారు. వీరి కారణంగా ఇంగ్లీషువారు, ఆంగ్లో ఇండియన్స్ సొసైటీవైపు మొగ్గు చూపేవారు. బ్లవట్స్కీ లక్ష్యం అది కానేకాదు. సిన్నెట్ మంచి రచయిత. హూమ్ గవర్నమెంట్ మాజీసెక్రటరీ. కొంతకాలం తర్వాత హ్యూం చప్పబడ్డారు. సిమ్లా థియోసాఫికల్ సొసైటీని తన స్వంతం చేసుకోవాలని యత్నించాడు. నిజానికి సిన్నెట్, హ్యూమ్ ఇద్దరూ యోగం చేయరు. వారికి పాపులారిటీ కావాలి. వారిద్దరూ స్వార్థ పరులని మాస్టర్ కుత్‌హోమి అభిప్రాయం.

ఇద్దరిలో సిన్నెట్ కొంత మేలు. థియోసఫీని జర్నలిస్టుగా తను అర్థం చేసుకున్న రీతిలో వివరించేవాడు. ఎవరి అవగాహన వారిది. మాస్టర్స్ ఉనికిపై గట్టి విశ్వాసం ఉన్నవాడు సిన్నెట్. హ్యూమ్ గోడమీది పిల్లి వాటం. అతనికి ప్రజాసేవలో ఆసక్తి ఎక్కువ, స్వార్థమూ ఎక్కువే. అతీంద్రియ శక్తులు, దివ్యజ్ఞానం విషయంలో ఆతని మేథ సరిగా పనిచేయలేదు.

సిమ్లా బ్రాంచ్ చక్కగా ప్రారంభమైనా చేరినవారంతా ఆంగ్లోస్ కావడంతో, వారికి అతీంద్రియ విజ్ఞానం పట్ల నమ్మకం కుదరలేదు. దాంతో ప్రతికూలత ఎక్కువైంది. బ్లవట్స్కీది ఎవరినీ కేర్ చేసే తత్వం కాదు. రాజకుటుంబంలో పుట్టిందేమో రాజసం ఎక్కువ. ఆత్మాభిమానం పాలు ఎక్కువ. బ్రహ్మచారిణి కావడంతో మగాళ్లను మరీ చులకన చేసేది. ఆమె స్వేచ్ఛా ప్రియత్వాన్ని మగ మహా పురుషులు అపార్థం చేసుకునేవారు.

బరోడా ఛీఫ్ జస్టిస్ జుత్తు పండిపోయిన పార్శీ పెద్ద మనిషి, ఓ పదహారేళ్ల, పిల్లను తన భార్యగా మాడంకి పరిచయం చేశాడు. అతని మొహం మీదనే ఓల్డ్ జాకాల్ (ముసలినక్క) అని నిందించింది. ఆడ, మగ ఎవరినైనా సరే విమర్శలు బాధిస్తాయి! ఆ నోటి దురుసుతోనే ఆమె కష్టాలు కొనితెచ్చుకునేది.

అప్పట్లో, ఇంగ్లీషు వారికి ఆతీంద్రియ శక్తులంటే భయం. ధ్యానం, తపస్సు అంటే చీదర. టెలిపతీ లాంటి విద్యల్ని వారు నమ్మేవారు కాదు. బ్లవట్స్కీయే 'కుత్‌హోమి' అని ఒక పాత్రను సృష్టించి నాటకం ఆడుతోందని ప్రచారం చేశారు. ఆల్కాట్‌కూ 'కుత్‌హోమి' దయ్యం పట్టిందని క్రైస్తవ సంఘాలు దాడి ప్రారంభిం చాయి.

1880లో ఎ.పి. సిన్నెట్ రాసిన పుస్తకం **"ఆకల్ట్ వరల్డ్"**కు బ్లవట్స్కీ భావాలు, ప్రయోగాలు, అనుభవాలు ఆధారం. దాంతో బ్లవట్స్కీకి విశేష ప్రచారం లభించింది. పరలోకాలకు, పరమ గురువులకు ప్రచారం లభించింది. విద్యా వంతుల దృష్టి థియోసఫీ వైపు మళ్లింది. ఆ సందర్భంలో సిన్నెట్ హిమాలయ యోగుల్ని, టిబెట్ మాస్టర్లను, హిందూ యోగుల్ని జనానికి పరిచయం చేయసాగాడు. "మహాత్మ లేఖలు" మరింతగా పాఠకుల్ని ఆకర్షించాయి.

> *"అపార్థాలవల్ల, స్వార్థాల కారణంగా సొసైటీ పెద్దలు మాస్టర్ల ఆగ్రహానికి గురైనారు. మహాచౌహాన్, మాస్టర్ మోరియా, మహాత్మా కుత్‌హోమి వారి ప్రవర్తనకు గట్టిగానే స్పందించారు."*
>
> *"థియోసాఫికల్ సొసైటీ ఒక మంత్రాలయం అయింది. దీనిని రద్దు చేయండి. ఎక్కడి వారక్కడకు వెళ్ళిపోండి. సొసైటీలో ఉండవలసింది నిస్వార్థపరులు. ఇప్పుడున్నది స్వార్థపరులు".*

సిన్నెట్‌కు ప్రాధాన్యత లేదు. అతనికి ఆధ్యాత్మికత తెలియదు. అతనికి కావలసింది 'ఈసొటరిక్ బుద్ధిజం'. అదే అతని థియోసఫికి ఆధారం. అదే బ్లవట్స్కీ "Secret Doctrine" కి ప్రేరణ. ఏది ఏమైనా థియోసఫీపెద్దలు

జారుడు మెట్లపై నడక మొదలెట్టారు. సిద్ధాంత పరంగానూ జారుడు మొదలైంది. అతీంద్రియ విజ్ఞానాన్ని గోప్యంగా ఉంచాలని మాస్టర్ కుత్‌హోమి సిన్నెట్‌ను గట్టిగా మందలించాడు.

## బౌద్ధానికి ప్రాధాన్యత

న్యూయార్కులో బయలు దేరినప్పుడున్న ఆశయాలు బొంబాయి చేరగానే కొంత మారాయి. సిమ్లా, బనారస్‌లలో మరి కొన్ని మార్పులు, చేర్పులు జరిగాయి. మద్రాసు చేరేనాటికి దాని రూపురేఖలు మారిపోయాయి. 1879 డిసెంబరులో బనారస్‌లో విజయనగరం రాజావారి భవనంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. జెండాతో పాటు అజెండా మారిపోయింది. మూడు రకాల సభ్యత్వం తయారైంది.

సొసైటీ ప్రధాన లక్ష్యం మనిషిలో ఆధ్యాత్మిక జ్ఞానం పెంపొందించడం. ఆల్కాట్ సమావేశాలకు, చర్చలకు దూరంగా ఉండసాగాడు. అతనికి బ్లవట్‌స్కీ ఒంటెత్తు పోకడతో విసుగుపుట్టింది. 'అంతా నేనే. అంతా నాదే' అంటుంది. మాస్టర్ల అండ ఆమెకున్నదనే ఒక్క కారణం తప్ప ఆమె పట్ల గౌరవానికి మరొక కారణం కనిపించదు. సభ్యులు పలచబడ్డారు.

1880లో బ్లవట్‌స్కీ, ఆల్కాట్, దామోదర్, మరికొందరు సింహళ పర్యటన పెట్టుకున్నారు. అక్కడ బ్లవట్‌స్కీకి మంచి గుర్తింపు లభించింది. ఆ సందర్భంలో మహాచౌహాన్ వ్యాఖ్య : **"బౌద్ధంలో మూఢనమ్మకాలు తొలగితే అది పరమ సత్యం అవుతుంది"** అని. ఇండియాలోని బౌద్ధానికి, సిలోన్ బౌద్ధానికి చాలా వ్యత్యాసం ఉంది. ఇండియాలో వారికి స్వేచ్ఛ, పరమత సహనం ఎక్కువ. సిలోన్‌లో బౌద్ధానికి ఆదరణ తక్కువ. క్రైస్తవ మిషనరీల దాష్టికం అధికం. మరొక మతాన్ని అక్కడి క్రిస్టియన్లు సహించరు. బౌద్ధ కార్యకలాపాలపై నిషేధం పెట్టారు. క్రైస్తవులకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉంది. ఆల్కాట్ బౌద్ధాభిమాని. సిలోన్‌లో బౌద్ధమత పున రుద్ధరణకు పూనుకున్నాడు. ఆల్కాట్ మతాభిమానం బ్లవట్‌స్కీకి తలనొప్పిగా తయారైంది. ఆల్కాట్ ప్రయత్నాన్ని మాస్టర్ కుత్‌హోమి అభినందించాడు.

**"అవును, బౌద్ధం పునరుజ్జీవనం పొందడం అవసరం"** అన్నాడు మాస్టర్ కె. హెచ్.

సింహళంలో మాడం బ్లవట్‌స్కీకి ఒక మాంచి కత్తిలాంటి కుర్రవాడు దొరికాడు. పేరు హయవితరణ ధర్మపాల. బౌద్ధాన్ని తలకెత్తుకున్నవాడు. థియోసఫీలో చేరాలని ఆశించాడు. కాని మాడం అతన్ని బౌద్ధ ధర్మ ప్రచారం

చేయమని ఆదేశించింది. అతను గృహస్త జీవనం వదలి పాశ్చాత్య దేశాలలో బౌద్ధ ధర్మ ప్రచారం చేశాడు. అతను మాస్టర్ కుత్‌హోమి అభిమాని, శిష్యుడు. బ్లవట్‌స్కీ అంటే వల్లమాలిన అభిమానం, ఇష్టం. సిలోన్‌లో కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఇండియా తిరిగి వచ్చాక ఆల్కాట్ బయట తిరిగే పనులు చేసుకునేవాడు. బ్లవట్‌స్కీ రచన, పత్రిక, సొసైటీ పనుల బాధ్యత తీసుకున్నది.

ఇండియాలో మండు టెండలు, అకాల వర్షాలు, ఎముకలు కొరికే చలి. బ్లవట్‌స్కీ ఆరోగ్యం దెబ్బ తినసాగింది. ఉక్క భరించలేక పోయేది. డాక్టర్లు హెచ్చరించారు. “నీవు ఎక్కువకాలం బ్రతకవు జాగ్రత్త” అని. అప్పటికి థియోసాఫికల్ సొసైటీ ఏర్పడి ఏడు సంవత్సరాలు పూర్తి కావస్తోంది. ఇంకా బాలారిష్టాలు దాటినట్లు అనిపించడం లేదు. బ్లవట్‌స్కీకి జబ్బు చేసింది. ఉద్యమానికీ జబ్బు చేసింది. అసలు పని 1882లో ప్రారంభమైంది.

బ్లవట్‌స్కీ అనారోగ్య కారణంగా నీలగిరులలో ఉన్న “గార్గ్యదేవ్” అనే యోగిని మాస్టర్లు ఆమెకు సహాయంగా ఉండమని నియమించారు. అతను మాడంకు సిక్కిం యాత్రలో సహకరించాడు. ఇద్దరూ సిక్కిం సరిహద్దులలో ఒక యోగి ఆశ్రమం చేరారు. అక్కడ మాస్టర్ మోరియా, కుత్‌హోమి, ఇంకా అనేక మంది గురువులు, శిష్యులు కనిపించారు. అక్కడ ఉన్నది రెండే రోజులు. అయినా బ్లవట్‌స్కీ ఆరోగ్యం చక్కబడ్డది. ఆమె మృత్యుముఖం చేరిన ప్రతిసారీ మాస్టర్లు రక్షిస్తూ ఉన్నారు. మాస్టర్ ఆస్ట్రల్ దర్శనం అయితే చాలు ఆమె జబ్బు తగ్గి పోయేది చిత్రంగా.

★ ★ ★

## రెండవ సప్తకం

“థియోసాఫికల్ చరిత్ర”లో రెండవ సప్తకం 1882లో ప్రారంభమైంది. వారికి ఏడు సంఖ్య ముఖ్యం. ఏడుగురు మాస్టర్లు, ఏడు లోకాలు, ఏడు శరీరాలు. మనిషి జీవితంలోనూ ఏడేండ్ల కొకసారి మార్పు వస్తుందని వారి విశ్వాసం. ఏ సంస్థకైనా ఏడేండ్ల కొకసారి మలుపు తప్పదంటారు. మార్పుకు బీజాలు సిమ్లాలోనే పడ్డాయి. థియోసఫీకి ఫిలాసఫీ స్టేటస్ కల్పించే బాధ్యత మహర్షి సుబ్బారావు పైన పడ్డది. ఆయన అప్పటికే పరోక్షంగా థియోసఫీకి అండగా ఉంటున్నాడు. ఏ సంస్థలూ సజావుగా నడవవని ఆయన భయం. హైకోర్టు అడ్వకేటు కదా! సుబ్బారావుకు సిన్నెట్, హ్యూమ్‌ల నిజాయితీపై నమ్మకం లేదు.

1882 జనవరి 26 సుబ్బారావు సిన్నెట్‌కు ఒక వివరణాత్మక లేఖ రాశాడు.

"మిత్రమా ! అతీంద్రియ శక్తుల గురించి పాఠాలు చెప్పడం కుదరదు. మీ ఆలోచనా ధోరణి ఆచరణ సాధ్యం కాదు. నాకు తెలిసినంత వరకు అతీంద్రియత వల్ల మానసిక శక్తులు పెరుగుతాయన్న గ్యారంటీ లేదు. ఆ విషయంలో ఏ గురువు ఏ శిష్యుడిని తయారు చేయలేడు. ఎవరి ప్రతిభ వారిది. ఎవరి ప్రగతి వారిది. ఎవరి సమర్ధత వారిది. మీరు సంపాదించిన జ్ఞానంతో తృప్తి పడడం మంచిది. అధికంగా ఆశించడం మంచిది కాదు. ఏవో కొన్ని సిద్ధులు లభించి, అతీంద్రియ శక్తులు లభించినంత మాత్రాన ఎవరూ "Physical Immortality" సాధించినట్లు అవదు. సాధకుడు స్వతంత్రంగా భౌతిక ప్రపంచం నుంచి 'పరం' వేపు ప్రయాణించ గలగాలి. 'రూపం' వదలి 'అరూపం' కావడం ముఖ్యం. ఆ పని మీరు అనుకున్నంత సులభం కాదు. సద్గురువు అయినవాడూ బోధించడు, వాదించడు. శిష్యుని అభివృద్ధి గమనిస్తూ తన సంకల్పంతో సహకరిస్తుంటాడు."

సుబ్బారావు విదేశీ సాధకుల కోసం, పాఠకుల కోసం, అభిమానుల కోసం చేయగలిగినంతా చేశాడు.

తొలి సప్తకంలో (1875-82) బ్లవట్స్కీ ఆంతర్యం సభ్యులు అర్థం చేసుకోలేదు. ఆమెను తక్కువగా అంచనా వేశారు. ఆమెకు పరమగురువులతో ఉన్న అనుబంధాన్ని సైతం శంకించారు. గురు-శిష్య సంబంధం విలువ పాశ్చాత్యులకు అర్థంకాదు. తెలుసుకోవలసిన అవసరం వారికి కనిపించలేదు. అపార్థాల వల్ల, సభ్యుల అభ్యంతరాల వల్ల బ్లవట్స్కీ చాలా మానసిక క్షోభ అనుభవించవలసి వచ్చింది.

"గురువు పట్ల, మాస్టర్ల పట్ల సంపూర్ణ విశ్వాసం లేకపోవడం శిష్యుల అభివృద్ధికి పెద్ద అవరోధం. అవిశ్వాసం వల్ల సంస్థ ప్రగతి దెబ్బ తిన్నది. అతీంద్రియ జ్ఞానం పరీక్షలకు నిలబడదు. విశ్వాసమే ప్రగతికి ఆధారం. మాస్టర్లు ఉన్నారా? అంటే ఏది సమాధానం. ఉంటే మాకు కనిపించరేం? అంటారు. ఆ శక్తులు మాకెందుకు కలగవు? అంటారు. అవి డబ్బు పెట్టి కొనేవి కావు. యూనివర్సిటీలు ఇచ్చే డిగ్రీలు కావు అవి. ఆ ప్రశ్నలకు జవాబులు చెప్పటం అనవసరం. ఆత్మజ్ఞానంతో సమాధాన పరచుకోవలసిందే.

ఏడు సంవత్సరాలలో బాలారిష్టాలు కొన్ని తొలగినా, అపార్థాలు సమసి పోయినా ఉద్యమ స్వభావం సభ్యులకు అర్థం కాలేదు. మాస్టర్ల దర్శనం కావడమే పరమ లక్ష్యమా? దానివల్ల ఒరిగేది ఏముంది? అప్పుడే మాస్టర్లు దూరం జరిగారు. బ్లవట్స్కీ ఒక్కరికి తప్ప మిగత వారికి మాస్టర్లు దర్శనం ఇవ్వడం మానేశారు.




# 15. అడయారు

**ప్రతి ఒక్క ప్రయాణానికి ఒక గమ్యం ఉంటుంది.**

అందరికీ ఆదర్శాలుండక పోవచ్చు. బ్రతుకుపైన ఆశ అందరికీ సహజం. మాన్యులకు ఆదర్శం ఒక్కటే గమ్యం. అదే జీవిత పరమార్థం. మాడం బ్లవట్స్కీ జీవితంలో లక్ష్యం, ఆదర్శం జడగా అల్లుకుని గమ్యం దిశగా ప్రయాణించింది. అనేక దశలు దాటి తీరంచేరబోతున్న తరుణం అది. అదే అడయారు! ఎక్కడో పుట్టి, ఎక్కడెక్కడో తిరిగి చివరకు అడయారు చేరింది.

అడయారు థియోసఫిస్టుల స్వర్గం. తర్వాతి కాలంలో 'అడయారు' అనే పదం థియోసఫీకి పర్యాయపదం అయింది. అది అంత సులభంగా రాలేదు. మాడం పట్టుదల, అకుంఠిత దీక్ష, కృషి. వాటి వెనుక కరిగిపోయిన అవమానాలు, అనుమానాలు, కుట్రలు, కుతంత్రాలు, అవహేళనలు ఎన్నో అడయారు నదిలో పడి కొట్టుకుపోయాయి.

1882 చివరన మదరాసు సమీపంలోని అడయారులో ఆల్కాట్ పెద్ద ఎస్టేట్ కారుచౌకగా కొని, థియోసాఫికల్ సొసైటీకి బహుమతిగా యిచ్చాడు. మహానుభావుడు, ప్రాతఃస్మరణీయుడైనాడు. ఏ ముహూర్తంలో అక్కడ అడుగుపెట్టారో గాని, అడయారు ప్రపంచపటం లోకి ఎక్కింది. దక్షిణభారతంలో, అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలో టి.ఎస్.కి. ఆదరణ పెరిగింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళీలు ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నారు. అన్ని ప్రాంతాలనుండి, పట్టణాల నుండి ఆహ్వానాలు కుప్పలుగా వచ్చిపడ్డాయి. కొత్తను స్వాగతించడం, ఆదరించడం దక్షిణ

భారతీయులకు అలవాటు. దక్షిణ భారతంలో ఎన్ని తత్వాలు, ఎన్ని మతాలు నెలకొనలేదు! ఏ రెండూ కలహించుకున్న దాఖలాలు లేవు. బ్లవట్స్కీ, ఆల్కాట్‌లు జంట కవుల్లాగా తిరిగారు.

భారత ఇతిహాసాలలోని ఆధ్యాత్మికతను, సనాతన ధర్మాలను వెలికి తీసి, ప్రపంచ దేశాలకు అందించడం చిన్న విషయం కాదు. ఆ కృషి భారతదేశానికే ఘనకీర్తి. అది భారత సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం.

ప్రచారానికి, ప్రాచుర్యానికి కొన్ని ఆకర్షణలు అవసరం. ఉత్తినే రమ్మంటే ఎవరూ రారు. మాస్టర్లు అంటే పరమ గురువులు అంటే మహర్షులు. మనకు గురు సంప్రదాయం ఉండనే ఉంది. మనది పుణ్యభూమి, తపోభూమి గదా! బ్లవట్స్కీ ఆ మీట నొక్కి ప్రచారం సాగించింది. ఆ విజ్ఞానం అంతా మీదే అనడంతో మన వారు ఉలిక్కిపడ్డారు. ఆమెతో సహకరించడానికి సన్నద్ధులైనారు. అలా థియోసఫీ ఉద్యమం 'దివ్యజ్ఞానం' ఉద్యమంగా ప్రచురమైంది. ఆల్కాట్ అఘటన ఘటనా సమర్థుడు. ఇసుకలోంచి తైలం పిండగల మేధావి. కొన్ని జిమ్మిక్కులు తెలిసినవాడు. ప్రజలనాడి పట్టగల నేర్పరి. **'మాగ్నటిక్ హీలింగ్'** మొదలుపెట్టాడు. శక్తిపాతంతో ఎలాంటి రోగాలకైనా చికిత్సలు చేయసాగాడు. పుణ్యం, పురుషార్థం కలిశాయి. ఇంకేం! పత్రికల ప్రచారం మరొకవంక. థియోసఫీకి తిరుగులేని ఆదరణ లభించింది.

బొంబాయిలోని కాకిగూడు (Crows Nest) కన్న అడయారు బీచ్ ఎస్టేట్ వేయి రెట్లు సౌకర్యంగా ఉంది. మద్రాసు సముద్ర తీరం పదిమైళ్లు పైగా ఉంది. అడయారు నది సముద్రంలో కలిసేచోట ఉన్న థియోసాఫికల్ సొసైటీ భవనం ఒక పెద్ద ప్రాచీన కట్టడం. మేడ పైభాగం అంతా బ్లవట్స్కీ స్వంతానికి. అందులో ఒక గదిని 'ఆకల్ట్' కార్యకలాపాలకు కేటాయించింది. అందులోకి ఎవరినీ రానీయదు. తను మాస్టర్లతో చర్చించే గది అది. ఇద్దరు మాస్టర్ల ఫొటోలు సంపాదించి అందులో అలంకరించింది. మాస్టర్సు నుండి వచ్చే లేఖలు, సందేశాలు అందుకునే ప్రదేశం ప్రత్యేకం. ఎవరైనా మాస్టర్స్‌తో మాట్లాడ దలిస్తే ఆ గదిలోకి పంపేది. అసలు ఈసొటరిక్ సర్కిల్‌లో చాలా కొద్దిమందికే ప్రవేశార్హత.

ఆవరణ అంతా ఇరవై ఒక్క ఎకరాలు. పురాతన భవనాలకు తెల్లటి వెల్ల వేశారు. బిల్డింగ్ ముందర పెద్ద తోట. అందులోదే మర్రిచెట్టు. ఊడలు దిగి, వయసు తెలియ నీయదు. అక్కడే టి.ఎస్. సమావేశాలు జరిగేవి. తర్వాతి కాలంలో తత్వవేత్త, జిడ్డు కృష్ణమూర్తి (J.K.) ప్రసంగాలు ఆ మర్రి నీడనే జరిగాయి.

**దామోదర్ కె. మావ్లంకర్** (ఏప్రిల్ 1883)

నిన్నటి దినం చాలా ముఖ్యమైంది. రాత్రి మాడం ప్రక్కన నేను, నరసింహ శెట్టి కుర్చీలలో కూర్చుని మాట్లాడుతున్నాం. విసన కర్రలతో గాలి విసురుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నాం. మాడంకి నెమ్మదిగా నిద్రపడుతోంది. ఒక్కసారిగా మాడం గావుకేక పెట్టి లేచి కూర్చుంది. ఏమైంది? ఏమైనా పీడకల వచ్చిందా? మేము కంగారు పడిపోయాం. అయినా కలలకు కంగారుపడే మనిషా తను?

"ఆయన వస్తున్నారు! కదలకండి. భయపడి పారిపోకండి. మెదలకుండా కూర్చోండి" (ఆయనంటే మాస్టర్ మోరియా – మాడం గురువు) మా ఇద్దరి చేతులు తన రెండు చేతులతో గట్టిగా పట్టేసింది.

రెండు నిమిషాలలో డోర్ కర్టెన్ తొలగించి మహాత్మా మోరియా లోపలకు వచ్చారు. ఆయన రాక విచిత్రంగా ఉంది. అడుగులు వేస్తున్నట్లే అనిపించలేదు. గాలి వాలుకు లోపలకు దూసుకు వచ్చినట్లుంది. దగ్గరగా వచ్చి మాడం ఎదురుగా నిలబడ్డాడు. మంచానికి ఇటువైపు మేము అటు మాస్టర్ మోరియా మధ్యలో మాడం. అద్భుతమైన సన్నివేశం. మేము మాస్టర్‌ని ఫిజికల్‌గా చూచినట్లే ఉంది.

గురువు గారిని నేను లోగడ చూచాను కనుక వెంటనే గుర్తించ గలిగాను. వైట్ లాంగ్‌కోట్, పెద్ద తలపాగా, గిరజాల జుత్తు, పొడవు గడ్డం. మేము వెంటనే వెళ్లి కిటికీ దగ్గర నిలబడ్డాం. బయట పండువెన్నెల. పౌర్ణమి కావచ్చు. మాస్టర్ రెండు చేతులూ చాచి మాడం తలను స్పృశించాడు. ఆమె చేయి చాచింది, కానీ ఆమె చేతికి మాస్టర్ శరీరం తగిలినట్లు లేదు. అది ఆస్ట్రల్ శరీరం. ఉత్త గాలి, కాంతి కలిసి భౌతిక శరీరం అనే భ్రమ కలిగించింది. మాస్టర్ చేతిలో ఒక కవరు ఉంది. మాడం ఆ కవరు అందుకుంది. మాస్టర్ మా వైపు తిరిగి చేయి ఊపారు. 'బై' చెప్పాడా? ఏమో? నాలుగు అడుగులు వేసి తర్వాత అంతర్ధాన మైనాడు. మాడం ఆ ఉత్తరం నాకిచ్చింది. దానిని నాకోసం మాస్టరు తెచ్చారా? నాకిమ్మని చెప్పారా? ఏమో! అది ఎన్నటికీ మరచిపోలేని అనుభవం.

**హెచ్.ఎస్. ఆల్కాట్** (ఆగస్టు 1883)

మేజర్ జనరల్ మోర్గన్ ఆహ్వానంపై మాడం బ్లవట్‌స్కీ ఊటీ వెళ్లింది. నేను ఇంగ్లండు నుండి తిరిగి వచ్చేసరికి ఆమె కనిపించక పోవడం వల్ల నేనూ ఊటీ బయలు దేరాను. అప్పట్లో నీలగిరి కొండల క్రిందివరకే రైలు ఉండేది. అక్కడ నుండి గుర్రం బగ్గీలలో, టాంగాలలో కొండపైకి వెళ్లాలి. అంతా మెటల్

రోడ్డు. రెండు చక్రాల టాంగాకు రెండు గుర్రాల్ని కట్టి లాగించేవారు. పర్వత ప్రాంతం, పైగా అరణ్యం. చల్లని గాలి హాయిగా ఉంది. మధ్యాహ్నానికి రెస్ట్ హవుస్ దగ్గర విశ్రాంతి. కొండలపైకి పోతుంటే ఎటుచూసినా పూలతోటలు నయనానందం, హృదయానందకరం.

కూమర్ రోడ్డుపైన టోల్‌గేట్ వద్దకు వెళ్లేసరికి మాడం బ్లవట్స్కీ, మిసెస్ మోర్గన్ వచ్చి స్వాగతం చెప్పారు. మాడం ఆరోగ్యం బాగైంది చాలావరకు. అక్కడ మాడంకు చాలామంది కొత్త మిత్రులు దొరికారు. ఒకామెకు గాలిలోంచి మరకతం (Topez) సృష్టించి బహూకరించింది. నీలగిరుల్లో 'తోడా' కొండజాతి వారిని స్టడీ చేసింది. ఆటవికుల్లో, కొండజాతుల్లో అద్భుతమైన అతీంద్రియ శక్తులు ఉంటాయని ఆమె విశ్వాసం, అనుభవం కూడా.

ఊటీలో రాత్రి రెండు గంటల వరకు రాస్తూ, ప్రూఫులు చూస్తూ గడిపేది. ఆమె కళ్లలో 'మ్యాజిక్' అందర్నీ ఆకర్షించేది. అర్థరాత్రి దాటే వరకు మేల్కొని ఉండడానికి అసలు కారణం పన్నెండు గంటలు దాటిన తరువాత మాస్టర్లు వస్తుంటారు. వారి కోసం నిరీక్షణ.


సెప్టెంబరు 16న టాంగాలో ఊటీ నుండి కోయంబత్తూరు వెళ్లాం. అక్కడ నుండి పాండిచ్చేరి, ఆపైన మద్రాసు ప్రయాణం. పాండిచ్చేరిలో టి.ఎస్. బ్రాంచి ఏర్పాటు చేసింది. అక్కడ నారాయణ గురు మాడం బ్లవట్స్కీని కలిశారు.

**విలియం టి.బ్రౌన్** (సెప్టెంబరు 1883)

నేను ఇంగ్లండు నుండి ఆగస్టు 25న బయలుదేరి సెప్టెంబరు 29న మద్రాసు చేరుకున్నాను. నౌకలో ప్రయాణం. అడయారు థియోసాఫికల్ సొసైటికి వెళ్లగానే మాడం బ్లవట్స్కీ స్వయంగా స్వాగతం చెప్పారు. బ్లవట్స్కీ వంటి విదుషీమణిని నేను అంతవరకు చూడలేదు. ఉన్నత విద్యావంతులైన మహిళలు చాలా మంది ఉన్నారు. బ్లవట్స్కీ ప్రతిభ ముందు ఎవరూ నిలవలేరు. ఆమె హృదయం నిష్కల్మషం, ఎంతో పవిత్రం అనిపిస్తుంది. ఆమె చూపు, రూపు, వర్తనం అద్భుతం.

అక్కడ నన్ను అమితంగా ఆకర్షించింది మాడం నివాసంలోని 'ఆకల్ట్ రూం'. పృచ్ఛకుల ఉత్తరాలు ఆ గదిలో టేబుల్ పైనున్న బాక్సులో ఉంచుతారు. మాస్టర్స్ వాటిని తీసుకుపోయి జవాబులు రాసి తెచ్చి ఆ బాక్సులో ఉంచుతారు. ఆ గదిలోకి ఇతరుల్ని అనుమతించరు. మాడం ఆ గదిలోకి నన్ను పిలిచింది. ఆ గది దివ్యమందిరం. అక్కడ చాలా ఎనర్జీ ఉంది. శక్తిపాతం ధారాళంగా జరుగు

తుంది. అక్కడ అలంకరణ గొప్పగా ఉంది. ఆ రోజున ఆ గదిలో ఉన్నది ఏడుగురం. 'ఏడు' మాడం సెంటిమెంటు నంబరు.


జ్వాల్‌కూల్

అక్కడ నలుగురు ఆధ్యాత్మిక విద్యార్థులున్నారు. వయసులో పెద్దవారే. ఒక్కొక్కరు ఉత్తరం బాక్సులో పెట్టి, సాష్టాంగ నమ స్కారం చేశారు. రెండు నిమిషాల తర్వాత మాడంకు ఏదో సందేశం అందుతుంది. (అది సైకిక్ టెలిగ్రాం) ఎవరికో ఒకరికి జవాబు సిద్ధంగా ఉందని సంకేతం. జవాబులు టిబెట్ కవర్లలో వస్తాయి.

దామోదర్ కె. మావ్లంకర్ ఒక కవరు నాకు అందించారు. మావ్లంకర్ మాస్టర్ కుత్‌హోమికి ప్రియశిష్యుడు. మాడంకి అత్యంత ఇష్టుడు. మాస్టర్ నన్ను గుర్తించినందుకు చాలా ఆనందం కలిగింది. 'మాస్టర్, థాంక్యూ' అన్నాను.

★ ★ ★

"మద్రాసు నుండి షోలాపూర్‌కి 26 గంటలు ప్రయాణం. అక్కడకు వెళ్లి ఆల్కాట్‌ని కలిశాను. ఉత్తర భారతంలో ప్రచారానికి ఆల్కాట్‌కు నేనూ, దామోదర్, మరికొందరం సహకరించాలి. ఆల్కాట్ మంచి వక్త. ఒక మీటింగులో శ్రోతల్లో ఉన్న వారిలో ముగ్గురు, నలుగురు నా దృష్టిని ఆకర్షించారు. వారు నిశ్చలంగా కూర్చుని ఉన్నారు. తర్వాత తెలిసింది మాస్టర్సు, వారి శిష్యులు ఆస్ట్రల్ రూపంలో వచ్చి కూర్చున్నారని. అలహాబాదు మీటింగులో నేను మాస్టర్ కె.హెచ్.ని గుర్తించాను. ఒక్క నిమిషం కనిపించినా వారు నన్ను గుర్తించారు. వారి దృష్టి నా పైన పడ్డది. లాహోర్‌లో ఆల్కాట్ మీటింగుకి కుత్‌హోమి మాస్టర్ భౌతికంగా వచ్చారు. నవంబరు 20న నాగదిలో పట్టపగలే ప్రత్యక్షమై ఆశ్చర్యపరిచారు. "నాదీ నీవంటి రూపమే కంగారు పడకు" అని తన రాకకు గుర్తుగా ఒక సిల్కు స్కార్ఫ్ సృష్టించి ఇచ్చివెళ్లారు. విజన్‌లో చాలా మందికి కె.హెచ్. కన్పిస్తుంటారు.

నవంబరు 21సాయంత్రం ఆల్కాట్, దామోదర్, నేను షామియాన క్రింద కూర్చుని ఉండగా జ్వాల్‌కూల్ మాస్టరు దర్శనమైంది. ఎవరో మాస్టర్ రానున్నారని ఆయన శిష్యుడొకరు ముందుగానే వచ్చి హెచ్చరించాడు. మహాత్మ జ్వాల్‌కూల్ మా వద్దకు వచ్చి దామోదర్‌తో మాట్లాడి వెళ్లాడు.

దామోదర్ అదృష్టవంతుడు. మంచి మీడియం. మాస్టర్ల అనుగ్రహం సంపాదించ గలిగాడు. లాహోర్ నుండి జమ్మూ వెళ్లాం. మా బృందం అంతా అక్కడ మహాత్మా కుత్‌హోమిని కలిసే అవకాశం కలిగింది. మేము విడిది చేసిన ఇంటి వరండాలో చివరివరకు నడిచాను. ఏదో ప్రేరణ. అక్కడ వారిని చూచాను. అదే రోజు రెండు గంటల ప్రాంతంలో కుత్‌హోమి ఆల్కాట్ గదికి వచ్చాడు. ఆయన చేతిలో సిల్కురుమాలలో చుట్టిన ఒక కాగితం ఉంది. దానిని ఆల్కాట్ చేతిలో ఉంచి కుడిచేతితో గుప్పిట మూసి వెళ్లిపోయాడు.

అక్కడ మా క్యాంపు మూడు రోజులు. ఒక రోజున టెంట్‌లో పడుకుని నిద్రపోతుండగా ఎవరో బలంగా నన్ను నొక్కినట్లు అనిపించింది. వెంటనే ఆ చేతిని గట్టిగా పట్టేశాను. మా క్యాంపు పోలీసు రక్షణ పరిధిలో లేదు. ఎవరైనా దొంగ అఘాయిత్యం చేయడానికి వచ్చాడని అనుమానం వేసింది.

హిందూస్థానీలో అడిగాను, "ఎవరు నువ్వు? ఎవరు కావాలి నీకు?"

ఓ తీయని గొంతు వినిపించింది. "నేనెవరో నీకు తెలుసులే అరవకు".

అది మాస్టర్ కె.హెచ్. గొంతు. నా పట్టు సడలించాను. మాస్టర్ నా నుదురు తాకి ఆశీర్వదించారు. గురువు గారు వెళ్లాక కళ్లు తెరిచాను. నా చేతిలో ఒక కాగితం ఉంది.

★ ★ ★

మరునాడు ఉదయం పదిగంటల ప్రాంతం. టెంట్‌లో దామోదర్, బ్రౌన్, నేను ఉన్నాం. కొంచెం సేపటికి ఎవరో దూరం నుండి వస్తున్నట్లు అనిపించింది. అతని వేషం చూచి హిందువు అనిపించింది. దగ్గరకు రమ్మని దామోదర్ పిలిచాడు. అతను వచ్చి కాసేపట్లో మాస్టర్ కె.హెచ్. వస్తున్నట్లు చెప్పాడు. దామోదర్ వెళ్లి కె.హెచ్.తో మాట్లాడి వచ్చాడు.

దామోదర్ గట్టివాడు. మాస్టర్ల దృష్టిలో పడ్డాడు. తర్వాత మూడు రోజుల పాటు మాస్టర్ కుత్‌హోమి రోజూ వచ్చి దామోదర్‌తో ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు.

ఒకరోజు నేను మాస్టర్ కె.హెచ్.ని ధైర్యం చేసి ప్రశ్నించాను.

"మాస్టర్, సొసైటీ సభ్యుల దృష్టిలో మీరు చాలా వృద్ధులు. కాని మీ వయస్సు అరవై మించి లేదనిపిస్తుంది."

"అదంతా వేదాంత స్వామి ప్రచారం. అయినా గురువులకు వయసేమిటి? గురువు కాలానికి అతీతుడు గదా. మాస్టర్లంతా అమరులే, అమృతులే."

**భవానీ శంకర్** (జనవరి 1884)

జబల్‌పూర్ థియోసాఫికల్ సొసైటీ సెక్రటరి నివారణ్‌చంద్ర ముఖర్జీ. ఆయన ఒకరోజున నాతో అన్నాడు. “సొసైటీలో 27 మంది చేరారు. చెబుతుంటే శ్రద్ధగా వింటున్నారు. అంతలో గది ఒక్కసారిగా నిశ్శబ్దం అయింది. ఏదో శక్తి ప్రవేశించినట్లు అందరి మనస్సులు మూగబోయాయి. ఎవరిలోను చలనం లేదు. ఇంద్రియాలు పనిచేయడం మానేశాయి. మహాత్మ మోరియా వచ్చినపుడు అలా వాతావరణం స్థంభిస్తుందని కూడా చెప్పారు. అది ఒకవిధంగా శక్తిపాతం. ప్రతి ఒక్కరిలో చైతన్యం ఉరకలు వేస్తుంది.

ఒక యోగి నుండి ప్రసరించే శక్తి ఎలెక్ట్రో మాగ్నెట్ శక్తి కన్న ఎక్కువది. మాస్టర్ ఆత్మ తన రాకను ఆవిధంగా తెలియచేస్తుంది. వాతావరణమే మాస్టర్ శక్తికి అట్లా మారిపోతుంది. ఒక్కసారి గాలి స్తంభించిపోతుంది. మనస్సులు మొద్దుబారి పోతాయి. మా మీటింగు జరిగే చోటుకు మాస్టర్ వచ్చారు. అందరూ మాస్టర్ మోరియాను భౌతికరూపంలో చూడగలిగారు ఆరోజు.

**ఫ్రాంజ్ హార్ట్‌మన్** (డిసెంబరు 1883)


నేను 1883 డిసెంబరు 4న మద్రాసు చేరుకున్నాను. జి. ముత్తుస్వామి చెట్టియార్ తన బండిలో నన్ను అడయారు తీసుకువెళ్లాడు. మేము వెళ్లేసరికి చీకటి పడ్డది. నాకోరిక మాడం వద్ద ‘ఆకల్టిజం’ నేర్చుకోవాలని. నా దృష్టిలో బ్లవట్‌స్కీ మహాయోగిని, దేవత.

పడుకోబోయే ముందు నాకు మాస్టర్ల ఫోటోలు చూడాలనిపించింది. వారిని గురించి వినడం, చదవడం తప్ప ఏ ఒక్కరి రూపం చూడలేదు. నన్ను మేడపైకి తీసుకువెళ్లారు. అది ధ్యానమందిరం. అందులో ఇద్దరి చిత్రాలే ఉన్నాయి. అక్కడనే ‘మహాత్మా లెటర్స్’ మెటీరియలైజ్ అవుతాయట. నాకు ఆసక్తి కలిగింది. నేను మాస్టర్‌కి ఒక ఉత్తరం రాశాను.

“మాస్టర్ నమస్కారం.

నా మనఃస్థితి గమనించి నాకు అర్హత ఉన్నదనిపిస్తే, నా కోరిక తీర్చ ప్రార్థన.”

నా చిన్ని ఏక వాక్య లేఖను కల్నల్ ఆల్కాట్‌కు యిచ్చాను. ఆయన దానిని మందిరంలో బాక్సులో పెట్టాడు.




రెండు రోజులు గడచినా సమాధానం రాలేదు. నాకు అర్హత ఉంటే ఏదైనా వారే చేస్తారు. మరల జ్ఞాపకం చేయడం అనవసరం. అయినా ఉండపట్టలేక ఆల్కాట్‌ని అడిగాను. "నా ఉత్తరం తెచ్చి పెట్టండి" అని –

ఆయన వెళ్ళిచూస్తే డబ్బాలో నా లేఖ లేదు. మాయమైపోయింది.

★ ★ ★


మాడం ఆరోగ్యం బాగా చెడిపోయింది. డాక్టర్లు ఆమెను యూరపు వెళ్లమని సలహా యిచ్చారు. ఆమెతోపాటు ఇంగ్లండు వెళ్లే పని మీద ఆల్కాట్ బయలుదేరాడు. మరో రెండు మూడు రోజుల్లో వారు బయల్దేరుతా రనగా, నా అంతట నేను మాడం గదికి వెళ్లి సొసైటీ విషయం ప్రస్తావించాను.

మాడం అన్నారు. "నీ సంకల్పం, ఆలోచనలు మంచిగానే ఉన్నాయి. అయినా మాస్టర్ల ఆమోదం కావాలి. సంకల్పం చేసి మెడిటేట్ చెయ్. ఏమంటారో చూడు. మాస్టర్స్ నీకే డైరెక్టుగా సమాధానం యిస్తారు."

అంతలో ఒక సభ్యుడు వచ్చి నన్ను పిలిచాడు. నా గదికి వెళ్లాను. అక్కడ టేబుల్ సొరుగులో మాస్టర్ దస్తూరిలో పెద్ద కవరుంది. విప్పి చదివాను. ఇంతకు ముందుగా నేను మాడంను అడిగిన విషయాలన్నింటికీ అవి సమాధానాలు. కవరులో మాస్టర్ మోరియా ఫొటో ఒకటి ఉంది. ఫొటో వెనుక నాపేరు రాసి ఉంది.

1884 ఫిబ్రవరి 7న మాడంతో పాటు మోహిని చటర్జీ, నేను బొంబాయి బయలుదేరాం. బొంబాయి వెడుతుండగా ఒక విచిత్ర సంఘటన జరిగింది. మాడం

నా వ్యాసం ఒకటి చదవడానికి తీసుకుని అక్కడక్కడ మార్పులు చేసింది. దానిని నేను బ్యాగ్‌లో వేసుకున్నాను. సాయంత్రం మాడం ఆ వ్యాసం కావాలని అడిగింది. ఇచ్చాను. అందులో ఖాళీ పేజీలో మాస్టర్ స్వదస్తూరిలో నాలుగు వాక్యాలున్నాయి.




ఫిబ్రవరి 20న మాడం ద్వారా మాస్టర్ మోరియా నాకో టిబెట్ 'పతకం' అందచేశారు. యూరపు దాకా ప్రయాణం. 'ఆ' పతకం జాగ్రత్తగా ఉంచుకోమని సలహా యిచ్చారు. దానిని మెడలో వేసుకోడానికి చెయిన్ రాదు. ఊళ్లోకి వెళ్లి ఒక చెయిన్ కొందామంటే దొరకలేదు. గదికి వచ్చి అటు ఇటు పచార్లు చేస్తుండగా కిటికీవద్ద రిబ్బన్ ఒకటి కనిపించింది. అది కొత్తది. దాంతో పతకం బిగించి మెడలో వేసుకున్నాను.

★ ★ ★

మాస్టర్ ఆశ్రమంలో అభివృద్ధి బాగా జరుగుతుంది. దామోదర్‌ని మాస్టర్ మోరియా తన ఆశ్రమానికి పిలిపించుకున్నాడు. అక్కడ కొద్ది రోజుల్లోనే దామోదర్ యువకుడుగా మారాడు. ఆల్కాట్ పుష్టిగా తయారైనాడు. కాశ్మీరు నుండి తిరుగు ప్రయాణంలో జైపూరు వెళ్లారు. అక్కడ 'అంబర్' అనే శిథిల నగరం ఉంది. ఆ నగరం రెండు వేల సంవత్సరాల నాటిది. ఒకప్పటి జైపూర్ రాజధాని అది. అంబర్‌లో చిత్రమైన శక్తులున్నాయని మాడం బ్లవట్‌స్కీ అన్నారు. అక్కడ ఆత్మారాం స్వామి అని ఒక మహాయోగి ఉండేవాడట. ఆయన మాస్టర్ కె.హెచ్., మాస్టర్ మోరియాలను కలుసుకున్నారని, టిబెట్ వెళ్లి వచ్చాడని అంటారు.

స్వామి ఆత్మారాంను రాజస్థానీలు గురువుగా పూజిస్తుంటారు.



# 16. తుఫాను మొదలైంది

**అ**న్నీ సవ్యంగా సాగినంతకాలం మనిషి భగవంతుడ్ని పట్టించుకోడు. అయితే అన్ని కాలాలు మనకు అనుకూలంగా ఉండవు.

1884 ఆరంభం వరకు శుభం అనిపించినా పోనుపోను కడలిలో కల్లోలం మొదలైంది. సిలోన్‌లో బౌద్ధాన్ని ఉద్ధరించే పనిలో ఆల్కాట్ లండన్ వెళ్లాడు. జబ్బు ఎక్కువై అనారోగ్యంతో బ్లవట్‌స్కీ యూరపు ప్రయాణం పెట్టుకుంది. దేవుడు, పూజారి లేని ఆలయమైంది థియోసాఫికల్ సొసైటీ. మాడంకు సహాయంగా ఇద్దరు హిందూ సభ్యులు, ఒక పార్సీ వెళ్లారు. సముద్ర ప్రయాణంలో ఆమె శ్వాస తీసుకోవడమే కష్టమైపోయింది. వెంట వెళ్లిన శిష్యులలో మోహిని చటర్జీ మేధావి, చురుకైనవాడు. మాడం కొంతకాలం 'నీస్'లో ఆగి తర్వాత పారిస్ చేరుకున్నారు.

అప్పటి ఆమె మనఃస్థితి అల్ల కల్లోలంగా ఉన్నట్లు ఖండాలవాలా అనే థియోసఫిస్టుకి రాసిన లేఖలో తెలుస్తోంది ...

"మాస్టర్ సంకల్పాన్ని నేను ప్రశ్నించను. టైం అయింది రమ్మంటే వెళ్లడానికి రెడీగా ఉన్నాను. నన్ను దేశాంతరాలకు పంపదలచింది మాస్టర్లు, పంపారు. వెళ్లాను. ఎక్కడ ఉన్నా నేను సంకల్పిస్తే నాకు పూర్ణ ఆరోగ్యం ప్రసాదించగలరు. లోగడ రెండుసార్లు నన్ను మృత్యువు నుండి కాపాడింది వారే. కల్నల్ ఆల్కాట్ లండన్ వెళుతున్నాడు. నేను ఎక్కడికి పోతానో, ఎక్కడ తేలతానో నాకు తెలియదు."

అది అప్పటి బ్లవట్స్కీ పరిస్థితి. ఆమె 'సీస్' నుండి రావడం కోసం మోహినీ ఎదురు చూస్తున్నాడు. అతనికీ ఒక లేఖ అందింది. అది ఎవరు రాసిందీ తెలియదు. అది సాధకుల ప్రవర్తన గురించి.

"ఉపాసిక (బ్లవట్స్కీ) వచ్చినప్పుడు భక్తి ప్రపత్తులతో స్వాగతం చెప్పాలి. ఆమెను కన్న తల్లిలా గౌరవించాలి. భారత సంప్రదాయాలు, ఆచారాలు మంచివి. ఫ్రెంచి వారి మర్యాదలు యోగం విషయంలో పనికిరావు. ఒకవేళ కల్నల్ అడిగితే చెప్పు "నమస్కారం చేస్తున్నది శరీరానికి కాదని, లోపలి ఆత్మకని." ఆయన నాకంటే పెద్దవాడు, మహాత్ముడు. అయినా తన వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యత నాది. పెద్దలు కనిపించినప్పుడు మర్యాదగా నమస్కారం చేయడం నేర్చుకో."

['నా కంటే పెద్దవాడు' అన్నది మహాచౌహాన్ గురించి. మహాచౌహాన్ హిమాలయ యోగులలో శ్రేష్ఠుడు. హిందూ సంప్రదాయంలో 'నమస్కారం' వినయాన్ని తెలియచేస్తుంది.]

**బ్లవట్స్కీ రాసిన ఉత్తరం :**

*ఫిబ్రవరి 17 (1884) : ఆల్కాట్ సొంత పనుల మీద లండన్ వస్తున్నాడు. మాస్టర్ మోరియా తన శిష్యుడు మోహినీ మోహన్ చటర్జీ రూపంలో నా వద్దకు పంపుతున్నాడు. ఆ వచ్చేవాడు అసలు 'మోహిని' కాదు – మాస్టర్ ప్రతినిధి. శరీరం, రూపం చూచి భ్రమపడకు. లోపల పనిచేసేది మాస్టర్. ఇంక నా విషయం అంటావా? వయసు మీరింది గదా! ప్రశాంతంగా చచ్చిపోవాలని ఉంది. ఆరోగ్యమూ అంతంత మాత్రమే. ఎవరికీ, ఎందుకూ పనికిరాని మనిషిని నేను. రోజూ కాస్త కాస్త చచ్చిపోతున్నాను.*

★ ★ ★

**పొరపాటు :**

ఆమె చేసిన పని పూర్తి చేయకుండా మాస్టర్లు అనుమతించరు. 1884 ఏప్రిల్ 24 మరొక లేఖ ఎ.పి. సిన్నెట్‌కు అందింది. "మోహిని లండన్ రావడానికి కారణం – అక్కడ లాడ్జి పనులు చక్కబెట్టడం కాదు, వేరే ముఖ్యమైన కార్యం ఉంది. ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందిన వ్యక్తి 'స్వబుద్ధి'తో పనిచేయడు. అతడిని నడిపించే ఆత్మ లోపల ఉంటుంది. వేరొకరి ఆత్మ అతన్ని ఆవహించి పనిచేయిస్తుంది. అది చనిపోయిన మనిషి ఆత్మే కానవసరం లేదు. ఒక పరమ గురువు 'మహాత్మ' అభివృద్ధి చెందిన శిష్యుని శరీరంలో ప్రవేశించి పనిచేస్తుంది. అది 'ఆవేశనం'. పూర్తి పరకాయ ప్రవేశం కాదు.

చిన్నా చితకా అవరోధాలు ఆటంకాలు ఏర్పడినా ఇంగ్లండులో, ఫ్రాన్సులో థియోసఫి సెంటర్లు చాలా ఏర్పడ్డాయి. భారతీయ ఆధ్యాత్మిక తత్వం తద్వారా యూరపుకు పాకింది. ఆ మాత్రం స్పందన ఇంకా అమెరికాలో రాలేదు. అమెరికా తటపటాయిస్తోంది. మొత్తంమీద అతీంద్రియశక్తుల కథలు జనాల్లో బాగా ప్రచారం పొందాయి.

పారిస్‌లో ఉన్న బ్లవట్‌స్కీని చూడడానికి ఆమె సోదరి ఝెలిహోవ్‌స్కీ వచ్చింది. అయిదు సంవత్సరాలు ఇండియాలో ఉండివచ్చిన చెల్లెల్ని చూచి ఆశ్చర్యపడ్డది. ఎంత మారిపోయింది! ఒక యోగినిలా తయారైంది. సొసైటీ పనులతో బిజీగా ఉన్నా జర్మనీ, రష్యా, అమెరికా నుండి వచ్చే అతిథులతో ఆత్మీయ చర్చలు సాగిస్తోంది. నిజానికి తను ఎవరి ఆసక్తిని ప్రోత్సహించడం లేదు. నిర్లిప్తంగా ఉంటోంది. అనాసక్త యోగినిగామారి ప్రాపంచిక విషయాలు ఏవి అడిగినా అసహ్యించుకుంటోంది. నిరుపయోగమైన విషయచర్చలతో తన శక్తిని వృథా చేసుకోవడం ఇష్టం లేదు. అసలే తను జబ్బుగా ఉంది. ఏ మాత్రం సంకల్పశక్తిని అతీంద్రియశక్తి కోసం వినియోగించినా చాలారోజుల వరకు కోలుకోలేక పోతోంది. అలసిపోతే జబ్బు తిరగ బెడుతోంది.

ఫ్రాన్సు, జర్మనీల్లో విస్తృతంగా పర్యటిస్తూ, థియోసఫీకి విశేష ప్రచారం చేసింది. అప్పుడప్పుడు లండన్ వెళుతుండేది. ఫ్రాన్సు, జర్మనీలు కొత్త ఫిలాసఫీని ఆదరిస్తాయి. ఇంగ్లండుకు సంప్రదాయంపై మక్కువ. అమెరికాది అదీ ఇదీ కాని అయోమయ స్థితి. అమెరికా దేనినీ పదికాలాలపాటు నిలబెట్టుకోదు. ఎప్పటి కప్పుడు కొత్త రుచులు కావాలి. కొత్త ప్రయోగాలు చేస్తుండాలి.

★ ★ ★

1884 నాటికి బ్లవట్‌స్కీ ఏకైక తత్వవేత్తగా పేరు గడించింది. ప్రతిభావంతు రాలని, గొప్ప భావుకురాలని పేరు వచ్చింది. లండన్‌లో బ్లవట్‌స్కీతో పాటు ఆల్కాట్, మోహిని చటర్జీలకు డిమాండ్ ఎక్కువైంది. మోహిని హిందూతత్వం, ఆల్కాట్ బౌద్ధం, బ్లవట్‌స్కీ థియోసఫి మూడు కోణాలలో దాడి సాగించారు. లండన్ ప్రసంగాలలో ఆల్కాట్ గొంతు మారింది, స్వరం మారింది. ఆల్కాట్ తను వేరు, బ్లవట్‌స్కీ వేరు, మోహిని వేరు అనే అభిప్రాయం కలిగించసాగాడు. సిద్ధాంత విభేదం కొట్టవచ్చినట్లు కనిపించసాగింది.

లండన్ థియోసాఫికల్ లాడ్జి ప్రెసిడెంటును మిసెస్ కింగ్స్ ఫోర్డును మాడం ఆమోదించలేదు. ఆమె సిన్నెట్ మనిషనే అనుమానం. మాస్టర్ల ఆదేశాలను అప్పుడప్పుడు బ్లవట్‌స్కీ ఖాతరు చేయకపోవడం మామూలే. బ్లవట్‌స్కీకి బైబిల్

అంటే బొత్తిగా అభిమానం లేదు. థియోసఫీ కోణంలో బైబిల్‌ను అధ్యయనం చేయాలంటుంది. "Finding of Christ" అందుకోసం రాసిన పుస్తకం.

1884లో పారిస్‌లో ఉండగా జడ్జి ఇండియా వెళుతూ వచ్చి కలిశాడు. జడ్జి మాడంకు ప్రియశిష్యుడు. సొసైటీ ట్రెజరర్. పారిస్‌లో ఉన్న కాలంలో జడ్జి **'సీక్రెట్ డాక్ట్రిన్'** రచనా వ్యాసంగంలో ఎంతగానో సహకరించాడు. ఒక దశలో బ్లవట్స్కీ "ఆ పుస్తకం నువ్వే రాసి, పూర్తి చేసి, నీ పేరుతో వేసుకో" అన్నది.

బ్లవట్స్కీ **'సీక్రెట్ డాక్ట్రిన్'** రచన చేస్తున్నప్పటి అనుభవాలు జడ్జి ఇలా రాశాడు :

"H.P.B తీవ్రంగా ఆలోచిస్తూ ఆలోచిస్తూ సడెన్‌గా కుర్చీలోంచి లేచేది. కిటికీ దగ్గరగా వెళ్లి చేయి ఎత్తి ఏదో సౌంజ్ఞ చేసేది. అప్పుడు దూరం నుండి గొప్ప సంగీతం వినిపిస్తుండేది. ఆ సంగీతం దగ్గరగా వచ్చి గది నిండా వ్యాపించేది. ఆమె ప్రియ శిష్యుడు మోహిని మాడం పాదాలపైన తలపెట్టి వింటూ పరశించి పోయేవాడు. మాడం దివ్యజ్ఞానం, మహత్తత్వం వర్ణనాతీతం ... చెరిగిపోనిది."

## కుట్రలు : కుతంత్రాలు

1884లో యూరపుకు వెళ్లే ముందు అడయారు థియోసాఫికల్ సొసైటీ నిర్వహణకు ఒక కౌన్సిల్ ఏర్పాటు చేశారు మాడం బ్లవట్స్కీ. అప్పుడు కౌన్సిల్‌లో కొన్ని చీడపురుగులు జొరబడ్డాయి. 'కౌలంబ్' అనే ఫ్రెంచి వ్యక్తిని ఎవరూ అనుమానించలేకపోయారు. అతను పెళ్లాంతో కలిసి (ఆమె ఇంగ్లీషు మహిళ) కుట్ర చేశాడు. బ్లవట్స్కీని అపకీర్తి పాల్చేయడం ఆ దంపతుల అభిమతం. వారికి సొసైటీని ఎలాగైనా నాశనం చేయాలన్న దుర్బుద్ధి పుట్టింది.

పాపం! బ్లవట్స్కీ, ఆల్కాట్‌లు అటువంటి ప్రమాదం ఊహించలేదు. కాని పైనున్న మాస్టర్లు పసిగట్టారు. ఆల్కాట్, మోహిని పారిస్ నుండి లండన్ వెళుతుండగా వారెక్కిన రైలు బోగిలోకి ఒక లేఖ పంపాడు మాస్టర్ కుత్‌హోమి. అందులో అడయార్ కుట్ర గురించి ఉంది. మాడం కౌలాంబ్ కుట్రలో ఆమె మొగుడు ఒక గంగిరెద్దు. ఇంగ్లండు నుండి కొత్తగా వచ్చి చేరిన 'లేన్ ఫాల్స్' సలహాదారు. కుట్ర గురించి జర్మనీలో ఉన్న ఆల్కాట్‌కు, సిన్నెట్ భార్యకు సమాచారం అందింది.

టిబెట్‌లో 'తసిలామా' ఉండే ప్రదేశం షిగాట్సె. అక్కడ చాలామంది పరమ గురువులు (మాస్టర్లు) ఉంటారు. అక్కడ నుండే టెలిపతిలో లేఖలు పంపుతుంటారు. సిన్నెట్‌కు విశ్వాసం ఉన్నా నమ్మకం తక్కువ. చిత్రమైన స్వభావం. మానవ

స్వభావాలను కర్మలతో ముడిపెట్టడం అతనికి నచ్చదు. శిష్యుడు గాని, సాధకుడు గాని ఆత్మ విశ్వాసంతో సాధన చేయాలి తప్ప గుడ్డినమ్మకంతో కాదంటాడు. ప్రతి ఒక్కరు వాస్తవం తానుగా గ్రహించాలన్నది ఆయన సిద్ధాంతం. గురువుపైన పూర్ణవిశ్వాసం ఉంచాలి. ఒక సిద్ధాంతాన్ని త్రికరణశుద్ధిగా నమ్మాలి.

**మాస్టర్ కె. హెచ్. సిన్నెట్‌కు రాసిన లేఖ :**

"సొసైటీలో చేరినవారి కర్మలు సైతం సొసైటీ మీద పనిచేస్తాయి. మంచివారి వల్ల మంచి ఫలితాలు కలుగుతాయి. చెడ్డవారివల్ల చెడ్డ ఫలితాలు వెంటనే తెలుస్తుంటాయి. అతీంద్రియ శక్తులు తెలుసుకోవడం మంచిదే. ఆ జ్ఞానం మనిషికి మేలు చేస్తుంది. కొంత కీడు తొలగిపోతుంది."

"సూత్రాలు, నియమ నిబంధనలు కఠినంగా అనిపించవచ్చు. ఆచరణ యోగ్యం కాకపోవచ్చు. అవి ఒక కాలానికి పరిమితం. కాలానికి అనుగుణంగా సూత్రాలను వినియోగించుకోవాలి. అనుకూలంగా మలచుకోవాలి. అందరూ అన్ని ధర్మాలు పాటించ నవసరం లేదు. సంస్థ వ్యవహారాలలో భూకంపాలు, ఉప్పెనలు వస్తుంటాయి. ఒక భూకంపం వల్ల కొంతనష్టం కలిగినా తర్వాత మేలు కలుగుతుంది. వరదలు వస్తే అప్పటికి నష్టం కనిపించినా తర్వాత చాలా సంవత్సరాలు బంగారం పండుతుంది. నేల సుభిక్షం అవుతుంది."

## కౌలాంబ్ కుట్ర

కౌలాంబ్ కుట్ర వెనక పెద్ద పెద్ద చేతులున్నాయి. చాలామంది తలలు కలిసి పనిచేశాయి. అసలు కారణాలు :

1. భౌతిక వాదాన్ని విమర్శించడం. 2. సైన్సును చిన్న చూపు చూసి ఆధ్యాత్మికానికి పెద్దపీట వేయడం. 3. ప్రాచ్యదేశాల ప్రాచీన విజ్ఞానాన్ని అతిగా తలకెత్తుకోవడం. 4. బైబిల్‌ను విమర్శించడం. 5. క్రైస్తవమతాన్ని గౌరవించక పోవడం.

అంచేత క్రైస్తవ మిషనరీలు కౌలాంబ్ కుట్రలో చేతులు కలిపాయి. బౌద్ధానికి అతిగా ప్రాధాన్యత నివ్వడం యూరపు దేశాలకు నచ్చలేదు. వారి దృష్టిలో క్రైస్తవ మతం ఒక్కటే గొప్ప. జీసస్‌ను మించిన ప్రవక్త లేడు.

## కౌలాంబ్ అసలు కథ

మాడం బ్లవట్‌స్కీకి మాడం కౌలాంబ్‌కు పూర్వ పరిచయం ఉంది. ఆ పరిచయమే ఇప్పుడు బ్లవట్‌స్కీ కొంపమీదికి తెచ్చింది. ఆమె పీఠానికి ఎసరు పెట్టింది. 1870లో బ్లవట్‌స్కీ ఒక నౌకాప్రమాదంలో చిక్కుకుని ప్రాణాలతో

బయటపడ్డది. అప్పుడు చేతిలో ఒక్క రూబుల్ లేదు కట్టు బట్టలు తప్ప. రష్యా నుండి డబ్బు రావడం ఆలస్యమైంది. అప్పుడు కౌలాంబ్ ఆమెను ఆర్థికంగా ఆదుకున్నది. అప్పుడు కౌలాంబ్‌కు కైరోలో చిన్న హోటల్‌లో పని. బ్లవట్‌స్కీకి ఉచిత భోజనం, వసతి ఏర్పాటు చేసింది. అందుకు కృతజ్ఞతగా తొమ్మిది సంవత్సరాల తర్వాత కౌలాంబ్ దంపతులు కష్టంలో ఉన్నపుడు బొంబాయికి పిలిపించి థియోసాఫికల్ సొసైటీలో ఆశ్రయం యిచ్చింది. తర్వాత అడయారు రప్పించి పరపతి పెంచింది. కొంతకాలం సజావుగానే సాగింది. తర్వాత కౌలాంబ్ దంపతుల ప్రవర్తనతో ఆల్కాట్, బ్లవట్‌స్కీ లిద్దరూ విసిగిపోయారు. అయినా వాళ్లలో మార్పులేదు. మాడం సహించి ఊరుకోవడంతో మిగతవారు ఏమీ చేయలేక పోయారు.

కౌలాంబ్ పెళ్లాం బొంబాయి చేరిన రోజు నుండే గూఢచర్యం మొదలు పెట్టింది. థియోసాఫికల్ సొసైటీ విషయాలు **'బాంబే గార్డియన్'** పత్రికకు అమ్మడం మొదలు పెట్టింది (1880). ఆ విషయం మాస్టర్‌కు ఫిర్యాదు చేస్తే 'నీ ఇష్టం' అని ఊరుకున్నాడు. చచ్చే పామునైనా పాలు పోసి బ్రతికించడం బుద్ధ ధర్మం. ఆ పాము లేచి పాలుపోసిన చేతినే కాటు వేస్తుందని బుద్ధునికి తెలియదా? అది బుద్ధుని కాటువేయకపోవచ్చు. మిగతవారిని వదలదు గదా! బ్లవట్‌స్కీ వాళ్ల చర్యల్ని వాళ్ల 'కర్మ' అని సరిపెట్టుకోసాగింది. చివరకు **"నా సహనమే నా పాలిటి శాపమైంది".** దిగులుపడ సాగింది.

కౌలాంబ్ పెళ్లాం డబ్బు విషయంలో మహా గబ్బు మనిషి. డబ్బు కోసం ఎన్ని గలీజు పనులైనా చేస్తుంది. తనకు దివ్యదృష్టి ఉందని ప్రచారం చేసుకుంది. గుప్త నిధుల్ని కనిపెడతానని డబ్బు సంపాదించేది. సొసైటీ సభ్యులకు అబద్ధాలు చెప్పి డబ్బు గుంజేది. మాడం బ్లవట్‌స్కీ యూరపు వెళ్లగానే ప్రిన్స్ హరిసింగ్ నుండి రెండు వేలు సంపాదించింది. అతను బ్లవట్‌స్కీకి ఫిర్యాదు చేశాడు. అది బ్లాక్‌మెయిల్. దాంతో ఆవిడపై చర్య తీసుకుంటారని భావించారు. కానీ ఆవిడ బ్లవట్‌స్కీపైన, థియోసాఫికల్ సొసైటీపైన పగ పెంచుకోసాగింది.

బ్లవట్‌స్కీ వెళ్లగానే కౌలాంబ్ దంపతులు మేడమీద బ్లవట్‌స్కీ ఉండే గదులు ఆక్రమించుకున్నారు. నాటినుండి బ్లాక్ మెయిలింగ్ మొదలైంది. మాడంపై పగ సెగలుగా రగిలింది. బ్లవట్‌స్కీ రాసిన ఉత్తరాలలో కొన్ని ఫోర్జరీ ఉత్తరాలు జత చేశారు. కౌలాంబ్ వడ్రంగం పనివాడు. మాడం గదుల్లో బీరువాలు తెరిచి రంధ్రాలు చేసి బ్లవట్‌స్కీ 'మాయలేడి' అని, తాంత్రికురాలని ప్రవాదాలు ప్రచారం చేశారు.

వారి దుశ్చర్యలు ఎవరూ పసికట్టలేదు. కౌలాంబ్ చర్యలకు కౌన్సిల్ విసిగిపోయింది. చివరికి కౌలాంబ్ దంపతుల్ని క్వార్టర్సు నుండి పంపి వేశారు.

తర్వాత నాలుగు నెలలకు మాడం బ్లవట్స్కీ పేరున కొన్ని ఉత్తరాలు మద్రాసు క్రిస్టియన్ కాలేజీ మాగజైన్‌లో అచ్చయ్యాయి. ఆ వ్యాసాలు ఇచ్చినందుకు క్రిస్టియన్ మిషనరీలు కౌలాంబ్‌కు చాలా డబ్బు యిచ్చాయి. అది బ్లవట్స్కీకి తెలిసింది. మూడు వేల రూపాయలిస్తే ఆ ఉత్తరాలు తిరిగి యిస్తానని కౌలాంబ్ బ్లాక్ మెయిల్ చేసింది.

థియోసాఫికల్ సొసైటీపై దాడి జరిగినట్లు పత్రికల్లో వార్త వేయించారు. ఆ వార్త ఆధారంగా ఆమెపై విమర్శలు సాగాయి. కోర్టుకు వెళితే మాడం పరువు బజారు పాలవుతుందని కౌన్సిల్ మిన్నకుండి పోయింది.

★ ★ ★

బ్లవట్స్కీ తిరుగు ప్రయాణంలో ఈజిప్టులో ఆగింది. ఒకనాడు నైల్‌నదీ తీరంలోని బాలన్ మ్యూజియం వెళ్లింది. అక్కడ సమాధి అయిన రాజుల చరిత్రలు ఆమె వివరిస్తుంటే ఈజిప్టాలజిస్ట్ **'మస్సురో'** నోరు వెళ్లబెట్టాడు. పరిశోధనలకు సైతం అందని విజ్ఞానం ఆమెది.

మాడం తిరిగి అడయారు చేరగానే భారతీయ పద్ధతిలో ఘన స్వాగతం లభించింది. 500 మంది కాలేజీ విద్యార్థులు సంతకాలతో మెమొరాండం సమర్పించారు. మద్రాసు క్రిస్టియన్ కాలేజి పత్రికలో ఆమెపై చెడుగా రాసినా లెక్చరర్లు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఆమె సన్మానానికి సమాధానం చెబుతూ "మీరు నావిగా ప్రచురించిన లేఖలు నేను రాసినవి కాదు. అంతకు మించి నా సంజాయిషీ అవసరం లేదు." కౌలాంబ్ కుట్రలో మిషనరీల పాత్ర ఉందని తెలిసిన తర్వాత అందరికీ ఆమెపై గౌరవం పెరిగింది. ఆ సందర్భంలో ఇండియన్ క్రానికల్ పత్రిక బ్లవట్స్కీని ప్రశంసిస్తూ ఇలా రాసింది:

"మేము థియోసఫిస్టులం కాము. కాని థియోసాఫికల్ సొసైటీ నిర్మాతలపైన గౌరవం, సద్భావన మాకుంది. క్రైస్తవమత చాదస్తులకు మహాత్ముల గురించి బొత్తిగా తెలియదు. అవగాహన లేదు. భారతదేశంలో ఎందరో మహర్షులు, యోగులు ఉన్నారు. వారిని గుర్తించలేని మూర్ఖులు క్రైస్తవులు. థియోసఫీ చాలా విలువైన సిద్ధాంతం. అది ప్రాచీన సనాతన ధర్మం. వారికి తాత్కాలికంగా అవరోధాలు ఏర్పడవచ్చు. కాలాన్ని ఎదిరించి, థియోసఫీ నిలబడుతుంది.

మంచిచెట్టు పుచ్చు, చచ్చు కాయలు కాయదు. తియ్యని చెట్లకు తీయని ఫలాలే కాస్తాయి – చేదు కాయలు కాయవు.

“ఆధ్యాత్మిక రంగంలో, ఆత్మాన్వేషణలో అంచనాలు వేయడం కుదరనిపని. సత్యాన్వేషుల జీవితాలు భౌతిక ప్రమాణాలకు అందవు. మాడం బ్లవట్స్కీ జీవితం చిన్నతనం నుండి అసాధారణమైంది. భిన్నంగా ఉంది. పరమశత్రువులైనా ఆమె నిజాయితీని, నిబద్ధతను శంకించలేరు. ఆమెది మచ్చలేని జీవితం. రాజ కుటుంబంలో పుట్టిన ఆమె తప్పుడు పనులు చేయలేదు. నీచపు బుద్ధు లుండవు. దరిద్రం అనుభవించడం కర్మవల్ల కావచ్చు. కోరి దరిద్రాన్ని వరించిందేమో! లోకుల దృష్టిలో అది స్వయంకృతాపరాధం. ఆమెకు నిరాడంబరంగా, పొదుపుగా జీవించడం ఇష్టం. ఆ విషయం అక్షర సత్యం, అందరికీ తెలిసిన నిజం. ఒక ఆశయంతో ముందుకు సాగేవారికి అవరోధాలు, ఆటంకాలు ఏర్పడతాయి. అవి పరీక్షలు మాత్రమే. ఓటమి, అపజయ చిహ్నాలు కావు. మనిషి బలహీనతల్ని ఆమె క్షమించగలిగింది. కీర్తికాంక్ష, ధనవ్యామోహం బొత్తిగా లేని స్త్రీ ఆమె.”

ఆమెలో వెతికినా అహంకారం కనిపించదు. ఏ మతంపట్ల అభిమానం, పక్షపాతం లేదు. సహాయాలు, సత్కార్యాలు చేసి పేరు సంపాదించాలన్న తపన అసలు లేదు. తను రాసిన పుస్తకాలలోని భావాలు తన స్వంతం అని చెప్పదు. ఆ గొప్పతనం తన గురువులకు ఇస్తుంది. ‘మాస్టర్లు నా చేత రాయించుకున్నారు’ అని సవినయంగా ప్రకటించింది.

‘మహాత్మ లేఖలు’ అన్నీ మాడం కల్పించినవనే అపవాదం ఉంది. మాస్టర్ పేర ఫోర్జరీ చేసిందంటారు. కాదని జిన రాజదాస్ నిరూపించాడు. ఎన్ని కష్టనిష్ఠురాలు ఎదురైనా అనుకున్న లక్ష్యం సాధించడం ఆమె కిష్టం. లక్ష్యం చెదరనీయలేదు. మాస్టర్లపై నమ్మకం సడలనివ్వలేదు.

తలెత్తి నిటారుగా నడవగలిగిన ధీమతి బ్లవట్స్కీ.

## పులిమీద పుట్ర

కౌలాంబ్ కుట్ర అంతటితో ఆగిపోలేదు. కోతి పుండు బ్రహ్మరాక్షసి అయినట్లు కౌలాంబ్ కేసుపై ఒక విచారణ కమిటీ ఏర్పడ్డది. థియోసఫీ వ్యవహారాలు కోర్టుకెక్కితే నిరూపితం కావు. వేటికీ ఆధారాలుండవు. న్యాయం జరగదు. ఫ్రైమా ఫాసియా క్రింద కొట్టి వేస్తారు. అతీంద్రియ విషయాల నిరూపణ అసంభవం. పాపం! బ్లవట్స్కీ ఓటమి అంగీకరించి పారిపోవలసి రావచ్చు. ప్రతిపక్షం వారు లబ్ధి పొందడం ఖాయం. హిమాలయాల్లో ఎంత వెదికినా అతీంద్రియ శక్తులున్నవారు కనిపించరు. మాస్టర్లూ కనిపించరు. కనిపించినా వచ్చి సాక్ష్యం

చెప్పరు. పవిత్రమైన పరమ గురువుల లక్ష్యాలు నిరూపించడం ఎలా? కేసు కౌలాంబ్‌తో ఆగదు. తీగ లాగితే డొంకంతా కదులుతుంది.

**ఆ సమయంలో బ్లవట్‌స్కీ ఎ.పి. సిన్నెట్‌కు రాసిన లేఖాంశం :**

> *"ఈ కేసులో మాస్టర్ల ప్రస్తావన వచ్చి తీరుతుంది. నా వరకు న్యాయ స్థానంలో మాస్టర్ల పేర్లు బయట పెట్టడం ఇష్టం లేదు. నేను చావనైనా చస్తాను గాని ఆ పని చేయలేను. అది గురుద్రోహం. ఒక్కసారి కాదు మాస్టరు కోసం వేయిసార్లు చావడానికి నేను సిద్ధం. నేను ఏం రాయను? కుట్రలకు, కుతంత్రాలకు ఈ వయసులో నేను బలికావాలా! అది నాకు ఆత్మహత్యతో సమానం. సొసైటీకి అవమానం. నా జీవితం అంతా మాస్టర్ల దయపైన సాగింది. నా జీవితం మాస్టర్ల చుట్టూ పరిభ్రమించింది. ఇది నాకు జీవన్మరణ సమస్య. నన్ను చంపితే నా ఉద్యమం నీరుగారి పోతుందని వారి పేరాశ. వారే జయించి నట్లవుతుంది."*

అది బ్లవట్‌స్కీకి వ్యక్తిగతంగా అవమానం కాదు. థియోసఫీపై కక్ష సాధింపు. మంచి ఆశయాలను గౌరవించలేని సమాజ వైఫల్యం.

## అసలు జరిగింది! ...

సొసైటీలో సభ్యులుగా చేరే ముందర అందరి బుద్ధి బాగానే ఉండేది. అందరూ దివ్యజ్ఞానం, ఆత్మజ్ఞానం ఆశిస్తున్న వారే. తర్వాత ఎవరికెంత ఆత్మజ్ఞానం కలిగింది? ఎవరికెంత ఆత్మవిద్య పట్టుబడింది? అన్నది ప్రశ్నార్థకం. రోజులు గడిచిన కొద్దీ "అతీంద్రియ శక్తులు దక్కడానికి ఇంకా ఎంతకాలం?" అని ప్రశ్న మొదలైంది. పైకి చెప్పకపోయినా అందరూ ఆశించింది సిద్ధులు, మహత్తులు, మాస్టర్లతో పొత్తులు. మానవత్వాన్ని ప్రేమించేవారు, దివ్యభావనను ఆశ్రయించేవారు తక్కువైనారు. అలా మారిన విలువలపైన **మాస్టర్ మోరియా** ఇలా స్పందించారు:

"మేము ఎన్నిసార్లు చెప్పాలి? సొసైటీలో చేరడానికి ఏకైక లక్ష్యం పరమ గురువుల్ని ప్రసన్నం చేసుకోవడం. అతీంద్రియ శక్తుల కోసం, మహత్తుల కోసం ఆరాటం, భౌతికంగా మాస్టర్లను దర్శించడం అనవసరం. హృదయం నిండా ప్రేమ నింపుకున్న వారికే మాస్టర్ల దర్శనం లభిస్తుంది. సత్సంగం ఏర్పడుతుంది. శక్తుల్ని స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించదలిస్తే లక్ష్యం దూరమవుతుంది. మానవత్వం మరచి స్వార్థం చూచుకునేవారు ఇక్కడ ఉండడానికి అర్హులు కారు."

ఆ లేఖను బట్టి టి.ఎస్. సభ్యులతో మాస్టర్లు విసిగిపోయినట్లు తెలుస్తుంది.

ఆ లేఖ బ్లవట్స్కీని చాలా బాధించింది. పెట్టే బేడా సర్దుకుని రష్యా తిరిగి వెళ్లిపోదామా అని ఆలోచించింది. తన జీవిత లక్ష్యం Secret Doctrine రచన. అది పూర్తి కావాలి. థియోసాఫికల్ సొసైటీ ఎంత ముఖ్యమో సీక్రెట్ డాక్ట్రిన్ రచన అంతేముఖ్యం. నాటి మాడం మనఃస్థితి మిసెస్ సిన్నెట్‌కు రాసిన మరొక లేఖ అద్దం పడుతుంది:

"నా గుండె ముక్కలైంది. అయినవాళ్లే శత్రువులైనారు. చావు బ్రతుకుల్లో ఉన్నప్పుడు ఒకనాటి సంఘటన నన్ను బ్రతికించింది.

"నేను చేయవలసిన పనులు పూర్తి చేసి తీరాలని మాస్టర్ ఆదేశించారు. మాస్టర్‌కి మాట యిచ్చాను. ఆ రోజు రాత్రి నేను చనిపోతానని అందరూ అనుకున్నారట. ఆశించారో, భయపడ్డారో తెలియదు నాకైతే. నాటి సంఘటన నా హృదయంపైన చెరగని ముద్ర వేసింది. ఆ రోజునే మనిషి నైచ్యం తెలిసింది. మాస్టర్ తన చేతిని నా గుండెపైన ఉంచి శ్వాస ఆగిపోకుండా చేశారు. పైగా రానున్నది మంచికాలమని హామీ యిచ్చారు."

'నీ కిష్టమేనా?' అని అడిగారు మాస్టరు. 'ఇష్టమే' అన్నాను.

"అలా నా కర్మకు నేనే బాధ్యురాలినైనాను. నా కష్టాల్ని నేనే కొనితెచ్చు కున్నాను. ఆ క్షణంలో చచ్చిపోయి ఉంటే బావుండేది. ఇంకా బాధలు అనుభవించ వలసి ఉంది. ఏం చేయను! నేను బ్రతికి తీరాలి అని మాస్టర్లు అంటే నేను కాదనలేను."


★ ★ ★

ఆ మర్నాడు బ్లవట్స్కీ ఉత్సాహంగా నిద్ర లేచింది. డాక్టరుతో అన్నది : "డాక్టర్! మీరు మాస్టర్లను నమ్మరు, నేను బ్రతకడం మాస్టర్ మహత్యం కదా!"

ఆ తర్వాత సొసైటీ కార్యకలాపాలకు కావాలని దూరమైంది. 'థియోసఫీ' పత్రికను ఆల్కాట్ చేతిలో పెట్టింది. యూరపు వెళ్లిపోయి విశ్రాంతిగా ఉంటూ Secret Doctrine పూర్తి చేయాలని సంకల్పించింది. 1884 మార్చిలో ఇండియా వదలి వెళ్లిపోయింది.

మాస్టర్స్ ట్రీట్ చేసినా ఆరోగ్యం పూర్తిగా కోలుకోలేదు. చక్రాల కుర్చీలో కూర్చోపెట్టి స్టీమరు ఎక్కించవలసి వచ్చింది. నడిచే స్థితి లేదు.

మాడం వెళ్లిపోయిన తర్వాత ఆల్కాట్ అన్నీ తానే అయి సంస్కరణలు మొదలు పెట్టాడు. విలువల పునరుద్ధరణ అత్యావశక్యం. అయినా థియోసాఫికల్ సొసైటీ సవ్యంగా సాగే అవకాశాలు కనిపించలేదు.



లెడ్‌బీటర్

# 17. సందిగ్ధం

**ఇ**ండియానుండి బయలుదేరి బ్లవట్‌స్కీ సరాసరి ఫ్రాన్స్ చేరుకుంది. ఆల్కాట్‌కు 'లండన్ లాడ్జి' వ్యవహారాలు, అక్కడ ఆధిపత్య సమస్య. బ్లవట్‌స్కీని లండన్ వెళ్లి వ్యవహారాలు చక్కదిద్దమని 'పై' నుండి ఆదేశాలు అందాయి. ఆమె అక్కడకు వెళ్లాక పరిస్థితి మరీ ఉద్రిక్తంగా మారింది. వెంటనే ఫ్రాన్స్ వచ్చేసింది. ఫ్రాన్స్‌లో ఫ్రాన్సెస్కో అరండేల్‌కు గెస్టుగా ఉంది. బ్లవట్‌స్కీ ఉన్నచోట జనం తాకిడి. గెస్టుగా వచ్చి హోస్టుగా మారవలసి వచ్చింది. అనేకమంది ఔత్సాహికుల రాకపోకలు నివారించలేకపోయింది.

**విలియం క్యూ. జడ్జి** (మార్చి 1884)

మార్చి 25 నాటికి నేను ఇక్కడికి వచ్చి చేరాను. మాడం బ్లవట్‌స్కీ 28న వచ్చింది. ఆమె వచ్చినరోజు నుండి జనం తాకిడి. ఆమెతో పర్సనల్‌గా మాట్లాడడానికి వీలైంది కాదు. నాకు మాస్టర్ల నుండి ఆదేశం వచ్చింది – ఇక్కడ ఉండి సీక్రెట్ డాక్ట్రిన్ రచనలో మాడంకి సహాయం చేయమని.

వీలు చిక్కగానే ఇండియా వెళ్లాలని ఆలోచన. ఆల్కాట్ అభిప్రాయం – నేను ఫ్రాన్సులోనే ఉండి మాడంకు సహాయం చేయాలని – ఎలా? మాస్టరు ఆదేశం కాదనలేను. ఆల్కాట్‌ని ధిక్కరించి ఇండియా వెళ్లి చేసేది ఏమీ లేదు. అయినా స్టీమరు టికెట్ దొరికే వరకు లండన్‌లో ఉండిపోక తప్పదు.

**ఎ.పి. సిన్నెట్ డైరీ** (1884 ఏప్రిల్)

ఏప్రిల్ మొదట్లో ఆల్కాట్ లండన్ వచ్చాడు. మాడం పారిస్‌లోనే ఉంది.

ఆల్కాట్‌తో మోహిని అనే యువకుడు వచ్చాడు. చురుకైన కుర్రవాడు. మాస్టర్ కె. హెచ్. అతనిని తనకు పరిచయం చేశాడని చెప్పాడు. లండన్ లాడ్జికి 'పించా' ప్రెసిడెంట్‌గా ఎన్నికైనాడు. గొడవ సద్దు మణిగింది కొంతవరకు.

మీటింగు జరుగుతుండగా మాడం వచ్చింది. సభ్యులకు ఆమెను పరిచయం చేశాం. అక్కడ మాడం ఒక ప్రకటన చేశారు. "సభ్యులు ఎవరైనా నా "ఇసిస్ అన్వీల్డ్"లో క్లిష్టమైన విషయాలు ఉన్నాయనిపిస్తే నాకు తెలియచేయండి. రానున్న "సీక్రెట్ డాక్ట్రిన్"లో వాటికి వివరణ యిస్తాను."

## ఫెలిహోవస్కీ (మే 1884)

ఫదయేవ్, రష్యా రచయిత సొలోవ్‌స్కీ, నేను, మరొకరు మొత్తం నలుగురం రాత్రి 11 గంటల ప్రాంతంలో డ్రాయింగ్ రూంలో కూర్చుని ఉన్నాం. బ్లవట్స్కీని అడిగాము "మీ మాస్టర్స్ గురించి, అతీంద్రియ శక్తుల గురించి చెప్ప"మని.

తను ఆసక్తిగా చాలా విషయాలు చెప్పింది. ఉన్న నలుగురమూ రష్యన్లమే గదా.

తన మెడలో ఉన్న లాకెట్ తీసి ఇచ్చింది చూడమని. అది బంగారు గొలుసు. లాకెట్‌లో ఒక బొమ్మ ఉంది. హైందవ యోగిది. చూస్తుండగానే మాలో ప్రతి ఒక్కరిలో ఏదో అలజడి కలిగింది. ఏదో కంగారు. ఏమిటో తెలియదు. ప్రతి ఒక్కరికీ ఊపిరి తీసుకోవడం కష్టమైంది. ఉక్కిరి బిక్కిరైపోతున్నాం. బ్లవట్స్కీ చేతులతో కళ్లు మూసుకుంది. ఏదో జరగబోతోంది అనడానికి అది సూచన.

సొలోవ్‌యేవ్ తన చూపు గది మూలన కేంద్రీకరించాడు. అక్కడ ఒక నిప్పు కణిక కదిలినట్లయింది. అంతలో వరండా కారిడార్‌లోంచి అద్భుతమైన సంగీతం వినవచ్చింది. నేను లేచి వెళ్లి చూచాను. అక్కడ ఎవరూ లేరు. కాని బ్లవట్స్కీ ప్రక్కన ఎవరో నిలబడి ఉన్నట్లు తోచింది. నేను చూస్తుండగానే ఆవ్యక్తి రూపం అదృశ్యమైంది. ఆమె మాకు చూపించిన 'పతకం'లో ఇప్పుడు రెండు రూపాలున్నాయి. మాస్టర్‌ది, మాడంది.

'మాడం మీరు ఎవరు?' అని అడిగారు ఒకరు.

ఆమె సమాధానం : **'నేనొక బౌద్ధ ఉపాసికను. ప్రపంచం అంతా తిరుగుతుంటాను. సత్యాన్ని ప్రతిష్టించడమే నా ధ్యేయం, కర్తవ్యం.'**

## లెడ్‌బీటర్

థియోసాఫికల్ సొసైటీ చరిత్రను ఒక మలుపు తిప్పిన వ్యక్తి లెడ్‌బీటర్. మాడం బ్లవట్స్కీ నిష్క్రమణ తర్వాత తెరపైకి వచ్చిన ప్రతిభాశాలి. వస్తుతః

అతీంద్రియశక్తులు కలవాడు. బహుముఖ ప్రజ్ఞావంతుడు – అన్నింటికీ మించి క్రైస్తవాభిమాని. ఆ అభిమానం లెడ్‌బీటర్‌కు కలిసొచ్చింది. అతనికి క్రైస్తవ ప్రపంచంతో ఉన్న సంబంధాలు థియోసఫీ ప్రచారానికి పనికొచ్చాయి. అతనికి మాస్టర్లతో 'టచ్' ఉంది. థియోసఫీలో చేరకముందే మాస్టర్ కుత్‌హోమి నుండి ఒక లేఖ అందుకున్నాడు. వారి దృష్టిలో అది అర్హత, యోగ్యత. మాస్టర్‌కు మరొక లేఖ రాద్దామనుకున్నాడు. అది పోస్టు చేయడం కుదరని పని. మాస్టర్స్‌కు తనలేఖను అందించడానికి బ్లవట్‌స్కీని కలుసుకోదలిచాడు. ఆ మర్నాడే మాడం ఇండియా వెళ్లిపోతోందని తెలిసి ఉరుకులు పరుగులతో వెళ్లాడు. అతి కష్టం మీద అపాయింట్‌మెంటు దొరికింది. మాస్టర్ కె.హెచ్. తనపేరున రాసిన ఉత్తరం ఆమె చేతిలో పెట్టాడు.

బ్లవట్‌స్కీ అన్నది : అలాంటి ఉత్తరాలు ఎవరి పేరున రాస్తే వారే చదువుకోవాలి. ఇతరులకు ఇవ్వకూడదు. ఇతరులు చదవకూడదు. సారీ! నేను నీ ఉత్తరం చదవను.

లెడ్‌బీటర్ తల తిరిగింది. 'ఇతరులకు వచ్చిన ఉత్తరాలు ఆసక్తిగా చదివే జనం ఉన్న ఈ రోజుల్లో ఇంతటి నిజాయితీ కలవారు ఉన్నారా?' అనుకున్నాడు. తాను వచ్చిన పని వేరు గదా! బ్రతిమలాడి చదివించాడు ఆమెచేత.

"అయితే! ఏం జవాబు పంపాలంటావ్?" అడిగింది సూటిగా. బొత్తిగా మొహమాటం లేని మనిషి!

"నా ఉత్తరం మాస్టర్‌కు అందే మార్గం చూపించండి."

"ఆ మార్గం నీకు తెలుసు. ఒకసారి రాసి, జవాబు పొందావు కదా."

"మీకు మాస్టర్లతో టచ్ ఎక్కువ గదా."

"నువ్వు నాతో ఉండిపో. ఏ పరిస్థితిలోనూ నన్ను వదలి పోకు".

సరే నన్నాడు, ఉండిపోయాడు. అయితే ఆమె పడకగదిలోకి వెళ్లినా వెంట వెళ్లేవాడు. ఎక్కడకు వెళ్లినా వచ్చి పక్కన నిలబడేవాడు. ఎంతయినా స్త్రీ గదా! తన ఇబ్బందులు, అవసరాలు తనకుంటాయి! తర్వాత గ్రహించాడు.

"నాతోనే ఉండమంటే అంట కాగమని కాదు. అందుబాటులో ఉండమని. పిలిస్తే పలికితే చాలు గదా."

*"మాడం నన్ను భరించడం కష్టమైంది. ఎట్లా వదిలించుకోవాలా అని చూచింది. ఎరక్కపోయి నాతో ఉండమన్నానే" అని వాపోయింది. టాంగాలో పోతే చోటంతా తనకే సరిపోయేది. భారీ విగ్రహం కదా.*

నేను ఒకమూలన ఇరుక్కుని కూర్చోవలసి వచ్చేది. ప్రయాణంలో ఒళ్లు నలిగిపోయేది. కూపర్ ఓక్లే దంపతులు బ్లవట్స్కీతో ఇండియా బయలు దేరుతున్నారు. ఆ రోజు రాత్రి మాడంతో కలిసి వాళ్ల ఇంటికి వెళ్లాను.

మాడం వస్తోందని తెలిసి, అంత ప్రొద్దు పోయినా వారిఇల్లు జనంతో కిటకిటలాడుతోంది. వాళ్లంతా మాడంకి సెండాఫ్ చెప్పడానికి వచ్చారు. ఆమె ఫైర్‌సైడ్ కుర్చీలో కూర్చుని మాట్లాడుతోంది. సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తోంది. ఆమె చైన్ స్మోకర్. అకస్మాత్తుగా ఆమె కుడిచేతిని లేపి మంటలోకి చాచింది అరచేయి పై వైపుకు తిరిగి ఉంచి. నాకు ఆశ్చర్యం. ఆమె ప్రక్కనే ఉన్నాను. అది నా డ్యూటీ కదా. ఆమె చేతిలోకి ఒక మడతపెట్టిన కాగితం వచ్చింది. దానిని నాచేతి కిచ్చి “ఇది నీ ప్రశ్నకు జవాబు” అన్నది. “బయటకు వెళ్లి చదువుకో” అని నన్ను పంపివేసింది.

ఎంత నిజాయితీయో!

★ ★ ★

బ్లవట్స్కీ బృందం లెడ్‌బీటర్‌తో కలిసి బయలుదేరింది.

‘ప్రయాణం’లో చాలా ముఖ్యమైన సంఘటన ఒకటి జరిగబోతోంది అని. ఆమె ముందుగానే ‘తాయిలం’ అందించింది.

## భవిష్య దర్శనం

యూరపులో ఆర్భాటం. ఇంగ్లండులో గొడవలు చూచి బ్లవట్స్కీ చిరాకు పడ్డది. అందరిదీ ఆరంభశూరత్వమే. ఎవరిలోనూ లోతు లేదు.

“మీ ఐరోపా వారికి అత్యాశ. అతీంద్రియ విజ్ఞానం సైతం మీ సొంతం అయినట్లు, మీరే కనిపెట్టినట్లు పొంగిపోతున్నారు. అమెరికావారు ప్రపంచంలో ఎక్కడ ఏ విశేషం ఉన్నా దానిపైన సర్వహక్కులు తమకే కావాలంటారు. వారిది మరీ నడమంతరం. అతీంద్రియ విజ్ఞానాన్వేషణలో వచ్చే కష్టాలు మీకు తెలియవు. ఊహించను కూడా ఊహించలేరు. మీ వివేకం, జ్ఞానం వేరు. నేనెన్ని కష్టాలు అనుభవించానో మీకు తెలియదు. ఇండియన్స్‌కు ఏం కోరుకోవాలో, ఎంత ఆశించాలో తెలుసు. అర్హత లేని వాటి కోసం వారు అర్రులు చాచరు. భారతీయులు చాలా పరీక్షలు తట్టుకుని విజయం సాధించారు. అది వారి స్వంత సాధనా

ఫలం. తపఃఫలం. ఉత్తినే వచ్చిపడ్డది కాదు. అది అర్హత. ఆ తపస్సు మీవల్ల ఏమవుతుంది?”

1884 నవంబరులో లివర్‌పూల్ నుండి మద్రాసుకు బయలుదేరిన బృందం ఇసాబెల్‌కూపర్, లారాట్లేకూపర్, డా.అర్చిబాల్డ్ క్రైట్లే. ఒకాలే మాడం. తర్వాత లెడ్‌బీటర్ వచ్చి కలిశాడు. మెయిల్‌బోటులో సూయజ్ కెనాల్ ఇన్‌మైలా వరకు ప్రయాణం. తర్వాత కైరోకి రైలు ప్రయాణం.

## ఇసాబెల్ కూపర్ ఓక్లే

కైరో నుండి బ్లవట్‌స్కీ, నేను సూయజ్ చేరి రెండు రోజులు ఆగి మద్రాసుకు బయలుదేరాం. ఆల్కాట్, ఇతర సభ్యులు కొలంబోలో మమ్మల్ని వచ్చి కలిశారు. అక్కడ రెండు రోజులుండి ముఖ్యమైన బౌద్ధాలయం దర్శించాం. మేము కలిసిన వారిలో సుమంగళ గొప్పవ్యక్తి. సిలోన్ బౌద్ధారామాల ప్రధాని. ఆయన మమ్మల్ని చాలా ఆదరంగా చూచాడు. డిసెంబర్ 21 నాటికి మద్రాసు చేరాం. చిన్న పడవలో ఒక బృందం మా నౌక దగ్గరకు వచ్చారు. పెద్దపెద్ద కెరటాలు. పడవలు మునిగి పోతాయా అని భయమేసింది. నావికా ప్రయాణం అంతా ఒక ఎత్తు. చిన్న పడవల్లో రేవుకు చేరడం ఒక ఎత్తు. భయం వేస్తుంది.

బ్లవట్‌స్కీకి బ్యాండు మేళాలతో స్వాగతం చెప్పారు. పచ్చయ్యప్ప మందిరానికి తీసుకువెళ్లారు. రాజా ఒకరు మమ్మల్ని కారులో అడయారు చేర్చారు. అప్పుడు అడయారులో కన్వెన్షన్ జరుగుతోంది. దేశంలోని అన్ని ప్రాంతాల నుండి అభిమానులు వచ్చారు. అనేక విషయాలతోపాటు కౌలాంబ్ కుట్రపై సుదీర్ఘ చర్చ సాగింది. కేసువల్ల కలిగిన అవమానంతో మాడం ముఖం చూపలేక మానసికంగా క్రుంగి పోయింది.

ఒకరోజు రాత్రి ఊహించని ప్రమాదం రానే వచ్చింది. ఆమె సడెన్‌గా స్పృహ కోల్పోయింది. డాక్టర్లు ‘ఇదే చివరి రాత్రి’ అని తేల్చారు. మాడం ‘మరేం ఫరవాలేదు’ అంటూనే కోమాలోకి వెళ్లిపోయింది. మాకెవరికీ కాళ్లు చేతులు ఆడలేదు. గంటలు గడుస్తున్నాయి. డాక్టర్లు అనడం ఆమె కోమాలోనే తుదిశ్వాస విడుస్తారని. ఆ రాత్రి గడవదని డాక్టర్లు హెచ్చరించారు. ఎవరు ఏం చేయగలరు? ఆ రాత్రి ఏం జరిగింది? ఏమో!

ఉదయం 8 గంటల వేళ మాడం లేచి కూర్చుని కళ్లు విప్పింది. ఆకలిగా ఉంది, బ్రేక్ ఫాస్ట్ కావాలని అడిగింది. రెండు రోజులుగా ఆమెకు స్పృహ లేదు.

ఒళ్లుపై తెలియని స్థితి. ఇలా తెల్లవారేసరికి ఏమిటీ మార్పు? పరుగున వెళ్లి చెప్పినా డాక్టరు నమ్మలేదు. ఆమె డాక్టరును ప్రశ్నించింది. "మీరు మాస్టర్లను నమ్మరు. వారి శక్తి మీకు అర్థం కాదు. తెలియదు."

ఆమె ఆరోగ్యం కుదుట పడాలంటే యూరపు తీసుకువెళ్లాలని డాక్టర్లు సలహా చెప్పారు.

**ఆల్కాట్ కథనం** (ఫిబ్రవరి 1885)

మరొక మారు మాస్టర్ మోరియా మాడంను మృత్యువు నుండి రక్షించాడు. కొన్ని రోజులు ఆమె మృత్యువు ఒడిలోనే ఉంది. నాకు టెలిగ్రాం అందగానే బర్మా నుండి వచ్చాను. మాడంను చూస్తానన్న ఆశ లేదు నిజానికి. ముగ్గురు డాక్టర్లు రాత్రింబవళ్లు కష్టించినా ఆమెను కోమా నుండి తప్పించలేకపోయారు. కోమాలోనే చచ్చిపోతుందని ఆశ వదలుకున్న సమయంలో మాస్టర్ అదృశ్యహస్తం వచ్చి ఆదుకుంది. మాస్టర్ కనిపించగానే సీను మారిపోయింది.

నిన్నగాక మొన్న ఫిబ్రవరి 7న, పరిస్థితి విషమించింది. సుబ్బారావు, దామోదర్ ఆశలు వదులుకున్నారు. 'అంతా అయిపోయింది' అని నిర్వేదం చెందారు. నిన్న ఒక యోగి కాషాయబట్టలతో వచ్చాడు. ఆయన ప్రక్కన ఒక స్త్రీ ఉంది – శిష్యురాలేమో! నన్ను పిలిపించారు. వెళ్లాను. ఆయన నావైపు చూచారు – నేను ఆయనలోకి చూచాను. ఆయన కళ్లు మూసుకుని ధ్యానం చేశాడు. ఏదో సందేశం యిచ్చినట్లయింది. తిరువెళ్లుం నుండి మాస్టర్ నారాయణ పంపాడట తనని. నన్ను ఒంటరిగా ఎక్కడికీ వెళ్లవద్దని హెచ్చరించారు.

తర్వాత ఆ యోగి, ఆయన శిష్యురాలు బ్లవట్స్కీ మంచం దగ్గరకు వెళ్లారు. ఆమె బ్లవట్స్కీని 'లెమ్మని' పిలిచింది. ఏవో మంత్రాలు ఉచ్చరించింది. గురువు ఆమెకి విభూతి యిచ్చి బ్లవట్స్కీ నుదుటిపై పెట్టమన్నాడు. కొంత విభూతి పొట్లం కట్టి మాడం తల దగ్గర ఉంచమన్నాడు. వెళుతూ చెప్పాడు :

**"ఫరవాలేదు. అవసరమైతే నన్ను తలుచుకుని, ముమ్మారు నాపేరు ఉచ్ఛరించండి. నేను చూచుకుంటాను"** అని గురువు తన శిష్యురాలితో కలిసి వెళ్లిపోయాడు.



# 18. మహర్షి సుబ్బారావు : శ్వేతయోగిని

**అ**డయారు థియోసాఫికల్ వ్యవహారాలతో మాడం బ్లవట్స్కీ విసిగిపోయింది. ఆరోగ్యం పూర్తిగా చెడిపోయి, చచ్చిబ్రతికినంతపనై జర్మనీ వెళ్లిపోయింది. బ్లవట్స్కీ నిష్క్రమణతో 'చెట్టులేని నీడలా' అయింది సొసైటీ స్థితి. సొసైటీకి పట్టుకొమ్మ, బ్లవట్స్కీకి అత్యంత ఆప్తుడు, ప్రియ శిష్యుడు అయిన దామోదర్ పరమ గురువుల పిలుపు మేరకు హిమాలయాల దారి పట్టి వెళ్లిపోయాడు. థియోసాఫికల్ సొసైటీలో మిగిలిన వారిలో సమర్థుడైన వ్యక్తి ఒక్కరే మహర్షి సుబ్బారావు. సుబ్బారావు మాడంకు ఇష్టుడు. ఆమె పైన ఈగ వాలనిచ్చేవాడు కాదు. అయితే ఆయనకు ఆత్మాభిమానం ఎక్కువ. స్వతంత్రభావాలు కలవాడు, తన ఆదర్శం, నమ్మకం చెక్కు చెదరనీయని స్వభావం.

కొన్ని విషయాలలో సుబ్బారావు బ్లవట్స్కీతో విభేదించేవాడు. చివరకు 'థియోసఫిస్టు' పత్రికను వేదిక చేసుకుని ఇద్దరూ అక్షర యుద్ధానికి దిగారు. 1888లో సుబ్బారావు సొసైటీకి రాజీనామా చేశాడు. అయినా అతనికి థియోసఫీ పట్ల గౌరవం సడలలేదు. ఆయన అల్పాయుష్కుడు. 1890లో చనిపోయేవరకు స్వచ్ఛమైన యోగిగా జీవించాడు. మాస్టర్ మోరియా బ్లవట్స్కీని 'మీడియం' చేసుకున్నందుకే ఆమెపట్ల గౌరవం పెంచుకున్నాడు, విధేయతగా ఉన్నాడు. ఇద్దరి మధ్య వైరుధ్యం ఉన్నా మర్యాదగా పలకరించుకునేవారు. ఎవరి మార్గం వారిది, ఎవరి అభిరుచి వారిది.

అంత గొప్ప యోగి అయినా, పవిత్రంగా జీవిస్తున్నా, మహర్షిగా గౌరవించబడినా 34వ ఏటనే సుబ్బారావు భయంకరమైన చర్మవ్యాధితో

చనిపోయాడు. సుబ్బారావు బ్రతికి ఉంటే ఆనీబీసెంట్, లెడ్‌బీటర్‌లు రంగం మీదికి వచ్చి ఉండేవారు కాదు. పర్సనల్‌గా వ్యతిరేకించినా బ్లవట్‌స్కీ మనసులో సుబ్బారావు యోగ్యుడైన వ్యక్తి. సీక్రెట్ డాక్ట్రిన్ రచనలోనూ ఆయన పాత్ర చాలా ఉంది. ఆల్కాట్‌కు సుబ్బారావు అంటే చాలా ఇష్టం. తన మాగ్నటిక్ హీలింగ్‌తో సుబ్బారావుకు చికిత్స చేశాడు. అప్పుడే ఇద్దరి మధ్య మంచి స్నేహం ఏర్పడ్డది. సుబ్బారావు జబ్బుకు కారణం ఎవరికీ అంతు చిక్కలేదు. అంతచిన్న వయసులో 'మహర్షి'గా జీవించిన వ్యక్తి మరణించడం అంటే ఆయన కారణ జన్ముడనే అనుకోవాలి.

**మహర్షి సుబ్బారావు గురించి ఆల్కాట్ అభినందన :**

మిస్టర్ టి.ఎస్.లో (టి. సుబ్బారావు) అన్ని అతీంద్రియ శక్తులున్నాయని, ఆధ్యాత్మిక వారసత్వం గూడుకట్టుకుని ఉన్నదని మొదట నాకు తెలియదు. ట్రీట్‌మెంటు ఇవ్వడానికి వాళ్ల ఇంటికి వెళ్లేవాడిని. సుబ్బారావు తల్లి గారితో పరిచయం అయింది. ఆమె చెప్పారు ఆయన గురించి :

"అంతకు ముందు తనకు అతీంద్రియ శక్తులున్నాయని మాకూ తెలియదు. థియోసాఫికల్ సొసైటీలో చేరిన తర్వాతనే ఆ శక్తుల గురించి మాట్లాడేవాడు. తనలో ఆ మహాసిద్ధులు, శక్తులు ఉన్నాయేమో! ఉన్నట్లు తనకూ తెలియదేమో. పూర్వజన్మ సంపదలు అన్నీ ఒక్కసారిగా థియోసఫి వెలుగులో, బయటకొచ్చి ఉంటాయి. 'ప్రమిదలో ఎంత చమురున్నా వత్తి ఉన్నా వెలిగిస్తేనే కదా వెలుతురు వచ్చేది. తన గురువును గుర్తించగలిగాడు. అప్పటి నుండి తన గురువుతో, మాస్టర్లతో మాత్రం సంబంధం పెట్టుకున్నాడు. వారందరిని థియోసాఫికల్ సొసైటీ భవనంలోనే కలుస్తుండేవాడు. అగోచరంగా ఉన్న మాస్టర్లతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేవాడు. అది ఎలాగో నాకు తెలియదు."

బ్లవట్‌స్కీ మహాయోగిని అని తన తల్లిగారితో చెప్పేవాడు. బ్లవట్‌స్కీ సమక్షంలో అనేక ఆధ్యాత్మిక అనుభవాలు పొందాడు. అతీంద్రియ శక్తుల ఉపయోగం తెలిసింది. ప్రాచీన వాఙ్మయం అంతా అప్రయత్నంగా అతని మేధకు అందేది. భగవద్గీత, బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులు ఇలా ఏ పుస్తకంలోని ఏ శ్లోకం అడిగినా విపులంగా వివరించి చెప్పేవాడు. అది ఎవరు ఏ సంవత్సరంలో రాసిందీ చెప్పేవాడు. అంతటి దివ్యజ్ఞానం తనది."

"సీక్రెట్ డాక్ట్రిన్" రచనలో టి. సుబ్బారావు పాత్ర ఎక్కువే నంటారు. వారి మధ్య అభిప్రాయభేదాలు కారణంగా బ్లవట్‌స్కీ ఆ రహస్యాన్ని దాచినా, అది దాగని సత్యం.

హ్యూం, సిన్నెట్ ఇద్దరూ సుబ్బారావును ప్రలోభపెట్టి మోసం చేశారు. బ్రాహ్మణ్యాల్లో, బౌద్ధతంత్రంలో ఉండే నిగూఢవిషయాలు చెప్పమని అడిగేవారు. అంత గొప్పదైన వేదవిజ్ఞానం, బౌద్ధవిజ్ఞానం తెలిసినవాడివి, నీవు థియోసఫీలో చేరడం ఏమిటని ప్రశ్నించేవారు. సుబ్బారావు అంటే తమ ప్రాధాన్యత తగ్గిపోవచ్చు నని వారి బాధ, అనుమానం. మాస్టర్స్ బ్లవట్స్కీకి రాసే ఉత్తరాలలో ఫోర్జరీ ఉత్తరాలు హ్యూం కల్పించి, సుబ్బారావుపై వ్యతిరేకత వచ్చేట్లు చేశాడు. బ్లవట్స్కీ రష్యా గూఢచారిని అని అపవాదం పుట్టించింది హ్యూం, సిన్నెట్‌లు. అప్పుడే మాడంకు సిన్నెట్‌పైన, హ్యూంపైన పిచ్చకోపం వచ్చింది. మనస్సును కలచి వేసింది.

ఈ దేశంలో ఏ సంస్కరణోద్యమం వచ్చినా దానిని మొదట స్వాగతించే వర్గం బ్రాహ్మణులు. చదువు, సంస్కారాలు బ్రాహ్మణులవే. దానిని తమ వర్గానికే పరిమితం చేయాలన్న ప్రయత్నం అది. ప్రతి ఉద్యమంలోను పెత్తనం వారిదే. చివరికి దానిని నీరుగార్చే అవినీతికి దిగేది ఆ వర్గమే. టి. సుబ్బారావు బ్రాహ్మణ పక్షపాతి. అడ్వకేట్ అయినా పరమ చాదస్తుడు.

మాస్టర్లు అంటే మన మహర్షులు, పరమగురువులు. వైదిక వాఙ్మయంలోని నిగూఢ విషయాలు బ్లవట్స్కీ బయటపెట్టడం ఆయనకు నచ్చలేదు. దాని వల్ల బ్రాహ్మణ్యం మంట గలుస్తోందని వాపోయాడు. పవిత్ర గ్రంథాలు అపవిత్రం అవుతున్నాయని దుగ్ధ. దేవరహస్యాలు, వేదరహస్యాలు బ్రాహ్మణేతరులకు తెలియ రాదన్నది ఆయన మనోభిప్రాయం. బ్లవట్స్కీ ఆ పనికి పూనుకోవడం అతనికి నచ్చని విషయం. అయినా ఆమె ప్రతిభకు తలవంచాడు. సమయం వచ్చినపుడు విరోధించాడు, నిరోధించాడు.

ఒక సందర్భంలో సుబ్బారావు బ్లవట్స్కీకి ఇలా రాశాడు.

“మాడం! మీరు చాలా తప్పు చేస్తున్నారు. అది క్షమించరాని నేరం. అతీంద్రియ విజ్ఞానం పేరున ‘ఆకల్టిజాన్ని’ బహిరంగ పరచకూడదు. అది నిగూఢంగా ఉంటేనే దానికి విలువ. అది పాశ్చాత్యులకు నిర్దేశించిన విద్య కాదు.”

“చెప్పకూడని బ్రహ్మ రహస్యాలు, నిగూఢ విషయాలు బహిర్గతం చేయడం వల్ల బ్లవట్స్కీ తగిన మూల్యం చెల్లించవలసి వచ్చింది. జబ్బు పడ్డది. శత్రువుల చేత చిక్కి అవమానాల పాలైంది.” అనేది సుబ్బారావు తీర్పు. తను తప్పు చేశానని, అందుకు తానే బాధ్యత వహిస్తానని ఒప్పుకుంది బ్లవట్స్కీ. ఆమె ఆశించిన విధంగా పాశ్చాత్య దేశాల మేధావి వర్గంలో మార్పు రాలేదు. బ్రహ్మ విద్యా రహస్యాలు భౌతిక వాదులకు అర్థం కావు. అవి అధిభౌతికం గదా.

ఒక సందర్భంలో మాస్టర్ కె. హెచ్. సిన్నెట్‌కు వివరణ యిచ్చాడు :

"ఈ విషయాలు ఎక్కువ భాగం మాటలతో చెప్పేవి కావు. అవ్యక్తాలు. అవి నిగూఢం. ఆత్మ వెలుగుల్లో వాటిని దర్శించాలి, అవగతం చేసుకోవాలి. ఆ పరమవిద్య అదే పరావిద్యను మాస్టర్లు, అంటే పరమ గురువులు, అందరికీ అవి అందనీయరు. కొందరికే అందుతాయి. అదీ అర్హత ఉన్న వారికి మాత్రమే.

బ్లవట్‌స్కీలో అతీంద్రియశక్తులు ఉన్నవనడంలో సందేహం లేదు. సుబ్బారావుకు ఆ సందేహం ఎప్పుడూ లేదు. బాహాటంగా బ్రహ్మవిద్యను ప్రచారం చేయకూడదన్నది ఆయన అభిప్రాయం. అర్హత లేనివారికి, అయోగ్యులకు బ్రహ్మోపదేశం చేయకూడదు. ఉపదేశం అంటేనే పరావిద్యకు ప్రవేశం.

1885లో థియోసాఫికల్ సొసైటీ మహాసభలో సుబ్బారావు పేరున ఒక 'బంగారు పతకం' ఏర్పాటు చేశారు. ఏటా ఒకరికి ఆ పతకాన్ని బహూకరిస్తారు. అది ఆయన విశిష్టతకు గుర్తింపు. థియోసాఫికల్ సొసైటీలో మరొకరెవరికీ ఆ గౌరవం దక్కలేదు. ఒక విదేశీ మహిళ అంతటి దివ్యజ్ఞాని కావడం హిందూ బ్రాహ్మణ వర్గానికి అసూయగా ఉంది. ఆక్రోశించారు. వారు ప్రతిస్పందించ లేదు. సుబ్బారావు దామోదర్ ఇద్దరూ బ్రాహ్మణులే. మహామహోపాధ్యాయులే అని రాయ్ బి. లాహిరీ వ్యాఖ్య.

బ్రాహ్మణులు ఈ దేశంలో ఎవరికీ తలవంచి నమస్కరించరు. ఇతరుల్ని ఆశీర్వదించే హక్కు తమ ఒక్క వర్గానిదే నంటారు. తాము అన్యులకు నమస్కరిస్తే వారికి ఆయుఃక్షీణమని, దురదృష్టమని ప్రచారం చేసుకున్నారు. అటువంటిది బ్లవట్‌స్కీ అనే **శ్వేత యోగిని** ముందు అందరూ పసిపిల్లలై పోయారు. ఆమెను 'అమ్మ'గా అభిమానించారు.

పరమ గురువుల దృష్టిలో బ్రాహ్మణత్వం ఎప్పుడో విలువల్ని కోల్పోయింది. పిచ్చి పిచ్చి నమ్మకాలు, విగ్రహారాధనలు, మంత్ర తంత్రాలను ఆశ్రయించి పురోహితులుగా, పూజారులుగా మారినప్పుడే బ్రాహ్మణీకంలోని బ్రహ్మత్వం పోయి పౌరోహిత్యం మిగిలింది. థియోసఫిస్టు లనేవారు నిజాయితీగా ఉండాలి. పూజలు, చాదస్తాలు, సంప్రదాయాలు వదలాలి.




# 19. సీక్రెట్ డాక్ట్రిన్

## ఎ.పి. సిన్నెట్ రికార్డు (1885)

**మా**డం బ్లవట్స్కీ 1885 ఏప్రిల్‌లో ఇటలీలోని నేపుల్స్ చేరింది. అక్కడ కొద్దిరోజులుండి, జర్మనీలోని వుడ్జ్‌బర్గ్ చేరుకుంది. అప్పుడు నేనూ, నా భార్య వుడ్జ్‌బర్గ్ వెళ్లి ఆమెను కలిశాము. సెప్టెంబరు నాటికి ఆమె సీక్రెట్ డాక్ట్రిన్ మొదలు పెట్టలేదు. ఆరోగ్యం కాస్త బాగానే ఉంది. ఆర్థిక పరిస్థితి మెరుగైంది. ఏ దిగులూ లేకుండా ప్రశాంతంగా ఉన్నట్లు కనిపించింది. ఆమె మేనత్త మాడం ఫదయేవ్ ఆమెకు తోడుగా ఉంది. గతంలోని మానసిక గాయాలు మానాయి. మొత్తం మీద సీక్రెట్ డాక్ట్రిన్ రాయగల శక్తి ఏర్పడ్డది. మేము లండన్ వచ్చేశాం.

**అక్టోబరులో మాడం ఉత్తరం రాసింది.**

> *"నేను సీక్రెట్ డాక్ట్రిన్ రాసే పనిలో పడ్డాను. చాలా బిజీ – న్యూయార్కులో ఇసీస్ అన్వీల్డ్ రాసిన నాటి సంఘటనలు పునరావృత మవుతున్నాయి. అప్పటికన్న ఇప్పుడు బెటర్. ఎప్పుడు ఎటుచూచినా దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఊహకు అందని విషయాలు మనసులోకి జొరబడుతున్నాయి. అంతా మిస్టరీగా ఉంది. అవును సీక్రెట్ డాక్ట్రిన్ అంటే అంతా మిస్టరీయే గదా!*

## మాడం సహాయకురాలు : కాంటస్ కాన్‌స్టన్స్ (1885)

నా దేశం స్వీడన్. కొంతకాలం ఇటలీలో నా స్నేహితురాలి దగ్గర ఉందామని అనుకున్నాను. మధ్యలో జర్మనీలో మాడం గెబ్ హార్డ్ ఇంటికి వస్తానని

మాటిచ్చాను. స్వీడన్‌లో వ్యవహారాలు చక్క బెట్టుకున్నాను. ఎన్ని రోజులు ఉండి పోతానో అయిడియా లేదు. నా వెంట తీసుకువెళ్లవలసిన వస్తువులు బ్యాగుల్లో సర్దు కుంటుండగా, ఒక గొంతు వినిపించింది. అశరీరవాణి.




"ఆ పుస్తకం తీసుకుపో. ప్రయాణంలో పనికొస్తుంది."

నాకు క్లయర్ వాయన్స్, క్లయర్ ఆడియన్స్ పట్ల నమ్మకం ఉంది. నాలోనూ కాస్త దూర, శ్రవణ, దూరదర్శన్ విద్యలు చోటు చేసుకుంటున్నాయి. ఆ గొంతు ఎవరిదో తెలియక పోయినా, నమ్మకం ఉంది కనుక టేబుల్‌పైన ఉంచిన పుస్తకం తీసి పెట్టెలో అడుగున పడవేశాను. అది 'మాన్యుస్క్రిప్టు' – చేతిరాత పుస్తకం. ప్రయాణాల్లో అటువంటి పుస్తకం చదవడం కుదరదు. అన్నీ తంత్రాలు, మంత్రాలు, మాజిక్కులు, మిస్టరీలు – పుస్తకం నిండా.

అనుకున్నట్లే జర్మనీలో ఎల్బర్ ఫెర్డ్ చేరాను. మిత్రురాలు ఆప్యాయంగా ఆదరించింది. ఇటలీ చేరడం నా గమ్యం. అక్కడ నా బెస్ట్ ఫ్రెండ్ ఎదురు చూస్తుంటుంది. ఇంకా చాలా మంది స్నేహితు లున్నారక్కడ. త్వరలోనే వెళ్లిపోతానని మాడం గెబ్‌హార్ట్‌తో ముందే చెప్పాను. ఇంక బయలుదేర బోతుండగా గెబ్‌హార్ట్ చెప్పింది నాతో, తనకు మాడం బ్లవట్‌స్కీ దగ్గరనుండి వచ్చిన ఉత్తరం గురించి. "బ్లవట్‌స్కీ జబ్బుపడ్డదని, మెంటల్ డిప్రెషన్‌లో ఉన్నదని, తోడుగా ఒక సర్వెంట్ గర్ల్, ఇండియా నుండి వచ్చిన ఒక శిష్యుడు మాత్రం ఉన్నారు."

మాడం గెబ్‌హార్ట్ సలహా, "నీవు మాడం బ్లవట్‌స్కీ దగ్గరకు వెళ్లిపో. తనకు నీ అవసరం చాలా ఉంది."

"నేను వచ్చి మీతో కొన్ని రోజులు ఉంటానని." నేనే ఉత్తరం రాశాను ఆ ఉత్తరం గెబ్‌హార్ట్‌కు చూపించి పోస్టు చేశాను. సంతోషించింది.

మూడవరోజున జవాబు వచ్చింది.

"నీవు రావద్దు. ఇంట్లో మరొక అతిథికి జాగాలేదు. పైగా నేను సీక్రెట్

డాక్ట్రిన్ పనిలో తలమునకలుగా ఉన్నాను. మీ ఎవరితో స్పెండ్ చేసే తీరిక లేదు. ఇటలీ నుండి తిరుగు ప్రయాణంలో రా."

ఆ ఉత్తరం నిరాశ కలిగించింది. వెంటనే ఇటలీ వెళ్లడానికి సిద్ధపడ్డాను. సామాన్లు సర్దుకుంటున్నాను. బయట 'కాబ్' రెడీగా ఉంది. అప్పుడు టెలిగ్రాం. "వెంటనే ఉల్జ్‌బర్గ్ బయలుదేరు – అర్జంటు – బ్లవట్‌స్కీ".

టెలిగ్రాం చూడగానే మాకు కంగారు పుట్టింది. ఏం జరిగి ఉంటుంది? జరగరాని దేదో జరిగితే తప్ప టెలిగ్రాం ఇవ్వరు గదా! మరో ఆలోచన లేకుండా సాయంత్రానికి బ్లవట్‌స్కీ లాడ్జికి చేరాను. కంగారు. భయం. మేడ మెట్లు ఎక్కుతుంటే కాళ్లు తడబడ్డాయి. ఏ దృశ్యం చూడవలసి వస్తుందో! ఓ మైగాడ్!

ఎదురుగా వచ్చి మాడం నవ్వుతూ పలకరించారు. హమ్మయ్య! ఎంత రిలీఫ్. మాడంకు ఏమీ కాలేదు.

"నన్ను క్షమించు! చాలా కఠినంగా ప్రవర్తించాను కదూ! ఏం చేయను? నిజం చెప్పనా! ఇక్కడ ఉన్నది ఒకే బెడ్‌రూం. నీవా చిన్నదానివి. నీకు సోకు లెక్కువ. నీకూ ప్రైవసీ కావాలి. ఈ ముసలిదానితో ఒకే గదిలో ఎలా ఉంటావు. నా పద్ధతులు వేరు, నీ పద్ధతులు వేరు. ఈ గదిలో ఉంటే నీకు నచ్చనివి చాలా భరించాలి. ముసలాళ్లను భరించడం కష్టం. అందువల్ల, నీవు వస్తానంటే వద్దని రాశాను. నీకు ఉత్తరం పోస్టు చేసిన తర్వాత మా గురువుగారు మందలించారు. నిన్ను వెంటనే రప్పించుకో మన్నారు. మాస్టర్ మాట కాదనలేను గదా! అది ఆర్డర్. ఆ తర్వాత బెడ్‌రూం మధ్యలో కర్టన్ కట్టి రెండు భాగాలుగా చేయించాను. నీకేమీ ఇబ్బంది ఉండదు కదా?"

"మాడం! ఎన్ని అసౌకర్యాలున్నా మీతో ఉండటం మహాభాగ్యం."

టీ తాగడానికి డైనింగ్ టేబుల్ దగ్గరకు పోతుండగా మాడం అన్నది.

"నాకు పనికొచ్చే పుస్తకం నీ దగ్గర ఏదో ఉందని, అది నీవు తెస్తున్నావని మాస్టర్ చెప్పారు ... ఏదీ ఆ పుస్తకం?"

"సారీ మాడం! మీకు పనికొచ్చేంత గొప్ప పుస్తకం నా దగ్గర ఎలా ఉంటుంది."

"ఆలోచించుకో. **'టరట్ – కబ్బలా'** గురించిన పుస్తకం లేదా నిజంగా? ఆ పుస్తకం తీసుకురమ్మని మాస్టర్ నీకు చెప్పారట."

అప్పుడు జ్ఞాపకం వచ్చింది. పెట్టెలో అడుగున పడేసిన రాత పుస్తకం గురించి. ఉపయోగం లేని పుస్తకం కదా అని అడుగున పడేసి దాని సంగతే మరచిపోయాను. రూంలోకి వెళ్లి, పెట్టె తెరచి ఆ పుస్తకం తెచ్చాను. పాకెట్ అలాగే ఉంది.

"ఆగు ... దాన్ని విప్పకు. పదవ పేజీలో, ఆరవ లైనులో ఈ కొటేషన్ ఉందేమో చూచి చెప్పు చాలు."

పుస్తకం తెరిచాను. మాడం చెప్పిన కొటేషన్ ఉంది. అది స్క్రిప్ట్. ఎవరూ తీసి చదివే అవకాశం లేదు. అది నా ఫ్రెండ్ స్వదస్తూరీతో రాసిచ్చిన పుస్తకం. మాడంకి తెలిసే అవకాశం లేదు. మిస్టరీ!

"చూడమ్మాయ్! ఇది **'సీక్రెట్ డాక్ట్రిన్'** నా కొత్త పుస్తకం. ప్రస్తుతం దాని రచనలో ఉన్నాను. మాస్టర్ స్వయంగా మాటర్ అందిస్తున్నారు, నేను రాస్తున్నాను. నీ దగ్గర ఉన్న ఈ పుస్తకం నాకు ఉపయోగిస్తుందని మాస్టర్‌కి తెలుసు."

★ ★ ★

ఒక్కరోజులో ఎంత చిత్రమైన మార్పు.

ఆ రోజు గడిచింది. మర్నాటి నుండి నా జీవితం బ్లవట్‌స్కీ జీవితంతో ముడిపడ్డది.

ఉదయం ఆరుగంటలకే సర్వెంట్ గర్ల్ మాడంకు టీ తీసుకు పోతుండగా నాకు మెలకువ వచ్చింది. నేను ఒక గంటలో రెడీ అయి మాడం గదికి వెళ్లాను. మాడం అన్నది 'నా పనికి ఇకపైన బ్రేకు పడకూడదు.'

"ఎనిమిది గంటలకు బ్రేక్‌ఫాస్టు. ఒంటి గంట దాకా రాస్తుంటాను. కాలింగ్ బెల్ మోగినప్పుడు లంచ్ తెస్తూ ఉండు. వచ్చేటప్పుడు తలుపు మూసి లోపలకు రా. రాత్రి డిన్నర్ టైం వరకు నన్ను డిస్టర్బ్ చేయవద్దు."

రాత్రి పదిగంటలకు రాతపని ముగించి, 'పేషెన్స్' ఆడుకునేది. థియోసాఫికల్ విషయాలు చెప్పనిచ్చేది కాదు. పత్రికలు తెచ్చి ముఖ్యమైన విషయాలు చదివి వినిపించేదాన్ని. రాత్ర ఒంటిగంట వరకు రష్యన్ పత్రికలు చదువుకునేది.

అది మాడం దినచర్య. ఆమెకు వచ్చిన ఉత్తరాలకు జవాబులు రాయడం నా పని. Society of Psychic Research వారి రిపోర్టు వచ్చిన రోజు ఆమె భోరున ఏడ్చింది. నోటమాట రాలేదు. అది పెద్ద షాక్.

"థియోసాఫికల్ సొసైటీ కర్మ కాలింది. ఆ పాపం నాకు చుట్టుకుంది. నన్ను బలిపశువును చేశారు. నేను రష్యా గూఢచారినట. నామాట ఎవరు వింటారు? ఇంక నా **'సీక్రెట్ డాక్ట్రిన్'** ఎవరు చదువుతారు? ఎవరు నన్ను గౌరవిస్తారు. మాస్టర్ ప్లాను ఎవరు నెరవేరుస్తారు? నేను ఎవరికోసం బ్రతకాలి? కర్మ. కర్మ ... ఈ అవమానం భరించలేను. చచ్చిపోతే! ఇంతకాలం పడ్డశ్రమ వృధా అవుతుంది. సొసైటీ నామ రూపాల్లేకుండా పోతుంది". విలపించింది.

మాడం అంతగా క్రుంగి పోవడం నేను ఎప్పుడూ చూడలేదు. ఆ రోజున బేలగా విలపించింది. బహుశా జీవితంలో ఆరోజున మొదటిసారి కన్నీరు పెట్టి ఉంటుంది. నావైపు చూచి అన్నది : 'వెళ్లిపో కౌంటస్. నన్ను వదలి పో. నీవు జమీందారు బిడ్డవు. చెడిపోయిన నాలాంటి దానితో నీకేం పని? నావల్ల నీకేం లాభం? ప్రపంచం నన్ను దోషిగా చూస్తుంది ఇక పైన. నేను మాయలాడిని, మంత్రకత్తెను. నా వల్ల నీ పరువు పోగూడదు, వెళ్లిపో తల్లీ."

నేను మాడం కళ్లలోకి చూచి అన్నాను.

"అమ్మా! మీకు తెలుసు, మాస్టర్లు ఉన్నారని. థియోసాఫికల్ సొసైటీ స్థాపనకు మీరు నిమిత్తమాత్రులు. అది మాస్టర్స్ సంకల్పం. అది మహత్కార్యం. ఆ విషయం మీకూ తెలుసు. నిప్పుకు చెదపట్టదు. సత్యానికి వన్నె తగ్గదు. మాడం! మిమ్మల్ని వదలి నేను వెళ్లలేను, వెళ్లను. నా జీవితం మీతోనే. మీ సేవ చేసుకోనీయండి చాలు. అందరూ వెళ్లిపోయినా, మీకు నేనూ, నాకు మీరూ ఉంటాం. మళ్లీ మంచిరోజులు వస్తాయని నా అంతరాత్మ చెబుతోంది."

అప్పటికి సీక్రెట్ డాక్ట్రిన్ రచన ఆగిపోయింది. ఆమె కలం ముందుకు సాగలేదు. మనసుకు స్థిమితం లేదు. కొన్ని రోజుల తర్వాత తేరుకుని రచన తిరిగి ప్రారంభించింది. అవునా! విధి రాసిన రాతను తిప్పిరాసే శక్తి మనిషికి ఉంది కదా! కర్మను సైతం జయించిన ధీమణి బ్లవట్స్కీ మాడం.

తర్వాత అక్కగారు ఝెలిహోవ్స్కీ, ఆమె కూతురు వచ్చారు.



# 20. పరాజయం అంచున

**ఆ**మె పరాజిత.

పదిసంవత్సరాలు ప్రపంచం మొత్తంలో మహామేధావి అనిపించుకున్నది. ఇండియా నుండి పారిపోయివచ్చి జర్మనీలో తలదాచుకుంది. ఉల్జ్‌బర్గ్ తన ఆరోగ్యానికి అనువైన ప్రదేశం. బయట ఎంత చలిపెట్టినా, మంచు కురిసినా, ఇంటిలోపల వెచ్చగా ఉంటుంది. ఇటలీలో బయట తిరిగితే ఇట్టే జలుబు చేస్తుంది. ఉల్జ్‌బర్గ్ అటు హైడల్‌బర్గ్‌కు, ఇటు నూరెన్‌బర్గ్‌కు దగ్గర. పైగా అది మాస్టర్ కుత్‌హోమి ఉన్న ప్రదేశం. తన గురువుగారు మాస్టర్ మోరియా తనని కావాలనే అక్కడకు చేర్చారనుకుంది. ఉల్జ్‌బర్గ్ చేరే నాటికి బ్లవట్‌స్కీ పరిస్థితి ఘోరంగా ఉంది. మహాదరిద్రం అనుభవిస్తోంది. రష్యన్ పత్రికలకు వ్యాసాలు రాసే అవకాశం పోయింది. డబ్బు సంపాదించే మార్గం లేదు. ఆ స్థితిలో సిన్నెట్‌కు ఒక ఉత్తరం రాసింది.

"డియర్ సిన్నెట్!

నేను ఇకపైన అజ్ఞాతంలో ఉండిపోదలిచాను. మరొకసారి ఉద్యమంలోకి వచ్చి చేసేదానికన్న అజ్ఞాతంలోఉంటూ ఎక్కువసేవ చేయగల ననిపిస్తోంది. ఎక్కడో, ఎవరికీ తెలియనిచోట ఉండి రాసుకుంటూ ఉంటాను. ఏడాదికి నలభైవేల ఫ్రాంకులు కావాలి. ఏదో రాయాలి. రాయడం తప్ప 'మరొక పనికి' పనికిరాని దాన్ని నేను."

బ్లవట్‌స్కీకి రష్యాలో రచయిత్రిగా మంచి గుర్తింపు ఉంది. పబ్లిషర్లు తుర్గనీవ్

లాంటి గొప్ప రచయితలకిచ్చిన రాయల్టీ ఆమెకూ యిస్తారు. 'సీక్రెట్ డాక్ట్రిన్' రాతపనిలో విరామం దొరికినపుడు రష్యన్ పత్రికా వ్యాసంగం కొనసాగిస్తుంది. 'రష్యన్ రివ్యూ' పత్రిక ప్రధాన రచయితల్లో ఆమె ఒకరు. 'రడ్డాబాయ్' ఆమె కలం పేరు. "The Key to Theosophy" అనే పుస్తకం ప్రొఫెసర్ వ్లదమిక్ సొలోవిచ్‌కి బాగా నచ్చింది. ఆయన గొప్ప ఫిలాసఫర్. "బోధిని ఎక్సొటరిక్ బుద్ధిజం నుండి వేరుచేస్తే థియోసఫీ అవుతుంది" అంటారాయన. "థియోసఫీని నియో బుద్ధిజం" అని ప్రశంసించాడు.

"మనిషిలో వ్యక్తిత్వం అన్నది స్వతంత్ర ప్రతిపత్తి. అది విశ్వధర్మం. అది విశ్వచైతన్యం ద్వారా భాసిస్తుంది" అంటారాయన. ఆ పని హిందూ ఫిలాసఫీవల్ల కావడం లేదు. భారతీయ వేదాంతంలో అనేక శాఖా భేదాలున్నాయి. బోధిలో (బౌద్ధం) సమగ్రత ఉంది. స్వచ్ఛత ఉంది. పరిపూర్ణత ఉంది. మాడం బ్లవట్‌స్కీ తన థియోసఫీ ద్వారా ఆ పవిత్ర జీవన విధానాన్ని ప్రబోధించింది. మనిషిని ప్రబుద్ధం చేస్తున్నది.

ప్రొఫెసరు సొలోవిచ్ "కీ టు థియోసఫీ" గురించిన మాటలు :

"థియోసఫీ బాగా లాభసాటి వ్యాపారం అనుకుంటారు కొందరు. డబ్బు గడించే మార్గం అనుకుంటారు మరి కొందరు. థియోసఫీ సొసైటీ మార్గ నిర్దేశకులైన టిబెట్ యోగులు అసలు ఉన్నారా? అని కొందరు సందేహిస్తారు. మాస్టర్లు అనేవారు బ్లవట్‌స్కీ 'కల్పన' అన్నవారూ లేకపోలేదు. అన్నింటికీ ఆధారాలున్నాయి, నిరూపణలూ ఉన్నాయి. థియోసాఫికల్ సొసైటీ ఏర్పడక ముందు 1840లో ఒక ఫ్రెంచి యాత్రికుడు 'హుక్' టార్టార్, టిబెట్, చైనా దేశాలలో పర్యటించి అజ్ఞాతంగా ఉండే గురువుల ఆచూకీ చెప్పాడు. వారు ఉన్నారు. లేరనడం అజ్ఞానం, అహంకారం.

థియోసాఫికల్ సొసైటీ ఏం చేసింది? అని కాదు. ఎంత చేసింది? అని చూడాలి. కొత్త బౌద్ధధర్మాన్ని ఆవిష్కరించింది. బౌద్ధాన్ని కొత్తకోణంలోంచి చూడడం, చూపడం సామాన్య విషయం కాదు. ఎటువంటి మూఢ నమ్మకాలు, చాదస్తాలు లేకుండా ఒక సిద్ధాంతాన్ని ప్రవేశ పెట్టడం తేలికకాదు. మనిషి నేరుగా స్వతంత్రంగా దివ్యత్వం సాధించే మార్గం చూపింది. ఆచరింప చేయడం చూపింది థియోసఫి. అది ఆత్మ పరిణామవాదం."

బుద్ధివాదాన్ని, బౌద్ధధర్మాన్ని ఆయన చక్కగా అన్వయించి చూపాడు. బుద్ధివాదం సనాతనధర్మం. బౌద్ధ ధర్మం గౌతమబుద్ధుని బోధామృతం.

కష్టాలు భరించలేక, అవమానాలు సహించలేక రష్యా తిరిగి వెళ్లి శేష జీవితం ప్రశాంతంగా గడపాలని భావించింది. అక్క ఝెలినోవ్‌స్కీ కూడా రమ్మని రాసింది. అలా వెళ్లిపోతే ఓటమిని అంగీకరించినట్లు అవుతుంది. అపవాదాలు నిజాలవుతాయి. అంచేత ఆపని చేయలేక 'అజ్ఞాతవాసం' ఇష్టపడ్డది. యోగాన్ని నమ్ముకున్నవారు యోగాగ్ని సెగలు భరించక తప్పదు. వేడిమిని, తాపాన్ని తట్టు కోగలగాలి. సత్యాన్ని తను నమ్ముకుంది. సత్యం తనను బ్రతికిస్తుంది. అసలు కలంపట్టి రాయలేని స్థితి వస్తుందని భయపడ్డది. జీవిత లక్ష్యంగా భావించిన **'సీక్రెట్ డాక్ట్రిన్'** పని పూర్తికావాలి. పట్టుదలతో, దీక్షగా రచనకు ఉపక్రమించింది.

1885లో పూర్తిగా నైరాశ్యంలో ఉన్న సమయంలో ఒక ఆంగ్ల వనిత లండన్‌లోని స్వీడన్ రాయబారి భార్య కాంటెస్ కాన్‌స్టాన్స్ బ్లవట్‌స్కీ జీవితంలో ప్రవేశించింది. ఆమె అంటుంది!

"తన ఒంటరితనం, విచారం పోగొట్టడానికి నాకు వీలైనంత సాయం చేశాను. మాడం బ్లవట్‌స్కీ గురించి చాలా విన్నాను. చెడుగా చెప్పిన మాటలూ విన్నాను. తర్వాత ఆమెను చూడడానికి వెళ్లాను. ఆమెలో ఆధ్యాత్మిక తేజం తప్ప ఏ ఒక్క లోపమూ నాకు కనిపించలేదు. స్వచ్ఛమైన మహిళ. గొప్ప హృదయం. సత్యం తెలుసుకోలేని వారు నిందలు వేశారనిపించింది."

"నేను ఆమెతో జర్మనీలో సహ జీవనం సాగించాను.

ఒకసారి ఆమె గది నిండా కాగితం ఉండలు కనిపించాయి చిరాగ్గా.

'ఏమిటి మాడం, ఏమైంది?' అని అడిగాను.

"ఈ పేజీ సరిగా రాయడం కుదరడం లేదు కాంటెస్. ఇప్పటికి డజను సార్లు తిప్పి రాశాను. రాసిన ప్రతిసారి మాస్టర్ 'అది తప్పు' అంటున్నారు. నువ్వు పోయి పడుకో, ఇది పూర్తి చేస్తే గాని నాకు నిద్రపట్టదు" అన్నది. అంతటి దీక్ష, పట్టుదల మాడంది."

★ ★ ★

సీక్రెట్ డాక్ట్రిన్ రాస్తున్నంత కాలం ప్రతిఉదయం నిద్ర లేచే సమయానికి ఆమె టేబుల్‌పైన ఇంత సమాచారంతో ఇన్ని కాగితాలు ఉండేవి. మాస్టర్లు ఎవరో తెచ్చి పెట్టేవారు. ఆమె రాస్తున్నంత సేపు వారు గమనిస్తుండేవారు.

మాడం బ్లవట్‌స్కీ వ్యక్తిత్వం గురించి కాంటస్ మాటల్లో :

"బ్లవట్‌స్కీని తెలిసినవారు, ఇష్టపడేవారు ఆమెలోని ఆకర్షణకు ముగ్ధులై పోతుంటారు. ఆమె ప్రేమలో, అభిమానంలో నిజాయితీ ఉంటుంది. అందరినీ నమ్ముతుంది. నిష్కల్మషంగా ప్రేమిస్తుంది. అప్పుడప్పుడు చిన్నపిల్లలా

మారిపోతుంది. ఆమె నవ్వినంత స్వచ్ఛంగా ఎవరూ నవ్వలేరు. మనుషుల బలహీనతలు ఆమెకు ఇట్టే తెలిసిపోతాయి. తప్పులు ఎత్తి చూపిస్తే ఎవరు మాత్రం సహిస్తారు! చాలామంది కోపంతో వెళ్లిపోయేవారు. లోపాలు సరిదిద్దుకున్నవారు ఆమె శిష్యులుగా మారిపోయేవారు. తమ తప్పుల్ని తెలుసుకుని చక్కదిద్దకో గలిగిన వారికి ఆధ్యాత్మికాభివృద్ధి ఉంటుంది. వారికి ఆధ్యాత్మిక శక్తులు ఆటోమాటిక్‌గా లభిస్తాయి. బ్లవట్‌స్కీ వంటి మంచి స్నేహితురాలు, గురువు దొరకడం అసంభవం. ఆమె నాకు దొరకడం నా అదృష్టం. ఆమెతో కలిసి అన్ని రోజులు జీవించడం, ఆమెతో సన్నిహితంగా మెలిగే అవకాశం కలగడం గొప్ప వరం.”

గురువుతో కలిసి నడవడం, గురువు అనుగ్రహం పొందడం ఒక వరం, అదే తపస్సు, అదే ఒక మహాయోగం.

★ ★ ★

1886 ఆరంభంలో బ్లవట్‌స్కీ బెల్జియం ప్రయాణం పెట్టుకుంది. ఓస్టెండ్‌లో తన సోదరి, ఆమె పిల్లలు ఉన్నారు. వారితో కొన్నాళ్లు గడపాలని వెళ్లి, 1887 మే వరకు అక్కడే ఉండి పోయింది. 1886 పొడవునా కష్టాలు వెన్నంటాయి. ఇండియా నుండి వచ్చిన ఒక యువకుని ప్రవర్తన ఆమెకు చిరాకు కలిగించింది. అతన్ని పంపివేశాక ప్రాణం కుదుటపడ్డది. అంతలో స్వీడన్ వెళ్లిన కాంటెస్ తిరిగి వచ్చింది. నాటి నుండి చివరి వరకు బ్లవట్‌స్కీని ఆమె కనిపెట్టుకునే ఉంది.

ఆనారోగ్యం కారణంగా బ్లవట్‌స్కీ లక్ష్యం దూరం చేసుకోలేదు. సీక్రెట్ డాక్ట్రిన్ పూర్తి చేయాలన్న పట్టుదల పెరిగింది. లోకులు విమర్శించిన కొద్దీ సత్యం, నిజాయితీ పదును తేలింది. విపరీతమైన కీళ్లనొప్పులు, ఒంటినొప్పులు భరించింది. ఆమె పట్టుదలకు జబ్బులు పలాయనం చేశాయి. అపాయాలు చెప్పిరావు. ఓస్టెండ్‌లో సోదరి ఇంటివద్ద ఉండగా మళ్లీ జబ్బు పడ్డది. స్పృహ కోల్పోయింది. డాక్టర్లు ఆశలు వదిలారు. సీక్రెట్ డాక్ట్రిన్ పని అసంపూర్ణంగా ఉంది. అది పూర్తి చేయడానికైనా మాస్టర్లు ఆమెను బ్రతికించక తప్పలేదు. ఎప్పుడైతే గురువు ఆపన్నహస్తం అందిందో అప్పుడు చప్పున లేచి కూర్చుంది.

అప్పుడు కాంటెస్ అన్నమాట.

“కాంటెస్, ఇలారా! మాస్టర్ వచ్చి వెళ్లారు గమనించావా? నేను బ్రతడకడం చావడం నా ఇష్టంట. ఇంగ్లండ్ వెళ్లి ఉంటే చనిపోయేదాన్నట – మాస్టర్ చెప్పారు.

థియోసఫీ కోసం నా సర్వస్వం త్యాగం చేశాను. కాఫీ పట్టుకురా, నీరసంగా ఉంది" మృత్యుముఖంలోనూ నిబ్బరంగా జోక్ చేయగల సంయమనం ఆమెది.

ఆ క్షణంలో బ్లవట్స్కీ నిర్ణయం గొప్పది. బాధ భరించలేక చచ్చిపోవాలని నిర్ణయిస్తే సీక్రెట్ డాక్ట్రిన్ పూర్తయ్యేది కాదు. బ్రతకాలనుకుంది – మాస్టర్లు 'ప్రాణం' దానం చేశారు. ఆయుర్దాయం పెంచారు. ఆమెకు ఆకల్ట్ శిక్షణ, దివ్యజ్ఞానం ముఖ్యం. ఆమె ఉదాత్త నిర్ణయానికి కారణం ప్రేమ, సమరస భావన, సహజీవన సౌభాగ్యం. అవును. ప్రపంచానికి, మానవాళికి అవసరమైన మూల ధర్మాలు అవి. భౌతిక సుఖాలు ఆశించేవారు ఆ మూడు సూత్రాలను ప్రక్కన పెడతారు. భారతదేశంలో హిందువులైన యోగులకే ఆ శక్తి ఉంది. కాని ఉపయోగించరు. మొత్తం ప్రపంచానికి శాంతిని, దాంతిని ప్రసాదించగల యోగశక్తి భారత్‌లోనే ఉంది. సనాతన ధర్మంలో సహనం, ప్రేమ, ఆదరణ ఉన్నాయి. కాని ఆచరణలో కనిపించవు. హిందూ థియోసఫిస్టులకు తెలుసు–బ్లవట్స్కీ మహర్షుల వారసురాలని.

పరమ గురువులు సదా కాంక్షించేది విశ్వసౌభ్రాతృత్వం. అనవరతం ఆశించేది విశ్వశాంతి. అందుకు తగిన సమయం ఇదేనని గుర్తించారు. బ్లవట్స్కీ ప్రయత్నం వల్ల యూరపు దేశాలలో మానసికంగా కొంత మార్పు వచ్చింది. వీలైనంత తొందరగా జర్మనీ వదలి లండన్ చేరాలని సంకల్పించింది. తన కృషి విశ్వవ్యాప్తం కావడానికి లండన్ మంచి కేంద్రం. ఇంగ్లీషు మంచి మాధ్యమం. లండన్ థియోసఫిస్టులు అన్ని ఏర్పాట్లుచేసి ఆహ్వానించారు. అది మాస్టర్ సంకల్పం కావచ్చు. మాస్టర్ ప్రణాళికలో ఒక భాగం అయి ఉండవచ్చు. తానెలా కాదనగలదు. ఏది వచ్చినా భరించడానికి సిద్ధంగా ఉంది. సీక్రెట్ డాక్ట్రిన్, ఇతర రచనలు ప్రింట్ కావడానికి అక్కడ ఏర్పాట్లు జరిగాయి. థియోసఫీ పట్ల జనానికి ఆసక్తి పెరిగింది.

లండన్‌లో ఆమెకు నివాసం ఏర్పాటైంది. ప్రముఖ సాహితీవేత్తలు ఆమె రచనలో సహకరించడానికి సిద్ధమైనారు. 1890 ఫిబ్రవరిలో బ్లవట్స్కీ ఇలా మళ్లీ అన్నారు :

"నేను తిరిగి ఇండియా వెళ్లకపోవడానికి నా అనారోగ్యం కారణం కాదు. అడయార్‌లో నన్ను రక్షించిన మాస్టర్లు ఇప్పుడు రక్షించక పోరు. రెండుసార్లు మాస్టర్లు నన్ను కాపాడారు. వెళ్లకపోడానికి అసలు కారణం – ఇండియాలో నేను ఆశించిన ఆదరణ, ప్రేమ కరువైనాయి. ఆ ప్రేమాదరాలు అమెరికాలో, ఇంగ్లండులో లభిస్తున్నాయి. గత మూడు సంవత్సరాల్లో వందల మందిని కలిశాను.



వారంతా నాకోసం ప్రాణాలివ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ఎవరికి తోచిన రీతిలో వారు సహాయం చేశారు. థియోసఫీని ప్రచారం చేస్తున్నారు. అది నాకు సాంత్వన కలిగించింది.

పైగా, నేను ఇండియా వదలిన తర్వాత అక్కడి వారికి శ్రద్ధ తగ్గిపోయింది. ఎవరూ సరిగా పనిచేయటం లేదు. అడయారులో అధికారం కోసం పోరు ఎక్కువైంది. అసూయలు పెరిగాయి. అవకాశం కోసం ఎదురు చూచారు. నేను ఇంగ్లండు రావడం వారికి అవకాశం అయింది. ఇండియాలో థియోసఫి దెబ్బతినడానికి ఆల్కాట్ పాత్ర కూడా చాలా ఉంది. అతనిలో పూర్వం ఉన్న ఉత్సాహం, దక్షత కొరవడ్డాయి. తన సర్కిల్ ఒకటి తయారు చేసుకున్నాడు. అది మేధావివర్గం. దాంతో అసలు లక్ష్యం చెదిరింది. థియోసఫి అంటే తాంత్రికం కాదు. మిస్టరీ కాదు. అతీంద్రియ విద్యల ప్రదర్శన అంతకన్న కాదు.

సిన్నెట్ కూడా అటువంటి తప్పులే చేసి పతనానికి చేయి అందించాడు. మాస్టర్ సందేశాలు లెక్కచేయడం మానివేశాడు. అప్పుడే మాస్టర్ మోరియా హెచ్చరించాడు. **"మనిషి సామాజిక హోదాకు, ఆధ్యాత్మికతకు సంబంధం లేదని".** ఆ సలహాను సిన్నెట్ పాటించలేదు. లండన్ లాడ్జిని విద్యావేత్తలతో నింపాడు. పలుకుబడి, హోదాగల వారినే గౌరవించేవాడు. సిన్నెట్ ఇండియా వదలి లండన్ చేరగానే మాస్టర్లు అతనిని వదలిపెట్టారు. బ్లవట్స్కీ సమావేశాలకు హాజరయ్యేవాడు కాదు. పైగా ఎనలేని ద్వేషం పెంచుకున్నాడు."అది కలిమహత్యం" అన్నది బ్లవట్స్కీ.

1891లో కాలం చేయడానికి కొంచెం ముందు, ఒక అమెరికన్ కన్వెన్షన్‌లో మాడం చెప్పినమాట – **"ఇప్పటివరకు సాధించిన ప్రగతి, అభివృద్ధి 1898 వరకు కొనసాగుతుంది. అప్పుడు థియోసాఫికల్ సొసైటీలో చాలా గొడవలు వస్తాయని నాకనిపిస్తోంది. అసలుకే ముసలం రావచ్చు. చాలా చాలా గొడవలు వస్తాయి. అయితే కల్లోలం తర్వాత థియోసఫికి మంచి భవిష్యత్తు ఉంటుంది."** మాస్టర్ మోరియా ముక్తాయింపు –

"ఇప్పటివరకు జరిపిన ముగ్గురి కృషి వృధా కాదు. అది ప్రశంసనీయం.

మొదటి పాతిక సంవత్సరాలలో మాస్టర్స్ ఓపెన్‌గా సహకారం అందిస్తారు. ఆ తర్వాత మాస్టర్ల డైరెక్టు సహాయం ఉండదు. అంతమాత్రాన వారి ప్రమేయం ఉండకుండా పోదు. ఎప్పుడూ థియోసఫీకి మాస్టర్లకు సంబంధం ఉంటుంది. అవసరమైన వారికి అవసరమైన సహాయం మాస్టర్లు ఎప్పుడూ చేస్తారు.

★ ★ ★

అప్పుడే ఒక విచిత్ర సంఘటన జరిగింది. లండన్ మురికివాడల్లో పేదలకు సేవ చేస్తున్న ఆనీబీసెంట్‌కు బ్లవట్‌స్కీ ఒక ఉత్తరం రాసింది. "నీవు చేస్తున్న సేవ గొప్పది. నా హృదయం స్పందించింది. నా దగ్గర 30 సెంట్స్ ఉన్నాయి. అవి నీకు ఇవ్వగలను. నేను నిరుపేదను. నేను 'పేదను' అని చెప్పుకోడానికి గర్వంగా ఉంది. నేనిచ్చే చిన్న మొత్తంతో 30 మంది చిన్నారులకు ఒకపూట భోజనం వస్తుంది. నాకు 30 నిమిషాలు ఆనందం మిగులుతుంది. నా చిన్నకోరిక తీర్చు. నిర్భాగ్య పాపలకు నా ఆశీస్సులు. ఈ లోకానికి పనికిరాని ఈ మిత్రురాలిని మన్నించు."

అది బ్లవట్‌స్కీ, ఆనీబిసెంట్‌ల మైత్రికి నాంది వాచకం. థియోసఫిస్టుల లక్ష్యాల గురించి 1888లో అమెరికన్ కన్వెన్షన్‌కు రాసిన ఉత్తరంలో స్పష్టంగా పేర్కొన్నది.

***"మద్యపానం వ్యతిరేకించేవారికి మేము మిత్రులం. జంతువుల పట్ల క్రూరంగా ఉండడం మేము సహించం. మహిళలకు అన్యాయం జరగడాన్ని అసలు సహించం. సమాజంలో, ప్రభుత్వంలో అవినీతిని సహించం. మేము రాజకీయాల్లో తలదూర్చం. పేదల పరిస్థితులను మెరుగు పరచడం మాలక్ష్యం."***

పై అంశాలను ప్రతిఒక్కరు పాటించాలి.

"థియోసఫిస్టులు ఏం ఉద్ధరిస్తున్నారని? ఎవరైనా ప్రశ్నించవచ్చు. చెట్టు నాణ్యత అది కాసే ఫలాల్ని బట్టి ఉంటుంది. పేదలకు ఇళ్లు కట్టించండి. ఉచితంగా భోజనాలు పెట్టండి."

థియోసఫిస్టుల బాధ్యత మనుషుల హృదయాల్లోని మాలిన్యాలు కడిగి వేయడం, దాతృత్వం గురించి తెలియ చెప్పడం. న్యాయం, ధర్మం, ప్రేమ విలువలు పెంచడం, మానవ విలువల్ని ఉద్ధరించడం. జ్ఞానం ప్రబుద్ధం చేయడం. మనిషి జంతు ప్రవృత్తిని వదిలి మానవత్వంలో జీవించడం, మనిషిగా బ్రతకటం అలవాటు చేసుకోవాలి. మానవత్వం నిలుస్తుంది. దయా, దాన, ధర్మ గుణాలు నెలకొంటాయి.




# 21. ఆనీబీసెంట్

## 1887

**మా**డం బ్లవట్స్కీ తన అనంతరం థియోసఫి ఉద్యమానికి జడ్జిని నాయకుని చేయాలనుకున్నది. జడ్జి యువకుడు, ప్రతిభావంతుడు, ఆల్కాట్‌కి తనకూ ఇష్టమైనవాడు. ఆల్కాట్‌లో బౌద్ధమతాభిమానం ఉందిగాని, జడ్జికి ఎలాంటి అభిమానం లేదు. సంపూర్ణంగా థియోసఫీకి అంకితమైనవాడు. అతనిలో మహాగురువు ఆత్మ ప్రవేశించి, పనిచేస్తుందని బ్లవట్స్కీ నమ్మకం. అలా పరప్రజ్ఞ ప్రవేశించడాన్ని 'నిర్మాణకాయ' అంటారు.

'నిర్మాణకాయ' అన్నది ఫిజికల్ కాదు, అది భౌతిక శరీరం కాదు. 'యోగి' ఉన్నత భూమికలను చేరినప్పుడు భౌతికశరీరం అసలు అలంబన కాదు. అసలు భౌతిక శరీరం ఉన్నదనిపించదు. అలా ఏర్పడిన శరీరం నిర్మాణ కాయ. అది ఎవరిలోనైనా ప్రవేశించి పనిచేయ గలుగుతుంది. ఆ వ్యక్తి మేధను నిద్రపుచ్చి తను పని చేస్తుంటుంది. అంటే నిర్మాణకాయలు సాధకులలో ప్రవేశించి వారి నైతిక జీవన విలువలు పెంచుతాయి. వారికి ఆధ్యాత్మిక పరిణతి కలిగిస్తాయి.

బ్లవట్స్కీ అరవై సంవత్సరాల జీవితంలో చివరి 'సప్తకం' చాలా విలువ గలది, ముఖ్యమైనది అనిపిస్తుంది. ఆమెను **'పూర్ణపురుష'**గా తీర్చిదిద్దిన సంఘటనలు చివరనే జరిగాయి. ఎండలో ఉన్నంతసేపు నీడ ఉంటుంది. మనిషిని నీడ వెన్నంటి ఉంటుంది. నీడలో ఉన్నవానికి నీడపడదు. లోకంలో మనిషి లోపాలు నీడల్లా వెంటపడతాయి. బ్లవట్స్కీ Secret Doctrine, The Voice of the Silence,

Key to Theosophy – మూడు పుస్తకాలు జీవిత చరమాంకంలో రాసినవే. అవి శాశ్వతాలు. ఆమెకు చిరకీర్తిని తెచ్చి పెట్టాయి.

★ ★ ★

మరో రెండు సంవత్సరాలలో బ్లవట్‌స్కీ మరణిస్తుందనగా, ఒక గొప్ప సంస్కర్త, మానవతావాది అయిన ఆనీ బీసెంట్ థియోసాఫికల్ సొసైటీలో చేరడం జరిగింది. ఆమె బ్లవట్‌స్కీని గురించి లోగడ విన్నది. ఆమెపట్ల ఆరాధన పెంచుకున్నది. అభిమానం పెంచుకున్నది. "రివ్యూ ఆఫ్ రివ్యూస్" అనే పరిశోధన పత్రిక ఎడిటర్ డబ్ల్యు.టి. స్టీడ్. సీక్రెట్ డాక్ట్రిన్ పై సమీక్ష రాయమని ఆనీ బీసెంట్‌ను కోరాడు. అంతకు ముందే థియోసఫీపై రిచర్డ్ హోడగ్సిన్‌తో చర్చ జరిగింది. చర్చలో ఆనీ బీసెంట్ మాడం బ్లవట్‌స్కీని సమర్థించింది. అప్పుడే ఆనీ బీసెంట్‌కు మాడంపట్ల అభిమానం ఏర్పడ్డది. ఆమె జర్నలిస్టు, మంచివక్త. మాడం ఆనీ బీసెంట్‌ను లండన్‌లోని బ్లవట్‌స్కీ లాడ్జికి ప్రెసిడెంటును చేసింది. Lucifer పత్రిక ఎడిటర్‌గా నియమించింది.

రెండు సంవత్సరాల పాటు మాడం ఈసాటరిక్ పనిపై కేంద్రీకరించింది. మిగిలిన పనులు ఆపివేసింది. అది చాలా మందికి నచ్చలేదు. కొంతమందికి 'ఈసాటరిక్'లో ప్రత్యేక శిక్షణ ఇవ్వసాగింది. సిన్నెట్ తన పద్ధతిలో స్వతంత్రించాడు. అడయార్‌లోని పెద్దల్ని గట్టిగానే మందలించింది. యూరపులోని థియోసఫి సంస్థలన్నీ ఒక దోవలోకి వచ్చాయి. యూరపులో బ్లవట్‌స్కీ ప్రాబల్యం పెరగటం ఆల్కాట్‌కి బాధగా ఉంది. వ్యక్తిపూజ పనికిరాదని, దానివల్ల థియోసఫి ప్రతిష్ట దెబ్బ తింటుందని అతని ఆరోపణ. ఒక గొప్ప వ్యక్తి లేకుండా ఏ సంస్థ బ్రతకదు, నిర్వీర్యమై పోతుంది. అతని ఆరోపణలకు 'లుసిఫర్' పత్రికలో సమాధానం ఇవ్వక తప్పలేదు.

1. బ్లవట్‌స్కీ మాస్టర్ల ప్రతినిధి కాకపోతే ఆమె ఎవరు? మోసకత్తె లేదా మాంత్రికురాలు అయివుండాలి.
2. ఎలాచూచినా, ఆమె లేని థియోసాఫికల్ సొసైటీ లేదు.
3. ఆమె మోసకారి అనుకుంటే, ఇంతమందిని మోసం చేయగలిగిన ఆమె ప్రతిభకు జోహారు.
4. ఆమెను మాస్టర్ ప్రతినిధి అని అంగీరిస్తే, ఆమెను విమర్శించడం అనుచితం. మాస్టరిజాన్ని గౌరవించేవారు ఆమెను అభిమానించాలి.
5. అసలు మాస్టర్లు అనేవారే లేకపోతే థియోసాఫికల్ సొసైటీ ఏర్పడి ఉండేది కాదు. దానిని వెనక ఉండి నడుపుతున్నది మాస్టర్లే.

## సీక్రెట్ డాక్ట్రిన్ ప్రచురణ

మొత్తం మీద 'సీక్రెట్ డాక్ట్రిన్' రచన పూర్తయింది. 1888 అక్టోబరు – డిసెంబరు మధ్య అచ్చయింది. ఎడిటింగ్ పనులు బెర్ట్రం కైట్లే, ఆర్చిబాల్ట్ కైట్లే చూచారు. ప్రింటింగ్ ఖర్చు కూడా వారే భరించారు. రెండు భాగాలుగా అచ్చయింది. అది బ్లవట్స్కీ మాగ్నమ్ ఓపస్. బృహద్రచన. మొదటి భాగంలో సృష్టి, విశ్వ పరిణామం, వివరణ. ఆ భాగానికి "The Book of Dzyan" లోని ఏడు పద్యాలు ఆధారం. అందులో ప్రపంచంలోని అన్ని మతాల ఆవిర్భావం, పరిణామం చర్చించింది. రెండవ భాగానికి "Dyan Chohans" ఆధారం. అందులో మానవ వికాసం, పరిణామం ప్రధానాంశం.

బ్లవట్స్కీని లండన్‌కు రప్పించింది బెర్ట్రం కైట్లే. అతని మేనల్లుడు ఆర్చిబాల్డ్ కైట్లే. ఆ ఇద్దరు రచన పూర్తి కావడానికి, పుస్తకం ప్రింట్ కావడానికి సహకరించారు. చార్లెస్ జాన్స్టన్ కూడా సహాయం చేశాడు. కాని అతను ఇరవై సంవత్సరాల కుర్రవాడు. అతనే బ్లవట్స్కీ అక్క కూతుర్ని చేసుకున్నాడు.

అంటే వరసకు మేడం బ్లవట్స్కీకి జాన్స్టన్ అల్లుడు.

## బెర్ట్రం మాటల్లో ...

మాడం మా ఆహ్వానం మేరకు 'మేకాట్' వచ్చారు. వచ్చిన తర్వాత ఒకటి, రెండు రోజుల్లోనే 'సీక్రెట్ డాక్ట్రిన్' వ్రాతప్రతిని డా. ఆర్చిబాల్ట్ కైట్లేకు, నాకు యిచ్చి, "చదివి ఇంగ్లీషు తప్పులు దిద్దండి. ఈ పుస్తకం మీ స్వంతం అనుకోండి. మీ ఇష్టం వచ్చిన మార్పులు చేయవచ్చు. నేనేమీ బాధపడను. ఇది అందరికోసం రాసిన మాస్టర్ పీస్. 'మాస్టర్ వర్క్' అన్నారు.

మాన్యుస్క్రిప్టు కట్టలు నా నడుం ఎత్తున ఉన్నాయి – మూడు నాలుగు అడుగుల ఎత్తుగా. నాకు గుండె ఆగినంత పనైంది. ఇన్ని వేల కాగితాలు చదవడం ఎలా? నా వల్ల అయ్యేపనా? పైగా దిద్దుడు. ఒకరి మహా రచనలో మరొకరు వేలు పెట్టడం తప్పుకదా! మాడంతో పోల్చుకుంటే నాతెలివి ఎందుకూ పనికిరాదు. హస్తిమసికాంతరం. పుస్తకంమీది భక్తితో, బ్లవట్స్కీ మీద ప్రేమతో ఓపిగ్గా చదివాను. అవసరమైనచోట స్పెల్లింగ్సు, పంక్చుయేషన్ మార్కులు పెట్టి మాడంతో సుదీర్ఘ చర్చలు సాగించాను. నాకేమో మాడంతో మాట్లాడాలంటే చచ్చే భయం. నిలబడితే కాళ్లు వొణికేవి. కాగితాలన్నీ ఒక వరసలో పెట్టాలి. ఒకతీరు తెన్నూలేని కవిలి కట్టలు.

మాతో ఒక మాట చెప్పింది. "మీ ఇష్టం ఏమైనా చేసుకోండి. మీ చేతుల్లో పెట్టాను. ఇంక నాపని అయిపోయింది" అని చేతులు దులిపేసుకున్నది. మేము ఎలాగో వదిలించుకోవాలనుకున్నాం. ఆలోచించాం. తలలు పట్టుకోవడం. మొత్తం మాటర్‌ని నాలుగు భాగాలుగా విభజించుకున్నాం. మొదటి భాగంలో బ్లవట్‌స్కీ సూచన మేరకు చరిత్ర ప్రసిద్ధిచెందిన మిస్టిక్ యోగుల్ని తెచ్చి పెట్టాం. తర్వాత సృష్టి, విశ్వ పరిణామం, తర్వాత మానవ ఉద్భవం, పరిణామం. మూడవ భాగంగా గొప్ప జ్ఞానుల గురించి, జ్ఞానం గురించి, నాల్గవ భాగం మార్మిక విద్య, దివ్యజ్ఞానం, ఆత్మజ్ఞానం. అంతా ఆకల్టిజం, ప్రయోజనాలు, అవసరాలు.

మాడంతో చర్చించి పరిష్కరించే పనికి పూనుకున్నాం. కాస్మాలజీ, ఆంత్రోపాలజీలతో ఒకటి, రెండు భాగాలు పూర్తి చేశాం. తర్వాత టైపింగ్ ఏర్పాటు చేశాం. టైప్ అయిన కాగితాలు ఒరిజినల్ స్క్రిప్టుతో సరిచూడడం మరొక బండపని. అలా చేయగా 'ధ్యాన్ చౌహాన్స్' వ్యాఖ్యానం ఇరవై పేజీలకు మించి రాలేదు. మాడంను బ్రతిమలాడి ఇంకా విపులంగా రాయించవలసి వచ్చింది. పుస్తకంలో బాలెన్సు ఉండాలి గదా. కొత్తగా రాయమంటే ఆమె అన్నారు :

‘‘నేను చేసేది ఏముంది? మీరు తెలుసుకోవలసింది మాత్రం ఏముంటుంది? మొహంమీది ముక్కు స్పష్టంగా తెలుస్తుంది. దానికి అద్దం ఎందుకు దండగ. మొహం చూచిన వారికి వేరుగా ముక్కు చూపించాలా? కొత్తగా రాస్తే అతికించిన ముక్కులాగానే ఉంటుంది."

"అంటే మరో వ్యాఖ్యానం వివరణ అవసరం లేదనిచెప్పడం. మేమే తంటాలు పడి ప్రతి శ్లోకం కిందికి ఆమె రాసిన విషయాలే ఏవో తెచ్చి చేర్చాం జాగ్రత్తగా.

ప్రెస్‌కు పంపాలంటే అన్ని కాగితాల్లో తుడుపులు, కొట్టివేతలు, చేతిరాతలు. ప్రెస్ వాళ్లు తిప్పి మొహంమీద కొడతారు. 'మేం ప్రింట్ చేయం' అనవచ్చు. అంత గలీజుగా ఉంది. అట్లా కాదని మళ్లీ టైపింగ్ పని మొదలుపెట్టాం. ఒకరు చదువుతూ పోతుంటే, ఒకరు టైప్‌చేయడం పని. మొదటి రెండు భాగాలు 'ప్రెస్ కాపీలు' రెడీ అయ్యాయి. అంతతో అచ్చుకథ అయిపోలేదు. ఎన్నోనెలల బండచాకిరి. పాపం బ్లవట్‌స్కీ మాడం రెండు రకాల ప్రూఫులు దిద్ది పెట్టేది. చివరికి పేజీ ప్రూఫులు కూడ తనే చూచేది. చివరి నిమిషందాకా ఏవో మార్పులు చేస్తుండేది. పుస్తకం ప్రూఫులు రచయిత తనే దిద్దుకోవడం వల్ల రచనకు పూర్ణత్వం వస్తుంది. ఆమె కోట్ చేసిన 'కొటేషన్స్' కరెక్టు అవునో కాదో నరమానవుడికి తెలియదు. లైబ్రరీల్లో వెతికినా ఆ పుస్తకాలు దొరికేవి కావు.

పాఠకులకు నచ్చడం ముఖ్యం. పాఠకులు మెచ్చడం మరీ ముఖ్యం. అవే గదా మంచి రచనకు గీటురాళ్లు.

## అక్కగారి అల్లుడు

## చార్లెస్ జాన్‌స్టన్ చెప్పిన కథ

మాడంను అందరూ హెచ్.పి.బి. అనే పిలుస్తుంటారు. తనకు అలా పిలిపించుకోవడమే ఇష్టం. 'మాడం' అనవద్దంటుంది. ఆమె శిష్యులు కొందరు మంచి ఇల్లు ఏర్పాటు చేశారు. లండన్‌లోని గొప్ప భవనాలలో అదీ ఒకటి. లండన్ నగరం నిండా గార్డెన్లు, పార్కులు, తోటలు. ప్రపంచంలో చాలా అందమైన నగరం లండన్ అని ప్రతీతి.

హెచ్.పి.బి. పని పూర్తిచేసుకునే సమయంలో వెళ్లి కలిశాను. ముందుగా సెక్రటరీతో కబురు పంపిన తర్వాతనే అపాయింట్‌మెంట్. సెక్రటరీ కూడ ఆమె శిష్యులలో ఒకడు. మాడం అంటే భక్తి ఉన్నవాడు. గత రెండు మూడు సంవత్సరాలుగా అతను నాకు తెలుసు. మేం అప్పుడప్పుడు కలిసి, చిన్ననాటి కబుర్లు చెప్పుకునే వాళ్లం. అతను సీక్రెట్ డాక్ట్రిన్ కథలు నాకు చెప్పేవాడు.

అతనితో ఓ అరగంట గడిపి వెళ్లి మాడంని చూచాను. మొదటిసారి చూచినప్పుడు ఆమె కళ్లు నన్ను భయపెట్టాయి. భయపెట్టాయంటే చిత్రంగా నచ్చాయని. ఆమెవి మిస్టిక్ ఐస్. లోతుగా ఉంటాయి. ఆమె చూపులు కూడా లోతుగా ఉంటాయి. నన్ను చూడగానే "కమాన్ యంగ్ మాన్. నీవు రావడం నాకు చాలా ఆనందంగా ఉంది. ఏమిటి విశేషాలు చెప్పు" అన్నది. అని ...

"టీ తాగుదామా!" అంటూ స్విస్ పనిపిల్ల 'లూయి'ని బిగ్గరగా పిలిచింది. ఆమె రాగానే ఏం కావాలో ఫ్రెంచ్‌లో చెప్పింది. తాను రష్యన్, ఆ పిల్ల స్విస్ మధ్య ఫ్రెంచ్ భాష. ఈజీ చెయిర్‌లో కూర్చుని, సిగరెట్ వెలిగిస్తూ "నువ్వు నాపై వచ్చిన రిపోర్టు చూసే ఉంటావు ... నేను రష్యా గూఢచారినట."

"తెలుసు మాడం, రెండు సంవత్సరాల క్రితం జరిగిన మొదటి మీటింగ్‌లో నేనూ ఉన్నాను."

"అలాగా, వారిలో ఆ ఆస్ట్రేలియా మేధావి రిచర్డ్ హడగ్సన్ గురించి నీ అభిప్రాయం."

"తెలివి కలవాడే గాని, తన మీద తనకే నమ్మకం లేనివాడు. మొదట ఏ అభిప్రాయం కలిగితే అదే పట్టుకుంటాడు. మారడు. ఒట్టి మూర్ఖుడు."

"పోనీలే, నీవైనా నిజం తెలుసుకున్నావు".

అంతలో సెక్రటరీ వచ్చాడు. మాడం అన్నది : పిరికివాళ్లు. నా సిద్ధాంతం అంగీకరిస్తే ప్రళయం ముంచుకొస్తుందని భయం. ప్రాచీన విజ్ఞానాన్ని అంగీకరిస్తే మోడరన్ సైన్సుకు ఏం నష్టం? నేను అగోచర లోకాల్ని గురించి, అతీంద్రియ శక్తుల్ని గురించి కదా రాస్తాను. వాళ్ల సైన్సుకు, మతానికి ఏం పోయింది? మాస్టర్స్ ఉన్నారని వీళ్లకు తెలియదు. చెప్పినా నమ్మే సంస్కారం లేదు. నన్ను 'బలి' పెట్టారు ఫూల్స్."

నేనన్నాను : అవును మాడం, ఆ రిపోర్టు నిరాధారం. పస లేదు. అంత బలహీనమైన రిపోర్టు నేను ఎన్నడూ చూడలేదు. అది పక్షపాత ధోరణి. అసూయ, ద్వేషం. ఒక్క సాక్ష్యం లేదు. ఒక్క ఆధారం లేదు.

మాడం : అవును కదూ!

నేనన్నాను : కాని మాడం ... మాస్టర్స్ పేర లెటర్స్ మీరే కల్పించారని ...!

మాడం : యంగ్ మాన్ ... నీవు ఆలోచనలు బదిలీ చేయడం గురించి ఎప్పుడైనా విన్నావా? ప్రయత్నించి ఉంటే నీకు తెలిసేది. నీ ఆలోచన నిర్దేశించిన వ్యక్తి మనసులో చొరబడినపుడు రంగులు మారతాయి. భాషలోకి అనువదించ బడినపుడు కొంత మారవచ్చు. బహిర్గతం చేసేటప్పుడు నీ భావచిత్రాలకు అతను రంగులు అద్దుతాడన్నమాట. దానిని Thought Transfer అంటారు. అంటే భావాన్ని బదిలీ చేయడం. అదే ప్రక్రియ ఉత్తరాలసృష్టి (సృష్టి అంటే ప్రెసిపిటేట్ కావడం) ఉదాహరణకు : మాస్టరు ఒకరికి ఇంగ్లీషు రాదనుకో, ఇంగ్లీషు రానివాడు ఇంగ్లీషులో రాస్తే ఎలా ఉంటుంది. మెంటల్‌గా జవాబు యిస్తాడు. ఆ భావాన్ని నీ మాటల్లోకి నీవు ట్రాన్స్‌మిట్ చేస్తావు.

"మాస్టర్లు ఎక్కడో టిబెట్‌లో ఉంటారు. మనం ఇక్కడ లండన్‌లో ఉన్నాం. నేను ప్రశ్నిస్తాను. ఆ ప్రశ్న భావం మాస్టర్లకు అందుతుంది. ఆయన ఇంగ్లీషులో ఆలోచించడు కదా! జవాబు భావన చేస్తాడు. ఆలోచనకు, భావనకు భాషతో నిమిత్తం ఉండదు. ఆ భావాల్ని నేను అందుకున్నపుడు, మనసు నాకు తెలిసిన భాషలోకి అనువదిస్తుంది. అంటే మనం భావానికి మాటలు కూర్చుతున్నామన్న మాట. అది మాగ్నటిక్ ఫోర్సు. అదే మాగ్నటిక్ ఎట్రాక్షన్.

"దానికి ఆస్ట్రల్ లైట్ సహకరిస్తుంది. అసలుకి మన భావాలు, మాస్టర్ల భావాలు ఆస్ట్రల్ లైట్‌లోనే ప్రయాణం చేస్తాయి. ఆస్ట్రల్ కాంతిలో కరిగి, కాంతి

కణాలై, మరల మెటీరియలైజ్ అవుతుంటాయి. మాగ్నటిక్ పవర్ స్పిరిట్యువల్ ఆరా, ఆస్ట్రల్ కాంతి ఉన్న మీడియమ్స్ వాటిని సులభంగా అందుకోగలరు. మొత్తం మీద కనిపించేది 'విల్‌పవర్'తో రూపకల్పన జరిగినట్లు.

"వినడానికి సులభంగానే ఉంది మాడం! కాని ఆ ట్రాన్స్‌ఫర్‌మేషన్ ఎలా అన్నది తెలియదు గదా? నిదర్శన కావాలి నమ్మకానికి."

"ఓ! అదా! నీకు ఆకాశయానం తెలియాలి. అంటే ఆకాశంలో ఎగరడం కాదు, ఆస్ట్రల్ శరీరంతో ప్రయాణం చేయడం. ఫిజికల్ బాడీ పైకి ఎగరలేదు. ఫిజికల్ ఫారం లాంటి డైమన్షన్‌తో నీలో ఓ ఆస్ట్రల్ బాడీ ఉంటుంది. దానిని వేరు పరచి, ఆస్ట్రల్‌లో ప్రయాణం చేయాలి. నా ద్వారా ఒక లేఖ మాస్టర్ నీకు అందించారంటే అందులో మాస్టర్ భావాలుంటాయి, నా భాగం కొంత ఉంటుంది. కొన్ని నా భావాలు కలుస్తాయి సౌలభ్యం కోసం. ఉత్తరాల్లోని సందేశం ముఖ్యం. ఎవరు రాస్తేనేం? ఎవరు అందుకుంటేనేం? ప్రయోజనం ముఖ్యం. పిచ్చి మనుషులు పిచ్చి పిచ్చిగా వాదిస్తారు. వేల మైళ్ల దూరంలో, ఎక్కడో మద్రాసులో ఉండి, టిబెట్ మాస్టర్ల లేఖలు అందుకుంటారు. వాటిలో నా కల్పన ఉండదు, ఏవీ నేను రాయలేదు. అసత్యాలని ఎవరూ నిరూపించలేరు."

నేనన్నాను. "అవును మాడం! సిన్నెట్ అలాంటి ఉత్తరం ఒకటి చూపించాడు. 'ఆకల్ట్' అంటే బుద్ధయోగ తంత్రం అనిపిస్తుంది. ఆ ఉత్తరాల్లో కొన్ని ఎర్ర సిరాతో రాసినవి, కొన్ని పెన్సిల్‌తో రాసినవి ఉన్నాయి. ఎక్కువ భాగం బ్లూ రంగు పెన్సిల్‌తో రాసినవే. తుడిచినా రంగుపోలేదు."

"అవును. తుడిస్తే ఎలా పోతుంది? కాదన్నంత మాత్రాన సత్యం సత్యం కాకుండా పోదు. పోనీలే నా రచనల గురించి చెప్పు."

"అదే చెబుతున్నాను. ఆ లేఖలు రెండు రకాలు. ఎర్రసిరా లేఖలు, బ్లూ సిరా లేఖలు. ఒకదాని కొకటి సంబంధం లేదు. హాండ్ రైటింగ్ బట్టి కారెక్టర్ చెప్పొచ్చు. బ్లూ సిరాతో రాసినవారు మంచివారై ఉండాలి. వాళ్లకి విల్ పవర్ ఎక్కువ. నెమ్మదస్తులై ఉండాలి. ఎన్ని కష్టాలు వచ్చినా అనుకున్నది సాధిస్తారు. వారిలో దయా ధర్మం ఉంటుంది."

మాడం : "అంటే నేను రాసినట్లు కాదు కదా! నాకలాంటి మంచి బుద్ధులు లేవులే". మాడం నవ్వి అన్నది. "నీవు చెప్పిన లక్షణాలు మాస్టర్ కుత్‌హోమివి. ఆయన కాశ్మీర్ బ్రాహ్మణుడు. యూరప్ అంతా తిరిగినవాడు. ఆకల్ట్ వరల్డ్‌లో

ఉత్తరాల రచయిత తనే. ఈసాటరిక్ బుద్ధిజం రాయడానికి సిన్నెట్‌కు మాటర్ తెచ్చి పెట్టిందీ ఆయనే – మహాత్మ కుత్‌హోమి.”

“మీ గొంతులో నెమలి స్వరం వినిపించేదట. నిజమా?”

“కాదు, నాది నైటింగేల్ గొంతు. మిగత రాతల సంగతి?”

“మాడం! ఎ(క్రసిరా ఉత్తరాల స్టయిలే వేరు. వాటిలో కరుకుతనం, వేగం, అధికారం ఉన్నాయి. అగ్ని పర్వతం బ్రద్దలై ప్రవహించే లావా ప్రవాహం. అందులో నయాగరా జలపాతం దూకుడు! ఉంది. అసలు మీరచన స్టయిలే వేరు మాడం. ఆ రెండవ రకం ఉత్తరాల వేగం మీ రచనల్లో కనిపిస్తుంది.

“అవునేమో. ఆ గురువు గారి శిష్యురాలిని కదా? అది నా గురువు మాస్టర్ మోరియాది. నావద్ద ఆయన ఫొటో కూడా ఉంది. ఆయన జన్మతః రాజపుత్ర యోధుడు. భారీ శరీరం, ఆజాన బాహువు. ఆరడగుల ఎనిమది అంగుళాల ఎత్తరి. ఆయనది గొప్ప అందం.”

“వారి వయస్సు?”

“తెలియదయ్యా! నా రెండు పదుల వయసులో, అంటే 1851లో మొదటిసారి ఆయన్ని చూచాను. అప్పటికి ఆయన యువకుడు. ఇప్పటికీ ఆయన అంతే యువకుడుగా ఉన్నారు. నేను ముసలిదాన్నయినాను.”

మాడం తనకు తెలిసిన మాస్టర్ల గురించి, యోగుల గురించి, భారతదేశపు ఋషుల గురించి, టిబెట్, పర్షియా, చైనా, ఈజిప్టు, గ్రీసు, హంగేరి, ఇటలీ, యూరపు మిస్టిక్ మాస్టర్ల గురించి వివరించింది. ఆమెకు చాలా మందితో పరిచయం ఉంది.

“అబ్బాయ్! పొద్దు పోయింది. నాకు నిద్రొస్తోంది. బై” అన్నది.

ఆరోజుతో బ్లవట్‌స్కీపై ఆరాధన మరీ పెరిగింది. ఆమె హృదయం లోతులు తెలుసుకోగలిగాను కొంతవరకు. అది అగాధం. ఆమెలో గొప్ప వర్చస్సు ఉంది. ఎవరికీ తెలియని రహస్యాలున్నాయి. వెలుగులున్నాయి. చీకటి కోణాలున్నాయి. కాంతి వాకలున్నాయి. ఒక్క మాటలో విశ్లేషించాలంటే ఆమె పుస్తకాల కంటే, ఆమె వ్యక్తిత్వం గొప్పది. ఆమె రచనలు చదవడం కాదు, ఆమెను చదవాలి. చదవ గలగాలి. ఆ చదువు అవసరం.



# 22. చరమాంకం

1887 మే నాటికి మాడం బ్లవట్స్కీ లండన్ చేరింది. మొదట వెకాట్‌లో నివాసం. అది మాబెల్ కాలిన్స్ ఇల్లు. అక్కడ ఉన్నది నాలుగు నెలలు మాత్రమే. ఆమె లండన్ చేరగానే అభిమానుల తాకిడి ఎక్కువైంది. వచ్చీ రాగానే 'బ్లవట్స్కీ లాడ్జి' ఏర్పాటు చేసింది. కాలక్షేపం అవసరం కూడా. యూరపు మొత్తానికి అదే కేంద్రం. 'లుసిఫర్' పత్రిక మతాలపైన, మత మూర్ఖత్వంపైన, చాదస్తాలపైన సంధించిన బాణం. మతాన్ని తూర్పార పట్టడమే లుసిఫర్ లక్ష్యం. సెప్టెంబరులో హాలండ్ పార్కు ఏరియాకు మారిన తర్వాత లుసిఫర్ మొదటి సంచిక వెలుగు చూసింది. అప్పుడే థియోసాఫికల్ ప్రచురణ సంస్థ ప్రారంభమైంది.

## "ఆర్చిబాల్డ్ కైట్లే" మాటల్లో ఆనాటి విశేషాలు :

మాడం ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉన్నా రాత్రి పొద్దుపోయేవరకు రాస్తుండేది. ఆమెకు ఆడంబరాలంటే మంట. చాలా సాదాగా జీవించేది. ఏ మాత్రం భేషజంలేని మనిషి. గంభీరంగా, సీరియస్‌గా కనిపించడాన్ని 'అహంకారం' అని అపార్థం చేసుకుంటారు జనం. కృత్రిమ అలంకారాలు, కృతక సంభాషణలు నచ్చవు. ఏ చిన్న తప్పు జరిగినా క్షమించని స్వభావం. జ్ఞానం అన్నది అనుభవంతో వస్తుంది. 'ఇది అంతే' అని కచ్చితంగా చెప్పకూడదు. ఎవరైనా తనకిష్టంలేని విషయాలు చెబితే మౌనం పాటిస్తుంది. 'ఎదురు ప్రశ్న వేసేవారు సత్యాన్ని గ్రహించలేరు, భరించలేరు' అంటారు ఆమె. ఎంత మందితో ఎన్ని కబుర్లు చెబుతున్నా మేడపైగది నుండి సంకేతం అందగానే పరుగు తీస్తుంది. అది మాస్టర్ రాకకు సంకేతం.

ఇండియాలోని థియోసాఫికల్ సొసైటీని దాదాపు ఆల్కాట్ స్వంతం చేసుకున్నట్లే. అతని పెత్తనం ఎక్కువైంది. అన్నింటిపైన తన ముద్ర వేస్తున్నాడు. దాదాపుగా ఆమె అడయార్‌తో సంబంధం వదులుకున్నది. ఇద్దరి భావాలు వేరు వేరు కాసాగాయి. థియోసాఫికల్ లాడ్జి పనులు, అనారోగ్యం. ఎప్పుడు ఒళ్లు నొప్పులు, నడవలేకపోయే స్థితి. అవతల సీక్రెట్ డాక్ట్రిన్ అచ్చు పని, లుసిఫర్ పత్రికపని – ఊపిరాడేది కాదు.



డాక్టర్ ఆర్చ్‌బాల్డ్

1888 అక్టోబరు బ్లవట్‌స్కీ జీవితంలో మరపురాని సమయం. సీక్రెట్ డాక్ట్రిన్ అచ్చయి వచ్చింది. అయిదు వందల కాపీలు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి.

★ ★ ★

## ఎడ్మండ్ రస్సెల్ – డైరీ ...

మాడం బ్లవట్‌స్కీతో నా పరిచయం ఆమె ముగింపు దశలో. అప్పటికే ఆమె చరమాంకంలో ఉంది. తరచుగా వెళ్లి కలుస్తుండేవాడిని. ఆమె పట్ల నాకు పిచ్చి అభిమానం, ఇష్టం ఏర్పడ్డది. ఆమె ఫొటో ఒకటి తీయించాలని ఆశ. ఆమెను ఫొటో స్టుడియోకు తీసుకు వెళ్లాలి. రమ్మని అడిగాను. ఆరోజు గాలివాన. బయటకు వెళ్లేందుకు అనువైన బట్టలు కూడ లేవు ఆమెకు. ఎవరైనా బట్టలు, వస్తువులు తెచ్చి బహూకరిస్తే వెంటనే వాటిని ఎవరెవరికో యిచ్చివేసేది. తనకే మీ ఉంచుకునేది కాదు. అంతటి నిస్వార్థజీవి. తన అవసరాలే తనకు తెలియని మనిషి.

మొత్తానికి కాంటెస్ సాయంతో సాయంత్రానికి మాడంను ఒప్పించాను. అప్పటిదాకా బయట 'కోచ్' వెయిట్ చేస్తూనే ఉంది. తనకు బయటకు రావడం ఇష్టం లేదు. 'అబ్బ చంపేస్తున్నారు' అని విసుక్కుంది.

"వర్షానికి నేలంతా చిత్తడిగా ఉంది. రాళ్లమీద కాళ్లు జారుతున్నాయి. నేను నడవలేను" అని పేచీ పెట్టింది. ఒంటికి షవల్స్ చుట్టుకుంది. బండి వాడి సహాయంతో బగ్గీలోకి ఎక్కించాం.

మాడం బ్లవట్స్కీకి సాయం చేస్తున్న కాంటెస్ సామాన్యురాలు కాదు. స్వీడన్ రాయబారి భార్య. మొదట లండన్ వచ్చినపుడు ఆమెకు గన్‌మన్ ఎస్కార్ట్ ఉండేది. అలాంటి మహిళ ఇప్పుడు బ్లవట్స్కీకి తను ఎస్కార్ట్, దాదాపు సేవకురాలు. కాంటెస్ సరదాగా అంటుంది "నేను కార్పెట్‌ల మీద నడిచిన దాన్ని. ఇప్పుడు మరొకరి కార్పెట్లు తుడుస్తున్నాను. ఈ విషయం నా హజ్బెండ్‌కి తెలిస్తే నన్ను ఇక్కడే పాతిపెడతాడు."

తీరా ఫొటో స్టూడియోకి వెళ్లిన తర్వాత మాడం ససేమిరా ఫొటో దిగనని పేచీ పెట్టింది. "నేనేమైనా నటినా? ఆర్టిస్టునా? నాకెందుకు ఫొటోలు" అని అంటూనే "సరేలే కూర్చుంటా. ఒక్కటంటే ఒకటే తీయండి" అన్నది.

'దయచేసి నవ్వండి' అన్నాడు ఫొటోగ్రాఫర్.

ఆమెకు నవ్వడం రాదు. ఎప్పుడూ సీరియస్సే.

"మాడం అంత సీరియస్‌గా ఉంటే ఫొటోలో మీరుండరు. మీ దయ్యం ఫొటో వస్తుంది." అన్నాడు ఫొటోగ్రాఫర్.

అప్పుడు ఫక్కున నవ్వింది. బహుశా జీవితంలో అదే మొదటిసారి నవ్వడం ఆమెగారు. ఆమె జీవితంలో ఒకేసారి నవ్వడం. ఒక్కసారే కన్నీరు పెట్టడం జరిగింది.

## **ఆనీబీసెంట్ అంతరంగం** (1889)

ఈమధ్య కాలంలో నాలో అశాంతి ఎక్కువవుతోంది. నాలుగు సంవత్సరాలుగా నాపైన నాకే నమ్మకం సడలుతోంది. సేవా కార్యక్రమాలు తృప్తి నివ్వడం లేదు. ఇంతేనా జీవితం? ఏం సాధిస్తున్నట్లు? నా కలలు వేరు, ఆశయాలు వేరు. నా కలలు నిజమవుతున్నాయా? ఆశయాలు నెరవేరుతున్నాయా? ఏమో! దేశంలో సైకాలజీకి ప్రాముఖ్యత పెరుగుతోంది. మనస్తత్వం ఒక శాస్త్రం అయింది. మనస్సు మనిషిని నడిపిస్తోంది. హిప్నసిస్‌లో ప్రయోగాలు మనసు లోతుల్ని వెదుకుతున్నాయి. స్వప్న, చైతన్యాలు రెండూ మానసిక చర్యలా? మానసిక వికారాలా? క్లయర్ వాయన్స్, క్లయర్ ఆడియన్స్, థాట్ రీడింగ్ వల్ల ప్రయోజనం ఎంత? అంతకు మించి మరేమీ ఉండదా? లేదా? ఇంకా ఏదో నిగూఢశక్తి మనిషిలో ఉంది. మనిషిని నడిపిస్తోంది. అది నాకు కావాలి.

1889 చివరకు ఎన్ని కష్టాలు రానీ, నా ఆశయం నేరవేర్చుకోవాలన్న తపన ఏర్పడ్డది. పట్టుదల పెరిగింది. చీకటి పడితే చాలు, ఆలోచనల ముసుళ్లు. జీవితానికి అర్థం ఏమిటి? అసలు జీవితం అంటే ఏమిటి? ఏది మనిషి గమ్యం? ఆ తీరం అతి దగ్గరలోనే ఉందని అనిపించసాగింది.

అలా రెండు వారాల మథనం, అంతర్మథనం. అంతలో నా వద్దకు రెండు పుస్తకాలు వచ్చాయి మిస్టీరియస్‌గా. అవి చాలా బరువైన పుస్తకాలు. ది సీక్రెట్ డాక్ట్రిన్ రెండు భాగాలు. రచయిత మాడం బ్లవట్స్కీ.

“మాడం వీటిని సమీక్షించగలరా? మా స్టాఫ్ బాయిస్‌వల్ల కాదు ఆపని. మా స్టాఫ్‌కి వాటిని అర్థం చేసుకునే ఓపిక, జ్ఞానం లేవు. మీకు ఇలాంటి విషయాలపై అభిరుచి ఉందని తెలుసు.”

రివ్యూ రాసి, ఎడిటర్ కిచ్చి “బ్లవట్స్కీ మాడంని నాకు పరిచయం చేయగలరా” అని అడిగాను. ఆమె రాసిన పుస్తకాల్ని నేను పాఠకులకు పరిచయం చేస్తున్నాను. కాదనదని నమ్మకం. స్టీడ్ వెంటనే అపాయింట్‌మెంట్ ఫిక్స్ చేశాడు. ఒకనాటి సాయంత్రం హెర్బర్ట్ బర్రోస్, నేనూ కలిసి బయలుదేరాం. అతని భావాలు నా భావాలు కలుస్తాయి. నాటింగ్ హిల్ స్టేషన్ నుండి లాన్స్ డౌన్ రోడ్డుకు చేరాం. ఒక నిమిషం ఆగి హాలులోకి వెళ్లాం. మా ముందర ఓ భారీ విగ్రహం కుర్చీకి నిండుగా కూర్చుని ఉంది. మమ్మల్ని చూడగానే మాడం –

"My dear Mrs. Besent. I have so long wished to see you" అన్నది.

నా చేతుల్ని ఆమె తన చేతిలోకి తీసుకుని, వెచ్చగా నొక్కి ఎంతకీ వదలలేదు. మొదటిసారిగా బ్లవట్స్కీ కళ్లలోకి సూటిగాచూస్తూ ఆమె చూపులతో నా చూపులు కలిపాను. అది గుర్తింపా? స్వీకారమా? స్పందనా? ఇద్దరం ఒక్కటైన భావన. నా గుండె దడ దడ కొట్టుకుంది ఆ క్షణంలో. నావి అసలే విప్లవభావాలు, వేటగాని చేతికి చిక్కిన హరిణం నేను. ఆమె నా చేతులు ఒడిసిపట్టుకున్న తీరుకు, నా జీవితం సర్వస్వం, నా భవిష్యత్తు తన చేతిలో పెట్టినట్లనిపించింది. తన ఎదురుగా కూర్చున్న నాకు తన జీవిత కథను సూక్ష్మంగా వివరించింది. చేతిలో సిగరెట్ కాలుతూనే ఉంది. తను కథ చెబుతూనే ఉంది. గంటలు గడిచాయి. ఎంతసేపు చెప్పినా అతీంద్రియ శక్తుల గురించి, ఆధ్యాత్మికత గురించిన ముచ్చటే లేదు. అన్నీ సామాజికమైన ముచ్చట్లే. అన్నీ సాదా, సీదా కబుర్లే. మేము సెలవు తీసుకుని బయలుదేరడానికి లేచాం.

ఆమె క్షణకాలం నా కళ్లలోకి తీక్షణంగా చూచి కంపిత స్వరంతో అన్నది. “బీసెంట్ నువ్వు వచ్చి నాతో కలవ రాదూ?”

తర్వాత చాన్నాళ్లకు బ్లవట్స్కీ అన్నది “అమ్మాయ్, నీకు అహంకారం ఎక్కువ. నీకు లుసిఫిల్ కున్నంత గర్వం ఉంది.”

మళ్లీసారి వెళ్లినపుడు థియోసాఫికల్ సొసైటీలో చేరతానన్నాను. లోపల మథనం. చేరడం ఎందుకు? చేరి ఏం చేయాలి? నా వ్యక్తిత్వం ఏం కావాలి? నేను అసలే స్వతంత్రజీవిని. ఎవరి అజమాయిషీ నేను సహించలేను. ఒకరి పెత్తనం క్రింద పనిచేయను. లండన్ స్కూలు బోర్డులో నాకు గుర్తింపు ఉంది. గౌరవం ఉంది. అవి వదలివస్తే నేను ఏం కావాలి? జనం ఏమనుకుంటారు? హేళన చేస్తారా? విమర్శిస్తారా? ప్రాపంచిక జీవనం కాదనడం భావ్యమా? థియోసఫిలో చేరి బావుకునేది ఏముంటుంది? ఆత్మవంచన అవుతుందా? నా బాధ నాది కదా! లోకానికి నాతో ఏం పని? చేసినంత కాలం లోకం సేవ చేయించుకుంటుంది. తర్వాత మరచిపోతుంది, ఏది శాశ్వతం?

బ్లవట్స్కీ ప్రశ్నించింది "నామీద వచ్చిన అభియోగం రిపోర్టు చదివావా?"

"నాకు తెలియదు. దాని గురించి అసలు విననేలేదు" అన్నాను.

"అయితే, ముందు అది చదువు."

"రిపోర్టు ప్రతిని ఇంటికి తెచ్చి చదివాను. బలహీనంగా ఉంది రిపోర్టు. అది అంతా అభియోగమే. నేరారోపణ. అందులో ఒక్క అంశమూ నిరూపితం కాలేదు. ఎట్లా నిజనిర్ధారణ జరిగింది. మోసం. సీక్రెట్ డాక్ట్రిన్ లాంటి పుస్తకం రాసిన వ్యక్తి ఒకరిని మోసం చేయడం ఎట్లా సాధ్యం? అసంభవం."

మర్నాడు వెళ్లి అప్లికేషన్ పూర్తి చేసి, సొసైటీలో చేరిపోయాను.

మా ఇద్దరి మధ్య ఒక్క మాట లేదు.

"అయితే నీవు మాలో చేరుతున్నావన్నమాట" అన్నది మాడం.

"అవును మాడం, నన్ను మీ శిష్యురాలిగా, మీ స్వంత బిడ్డగా స్వీకరించాలి. మీరే నాకు గురువు – మీరే నా సర్వస్వం. ఈ ఒక్క వరం చాలు నాకు."

"మంచిది. నీది మంచి మనస్సు. నీకు మాస్టర్ అనుగ్రహం లభిస్తుంది" అన్నది.

1889 మే 10న ఆనీబీసెంట్ స్వచ్ఛందంగా థియోసాఫికల్ సొసైటీలో చేరడంతో చరిత్ర మలుపు తిరిగింది. బ్లవట్స్కీలో కొత్త ఆశ చిగురించింది. జులైలో "The Key to Theosophy" ప్రచురణ జరిగింది. ప్రశ్నలు, జవాబులు రూపంలో ఆ రచన సాగింది. అన్నీ ఆధ్యాత్మిక, నైతిక, వైజ్ఞానిక, తాత్విక, సామాజిక విషయాలే. "The Voice of the Silence" అనే మార్మిక గ్రంథం వెలువడింది.

అది థియోసఫిస్టులకు పవిత్ర గ్రంథం. మాడం ఇండియాలో ఉండగా సేకరించి కంఠస్తం చేసిన శ్లోకాలకు, పద్యాలకు అది అనుసృజన.

సెయింట్ జాన్స్‌వుడ్ ప్రాంతంలోని తన ఇంటిని ఆనీబీసెంట్ థియోసాఫికల్ సొసైటీ ట్రస్టుకు రాసిచ్చింది తనకోసం ఏమీ మిగుల్చుకోకుండా. అప్పుడే మాడం బ్లవట్స్కీ ఆల్కాట్‌కు ఆసియా ఈసొటరిక్ సొసైటీ బాధ్యత అప్పగించింది. ఆ తర్వాత సొసైటీలో మార్పులు చకచక జరిగిపోయాయి. మాడం అన్నీ తెలిసినా మిన్నకుండిపోయింది. ఏమీ పట్టించుకునేది కాదు. రోజురోజుకు బ్లవట్స్కీ ఉద్యమానికి, సభ్యులకు దూరం కాసాగింది. పైకి ఉత్సాహం ఉన్నా లోపల వైరాగ్యం. అంతరాత్మ ప్రోత్సహం లేనిది ఎవరూ ఏపనీ చేయ సాహసించరు. కాలమే నిర్ణయిస్తుంది. కాలమే దారి చూపుతుంది. ఎవరూ కాలానికి అతీతులు కారు, కాలేరు.

## హెర్బర్ట్ బర్రోస్

కొన్ని జీవిత సమస్యలను భౌతిక సంపదలు పరిష్కరించ గలవు. కాని అన్నింటినీ పరిష్కరించలేదు భౌతిక వాదం. మానసిక సమస్యలకు భౌతిక వాదం అసలు పరిష్కారం చూపలేదు. మనిషికి సమస్యలు సృష్టించిపెట్టేది మేధ. వాటికి పరిష్కారాలు మేధలో దొరకవు. అందుచేతనే మనిషి నిరాశకు లోనవుతుంటాడు.

"ఆనీబీసెంట్ నా ఫ్రెండ్. మా ఇద్దరిది ఒకే మాట, ఒకే బాట, ఒకే ఆలోచన, ఒకే తపన. మాకు కొత్త వెలుగులు కావాలి, ఏవి? ఎక్కడ? 'ది ఆకల్ట్ వరల్డ్' పుస్తకం చదివాను. నా తపనకు ఊరట లభించింది. నా అన్వేషణపై కొత్త వెలుగు ప్రసరించినట్లయింది. ఆ తేజస్సు, ఆ వెలుగు ఈనాటిది కాదు. గతించిన కాలంలో ఆ మహాతేజస్సు ఉంది. దాని వెలుగులు ఇంకా ఉన్నాయి. బ్లవట్స్కీ ఆ వెలుగు రేకులు పట్టుకోగలిగింది. కానీ ఆమె జీవితంపైన వాలిన నీలిపరదాలు వాటిని బయటకు రానీయలేదు. ఆ పరదాలు తొలగించే చేతులు కావాలి. బలమైన చేతులు కావాలి. అందుకు ఆనీబీసెంట్, నేనూ సమాయత్తమైనాం.

థియోసఫి అన్నది నేటి కాలానికి కొత్త సిద్ధాంతం. జనాలకు అవసరమైనదే గాని, జనం ఆమోదించలేని సిద్ధాంతం. అందులో తలదూర్చితే ఏమవుతుంది! ఆకర్షణ ఉంది. ఆకర్షణ ఒక్కటే చాలదు. పుస్తకం చదవడానికి బావుంది. విషయం మాట్లాడుకోడానికీ బావుంది. నాకు కావలసింది అతీంద్రియ శక్తుల ప్రదర్శన కాదు. టీ కప్పు సాసర్లు సృష్టించడం, ఉత్తరాలు తెప్పించడం కాదు. దివ్యజ్ఞానం లోతులు వెదకాలి, వాటి అనుపానులు తెలుసుకోవాలి.

బ్లవట్స్కీలో జీవితాదర్శం ఉంది. తొణుకు బెణుకు ఏమాత్రం లేవు. తాత్వికత ఘనీభవించిన వ్యక్తి. మనిషికి ఫిజికల్ సైన్సు ఎంత అవసరమో మెటాఫిజికల్ సైన్సు అంతకు మించి అవసరం. ఆమెలో ఒక World Teacher ఉన్నట్లు గుర్తించారు ఆమె గురువు. జగద్గురువు. గురువు పని నీతులు బోధించడం కాదు. పాఠాలు చెప్పడం కాదు. చైతన్యం కలిగించడం, స్ఫూర్తినివ్వడం. అధ్యాపకత్వం కంటే కావలసింది అధ్యయనం. చదివింది మాత్రమే చెప్పేవారు చాలామంది ఉంటారు. వారు బోధకులు. అధ్యయనం చేసేవారనిపించరు. మనిషిని, మనసును, హృదయాన్ని కలిపి చదవగలిగితే అది అధ్యయనం అవుతుంది.

గజిబిజిగా ఉన్న నా ఆలోచనలు ఒక క్రమంలోకి వచ్చాయి, చిక్కుముడి విడిపోయింది. ఆమె జ్ఞానం నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది. ఆమె సదా 'ఆత్మ' సమాధిలో ఉంటుంది. కోట్ల మందిలో ఏ ఒక్కరికో ఆ యోగ్యత కలుగుతుంది. బ్లవట్స్కీలో లోపాలు లేవని అనను. లోపాల్ని మించిన సుగుణాలు, మహదా శయాలు, మహత్తులు ఉన్నాయి. సంపూర్ణత ఉంది.

"మాడం మీరు తుఫాను లాంటి వారు. సుడిగుండంలో చిక్కుకున్నారు. ఎందరికో స్ఫూర్తినిచ్చారు" అన్నాను. ఆమె పట్టించుకోలేదు. అభిశంసలు, అభినందనలు బొత్తిగా పట్టించుకోని మనిషి. ఆత్మజ్ఞానం ఒక్కటే ఆమెకు ఆధారం.

**ఆనీబీసెంట్** (1889 జులై)

నాకు రాజకీయాల రంధి ఎక్కువ. సమాజసేవ నా వ్యాపకం. పేదల ఉద్ధరణ నా ఆశయం. హెర్బర్ట్ బర్రోస్‌తో కలిసి పారిస్‌లో జరిగే లేబర్ సమావేశాలకు వెళ్లాను. వారం రోజులు సమావేశాలు. మధ్యలో వీలు కల్పించుకుని 'ఫౌంటెన్ బ్లూ'లో ఉన్న మాడం బ్లవట్స్కీని చూడడానికి వెళ్లాను. అప్పుడు The Book of the Golden Precepts రాస్తోంది. అదే The Voice of Silence. ఎదురుగా ఒక్క పుస్తకమూ లేదు. అంతా విజన్. ఇండియాలో ఉండగా కంఠస్థం చేసిన తెలుగు పద్యాలను తన స్వంతం చేసుకుని రాస్తున్న పుస్తకం అది. నేను స్క్రిప్టు చదివాను. అద్భుతమైన రచన అది.

నేను అడిగాను : మాడం! స్పిరిట్స్ అనేవి నిజంగా ఉన్నాయా?

ఆమె నన్ను దగ్గరగా పిలిచింది, తన చేతిని నా తలమీద ఉంచింది.

నా తలలోని ఎముకలు కదిలిన శబ్దం వినిపించింది. నా వెన్నులోంచి జరజర కరెంట్ పాస్ అయింది. ఊగి, తూగి పడిపోయాను.

**జి.ఆర్.ఎస్.మీడ్** (ఆగస్టు 1889)

1889 ఆగస్టులో నేను మాడం బ్లవట్‌స్కీ పనిలో చేరాను. అప్పట్లో ఆమె 'జెర్సి' ద్వీపంలో ఉంటున్నారు. టెలిగ్రాం అందగానే బయలుదేరి వెళ్లాను.

నా ఉద్దేశంలో మాడం అందరిని అతిగా నమ్ముతుంది, మోసపోతుంటుంది. ఆమెపైన వచ్చిన అపవాదులన్నింటికీ కారకులు తను అమితంగా నమ్మినవారు. నిజం మొహంమీద చెప్పేస్తుంది. ఏ విషయాల్ని, భావాలను మనస్సులో దాచుకోవడం ఆమెకు చేతకాదు.

నేను వచ్చీ రాగానే తనకు వచ్చిన ఉత్తరాల కట్టలు నాకు చూపించి వాటికి జవాబులు రాయమంది.

"ఇప్పుడు వాటికి జవాబులు వెళ్లకపోతే నాతోపాటు అవీ చచ్చిపోతాయి" అంది.

ఆ తర్వాత 'లుసిఫర్' పత్రిక పని. అప్పుడు బెర్ట్రం కైట్లే సబ్ ఎడిటర్. పత్రికలో ప్రతి పేజీ తను చదవందే అచ్చుకావడానికి వీల్లేదు. చివరి నిమిషం దాకా ప్రూఫులు దిద్దుతూ, మార్పులు చేస్తుండేది.

ఒకరోజున మాడం నా గదికి వచ్చి, ఒక రాత ప్రతి నా చేతికిచ్చి –

"చదివి నీ అభిప్రాయం స్పష్టంగా చెప్పు" అన్నది.


"బావుంది" అన్నాను.

తనకు నచ్చలేదు. తనకు రచనలో స్పష్టత ఉండాలి. అది లేనిదే ఆమెకు నచ్చదు. ముందుగా ఇతరుల చేత చదివించి అభిప్రాయం అడుగుతుంది. అది అలవాటు.

ఆర్చిబాల్డ్ బెర్ట్రం విదేశాలకు వెళ్లాక, మొత్తంపని నా పైన పడ్డది.

'లుసిఫర్' పత్రిక ఎడిటర్ తను. అయినా స్క్రిప్టులు చదివేది కాదు. ప్రూఫులు వచ్చాక చదువుతుండేది. వ్యాసం పెద్దదిగా ఉండకూడదు. మాటల్ని ఓపిగ్గా లెక్కపెట్టేది. ఎక్కువైతే తీసివేసేది. వ్యాసాలు ఎడిట్ చేయడం, ఒక క్రమంలో పెట్టడం తన పని. చివరి నిమిషంలో సంపాదకీయం రాస్తుండేది.

మాడం బ్లవట్‌స్కీ గొప్పరచయిత్రి మాత్రమే కాదు, మంచి జర్నలిస్టు కూడా.



# 23. ఆఖరి పోరాటం

**ఆ**నీబీసెంట్ అభిమానంతో బహూకరించిన ఇల్లు 1890 జులైన థియోసాఫికల్ సొసైటీకి కొత్త కేంద్రాలయం అయింది. అదే మాడం బ్లవట్స్కీ నివాసం కూడా. ఒక గదిలో మాడం తన ఆంతరంగిక బృందాన్ని కలుసుకునేది. పన్నెండు మందికి 'ఒక ఈసాటరిక్ గ్రూపు'గా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నది. ఒక విధంగా అది ధ్యానశిక్షణా కేంద్రం. ఆ 'ఇన్నర్ గ్రూపు'లో రాణించిన వారు తర్వాత థియోసఫీ కేంద్రాలకు వారసులవుతారని ఆమె ఆశ.

మార్చి మాసంలో 'The Key to Theosophy' ప్రచురణ జరిగింది. బ్లవట్స్కీ విపులవ్యాఖ్య రాసింది. అమెరికాలోని బోస్టన్‌లో జరిగిన అమెరికన్ థియోసాఫికల్ సమారోహానికి వెళ్లిన ఆనీబీసెంట్ తిరిగి వచ్చేసరికి 'ఇన్‌ఫ్లూయెంజా' ప్రబలింది. థియోసాఫికల్ సొసైటీ ఉద్యోగులు చాలామంది ఆ రోగం బారిన పడ్డారు. బ్లవట్స్కీకి తీవ్రంగా జ్వరం వచ్చింది. శ్వాసించడం కూడా కష్టమైంది.

## ఇన్నర్ గ్రూపు

బ్లవట్స్కీ ప్రత్యేక యోగశిక్షణకు ఎన్నిక చేసుకున్న పన్నెండు మందిలో ఆరుగురు పురుషులు, ఆరుగురు మహిళలు.

మహిళలు : కాంటెస్ వాచ్ మైస్టర్, మిసెస్ కూపర్ ఓక్లే. మిస్ ఎమిలి కిస్లింగ్ బరి, మిస్ లారా కూపర్, మిసెస్ ఆనీబీసెంట్, మిసెస్ అలిన్స్ క్లైతర్.

పురుషులు : డాక్టర్ ఆర్చిబాల్డ్ కైట్లే, హెర్బర్ట్ కొరిన్, క్లాడీ రిట్, మీడ్, స్టర్డీ, వాల్టర్ ఓల్డ్.

వీరి సాధనకు ఒక ప్రత్యేక గది ఏర్పాటు చేశారు. మాడం తన గది నుండి ఆ గదికి డైరెక్టుగా వెళ్లే వీలుంది. ఆ గదిలోకి బ్లవట్స్కీ పన్నెండు మంది శిష్యులు తప్ప అన్యులకు ప్రవేశం లేదు. మగవారిని కుడివైపున, మగువల్ని ఎడమ వైపున అర్ధ చంద్రాకారంలో కూర్చోపెట్టుకుని తాను మధ్యలో ఉండి మెడిటేషన్ చేయించేది.

## దృశ్యాలు : సాదృశ్యాలు

## (ఈస్తర్ విన్‌డస్ట్ అనుభవం)

నేను మొదటిసారి కలిసినప్పుడే మాడం బ్లవట్స్కీ నాపైన చెరగని ముద్ర వేసింది. నా ఫ్రెండ్ ఒకామె తన మీటింగుకు తీసుకు వెళ్లింది. రోజూ సాయంత్రం పూట జరిగే సత్సంగం అది. మాడం గొప్పవ్యక్తి అని విన్నాను కాని అంతగొప్ప యోగిని అని నాకు తెలియదు. ఆమెది ఆధ్యాత్మిక తేజస్సు (AURA). మొదట కేవలం ఆమెను చూద్దామన్న ఉత్సాహంతో మాత్రమే వెళ్లాను.

నాకు థియోసఫీ అంటే తెలియదు. దానిపైన ఎలాంటి అభిరుచి లేదు. సమావేశ మందిరం పూర్తిగా జనంతో నిండిపోయింది. మేము హాలు మధ్యలో కూర్చున్నాం. వేదికపైన రెండు కుర్చీలున్నాయి. ఆ ప్రక్కన వక్త ప్రసంగానికి ఒక స్టాండు. ఇద్దరు మహిళలు ఒకేసారి వేదికపైకి వచ్చారు. ఒకరు ఆనీ బీసెంట్ – ఆమె లాడ్జి ప్రెసిడెంటు. రెండవ ఆమె మరీ పొడవు కాదు కాని లావుగా ఉంది. మంచి ఆకర్షణీయమైన పర్సనాలిటీ. బహుశః ఆమె మాడం బ్లవట్స్కీ అనుకున్నాను. నా గరల్‌ఫ్రెండ్ చెవిలో ఏదో చెప్పబోగా 'ఉష్, సైలెన్స్' అని నా నోరు మూయించింది. నో టాక్, నో మర్మర్. పిన్‌డ్రాప్ సైలెన్సు.

నేను చాలా దేశాలు తిరిగాను. గొప్పగొప్ప వ్యక్తుల్ని చాలామందిని కలిశాను. నటులు, కళాకారులు, రచయితలు, రాజకీయవేత్తలు ఎందరినో చూచాను. బ్లవట్స్కీ వంటి నిరాడంబర వ్యక్తిని ఎక్కడా చూడలేదు. పెద్ద కుర్చీలో నిండుగా కూర్చున్నది. భుజాలపైన ఒక శాలువా కప్పుకుని చిన్నగా అనిపించింది. ఆమె ముఖం, కళ్లు మాత్రం స్పష్టంగా కనిపించాయి. చేతులు ఒడిలో పెట్టుకుని ఒద్దికగా కూర్చుంది. ఆమెలో విశేష ఆకర్షణ, ప్రేమ. ఆమె చూపుల్లోంచి 'ప్రేమ' ప్రవహిస్తుంది. అలా చూస్తూ కూర్చుండిపోయాను. ఆమె స్థానంలో సినిమాలో వలె బొమ్మలు కనిపించసాగాయి. దృశ్యాలు వస్తూ మాయ మవసాగాయి. ఆ దృశ్యాలు,

ఆ రూపాలు నేను ఎప్పుడు చూచినవి కావు – ఎప్పటివో, ఏకాలం నాటివో, ఎవరివో. అప్పటికి నాకు 'ఆరా' గురించి అస్సలు తెలియదు.

అవి ఈజిప్టు దృశ్యాలు, ప్రాచ్యదేశాల దృశ్యాలు. పూర్వకాలపు గుడులు, కట్టడాలు, కొండలు, లోయలు, ఆశ్రమాలు. ఆ దృశ్యాలు చూస్తూ మైమరచి పరవశించి పోయాను తప్ప ఆమె చెప్పే విషయాలు ఒక్కటీ వినలేదు. ఆ రోజునే నేను మారిపోయాను. నేను మరొక అద్భుత ప్రపంచంలోకి వెళ్లిపోయాను.

**కాంటెస్ వాచ్ మైస్టర్** (మార్చి 1891)

గురువారం సమావేశాలు మామూలుగా జరుగుతున్నాయి. ఎప్పుడో గాని మాడం బయటకు రావడం లేదు. ఎవరికీ కనిపించడం లేదు. రోజుల తరబడి తలుపులు మూసి తన గదిలోనే ఉండిపోతోంది. ఆమె గదిలోంచి తోటలోకి దారి ఉంది. అది రహస్య గది. ఆ గదిలోకి వెళితే బయటి ప్రపంచంతో సంబంధం ఉండదు. మనిషి బాగా నీరసించింది. చిక్కి సన్నబడ్డది. ఏకాంతంగా ఉంటే కాస్త శక్తి ఉంటుంది. ఎవరితో మాట్లాడినా అలసిపోతోంది. ఆయాసం వస్తోంది. బంధువులు, శిష్యులు, సొసైటీ మెంబర్లు ఎవరూ ఆమెను చూడడానికి వీలులేదు. తన శరీరం శిథిలమైన ఆలయం అంటుంది. కదిపితే ముక్కలవుతుందట.

**లారా ఎం. కూపర్** (ఏప్రిల్ 21 – మే 8, 1891)

ఆరోజు మంగళవారం – ఏప్రిల్ 21.

కొన్నాళ్లు థియోసాఫికల్ సొసైటీ హెడ్ క్వార్టర్సులో ఉందామని వెళ్లాను. కాని ఊహించని సంఘటనలు చోటుచేసుకున్నాయి. అక్కడే కొన్ని వారాలు ఉండి పోవలసి వచ్చింది. మాడం కాస్త ఆరోగ్యంగానే ఉన్నట్లు కనిపించింది. ఏప్రిల్ 23, గురువారం లాడ్జి సమావేశాలకు వచ్చింది. మిత్రులతో ఉల్లాసంగా, ఉత్సాహంగా కబుర్లు చెప్పింది. కార్యక్రమం అవగానే ప్రక్కనే ఉన్న తన గదికి వెళ్లింది. హెడ్ క్వార్టర్లలో ఉండేవారు ఆమె వెంట గదిలోకి వెళ్లి సెలవు తీసుకుని వారి వారి గదులకు వెళ్లిపోయారు.

శనివారం వరకు మాడం బాగానే ఉన్నారు. నా చెల్లెలు ఇసాబెల్ కూపర్ ఓక్లే, నేనూ, మరో ఇద్దరు రాత్రి 11.00 గంటల వరకు మాడం, చెప్పే కబుర్లు వింటూ కూర్చున్నాం. ఆమె 'గుడ్ నైట్, ఆల్' చెప్పి తన బెడ్‌రూంకి వెళ్లిపోయింది. మర్నాడు ఉదయం మెయిడ్ సర్వెంట్ పరుగెత్తుకు వచ్చింది నా గదికి.

"రాత్రంతా మాడం నిద్రపోలేదు. మూలుగుతున్నారు. మధ్యమధ్యన చలి తట్టుకోలేక వణికిపోయారు" అని చెప్పింది.

వెంటనే డాక్టర్‌కు కబురు చేశాం.

ఆ రోజంతా మాడం మూసిన కన్ను తెరవలేదు. మగత నిద్ర, మధ్యమధ్య బాధతో మూలుగు. కళ్లు తెరిచినా బాధపడేది.

సాయంత్రానికి డాక్టర్ మెన్నెల్ వచ్చాడు. మాడంకు ఇన్‌ఫ్లూయంజా అని చెప్పాడు. టెంపరేచర్ 105 డిగ్రీలుంది. ఆదివారానికి ఆమె పరిస్థితి మరీ ఆందోళన కరంగా మారింది. లాడ్జిలో ఉన్నవారికి ఒకరి తర్వాత ఒకరికి ఫ్లూ జబ్బు చేసింది. ఏప్రిల్ 30 గురువారం సాయంత్రానికి గొంతు ఇన్‌ఫెక్షన్ ఎక్కువైంది. మింగుడు పడడం లేదు. గొంతునొప్పి, దానికి తోడు దగ్గు. శ్వాస తీసుకోవడం కష్టమయింది.

సోమవారానికి పరిస్థితి మెరుగు పడలేదు. దగ్గు మరీ ఎక్కువైంది. డాక్టరు చూచి, గొంతులో కుడివైపున 'కణితి' ఏర్పడిందని చెప్పాడు. ఆవిరి కాపడం పెడితే గడ్డ తగ్గుతుందని సలహాయిచ్చాడు. కాపడంతో కాస్త వాపు, నొప్పి తగ్గింది. మే 3 నాటికి మాడం చాలా నీరసించింది. మందు బిళ్లలు మింగలేకపోయింది. తిండి అసలు లేదు. బాధ. మృత్యువుతో పోరాటం సాగిస్తోంది. బయట వారికేం తెలుస్తుంది ... ఆ భీకర పోరాటం!

మే 6, బుధవారం బట్టలు వేసుకుని ముందు గదిలోకి వచ్చి కూర్చుంది. అక్కడే లంచ్ తీసుకుని సోఫాలో పడుకుండిపోయింది. సాయంత్రానికి ఆరోగ్యం మెరుగైనట్లు డాక్టరు చెప్పాడు. జ్వరం పూర్తిగా తగ్గిపోయింది.

మే 7, గురువారం సిట్టింగ్ రూంలోకి వచ్చి 'కార్డులు' ఆడింది. పేషెన్స్ ఆడుకోవడం ఆమెకు హాబీ ... అది రిలీఫ్.

అయిదు గంటల ప్రాంతంలో డాక్టర్ మెన్నెల్ వచ్చి చూచి ఆశ్చర్యపోయాడు. మాడంను అభినందించాడు.

"ఇంక భయం లేదు. ధైర్యంగా ఉండండి మాడం" అన్నాడు.

"యస్ డాక్టర్. నా శక్తి మేరకు ధైర్యంగానే ఉంటాను" అంటూ తనొక సిగరెట్ వెలిగించి డాక్టర్‌కి ఒకటి యిచ్చింది. అదే చివరి సిగరెట్ అయింది. ఆ రాత్రే చివరి రాత్రి అయింది. ఆ రాత్రి భయంకరమైన బాధను భరించ లేకపోయింది. విలవిల్లాడి పోయింది. శ్వాస ఆడక అవస్థ పడ్డది. ఏమందు వాడినా గుణం కనిపించలేదు. తర్వాత కుర్చీలో మెత్తటి పరుపులు వేసి కూర్చోపెట్టాం. ఉదయం నాలుగు గంటలకు కాస్త నెమ్మదించింది.

మే 8న ఉదయం 11.30 గంటలకు రిట్ వచ్చి చెప్పాడు. మాడం పరిస్థితి

చేయిదాటి పోతోందని. గదిలోకి పరుగెత్తి చూడగానే అనిపించింది, అంతా అయి పోయిందని. ఆమె కాళ్ల దగ్గర కూర్చుని బిళ్ల యిచ్చాను. నీళ్ల గ్లాసు చేతిలోకి తీసుకుని పట్టుదొరక్క వదిలేసింది. నేనే నీళ్ల గ్లాసు పెదవులకు అందించాను. స్పూనుతో సూపు తినిపించాను. అదే లాస్ట్ సప్పర్. కొంచెం త్రాణ వచ్చింది. కొంచెం ఫరవాలేదని నర్స్ చెబుతుండగానే మాడం మెడ వాలిపోయింది. ప్రాణం పోయింది. కళ్లలో కాంతి తగ్గిపోయింది.

మాడం దీర్ఘంగా ఆలోచించే సమయంలో ఒక పాదం నేలను ఆన్చి ఆడిస్తుండేది. అది అలవాటు. చివరిశ్వాస వరకు ఆమె కాలు ఆడించడం మానలేదు. కాలు కదలడం ఆగిపోగానే నర్సు బయటకు వెళ్లిపోయింది. సి.ఎస్. రిట్, W.R. ఓల్డ్, నేను మాత్రం మాడం పక్కన మిగిలాం. ఇద్దరు మాడం ఎదురుగా కూర్చుని చేతులు పట్టుకున్నారు, నేను ప్రక్కన నిలబడి తల పట్టుకున్నాను. అలా కొన్ని నిమిషాలపాటు మా ముగ్గురిలో కదలిక లేదు. మాడం శ్వాస ఎప్పుడు నిలిచి పోయిందో ఎవరం గమనించలేదు.

ఆమె ప్రశాంతంగా వెళ్లిపోయింది. మేం నిలబడి ప్రార్థన చేశాం.

## జూలియా కైట్లీ

మాడం బ్లవట్స్కీ చనిపోయి కొద్ది రోజులు గడిచాయి. ఒకరోజు రాత్రి మాడం వచ్చి నన్ను నిద్ర లేపింది. ఆమె చనిపోయిందనే విషయం జ్ఞాపకం రాలేదు. నిద్ర లేచాను. మాడం నవ్వుతూ పలకరించింది. నా కళ్లలోకి ప్రేమగా చూచింది. అంతలో ఆమె రూపం అరూపం కాసాగింది. తర్వాత ఆమె మగవాని రూపం ధరించింది. మాడం రూపురేఖలు పురుషుని రూపంలోకి పరివర్తనం చెందాయి. పురుష రూపంలోకి మారిన తర్వాత నా వైపు చూచి “బాగా చూడు” అంటూ గోడమీద ఉన్న బ్లవట్స్కీ చిత్రపటం మీద చేయిపెట్టి నెమ్మదిగా గదిలోంచి నిష్క్రమించింది. మగాడుగా మారిన మాడం బ్లవట్స్కీ.

చిత్రం ఏమిటంటే ఆ పురుష పుంగవుడు తర్వాత చాలాసార్లు నాకు దర్శనమిచ్చాడు. పగటి వేళల్లో పని చేసుకుంటున్న సమయంలో వచ్చి పలకరించే వాడు. మాడం బ్లవట్స్కీ ఫొటోలోంచి బయటకు వచ్చి రూపం దిద్దుకున్న ఆ వ్యక్తి ఎవరు? బ్లవట్స్కీ తర్వాతి జన్మ రూపమా అది!?

కావచ్చు! ఎవరు నిరూపించగలరు? ప్రజ్ఞ తప్పు!



# 24. స్మృతి పథంలో ...

**మా**డం బ్లవట్స్కీకి మరణం లేదు. ఆమె భౌతిక శరీరం కనిపించదు. అశరీరిగా, కాంతి శరీరిగా ఆమె ఉంది. చైతన్యంగా జీవిస్తోంది.

బ్లవట్స్కీ ఆఖరిపోరాటం భౌతికంగా ఆగింది. భావపరంగా కొనసాగుతోంది. చివరి రోజుల్లో ఎంతగా ఆరోగ్యం చెడిపోయినా, బలహీనపడినా పని చేస్తూనే ఉంది. మధ్యమధ్య 'అంతర్ముఖం' అవుతూ సమాధిలో గడిపేది. ఆ విరామంలో శక్తిపాతం జరిగేది. మాస్టర్ల శక్తిని అందుకుంటుండేది. తిరిగి ఉత్సాహం పొందేది. ఇరవై నాలుగు గంటలూ రాత, ఆలోచన, థియోసఫీ. ఇవే వ్యాపకాలు. ఆమెది అలుపు లేని రాతపని.

ఆమె చివరి రచన 'నా పుస్తకాలు' రాస్తుండగా ఇన్‌ఫ్లూయంజా వ్యాధికి గురైంది. ప్రమాదం ముంచుకొచ్చింది. మృత్యువు వచ్చి ముంగిట కూర్చుంది. అసలే చాలా సంవత్సరాలుగా వీడని అనారోగ్యం. రోగాన్ని తట్టుకునే శక్తిని కోల్పోయి నీరసించింది. 1891 మే 8న శాశ్వతంగా కన్నుమూసింది. అవతార కార్యం పూర్తి చేసుకుని పుట్టింటికి వెళ్లిపోయిన పుణ్యవతి. ఆమెకు దహన సంస్కారం తర్వాత చితాభస్మాన్ని, అస్థికలను అడయారు, న్యూయార్కు, లండన్ నగరాలకు పంపారు. ఆ మూడు తావులు ఆమెకు ఇష్టమైనవే.

బ్లవట్స్కీ భౌతిక మరణం తర్వాత ఆమె కృషికి విలువ కట్టడం సాధ్యం కానిపని. ఆమె ఏం చేసింది? చేయవలసిన పని పూర్తి చేసిందా?

ప్రపంచానికి పరమ గురువుల్ని, మాస్టర్స్‌ని, మహాత్ముల్ని పరిచయం చేసింది. భృక్తంగా ఉన్న దివ్యజ్ఞానంపై తెరతీసి లోకానికి చూపించింది. మాస్టర్ల ఆచూకీ

తెలుసుకుని ఈ తరానికి అందించింది. అయితే బ్లవట్‌స్కీ ఆశించిన మహత్కార్యం కొంతవరకే పూర్తి చేయగలిగిం దనిపిస్తోంది. థియోసఫీ (దివ్యజ్ఞానం) అందించ గలిగింది కాని యోగా వర్కు (ఈసాటరిక్) ప్రారంభించనే లేదు. ప్రచారం జరిగింది కాని, వినిమయం జరగలేదు. ఆమె మరికొంతకాలం జీవించి ఉంటే తాను కలగన్న, ఆశించిన పనులు పూర్తిగా చేసి ఉండేది. పూర్తిచేసి ఉండేది.

ఆమె ఎక్కడికీ పోలేదు. **'నిర్మాణకాయ'** ధరించి నిర్మాణాత్మక కృషిలోనే ఉంది. మరొకసారి జన్మించి ఆపని పూర్తి చేయవచ్చు గదా, లేక మరొకరిలో తన ప్రజ్ఞను ప్రవేశింప చేయనూవచ్చు. మాస్టరు సహకారం ఉంటే కాని పని ఏముంది? ఎప్పటికైనా నిలబడేది 'మాస్టర్' యోగం. మనిషిగా పుట్టిన తర్వాత మరణం తప్పదు. మనిషి ఆశయం మనిషి మరణంతో ఆగిపోదు. అపజయాలు కాకపోయినా తాత్కాలిక వైఫల్యాలుంటాయి. కాలం గాయాన్ని మాన్పుతుంది. మచ్చలు మాసిపోతాయి. ఆపజయాల తర్వాత వచ్చే విజయాలకు విలువ ఎక్కువ. ముందు విజయాలు కలిగి తర్వాత కలిగే అపజయాలవల్ల ఘోర నష్టం కలుగుతుంది.

బ్లవట్‌స్కీ ఎప్పటికీ తన పుస్తకాలలో సజీవంగా ఉంటుంది. మంచి పుస్తకం మహర్షి హృదయం లాంటిది. వాటికి కాలదోషం ఉండదు. మాడం పుస్తకాలు ఏవీ కాలక్షేపానికి రాసినవి కావు. 'డబ్బు' సంపాదన కోసం రాసినవి అంతకన్న కాదు. గుండెలోంచి పొంగి వచ్చిన ఉద్వేగాలకు నకళ్లు. హృదయం నుండి పొంగి వచ్చిన ప్రేమామృత భాండాలు, ఆధ్యాత్మ వనరులు.

మొదట రాసిన పుస్తకం : 'ఇసీస్ అన్వీల్డ్'.

**"మనిషి తనకు తెలిసిన మనిషికన్న చాలా చాలా గొప్పవాడు"** అన్నది ఇసీస్ ప్రాతిపదిక. ప్రతిమనిషిలో ఎన్నో శక్తులు నిగూఢంగా ఉన్నాయి. ఇంతవరకు పాశ్చాత్య దేశాల మేధావి వర్గానికి ఆ రహస్యం తెలియదు. మనిషి బుద్ధిమంతుడు అయితే చాలదు, ఆత్మజ్ఞాని కావాలి. మహాత్ములకు, మహర్షులకు మరణం ఉండదు. వారు అమరులు, అమృతులు. వారు పరమ గురువులుగా శాశ్వతులు. మనకు వివేకం కలిగించేది, జ్ఞానం ప్రసాదించేది ఆ మాస్టర్లే. తన శక్తిని తాను తెలుసు కోకపోవడం అజ్ఞానం. ప్రతిమనిషి ప్రయత్నిస్తే దివ్యజ్ఞానం పొందగలడు. ప్రతిమనిషి దేవుడే. దేవుడంత ఎత్తులకు మనిషి ఎదగగలడు. ఇసిస్ అన్వీల్డ్‌లో ఆ ప్రయత్నంలో ఎదురయ్యే ప్రమాదాలను పేర్కొనడం, కష్టాలను చూపడం జరిగింది. ఆ పుస్తకంలో థియోసఫి సిద్ధాంతాన్ని, సందేశాన్ని క్లుప్తంగా వివరించడం జరిగింది.

ఇండియాలో థియోసఫీ ప్రచారానికి అండగా 'థియోసాఫిస్టు' పత్రిక ప్రారంభించింది. అందులో అభ్యుదయ భావాలు గల వ్యాసాలు ప్రచురించేవారు. భారతీయ తత్వంపై ప్రచురించిన రచనలు పాశ్చాత్యులను ఆకర్షించాయి. ఒక విధంగా ప్రాక్పశ్చిమాల మధ్య సన్నని వారధి ఏర్పడింది. అవగాహన పెరిగింది. అదే విశ్వసౌభ్రాతృత్వ భావన నెలకొనడానికి ఆధారమైంది.

## సీక్రెట్ డాక్ట్రిన్

1888 నాటికి ముఖ్య గ్రంథం **'సీక్రెట్ డాక్ట్రిన్'** తయారైంది. మానవా విర్భావం, సృష్టి, పరిణామం మొదలైన విషయాల పట్ల తాత్విక, శాస్త్రీయ అవగాహన ఏర్పడ్డది. 'ఇసీస్ అన్వీల్డ్' కన్న దీనిలో విస్తృత పరిశీలనకు అవకాశం ఏర్పడ్డది. ప్రాచీన మతాలు – విశ్వాసాలు, అధునాతన విశ్వాసాలు, ఇజాలు – తాత్విక విషయాలు విపులంగా చర్చించబడ్డాయి. కాలగర్భంలో దాగిన జ్ఞాననిధుల్ని వెలికి తీయడం జరిగింది. సనాతన విజ్ఞానం వెలుగుచూచింది. ఇంతకాలం నిస్తులంగా ఉన్న విజ్ఞానం మనిషికి అందింది. 20వ శతాబ్దంలో మనిషికి కావలసిన విజ్ఞానం, వివేకం సీక్రెట్ డాక్ట్రిన్ ద్వారా అందించింది.

1885లో మూడు భాగాలు తయారైనాయి. మొదటి సంపుటి **'ముందు మాట'**గా బ్లవట్స్కీ ఇలా రాసింది : "మూడవ భాగం పూర్తయింది. నాల్గవ భాగం **'ఆకల్టిజం'** ఇంకా రాయవలసి ఉంది.

తర్వాత మూడవ భాగం అచ్చుకానే లేదు. నాల్గవ భాగం గురించి ఎవరికీ తెలియదు. అది నేటికీ రాయని మహారచనగా మిగిలిపోయింది. మూడవ భాగం మాయం కావడం గురించి తర్వాత చాలా కథలు వెలువడ్డాయి. కొన్ని అపోహలు, కొన్ని దురూహలు.

మాడం బ్లవట్స్కీ అంటారు : అన్నీ ప్రకృతిలో సహజంగా ఉన్నవే. అయితే నిగూఢంగా ఉన్నవి. సైన్సు పరిశోధించి ఒక్కొక్కటిగా ఆవిష్కరిస్తున్నది. కొందరు వ్యక్తులకు మాత్రమే ప్రకృతిలోని రహస్యాలు అందుతాయి. కలియుగం అయిదు వేల సంవత్సరాలు పూర్తి కావస్తోంది. 1887–97 మధ్యకాలంలో ప్రకృతిలోని పదార్థ విజ్ఞానం ఎక్కువగా బయటపడే అవకాశం ఉంది.

మాడం చెప్పినట్లే 1897లో అనేక వైజ్ఞానిక పరిశోధనలు జరిగాయి. 1895లో ఎక్స్–రే కనుగొనబడింది. అణువిచ్ఛేదం జరిగింది. ఎలక్ట్రాన్స్ విజ్ఞానం అందింది.

ది సీక్రెట్ డాక్ట్రిన్ పుస్తకంలో బ్లవట్‌స్కీకి అర్థం కాని విషయాలు, ఆమెకు తెలియని విషయాలు అనేకం ఉన్నాయి. అయితే భవిష్యత్తులో సాధకుల, పాఠకుల జ్ఞాన దృష్టికి అవి తెలుస్తాయని ఆమె అన్నారు.

"వాటిని రాసింది నేను కాదు. పైనున్న మాస్టర్లు నాచేత రాయించారు. నా చేయిపట్టి నడిపించింది, రాయించింది వారే. కృతి కర్తలు వారు, నేను లేఖినిని. ఆ విషయాలు రాయగల మేధ నాకు లేదు. ఆ పుస్తకం సృష్టి, విశ్వరహస్యాలపై సంపూర్ణ రచన కాదు. సత్యాన్ని తెలుసుకోగలిగే వారికి కొంత మార్గం చూపిస్తుంది. అయితే చాలా పుస్తకాలలో దొరకని రహస్యాలు, విషయాలు అందులో ఉన్నాయి."

సీక్రెట్ డాక్ట్రిన్ పుస్తకం దివ్యజ్ఞానంలో ఎవరెస్టు శిఖరం కాకపోవచ్చు. దివ్యజ్ఞానం కల్పవృక్షం. ఎన్నో పూలు పూస్తుంది, కాయలు కాస్తుంది. అమృత ఫలాలను అందిస్తుంది. 1889లో వెలువడిన The Voice of Silence నిజంగా శిఖర సదృశం. అది వచన కవిత. అది ఆత్మ శోధన. మనిషి తనలోని దివ్యజ్ఞానాన్ని ఆవిష్కరింపచేసుకునే మార్గం చూపిస్తుంది. దివ్యజ్ఞాన బోధనల్లో అది తలమానికం. అది వ్యక్తి గమ్యానికి, సమాజం లక్ష్యానికి సూచిక. ఉత్తినే సీక్రెట్ డాక్ట్రిన్ ఎన్ని సార్లు చదివినా ఏమీ దొరకదు. **'వాయిస్ ఆఫ్ సైలెన్సు'** సత్యాన్ని ఆవిష్కరిస్తుంది. దీని వెలుగులో సీక్రెట్ డాక్ట్రిన్ అధ్యయనం చేయాలి.

ప్రపంచంలో సిద్ధాంత గ్రంథాలు, నీతి నిధులు చాలా ఉన్నాయి. థియోసఫీ వల్ల ఒరిగేది ఏమిటి? మోక్షం లభిస్తుందా? దేవుడు కనిపిస్తాడా? పునర్జన్మ లేకుండా పోతుందా? అని జిజ్ఞాసులు ప్రశ్నిస్తారు. వీటికి పరిష్కారం ఆత్మజ్ఞానంలో ఉంది. అంటే యోగసాధనలో ఉంది. అది మాస్టర్ యోగసూత్రం. దానివైపు అప్పటికి జనం వెళ్లలేదు. బ్లవట్‌స్కీ లోపల అన్నీ సిద్ధంచేసి పెట్టి, గేట్లు తెరవకుండా తప్పుకున్నారు. తన పని పూర్తి చేయకుండానే వెళ్లిపోయింది. ఈసాటరిక్ అంటే యోగసాధనతో ఆత్మాన్వేషణ. పుస్తకం గమ్యం చూపిస్తుంది. మార్గం నిర్దేశిస్తుంది. సాధన ముందుకు నడిపిస్తుంది. ది వాయిస్ ఆఫ్ సైలెన్సు పుస్తకం గురించి మాడం బ్లవట్‌స్కీ అంటారు –

"అందులో మహావాక్యాలున్నాయి. అవి నేను సృష్టించినవి, కల్పించినవి కాదు. వాటిని ఒక తెలుగు పుస్తకం నుండి తీసుకుని అనువదించాను."

"మహాయాన బౌద్ధానికి 'వాయిస్' హృదయం వంటిది. గౌతమ బుద్ధుని త్యాగానికి, ప్రత్యేక బుద్ధుల ఆధ్యాత్మిక త్యాగానికి తేడా ఉంది. ఇది మహాయాన సంగ్రహం. ఇది టిబెటన్ యోగం. నిగూఢ యోగరహస్యాల నిధి" అంటారు టిబెట్ గురు తాషీలామా.

మాడమ్ ఎంబ్లమ్



# 25. కొనసాగింపు

**కా**లం ఆగదు. చరిత్ర మలుపులు తిరుగుతుంది. పరిణామం ప్రగతికి బాటలు వేస్తుంది. అది సత్యం. సత్యం ఎప్పటికీ సత్యమే. సత్యాన్వేషణ నిరంతరం సాగుతుంది. సత్యాన్ని అన్వేషించటమే యోగం. సత్యయోగమే నిరవధిక తపస్సు. ఆత్మజ్ఞానానికి ఏకైక మార్గం – సూటిమార్గం. మహాయోగం, సత్యయోగం ఎప్పుడూ మాస్టర్ల అధీనంలోనే ఉంటుంది. పరమ గురువుల పర్యవేక్షణలో గమ్యాన్ని చేర్చుతుంది. లక్ష్యాన్ని సాధిస్తుంది. గురువు అనుమతి లభిస్తే తప్ప యోగ మందిరంలో ప్రవేశం లభించినట్లు కాదు. పై నున్న మాస్టర్లు ఆమోదిస్తే తప్ప పయనం ముందుకు సాగదు.

మాస్టర్లను దర్శించే ఉపాయం మొదటిసారిగా కలిగించిన వ్యక్తి బ్లవట్స్కీ. తర్వాత దర్శనాలు నిదర్శనాలైనాయి. మాస్టర్లే హిమాలయాలు దిగి వచ్చారు. అజ్ఞాతం వదలి, దివ్యజ్ఞానులైనారు. కొంతకాలం క్రితంవరకు అగోచరంగా ఉండే గురువుల్ని 'వైట్ బ్రదర్‌హుడ్' (White Brotherhood) అని వ్యవహరించేవారు. నిజానికి వారు తెల్లనివారో, నల్లనివారో ఎవరికెరుక. వారివి ఆస్ట్రల్ రూపాలు కనుక, కాంతి శరీరాలు కనుక 'వైట్ బ్రదర్స్' అయినారేమో. వారిని చూచినవారు తక్కువ, నమ్మినవారు ఎక్కువ. నమ్మేవారికి సైతం దృష్టాంతాలు నాస్తి. దరిమిలా ప్రయోగాలు, ప్రయత్నాలలో హిమాలయాల్లో టిబెట్ చైనా సరిహద్దుల్లోని 'శంబాలా' అనే లోయ ప్రాంతం మాస్టర్ల నివాసం అని ఒక నమ్మకం బలపడ్డది. అక్కడకు చేరిన వారిని వేళ్ల మీద లెక్కించవచ్చు. వారి అభిమానం పొందినవారు పదుల సంఖ్యలో ఉన్నారు. పరమ గురువులు వందల్లో ఉన్నారో, వేలసంఖ్యలో ఉంటారో

ఎవరికీ తెలియదు. వారివి అధిభౌతిక రూపాలు. అభౌతికం అంటే ఇంద్రియాలకు అతీతమైనదని గదా! కనుక కంటికి కనిపించని రూపాలు. అవి మాయా రూపాలు. కామరూపులు తమకు అవసరమైతే, ఇష్టమైతే భౌతిక రూపంలో, ఆస్ట్రల్ రూపంలో, భావ శరీరాలతో కన్పిస్తారు.

అన్ని కష్టాలు పడి, సర్వం త్యాగం చేసి, అవసరాలు, సుఖాలు, భోగాలు వదులుకుని వచ్చిన బ్లవట్స్కీలోని 'శూన్యత', ఆధ్యాత్మిక తపన మాస్టర్లకు నచ్చింది. దివ్యజ్ఞానం ప్రవేశానికి ఆ శూన్యత సరైన అర్హత అని గుర్తించారు. మాడం బ్లవట్స్కీని తన 'చేలా'గా ఎన్నుకుని దర్శనం యిచ్చిన మహాత్ముడు మోరియా. తర్వాత కుత్‌హోమి, జ్వాల్‌కుల్ వంటి మాస్టర్ల సహకారం పొందగలిగింది. ముందుకు పోగలిగింది. దానితో ఆమె సత్యాన్వేషణ ఊపందుకుంది. ఆధ్యాత్మిక యాత్ర ప్రారంభమైంది. మాస్టర్లు ఎవరూ నియమాలు, నిబంధనలు పెట్టరు. నీతిపాఠాలు చెప్పరు. గమనిస్తుంటారు. అభివృద్ధి సాధించడంలో అజ్ఞాతంగా ఉండి సాయపడతారు. అన్ని పరీక్షలలో విజయం పొందితే, అప్పుడు 'దివ్యజ్ఞానం' అందిస్తారు. తమ 'మీడియం'గా ఉండడానికి అనుమతిస్తారు.

అరవై సంవత్సరాల జీవనయానంలో (సుదీర్ఘయాత్ర కాకపోవచ్చు) బ్లవట్స్కీ సాధించింది ఎంత? విజయం పొందింది ఏపాటి? లబ్ధి ఎంతవరకు? బంధం తెగిపోకూడదు. అనుబంధం ఆగిపోకూడదు. **"నా అవతార లక్ష్యం ఆగిపోదు"** అంటారు ఆమె. 'లింక్' కొనసాగాలి. అయితే ఎలా? థియోసాఫికల్ సొసైటీ ఉదాత్త ఆశయాల పునాదులపై నిర్మితమైంది. కొన్ని లోపాలు కారణంగా గోడలు బీటలు వారాయి. మనస్పర్థల వల్ల, కొందరి స్వార్థ పరత్వం వల్ల సఖ్యత లోపించింది. పతనోన్ముఖమైంది. కానీ పూర్తిగా కనుమరుగు కాలేదు. అమెరికాలో, యూరపులో గట్టిగానే నిలబడింది. ఇండియాలోనే దాని ప్రాశస్త్యం తగ్గింది. కుంటినడక నడిచింది. సత్యానికి ఎప్పుడూ అపజయం ఉండదు. అవరోధాలు ఏర్పడవచ్చు.

1891లో బ్లవట్స్కీ జీవనరంగం నుండి నిష్క్రమించింది. కానీ పోషించవలసిన పాత్ర ఇంకా మిగిలే ఉంది. ఆమె నిష్క్రమణ 'మాస్టర్లు' ఊహించింది కాదు. స్వయంకృతాపరాధాల వల్ల 'అల్పజీవి' అయి ఉండవచ్చు. ఉద్యమం సాగాలి, మాస్టరిజం కొనసాగాలి. మాస్టర్లు మానవహితంకాని పనులు సంకల్పించరు. ఉద్యమస్ఫూర్తితో ఆచరించగల మనుషుల కోసం నిరీక్షిస్తారు. బ్లవట్స్కీ నిష్క్రమణలో సైతం ఏదో అంతరార్థం ఉంది. అది ఏమిటన్నది పరిప్రశ్న. ఆమె ఆశించిన లక్ష్యం ఏ మలుపు తిరిగిందన్నది మరొక ప్రశ్న.

థియోసాఫికల్ సొసైటీలో బ్లవట్స్కీ లేని 'వెలితి' పూరించలేనిది. చాలా కాలం పాటు ఆ శూన్యం తెలుస్తూనే ఉంది. థియోసఫి మూతపడినట్లేనని ఆమె అంటే గిట్టనివారు భావించారు. మహాత్ముల మరణంతో ఏర్పడే శూన్యం తాత్కాలికమే! మరొక మహాత్ముడు అవతరిస్తాడు. బాధ్యత తీసుకుంటాడు. తపస్సు వృధా కాదు. శరీరాలు వదలిన తర్వాత వారి యోగశక్తి, ఆత్మశక్తి నూరు రెట్లు అధికంగా పనిచేస్తుంది. పరిఢవిల్లుతుంది. ఇది సత్యం. ఆ మహాయోగిని మిగిల్చిన పనిని విజయవంతంగా పూర్తి చేయడానికి కొందరు ముందుకు వచ్చారు.

యూరపులోని థియోసఫిస్టులు సంఘటితమైనారు. ఆ కూటమిలో బ్లవట్స్కీ ఆశించిన 'ఆత్మాన్వేషణ' ఒక్కటే కొరవడింది. ఆత్మలేని మనిషికి విలువ ఉండనట్లే, 'ఆత్మాన్వేషణ' లక్ష్యంగా లేని సొసైటీ ప్రగతి సాధించలేదు. అప్పటికే లండన్ లాడ్జి ఎ.పి. సిన్నెట్ అధీనంలోకి వచ్చింది. ఆయన వేరు గ్రూపు ఏర్పాటు చేసుకుని సొసైటీ రూపు రేఖలనే కాదు లక్ష్యాలను, ఆదర్శాలను మార్చి వేశాడు. జనం ఎవరూ సిన్నెట్ చర్యలను ఖండించ లేదు. ఆల్కాట్, జడ్జి, ఆనీబీసెంట్‌ల నాయకత్వాన్ని గౌరవించ సాగారు. దాంతో యూరపు థియోసఫీలో రెండు చీలికలు ఏర్పడ్డాయి.

థియోసాఫికల్ సొసైటీలో థియోసఫీపై శ్రద్ధ ఏర్పడింది గాని అసలైన యోగసాధన విభాగం లుప్తమైంది. అది ఏమిటో ఎవరికీ తెలియని పరిస్థితి. 'యోగ విభాగం'లో సంపూర్ణ శిక్షణ ఎవరూ పొందలేదు. అప్పటికి సొసైటీలో ఆనీబీసెంట్ W.Q. జార్జి మాత్రమే మిగిలారు. బ్లవట్స్కీకి చాలాకాలం సన్నిహితంగా మెలుగుతూ ఆమె ఆంతర్యం తెలుసుకున్నవాడు జడ్జి. అతనికి అమెరికన్ సెక్షన్ అప్పగించారు. ఈసాటరిక్ సెక్షన్‌ను ఆనీబీసెంట్ తన క్రింద ఉంచుకున్నది. ఆనీ బీసెంట్ కొత్తగా వచ్చిచేరిన వ్యక్తి, మాడం బ్లవట్స్కీకి చాలా ఇష్టమైన వ్యక్తి. ఆ ఇష్టం ఒక్కటే ఆమెకు అదనపు అర్హత. 1891లో బ్లవట్స్కీ (తన నిష్క్రమణకు ముందు) చెప్పిన మాటలు –

**"ఆనీబీసెంట్ గొప్ప ఆధ్యాత్మికవేత్త కాదు. కానీ ప్రతిభావంతురాలు. ఆమెలో అతీంద్రియత లేదు గానీ మేధావి. అయినా నిశ్చలంగా, ప్రశాంతంగా ఉన్నప్పుడు "మాస్టర్స్ వాయిస్" వినగలదు. దివ్యకాంతుల్ని దర్శిస్తుంది. ఆమె హృదయం నిండా ప్రేమ, దయ, కరుణ ఉన్నాయి. గురువు చెప్పినట్లు నడుచుకొనే గొప్పగుణం ఉంది. అది సద్గుణం, సాధనకు అవసరమైన గుణం. బాధితులంటే ఆమెకు ప్రేమ, సానుభూతి."**

మాడం బ్లవట్స్కీ తర్వాత సారధ్యం ఎవరు వహిస్తారు? అనే ప్రశ్న వచ్చినపుడు అందరి దృష్టిని ఆకర్షించిన వ్యక్తి ఆనీబీసెంట్ ఒక్కరే. బ్లవట్స్కీ ఆశయాలను అర్థం చేసుకుని, గౌరవించిన వ్యక్తి ఆమె. విధేయురాలు. స్వచ్ఛమైన వ్యక్తి. నిస్వార్థ జీవి. ఆమెను ప్రధాన కార్యదర్శి పదవిలో కూర్చోబెట్టారు. కాని ఆమె అమెరికా వెళ్లి తిరిగి వచ్చే సరికి పరిస్థితి మారింది. ఆనీబీసెంట్ నియామకానికి అడ్డుపుల్ల వేశాడు ఆల్కాట్.

ఒకసారి మాడం బ్లవట్స్కీ జడ్జితో అన్నది :

“మిస్టర్ జడ్జ్! బీసెంట్ చాలా సమర్థురాలు. నాకు ఆమె కుడి భుజం లాంటిది. ఆమె నా వారసురాలు. అమెరికా థియోసఫీ బాధ్యత నీవు తీసుకో. ఇంగ్లండు బాధ్యత ఆనీబీసెంట్ తీసుకుంది.”

ఆ ఇద్దరి మధ్య పోటీ ఏర్పడ్డది. ఇద్దరికీ సమాన బాధ్యతలు ఇవ్వదలిచారు. అయితే జడ్జి తాను ప్రెసిడెంట్ కావాలన్న స్వార్థంతో బ్లవట్స్కీ రాసిన లేఖ బయట పెట్టలేదు. తనకన్న జడ్జి ఎక్కువ అర్హుడని బీసెంట్ చెప్పింది. బ్లవట్స్కీ మరణానికి ముందు దామోదర్ టిబెట్ నుండి తిరిగి రాలేదు. వచ్చి ఉంటే మొత్తం థియోసఫి బాధ్యత అతని పరం అయ్యేది. ఆనీబీసెంట్, జడ్జ్ బాధ్యతలు చెరిసగం పంచు కున్నారు.

★ ★ ★

1892లో చికాగోలో జరిగిన సర్వమత సమ్మేళనంలో యూరపు ప్రతినిధిగా ఆనీబీసెంట్ పాల్గొన్నది. అప్పుడే భారత హిందూమత ప్రతినిధిగా స్వామి వివేకానంద ఆ సభల్లో పాల్గొనడం జరిగింది. వివేకానంద ప్రతిభకు ఆనీబీసెంట్ ముగ్ధురాలైంది. అప్పుడే భారతదేశం పట్ల ఆమెకు ఇష్టం ఏర్పడ్డది. ఈసాటరిక్ సెక్షను నిర్వహణ బాధ్యతను తాను తీసుకున్నది.

చికాగో సభల్లో సింహళం నుండి వచ్చిన హేమవితరణ ధర్మపాల, సమాజం తరఫున వచ్చిన జి.ఎన్. చక్రవర్తి మూడురోజులు ఆనీబీసెంట్ ప్రసంగాలకు ముగ్ధులైనారు. ఆనీబీసెంట్‌కు చక్రవర్తి బ్రహ్మ భావనలు నచ్చాయి.

1893-95 మధ్య రెండుసంవత్సరాల మధ్య కాలంలో జడ్జి ప్రవర్తనతో ఆనీబీసెంట్ విసిగిపోయింది. అతనిని తప్పించాలని గట్టి ప్రయత్నం చేసింది. మహర్షి సుబ్బారావు లాంటి వారు థియోసాఫికల్ సొసైటీలో ఉండగా, జడ్జ్ లాంటి వారి అవసరం లేదు. సుబ్బారావుకు బ్లవట్స్కీ అంటే గొప్ప గౌరవం,

ఆరాధన. ఆమెకు మాస్టర్ల అండదండలున్నాయని పూర్తిగా నమ్మినవాడు. కాని ఆయన బ్రాహ్మణ పక్షపాతి. వేద రహస్యాలు, ప్రాచీన విజ్ఞానం పాశ్చాత్యులకు తెలియనివ్వడం ఇష్టం ఉండేది కాదు.

1895లో థియోసాఫికల్ సొసైటీ రెండుగా చీలిపోయింది. దేని కదిగా మనుగడ సాగించాయి. ఆనీబీసెంట్ ఇండియాలో ఉండాలని గట్టిగా నిర్ణయించుకుంది. ఆమె ఇండియా రావడంతో అమెరికా, యూరపు దేశాల్లో థియోసఫి చప్పబడ్డది. ఆల్కాట్ పని ప్రసంగాలకే పరిమితం. అతను 1907లో అడయారులో చనిపోయాడు. ఆల్కాట్‌కు, మాస్టర్ మోరియా, ఆల్కాట్, కుత్‌హోమిల సందేశాలు అందుతుండేవి.

★ ★ ★

హెచ్.ఎస్. ఆల్కాట్ మరణానంతరం అడయార్ థియోసాఫికల్ సొసైటీ ఆనీ బీసెంట్ చేతుల్లోకి వచ్చింది. వచ్చీ రాగానే సంస్థాగతమైన మార్పులు చేపట్టింది. ఆనీబీసెంటు అధ్యక్షతన థియోసాఫికల్ సొసైటీ బ్లవట్‌స్కీ కాలం నాటి వైభవాన్ని సంతరించుకోసాగింది. చీడపురుగుల్ని ఏరివేసి, శుద్ధి కార్యక్రమం చేపట్టింది. థియోసఫిస్టులు ఇతర రంగ ప్రముఖులతో మైత్రి పెంపొందించుకోవాలి. సాహిత్య, మత, సామాజిక, సహాయ కార్యక్రమాల్లో థియోసఫీ పట్ల ఇష్టం కలిగేటట్లు ప్రవర్తించాలి. అందుకై The Theosophical Order of Service ప్రారంభించింది. బ్లవట్‌స్కీ వలె ఆనీబీసెంట్‌కు ఇండియా అంటే ఇష్టం, ప్రేమ. చికాగోలో జరిగిన విశ్వమత సమ్మేళనంలోనే ఆమెకు ఇండియా సంస్కృతి పట్ల ఆకర్షణ ఏర్పడింది.

అయితే 1906 తర్వాత 'థియోసఫి' బురదగుంటలో పడ్డట్లయింది. అనవసర ప్రచారంతో ఇతర దేశాలలో చెడ్డపేరు కొని తెచ్చుకుంది. దానికి ప్రధాన కారకుడు C.W. లెడ్‌బీటర్. లండన్‌లో హెచ్.పి. సిన్నెట్ వర్గంలో ఉండేవాడు. అతను నెమ్మదిగా లండన్ వదలి అడయారు చేరుకున్నాడు. థియోసఫీపై పాఠాలు చెప్పడం మాని శృంగార పాఠాలు బోధించేవాడు. అది అడయారు పెద్దలకు నచ్చలేదు. అతని 'సెక్సు' దాహం భరించలేక చాలామంది సభ్యులు సొసైటీ వదలి వెళ్లిపోయారు. 1907లో ఆల్కాట్ మరణం తర్వాత తాను బుద్ధిగా, నీతిగా బ్రతుకుతానని హామీయిచ్చి బీసెంట్ గూటికి చేరుకున్నాడు.

థియోసాఫికల్ సొసైటీ ఆకర్షణ తగ్గడానికి ప్రధాన కారణం : ఆనీబీసెంట్‌కు లిబరల్ కాథలిక్ చర్చి పట్ల ఉన్న సానుభూతి. లెడ్‌బీటర్‌కు చర్చి అంటే ప్రాణం.

అతను తొంభయ్‌శాతం క్రిస్టియన్‌గా మసలు కొనేవాడు. తన మత ప్రీతిని వదులుకునేవాడు కాదు. అది థియోసఫీలో ఇమడని అంశం. థియోసాఫికల్ సొసైటీని అడ్డం పెట్టుకుని క్రైస్తవ మతప్రచారం చేస్తుండేవాడు. అయినా ఎవరూ ఆనీబీసెంట్‌కు ఫిర్యాదు చేసేవారు కాదు.

ప్రజాకర్షణలో భాగంగా ఆనీబీసెంట్ విద్యాసంస్థలు నెలకొల్పసాగింది. 1898లో బనారస్‌లో ఒక హైస్కూలు, కాలేజీ ప్రారంభించింది. తర్వాత ఆ కాలేజీయే బనారస్ విశ్వవిద్యాలయంగా మార్పు చెందింది. 1913లో ఆనీబీసెంట్ రాజకీయాల్లో ప్రవేశించింది. ఇండియాకు స్వతంత్ర ప్రతిపత్తి (Dominian-status) కల్పించాలని ఆమె ఆశయం. అందుకోసం పత్రికలు పెట్టింది. 1917లో ఇండియన్ నేషనల్ కాంగ్రెసుకు (Indian National Congress) అధ్యక్షురాలైంది.

1911లో ఆనీబీసెంట్ 'Order of the Star' సంస్థ నెలకొల్పి జిడ్డు కృష్ణమూర్తిని జగద్గురువుగా, మెస్సయ్యగా ప్రపంచానికి పరిచయం చేయాలని ప్రయత్నించింది. ఆ ప్రయత్నంలో లెడ్‌బీటర్ ఆమెకు అండగా నిలిచాడు. తర్వాత జె.కె. ఆర్డర్‌ను రద్దు పరచి, థియోసాఫికల్ సొసైటీకి తనకు ఎలాంటి సంబంధం లేదని దూరమైనాడు. దాంతో ఆనీబీసెంట్ హతాశురాలైంది. కన్నకొడుకులా కృష్ణమూర్తిని ప్రేమించింది. ఆయన స్వతంత్రించాడు. తనకు ఏ సంస్థ అవసరం లేదని, తనకు ఎవరి సహాయం అవసరం లేదని పారిపోయాడు. 1933 ఏప్రిల్ 20న ఆనీబీసెంట్ అడయారులోనే మరణించింది.

థియోసాఫికల్ సొసైటీ మాడం బ్లవట్‌స్కీ మరణంతో ఒక మలుపు తిరిగింది. అనీబీసెంట్ మరణంతో మరొక మలుపు తిరిగింది. అప్పట్లో బనారస్ హిందూ కాలేజీలో వైస్–ప్రిన్సిపాల్‌గా ఉన్న జార్జి అరండేల్ మద్రాసు చేరి థియోసాఫికల్ సొసైటీ అధ్యక్షులైనారు. 'రుక్మిణీ దేవి' అనే బ్రాహ్మణ యువతిని పెళ్లి చేసుకుని ఒక చరిత్ర సృష్టించాడు. చేతులు మారినకొద్దీ దివ్యజ్ఞానం పలచబడుతూ వచ్చింది. విలువలు కోల్పోయి అందనంత దిగువకు దిగజారింది.

**'మాస్టరిజం' మరొకరిని వరించింది. మాస్టర్ మైత్రేయ మరొకరిని తన మీడియంగా ఎన్నుకోవలసి వచ్చింది. మాస్టరిజం అడయారు నుండి కుంభకోణం కేంద్రానికి మారింది.**

## మాస్టర్ యోగాశ్రమం ప్రచురణలు

### శ్రీ శార్వరి రచనలు

**కొత్త పుస్తకాలు**

| | | |
|---|---|---|
| **1.** | **మాడం బ్లవట్స్కీ** | **రూ. 100/–** |
| **2.** | **77 సాధనా రహస్యాలు** (డా॥ వాసిలి వసంతకుమార్) | **100/–** |
| **3.** | **మాస్టర్ శార్వరి : మిషన్ & విజన్** (డా॥ వాసిలి వసంతకుమార్) | **100/–** |
| **4.** | **పరమహంస యోగానంద** | **100/–** |
| **5.** | **అవతార్ మెహర్‌బాబా** | **100/–** |
| **6.** | **రసరేఖలు** | **100/–** |
| **7.** | **గురుదర్శనం** | **100/–** |
| **8.** | **విశ్వదర్శనం** | **100/–** |

| | | |
|---|---|---|
| **9.** | **ఆంధ్ర మహాసావిత్రి** (ఫుల్ బౌండ్) (డీలక్స్ ఎడిషన్) | **రూ. 300/–** |
| 10. | మాస్టర్ ప్రేయర్స్ (తెలుగు) | 200/– |
| 11. | మాస్టర్ ప్రేయర్స్ : 'ఎం' కోర్సు | 100/– |

**శ్రీ శార్వరి యోగజీవితం (3 భాగాలు)**

| | | |
|---|---|---|
| 12. | ఆత్మయోగి సత్యకథ (1) | 100/– |
| 13. | యోగాశ్రమ జీవితం (2) | 100/– |
| 14. | యోగా విజన్ (3) | 100/– |

**మహాత్ముల జీవిత కథలు**

| | | |
|---|---|---|
| 15. | భగవాన్ బుద్ధ | 100/– |
| 16. | మహాత్మా జీసస్ | 100/– |
| 17. | సద్గురు సాయిబాబా | 100/– |
| 18. | సద్గురు రమణ | 100/– |
| 19. | అరవింద దర్శనం | 100/– |
| 20. | కొత్తకోణంలో కృష్ణమూర్తి | 100/– |
| 21. | మాస్టర్ సి.వి.వి. | 100/– |
| 22. | యు.జి. కృష్ణమూర్తి | 100/– |
| 23. | భగవాన్ రజనీష్ | 100/– |
| 24. | పరేంగిత ప్రజ్ఞ (దాదాజీ ఆత్మకథ) | 100/– |

**యోగ సాహిత్యం**

| | | |
|---|---|---|
| 25. | అతీత మానసం | 100/– |

| | | |
|---|---|---|
| 26. | జీవన్ముక్తి | 100/- |
| 27. | మాస్టర్స్ యోగదర్శిని | 100/- |
| 28. | ధ్యానం ఎలా చేయాలి? | 60/- |
| 29. | ధ్యానం - యోగం | 60/- |
| 30. | దివ్యజ్ఞానం (మహాచైతన్యం) | 60/- |
| 31. | కుండలిని | 60/- |
| 32. | శక్తిపాతం | 60/- |
| 33. | సమాధి (నిర్వికల్ప) | 60/- |
| 34. | పరావిద్య | 60/- |
| 35. | ఆత్మజ్ఞానం | 60/- |
| 36. | మృత్యువు తర్వాతి జీవితం | 60/- |
| 37. | భృక్తం - రహితం - తారకం | 60/- |
| 38. | మాస్టర్ 'యోగచరిత్ర' | 60/- |
| 39. | అసతోమా సద్గమయా | 60/- |
| 40. | తమసోమా జ్యోతిర్గమయా | 60/- |
| 41. | మృత్యోర్మా అమృతంగమయా | 60/- |
| 42. | యోగా ట్రీట్‌మెంట్ | 60/- |
| 43. | యోగాశ్రమ లేఖలు | 60/- |
| 44. | సత్య సంహిత | 60/- |
| 45. | శ్రీ కృష్ణావతారం | 60/- |
| 46. | **మంజరీ ద్విపద (శార్వరి కథలు)** | **100/-** |
| 47. | **హస్తసాముద్రికం** | **150/-** |
| | **ENGLISH BOOKS** | |
| 48. | **Master Prayers** (New Edition) | 100/- |
| 49. | The Mystery of Kundalini | 60/- |
| 50. | The Life Beyond Death | 60/- |

ఖరీదు మొత్తం ముందుగా ఎం.ఓ. ద్వారా గాని డి.డి. ద్వారా గాని పంపవలసి ఉంటుంది. పుస్తకాలు V.P. లో పంపలేము. చెక్కులు స్వీకరింపబడవు. రిజిష్టర్ పోస్టులో పంపడానికి రూ. 20/- అదనం.


**MASTER YOGAASHRAM**

Plot No. 89, Krishna Enclave, M.D. Farm Road, Tirumalagiri,
SECUNDERABAD - 500 015.
Ph : (040) 2779 0094, Cell : 9393933946
E-mail : drvaasili@yahoo.co.in www. masteryogashram.com